అనుదినం... జనస్వరం

www.navatelangana.com


నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

సోమవారం 18-12-2023

సంపుటి : 9 సంచిక : 347 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 14 పేజీలు వెల : 6.50

రెచ్చగొడుతున్నారు



శాంతికి భంగం కలిగిస్తున్నారు

- గవర్నర్ పదవికి అప్రతిష్ట తెస్తున్నారు
- నిరసనకారులతో అలాగేనా ప్రవర్తించేది?
- ఆరీఫ్‌ఖాన్‌పై కేరళ సీఎం పినరయి మండిపాటు

వివరాలు 13లో

ఉద్యోగాలు ఉత్తమాటలే.!

పెరుగుతున్న నిరుద్యోగం

- పీఎల్ఎఫ్ఎస్ సర్వే నివేదిక
- కేంద్రశాఖల్లో భారీగా ఖాళీలున్నా పట్టించుకోని బీజేపీ సర్కార్



నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో నిరుద్యోగ సమస్య అంతకంతకూ పెరుగుతోంది. దేశవ్యాప్తంగా ఉపాధి లేక రోడ్డున పడుతున్న యువత సంఖ్య ఆందోళనకరంగా మారుతోంది. 15 ఏండ్లు, అంతకంటే ఎక్కువ వయస్సు గల గ్రాడ్యుయేట్లలో నిరుద్యోగిత రేటు 2022-23లో 13.4 శాతం ఉంది. స్టాటిస్టిక్స్ అండ్ ప్రొగ్రామ్ ఇంప్లిమెంటేషన్ మంత్రిత్వ శాఖ నిర్వహించిన తాజా పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్ఎఫ్ఎస్) ప్రకారం 15 ఏండ్లు, అంతకంటే ఎక్కువ వయస్సు ఉన్న గ్రాడ్యుయేట్లలో అత్యల్ప నిరుద్యోగిత రేటు చండీగఢ్‌లో 5.6 శాతంగా ఉంది, ఆ తర్వాత ఢిల్లీలో 5.7 శాతం ఉంది. అండమాన్ అండ్ నికోబార్ ద్వీపంలో అత్యధికంగా నిరుద్యోగం 33 శాతం, లడఖ్‌లో 26.5 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 24 శాతం ఉన్నట్టు డేటా స్పష్టం చేసింది. పెద్ద రాష్ట్రాల్లో నిరుద్యోగిత రేటు రాజస్థాన్‌లో 23.1 శాతం, ఒడిశాలో 21.9 శాతంగా ఉంది.

అందుబాటులో ఉన్న సమయ వ్యవధిలో లేబర్ ఫోర్స్ డేటా లభ్యతకు సంబంధించిన ప్రాముఖ్యతను పరిగణనలోకి తీసుకుని, ఎన్ఎస్ఎస్ఓ ఏప్రిల్ 2017లో పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పిఎల్ఎఫ్ఎస్)ని ప్రారంభించింది. ఇంతకుముందు, ఐదు వార్షిక నివేదికలు జులై 2017-జూన్ 2018, జులై 2018-జూన్ 2019, జులై 2019-జూన్ 2020, జులై 2020-జూన్ 2021, జులై 2021-జూన్ 2022 మధ్యకాలంలో పీఎల్ఎఫ్ఎస్ లో సేకరించిన డేటా ఆధారంగా రూపొందించింది. ఇప్పుడు ...13లో



మేడిగడ్డ ప్రాజెక్టుపై సమీక్షిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

సర్కారు దూకుడు

టీం సిద్ధం చేసుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- పథకాల అమలు వేగవంతం
- వరుస సమీక్షలు.. సమాలోచనలు
- ఆయా రంగాల్లో నిష్ణాతులతో భేటీలు
- పాత సర్కారు భాగోతాలపై ప్రత్యేక నజర్
- రైతుబంధుకు సీలింగ్?
- ఆ నిధులు ఆరు గ్యారెంటీలకు మళ్లింపు

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ సర్కారు పాలనలో దూకుడు పెంచింది. ప్రమాణ స్వీకారం చేసిన రెండో రోజు నుంచే మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణాన్ని ప్రకటించి, అమల్లోకి తెచ్చిన విషయం తెలిసిందే. దానితో పాటే రాజీవ్ ఆరోగ్య శ్రీ పరిమితిని రూ.10 లక్షలకూ పెంచుతూ ఉత్తర్వులు ఇచ్చారు. తాజాగా ఆరు గ్యారెంటీలు అమలుతో పాటు పరిపాలనపైనా ప్రత్యేక దృష్టి పెట్టేందుకు సర్కారు సిద్ధమైంది. విభాగాల వారీగా గత ప్రభుత్వ నిర్వాకాలపై శ్వేతపత్రాలు ప్రకటించాలని తొలి మంత్రివర్గ భేటీలోనే నిర్ణయించిన విషయం తెలిసిందే. దీనికోసం సమీక్షల పేరుతో అధికారులకు ఎక్కడికక్కడ ఆదేశాలు జారీ చేస్తున్నారు. మరోవైపు ఆయా రంగాల్లో నిష్ణాతులైన వారితో సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక భేటీలు ఏర్పాటు చేస్తున్నారు. ఆయా శాఖల మంత్రులు, అధికారులతో పాటు తాను కూడా ...6లో

మేడిగడ్డపై పూర్తి వివరాలివ్వండి

- అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

కుంగిన మేడిగడ్డ ప్రాజెక్టుకు సంబంధించి పూర్తి వివరాలు అందించాలని నీటిపారుదల శాఖ అధికారులను ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి ఆదేశించారు. ఆదివారం తన నివాసంలో నీటిపారుదల శాఖ అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో ప్రస్తుత నీటిపారుదల రంగం స్థితిగతులపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గత ప్రభుత్వ హయాంలో కొత్తగా నిర్మించిన ప్రాజెక్టుల ఖర్చులకు సంబంధించి పూర్తి వివరాలు అందించాలన్నారు. ఇతర రాష్ట్రాలతో జల వివాదాలకు సంబంధించి కృష్ణా ట్రిబ్యునల్ వద్ద వినిపించాల్సిన వాదనలు, భవిష్యత్‌లో ఇబ్బందులు తలెత్తకుండా తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. యాసంగి పంటలకు నీళ్లిచ్చేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. నీటి లభ్యత, ఇతర అంశాలపై పలు సూచనలు చేశారు. అంతర్రాష్ట్ర జలవివాదాలను త్వరగా పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో చర్చించిన అంశాలకు సంబంధించి వీలైనంత త్వరగా పూర్తి వివరాలను అందించాలని అధికారులను ఆదేశించారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఈఎన్సీ మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

మరోసారి ఐఏఎస్‌ల బదిలీలు

11 మంది సీనియర్ అధికారులకు స్థానచలనం

- సీఎస్ శాంతి కుమారి ఉత్తర్వులు జారీ



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వం 11 మంది సీనియర్ ఐఏఎస్ అధికారులను బదిలీ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. పరిపాలనా విధానంలో భాగంగానే ఈ బదిలీ చేసామని చెప్పారు. పురపాలకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న అర్వింద్ కుమార్‌ను విపత్తు నిర్వహణశాఖకు, బీసీ వెల్ఫేర్ కార్యదర్శిగా ఉన్న బుర్రా వెంకటేశంను విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిగా నియమించి, కళాశాల, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. జలమండలి ఎండీగా ఉన్న దానకిషోర్‌ను పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శిగా నియమించి, హెచ్ఎండీఏ, సీడీఎంఏ కమిషనర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ కార్యదర్శిగా ఉన్న సుదర్శన్ రెడ్డిని జలమండలి ఎండీగా, వాణిజ్య పన్నుల శాఖ కమిషనర్‌గా ఉన్న క్రిస్టినా జెడ్ చాంగ్‌ను వైద్య ఆరోగ్యశాఖ కార్యదర్శిగా, ఆర్‌అండ్‌బీ శాఖ ముఖ్య కార్యదర్శిగా కె.ఎస్. శ్రీనివాసరాజును నియమించారు. సీఎం కార్యదర్శిగా ఉన్న రాహుల్ బొజ్జాను జీఏడీ కార్యదర్శిగా నియమించడంతో పాటు ఎస్సీ అభివృద్ధిశాఖ కార్యదర్శిగా అదనపు బాధ్యతలు అప్పగించారు. రవాణా శాఖ ముఖ్య ...13లో

21న కలెక్టర్ల కాన్ఫరెన్స్

- ఆరు గ్యారంటీలు, ధరణి, రైతుబంధు, భూసమస్యలపై చర్చ

వివరాలు 6లో



ఆర్థికాన్ని గాడిలో ఎలా పెట్టాలి?

- ఆర్బీఐ మాజీ గవర్నర్ రఘురామరాజన్‌తో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు భేటీ

13లో..



రాష్ట్రంలో 9 మంది ఐపీఎస్‌ల బదిలీలు

- ఐదుగురు నాన్‌కేడర్ ఎస్పీలకూ స్థానచలనం

వివరాలు 13లో





లిబియాలో జలసమాధి

నౌక మునిగి 61 మంది వలస కూలీల మృతి

- చనిపోయిన వారిలో అత్యధికులు మహిళలు, పిల్లలే

ట్రిపోలి: లిబియాలో పడవ ప్రమాదంలో మహిళలు, పిల్లలతో సహా 61 మంది చనిపోయారు. మొత్తం 86 మందితో వెళ్తున్న ఓడ బలమైన అలల తాకిడికి బోల్తా పడింది. వీరిలో 25 మందిని రెస్క్యూ టీమ్స్ సురక్షితంగా బయటికి తీసుకొచ్చాయి. మిగతా వారు బతికి ఉండే అవకాశం లేదని అధికారులు తెలిపారు. ఆదివారం ఉదయం లిబియా తీరంలో ఈ ఘోర దుర్ఘటన చోటుచేసుకుంది.

నైజీరియా, గాంబియా తదితర ఆఫ్రికా దేశాలకు చెందిన 86 మంది ఐరోపా దేశాలకు వలస వెళ్లేందుకు లిబియా నుంచి పడవలో బయలుదేరారు. లిబియా తీరానికి సమీపంలో పడవ బోల్తా పడినట్టు ఐక్యరాజ్యసమితికి చెందిన 'ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ మైగ్రేషన్ (ఐఒఎం) తెలిపింది. లిబియా పశ్చిమ తీరంలోని జువారా పట్టణ సమీపంలో బలమైన అలల తాకిడికి పడవ కొట్టుకుపోయినట్టు ఈ ప్రమాదం నుంచి బయటపడిన వారు వెల్లడించారు.

ఇప్పుడు ప్రమాదం జరిగిన మధ్యధరా సముద్రంలోని ఈ మార్గంలో గతంలో కూడా పలు ప్రమాదాలు సంభవించాయి. మెరుగైన జీవితం కోసం చాలా మంది ఆఫ్రికా దేశాల నుంచి ఐరోపా దేశాలకు వలస వెళ్లేందుకు ఈ మార్గాన్నే ఆశ్రయిస్తున్నారు. యుద్ధాలు, పేదరికం నేపథ్యంలో పశ్చిమాసియా, ఆఫ్రికా దేశాల నుంచి ఏటా వేల మంది ఐరోపా దేశాలకు వలసపోతున్నారు. నియంత గఢాఫీ మరణానంతరం లిబియాలో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. ఆ భూభాగంపై ఎవరికీ సరైన నియంత్రణ లేకపోవటంతో యూరప్‌కు చేరుకోవాలనుకుంటున్న వారంతా లిబియా తీరం నుంచే బయల్దేరుతున్నారు.

గడాఫీ మరణానంతరం కల్లోలంగా లిబియా

తమ చమురు అవసరాలు, ...13లో

పార్లమెంట్ పొగబాంబు లింకులు..?

- రాజస్థాన్‌లో దగ్ధం చేసిన ఫోన్లు స్వాధీనం



న్యూఢిల్లీ : పార్లమెంట్ భద్రతా వైఫల్యం కేసులో పగులగొట్టిన, దగ్ధం చేసిన కొన్ని మొబైల్ ఫోన్లను రాజస్థాన్‌లోని నగౌర్ వద్ద ఢిల్లీ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయాన్ని అధికారులు ఆదివారం వెల్లడించారు. దీంతో నిందితులపై ఇప్పటికే నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌లో సాక్ష్యాలను ధ్వంసం చేయడానికి సంబంధించిన సెక్షన్లను కూడా జత చేశారు. ఇప్పటికే అరెస్టు చేసిన ఆరుగురు నిందితుల్లో ఒకరైన లలిత్ ఝా ఇచ్చిన సమాచారంతో పోలీసులు ఈ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. శనివారం లలిత్‌ను నగౌర్‌కు ఢిల్లీ పోలీస్ స్పెషల్ సెల్ బృందం తీసుకెళ్లింది. కేసుకు సంబంధించిన సాంకేతిక సాక్ష్యాలను ...13లో

నాగ్‌పూర్ ఫ్యాక్టరీలో భారీ పేలుడు

- ఆరుగురు మహిళలు సహా తొమ్మిదిమంది సజీవ దహనం... మరో ముగ్గురి పరిస్థితి విషమం



నాగ్‌పూర్ : మహారాష్ట్రలోని నాగ్‌పూర్ జిల్లాలో పేలుడు పదార్థాల తయారీ కేంద్రంలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఆరుగురు మహిళలతో సహా తొమ్మిది మంది కార్మికులు సజీవ దహనమయ్యారు. చక్దోహ్ గ్రామంలో ఉన్న సోలార్ ఇండస్ట్రీస్ ఇండియా లిమిటెడ్ బిల్డింగ్ నంబర్ హెచ్‌ఆర్-సిపిసిహెచ్-2 (మిక్సింగ్, మెల్టింగ్, కాస్టింగ్)లో ఆదివారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో ఒక్కసారిగా పేలుడు సంభవించిందని ఆ సంస్థ సీనియర్ జనరల్ మేనేజర్ ఆశీష్ శ్రీవాస్తవ ఒక ప్రకటనలో తెలిపారు. బొగ్గు గనుల్లో ఉపయోగించే బూస్టర్లను ఉత్పత్తి చేసే భవనంలో ఈ ...13లో

ఆగని బాల్య వివాహాలు

చట్టబద్ధ వయసుకు ముందే పెండ్లిండ్లు

- కేంద్ర జాతీయ ఆరోగ్యమంత్రిత్వశాఖ కుటుంబసర్వేలో వెల్లడి

న్యూఢిల్లీ : మన దేశంలో ప్రతి ఐదుగురు బాలికలలో ఒకరు, ప్రతి ఆరుగురు బాలురలో ఒకరు చట్టబద్ధమైన వయసు రాకుండానే వివాహం చేసుకుంటున్నారు. బాల్య వివాహాలు చేసుకుంటే జరిమానాలు విధిస్తారని, శిక్షిస్తారని తెలిసి కూడా ఈ తరహా వివాహాలు చేస్తూనే ఉన్నారని ఓ అధ్యయనం తెలిపింది. దేశంలో గడచిన మూడు దశాబ్దాల కాలంలో జరిగిన బాల్య వివాహాలపై తొలిసారిగా సమగ్ర అధ్యయనం నిర్వహించారు. జాతీయ ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరిగిన కుటుంబ ఆరోగ్య సర్వేలను ఆధారంగా చేసుకొని అధ్యయనం జరిపారు.

1993తో పోలిస్తే 2021లో దేశంలో బాల్య వివాహాల సంఖ్య తగ్గిందని అధ్యయనం తెలిపింది. 1993లో బాలికలలో 49 శాతం మందికి బాల్య వివాహాలు జరగగా 2021 నాటికి అది 22 శాతానికి తగ్గింది. అదే బాలుర విషయానికి వస్తే 2021లో 21 సంవత్సరాల లోపు వయసున్న వారిలో 15.49 శాతం మంది వివాహం చేసుకున్నారు. ఇది యువకులకు చట్టబద్ధమైన వివాహ వయసు. 2021లో బాల్య వివాహాలు చేసుకున్న బాలుర (18 సంవత్సరాల లోపు వయసు వారు) సంఖ్య మొత్తం బాలుర సంఖ్యలో కేవలం 2 శాతం మాత్రమే ఉంది. అదే 1993లో ఇది 7 శాతంగా ఉంది. మొత్తంగా చూస్తే 2021లో 18 సంవత్సరాల నిండకముందే 1.3 కోట్ల మంది బాలికలు, 14 లక్షల మంది బాలురు వివాహం చేసుకున్నారు. లాన్సెట్ గ్లోబల్ హెల్త్ జర్నల్‌లో శనివారం అధ్యయన వివరాలను ప్రచురించారు. మహిళల ...13లో



ఈ రాష్ట్రాలలో అధికం

పశ్చిమ బెంగాల్, బీహార్, గుజరాత్, మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాలలో బాల్య వివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయని అధ్యయనం తెలిపింది. 2021లో దేశంలో 1.3 కోట్ల మంది బాలికలకు బాల్య వివాహాలు కాగా వారిలో ఒక్క బీహార్‌లోనే 16 శాతం మంది ఉన్నారు. బెంగాల్‌లో 15 శాతం, ఉత్తరప్రదేశ్‌లో 12 శాతం, మహారాష్ట్రలో 8 శాతం మంది బాలికలకు బాల్య వివాహాలు జరిగాయి. ఇక బాలుర విషయానికి వస్తే 2021లో 18 సంవత్సరాల లోపు వయసున్న 14 లక్షల మందికి బాల్య వివాహాలు జరగగా వారిలో గుజరాత్‌లో అత్యధికంగా 29 శాతం మంది, బీహార్‌లో 16 శాతం మంది, పశ్చిమ బెంగాల్‌లో 12 శాతం మంది, ఉత్తరప్రదేశ్‌లో 8 శాతం మంది ఉన్నారు.

పార్టీ, ప్రభుత్వం మధ్య సమన్వయం

ఆరు గ్యారంటీలపై ఫోకస్...

- పట్టం కట్టిన ప్రజలకు ధన్యవాదాలు
- మంత్రి వర్గంలో ఖాళీ బెర్తుల భర్తీ ఎలా?

నేడు కాంగ్రెస్ పీఏసీ భేటీ

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత టీపీసీసీ అధ్యక్షులు, సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి పార్టీపై దృష్టిసారించారు. ఒకవైపు ప్రభుత్వ కార్యకలాపాల్లో బిజీగా ఉంటూనే...పార్టీ బాధ్యతలపై ఫోకస్ చేశారు. ప్రభుత్వం ఏర్పడ్డాక మొదటిసారి సోమవారం గాంధీభవన్‌లో టీపీసీసీ రాజకీయ వ్యవహారాల కమిటీ (పీఏసీ) సమావేశమవుతున్నది. రేవంత్ సీఎం అయ్యాక తొలిసారిగా పార్టీ సమావేశంలో పాల్గొంటున్నారు. ప్రధానంగా తాజా రాజకీయ పరిస్థితులు, ఎన్నికల ఫలితాలు వంటి అంశాలను చర్చిస్తూనే..ఎన్నికల్లో కాంగ్రెస్‌కు పట్టం కట్టిన తెలంగాణ ప్రజలకు ధన్యవాదాలు తెలుపుతూ సమావేశం తీర్మానం చేయనుంది.ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తూ.చ తప్పకుండా అమలు చేస్తామని మరోసారి ప్రజలకు భరోసా ఇవ్వనుంది. గ్యారంటీల అమలు విషయంలో ప్రభుత్వంతోపాటు పార్టీ పాత్ర ఎలా ఉండాలనే అంశంపై చర్చించి కార్యాచరణ రూపొందించనుంది. మహిళలకు ఉచిత ప్రయాణం స్కీమ్, రాజీవ్ ఆరోగ్య శ్రీ పథకానికి పది లక్షలకు పెంచుతూ తీసుకున్న నిర్ణయాలను ఇప్పటికే అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. వాటిని ప్రజల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని కాంగ్రెస్ భావిస్తున్నది. మంత్రివర్గంలో ఖాళీల భర్తీ గురించి కూడా కమిటీలో చర్చించనున్నట్టు తెలుస్తున్నది.

ఆ ఆరుగురు మంత్రులెవరో?

రాష్ట్ర మంత్రివర్గంలో మరో ఆరుగురు మంత్రులకు అవకాశం ఉన్న నేపథ్యంలో దీనిపై కూడా ఈ భేటీలో ప్రాథమిక చర్చ జరిగే అవకాశం ఉన్నట్టు తెలిసింది. ఉమ్మడి ...6లో



సజ్జన్ జిందాల్‌పై లైంగికదాడి కేసు



ముంబయి : ప్రముఖ పారిశ్రామిక వేత్త, జేఎస్‌డబ్ల్యూ గ్రూప్ చైర్మన్, ఎమ్‌డి సజ్జన్ జిందాల్‌పై లైంగికదాడి ఆరోపణలతో ఎఫ్ఐఆర్ నమోదైంది. 30 ఏండ్ల మహిళ ఫిర్యాదు మేరకు ముంబయిలోని బంద్రా కుర్లా కాంప్లెక్ పోలీస్‌స్టేషన్‌లో ఈ నెల 13న కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించినట్టు పోలీసులు తెలిపారు. బాధితురాలి ఫిర్యాదు ప్రకారం 2021 అక్టోబర్ 8న దుబాయ్‌లో ఒక ఐపీఎల్ మ్యాచ్ సందర్భంగా బాధిత మహిళ తొలిసారిగా జిందాల్‌ను కలిశారు. ఆ తరువాత ఫోన్‌లో మాట్లాడుకోవడం, వ్యక్తిగతంగా కలుసుకోవడం చేసేవారు. వివాహం చేసుకుంటానని జిందాల్ హామీ ఇచ్చారని ఆమె పేర్కొన్నారు. 2022 జనవరిలో బంద్రా కుర్లా కాంప్లెక్స్‌లోని ప్రధాన కార్యాలయం పెంట్‌హౌస్‌లో తనపై ...13లో



పురూలియాలో వాసుదేవ ఆచార్య సంతాప సభ

కోల్‌కతా : సీపీఐ(ఎం) నాయకులు వాసుదేవ ఆచార్య జ్ఞాపకార్థం సంతాప సభను పార్టీ నిర్వహించింది. పశ్చిమ బెంగాల్‌లోని పురూలియాలో ఆదివారం జరిగిన ఈ సభలో సీపీఐ(ఎం) ప్రధానకార్యదర్శి సీతారాం ఏచూరి, లెఫ్ట్ ఫ్రంట్ చైర్మన్ బిమన్ బసు, సీపీఐ(ఎం)పొలిట్ బ్యూరో సభ్యులు సూర్యకాంత మిశ్రా, కేంద్ర కమిటీ సభ్యులు అమియా పాత్ర, పార్టీ నాయకులు పులిన్ బిహారి బాస్కే, ప్రదీప్ రాయ్, అభయ్ ముఖర్జీ, బిలసిబాల సాహిష్ పతి పాల్గొన్నారు.

టీఎస్ఆర్టీసీ కార్మికోద్యమంపై ఆంక్షలు ఎత్తేయాలి

- ప్రయాణీకుల సౌకర్యార్థం బస్సుల సంఖ్య పెంచాలి
- కార్మికులకు రెండు పే స్కేల్స్ అరియర్స్‌తో సహా ఇవ్వాలి : రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఎస్‌డబ్ల్యూఎఫ్ విజ్ఞప్తి



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీఎస్ఆర్టీసీ)లో కార్మికోద్యమంపై ఆంక్షలు ఎత్తివేసి, ప్రజాస్వామ్య పద్ధతిని పునరుద్ధరించాలని టీఎస్ఆర్టీసీ స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యూఎఫ్) రాష్ట్ర కమిటీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు కమిటీ అధ్యక్షులు వీరాంజనేయులు నాయకత్వంలో ఆఫీస్ బేరర్స్ ఏవీ రావు, పీ రవీందర్‌రెడ్డి, గంగాధర్, కేఎస్ రెడ్డి, కే గీత, ఎస్ కృష్ణ తదితరులు రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ప్రయాణీకుల సౌకర్యార్థం ఆర్టీసీలో బస్సుల సంఖ్య పెంచాలని కోరారు. 2014 నుంచి 2023 వరకు సంస్థలో బస్సుల సంఖ్య, రూట్లు, షెడ్యూల్స్ సహా ఇతర అనేక అంశాల్లో తగ్గుదలను పట్టిక రూపంలో మంత్రికి అందచేశారు. ఆర్టీసీని లాభనష్టాల ప్రాతిపదికన కాకుండా, ప్రజారవాణా సంస్థగా పరిగణించాలని విజ్ఞప్తి చేశారు. మొత్తం 26 డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని మంత్రికి సమర్పించారు. సంస్థ ఆస్తులు, అప్పులు, అసెంబ్లీలో ఇచ్చిన హామీలను ఆ లేఖలో ప్రస్తావించారు. ఆర్టీసీ కార్మికులకు రావల్సిన రెండు వేతన సవరణల్ని బకాయిలతో సహా చెల్లించాలని కోరారు. ఆర్టీసీ ప్రతిష్టను పెంచేలా ప్రభుత్వం నిర్ణయాలు తీసుకోవాలని ఆకాంక్షించారు.

బీజేపీ వచ్చాకే హక్కులపై దాడి

ఎన్నికల మ్యానిఫెస్టోలో దళితుల సమస్యలను చేర్చాలి

ఢిల్లీలో రాజకీయ పార్టీలకు వ్యవసాయ కార్మిక, దళిత, స్వచ్ఛంద సంఘాల విజ్ఞప్తి



నవతెలంగాణ-న్యూఢిల్లీ

'దేశంలో 17 శాతం పైగా ఉండి, గ్రామీణ ఉత్పత్తిలో ముఖ్యభాగమైన దళితులకు రాజ్యాంగం కల్పించిన హక్కులపై దాడి జరుగుతుంది. దేశంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తరువాత రాజ్యాంగం కల్పించిన వారి హక్కులు కాలరాయబడుతున్నాయి. 2024లో దేశంలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు తమ మేనిఫెస్టోలో దళితుల సమస్యలు చేర్చాలి' అని ఎఐఎడబ్ల్యుయు ప్రధాన కార్యదర్శి బి.వెంకట్ డిమాండ్ చేశారు. ఈ మేరకు రాజకీయ పార్టీలను కలుస్తున్నామని ఆయన తెలిపారు. శనివారం నాడిక్కడ దళిత సమస్యలపై ఏర్పడ్డ కోఆర్డినేషన్ కమిటీ ప్రతినిధులు మల్లేపల్లి లక్ష్మయ్య, బి. వెంకట్, రాజ్యసభ ఎంపి వి.శివదాసన్, నిర్మల్, విక్రమ్ సింగ్, సాయిబాలాజీ, నటుప్రసాద్ తదితరులు, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కలిసి డిమాండ్ చార్టర్ అందజేశారు. ఇటీవల సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజాలను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా దళిత్ కో-ఆర్డినేషన్ కమిటీ నాయకులు వ్యవసాయ కార్మిక సంఘం అఖిల భారత కార్యదర్శి బి.వెంకట్ ఏపీ, తెలంగాణ భవన్‌లో మీడియాతో మాట్లాడారు. దళితులకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, దళితుల సమస్యలపై హైదరాబాద్‌లో 100 సంఘాలు, వ్యక్తులు కలిసి దళిత్ సమ్మిట్ నిర్వహించామన్నారు. ఈ సమస్యలు రాజకీయ ఎజెండా కోసం కో ఆర్డినేషన్ కమిటీని రూపొందించడం జరిగిందన్నారు. దీనిలో భాగంగానే డిసెంబర్ 4న "మార్చ్ టూ పార్లమెంట్" కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందన్నారు. ఈ కమిటీ పిలుపులో భాగంగా దశలు వారీగా కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు కోటి సంతకాలు సేకరించి రాష్ట్రపతి కి అందిస్తామన్నారు. కో ఆర్డినేషన్ కమిటి ఆధ్వర్యంలో జిల్లా, రాష్ట్ర స్థాయిలో సదస్సులు నిర్వహించి, దళితుల సమస్యలపై చర్చ చేస్తామన్నారు. ప్రతి రాష్ట్రంలో దళితుల సమస్యలు అధ్యయనం చేయడానికి క్షేత్ర స్థాయిలో ఒక గ్రామాన్ని ఎంచుకొని సర్వే నిర్వహించుతామన్నారు.

బీజేపీకి వ్యతిరేకంగా పని చేసే పార్టీలతో భేటీ

ఢిల్లీలో అఖిల భారత నాయకులనే కాకుండా రాష్ట్ర స్థాయిలో బిజెపికి వ్యతిరేకంగా పని చేస్తున్న డిఎంకె, ఆర్జేడి, ఎస్పీ, జెడియు, జెఎంఎం, నేషనల్ కాన్ఫరెన్స్, పిడిపి వంటి ఇండియా ఫోరంలోని పార్టీలు, బిఎస్పి లాంటి నాయకులను కూడా కలవాలని నిర్ణయం తీసుకున్నామని వెంకట్ తెలిపారు. 12 డిమాండ్లలో భూ పంపిణీ మొదలు ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు, రాజ్యాంగ హక్కులు పరిరక్షణ, దళితుల సమస్యలు పరిష్కారం లాంటి ప్రధానమైన డిమాండ్లను తీసుకోవడం జరిగిందన్నారు. 2024 ఎన్నికల్లో బిజెపిని ఓడించి, సామాజిక న్యాయం, సమన్యాయం కోసం, రాజ్యాంగ పరిరక్షణ కోసం బిజెపి యేతరశక్తులని ఈ కమిటీతో కలిసి రావాలని ఆయన తెలిపారు.

వృద్ధి రేటు ఇలాగే ఉంటే...

దిగువ మధ్యతరగతి ఆర్థిక వ్యవస్థగా మిగిలిపోతాం

ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్



న్యూఢిల్లీ : దేశంలో జనాభా పెరగకుండా, వృద్ధి రేటు ప్రస్తుతమున్న 6% వద్దే కొనసాగితే 2047 నాటికి భారత్ దిగువ మధ్యతరగతి ఆర్థిక వ్యవస్థగానే మిగిలిపోతుందని ఆర్‌బీఐ మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ వ్యాఖ్యానించారు. దేశం వేగవంతంగా అభివృద్ధి చెందకపోతే సంపన్న దేశంగా మారడానికి ముందే జనాభా పరంగా పాతబడిపోతుందని అన్నారు. ఆ సమయానికి దేశంపై వృద్ధుల భారం కూడా పడుతుందని చెప్పారు.

గడచిన రెండు త్రైమాసికాలలో దేశంలో జీడీపీ వృద్ధి 7.5%గానే ఉందని, కార్మికుల భాగస్వామ్యాన్ని పరిగణనలోకి తీసుకుంటే ఇది చాలా తక్కువేనని రాజన్ చెప్పారు. జీ-20 దేశాలన్నింటిలోనూ మన దేశంలోనే మహిళా కార్మికుల భాగస్వామ్యం అత్యంత తక్కువగా ఉన్నదని ఓ కార్యక్రమంలో మాట్లాడుతూ తెలిపారు. 'మన వృద్ధి సామర్థ్యం ఈ రోజు 6%గా ఉంది. జీడీపీ వృద్ధి ఏడాదికి 6%గా ఉంటోంది. దీనిని ప్రతి 12 సంవత్సరాలకు రెట్టింపు చేస్తే 24 సంవత్సరాలకు మన తలసరి ఆదాయం నాలుగు రెట్లు పెరుగుతుంది. ఈ రోజు మన తలసరి ఆదాయం 2500 డాలర్ల కంటే తక్కువగానే ఉంది. దీనిని నాలుగుతో గుణిస్తే 10,000 డాలర్లు అవుతుంది. ఇలా గుణిస్తే ప్రస్తుత వృద్ధి రేటు ప్రకారం మనం సంపన్నులం కాలేము. 2047 నాటికి దిగువ మధ్యతరగతి ఆదాయాన్నే పొందుతాం' అని వివరించారు.

కొన్ని దక్షిణాది రాష్ట్రాలలో సంతానోత్పత్తి రేటు పునరుత్పత్తి రేటు కంటే దిగువకు పడిపోయిందని రాజన్ తెలిపారు. దీనిపై ఆయన వివరణ ఇస్తూ 'మనం వేగంగా అభివృద్ధి చెందకపోతే సంపన్నులం కాకముందే దేశం పాతబడి పోతుంది. అప్పుడు వృద్ధుల బాధ్యత కూడా దేశం పైన పడుతుంది' అని అన్నారు. కార్మికులుగా మారే వారందరికీ ఉపాధి కల్పించాలంటే ప్రస్తుత వృద్ధి వేగం సరిపోదని, పాతబడి పోవడానికి ముందే దేశాన్ని సుసంపన్నం చేయడానికి ఇది చాలదని చెప్పారు. కొన్ని అభివృద్ధి చెందిన దేశాలు సంపన్నవంతం అయిన తర్వాత ఉత్పత్తి రంగం నుండి సేవల రంగం వైపు మళ్లాయని అన్నారు. సంపన్న దేశాలలో 70% మంది కార్మికులు సేవల పరిశ్రమలోనే పని చేస్తున్నారని, 20% మంది ఉత్పత్తి రంగంలో ఉన్నారని చెప్పారు. నిర్మాణం, వ్యవసాయ రంగాలలో ఐదు శాతం మంది చొప్పున పని చేస్తున్నారని రఘురామ్ రాజన్ తెలిపారు.



21న సీడబ్ల్యూసీ భేటీ

న్యూఢిల్లీ : ఈ నెల 21న కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశం జరగనుంది. ఈ నెల 19న ఢిల్లీలో ఇండియా ఫోరం పార్టీల సమావేశమైన రెండు రోజుల తరువాత సీడబ్ల్యూసీ సమావేశాన్ని అధ్యక్షులు మల్లిఖార్జున ఖర్గే ఏర్పాటు చేసినట్లు ఆదివారం ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఇండియా ఫోరం సమావేశంలో తీసుకున్న నిర్ణయాలతోపాటు, ఇటీవల అసెంబ్లీ ఫలితాలు సీడబ్ల్యూసీ భేటీలో చర్చకు రానున్నట్లు చెప్పారు. అసెంబ్లీ ఫలితాలపై కాంగ్రెస్ ఇప్పటి వరకూ చర్చించలేదు. ఈ ఫలితాలపై ఖర్గే, రాహుల్ గాంధీ, ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ ఇప్పటికే చర్చించారు.

ఉద్యమ నేత, ఎమ్మెల్సీ సాబ్జీకి కన్నీటి వీడ్కోలు

నివాళులర్పించిన ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, ప్రజాసంఘాల నేతలు


భారీగా తరలొచ్చిన ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, సామాన్య ప్రజానీకం



ఏలూరు : ఏపీ ఉద్యమనేత, ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ (57) అంత్యక్రియలు ఏలూరులో ప్రభుత్వ అధికార లాంఛనాలతో ఆదివారం జరిగాయి. ఉద్యమ బిడ్డకు కడసారి వీడ్కోలు చెబుతూ జనం కన్నీటిపర్యంతమయ్యారు. ప్రజాప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులు, కార్మికులు, సామాన్య ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి సాబ్జీ భౌతికకాయానికి నివాళులర్పించి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ నెల 15న పశ్చిమగోదావరి జిల్లా ఉండి మండలం చెరుకువాడ వద్ద రోడ్డు ప్రమాదంలో సాబ్జీ మృతి చెందిన విషయం విదితమే. అదేరోజు భీమవరం ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం భౌతికకాయాన్ని ఏలూరు ఆశ్రం ఆస్పత్రికి తరలించి మార్చురీలో భద్రపరిచారు. ఆయన కుమార్తె ఆసిఫా అమెరికా నుంచి రావడంతో సాబ్జీ భౌతికకాయాన్ని ఉదయం తొమ్మిది గంటలకు ఆ ఆస్పత్రి నుంచి ఏలూరులోని యూటీఎఫ్ కార్యాలయానికి తరలించారు. అక్కడ సీపీఐ(ఎం) ఏపీ రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం, ఎంఎల్‌సిలు కెఎస్.లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావు, ఏలూరు నగరపాలక సంస్థ కో-ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్.పెదబాబు, యూటీఎఫ్ ఏపీ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఎన్.వెంకటేశ్వర్లు, కెఎస్ఎస్.ప్రసాద్, నాయకులు బాబురెడ్డి తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రజల సందర్శనార్థం ఇండోర్ స్టేడియంకు తరలించారు. అక్కడ సాబ్జీని కడసారి చూసేందుకు ఉద్యోగ, ఉపాధ్యాయులు బారులు తీరారు. భార్య, కుమారుడు ఆజాద్, కుమార్తె ఆసిఫ్ విలపిస్తున్న తీరు అందరినీ కలిచివేసింది. సీపీఐ(ఎం) ఏలూరు జిల్లా కార్యదర్శి ఎ.రవి, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి ఆర్.రవికుమార్, అధ్యక్షుడు అలీ సమన్వయపర్చారు. ఇండోర్ స్టేడియంలో ప్రజల సందర్శన తర్వాత సాబ్జీ భౌతికకాయాన్ని సత్రంపాడులోని ఆయన స్వగృహం వద్దకు తీసుకెళ్లారు. సంప్రదాయ పద్ధతిలో కార్యక్రమాలు ముగిసిన అనంతరం భౌతికకాయానికి పోలీసులు గౌరవ వందనం చేశారు. అనంతరం సిపిఎం, యుటిఎఫ్, సిఐటియు, ఐద్వా, డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ జెండాలతో అలంకరించిన అంతిమయాత్ర వాహనంలోకి సాబ్జీ భౌతికకాయాన్ని ఎక్కించి పడమర వీధిలోని ముస్లిం శ్మశాన వాటికకు తరలించారు. అంతిమయాత్రలో పెద్ద ఎత్తున జనం మోటార్ సైకిళ్లపై ర్యాలీగా తరలివచ్చారు. 'సాబ్జీ ఆశయాలను సాధిద్దాం' అంటూ, పూలు చల్లుతూ అంతిమ యాత్ర పొడుగునా నినాదాలు దద్దరిల్లాయి. అక్కడ పోలీసులు గాలిలోకి రెండు రౌండ్లు కాల్పులు జరిపారు. అనంతరం అంత్యక్రియల ప్రక్రియ పూర్తి చేశారు.

ప్రపంచంలోనే అతిపెద్ద కార్యాలయ సముదాయం

- సూరత్‌లో ప్రధాని మోడీ చేతుల మీదుగా ప్రారంభం



సూరత్: 'సూరత్ డైమండ్ బోర్స్' భవన సముదాయాన్ని ప్రధాని మోడీ ఆదివారం ప్రారంభించారు. 67 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఈ భవనాలను నిర్మించారు. 65 వేల మంది వ్యాపారాలు చేసుకునేలా ఏర్పాట్లు చేశారు.ఇది ప్రపంచంలోనే అతిపెద్ద కార్యాలయ సముదాయంగా చెబుతున్నారు.

సూరత్ కేంద్రంగా ఉన్న వజ్రాల పరిశ్రమ ఎనిమిది లక్షల మందికి ఉపాధి కల్పిస్తోందని మోడీ ఈ సందర్భంగా తెలిపారు. తాజాగా అందుబాటులోకి వచ్చిన ఎస్‌డీబీతో మరో 1.5 లక్షల మందికి కొత్తగా ఉపాధి లభిస్తుందన్నారు. ఈ భవన సముదాయం నవీన భారత శక్తి, సంకల్పానికి చిహ్నంగా నిలుస్తుందన్నారు.

ఎస్‌డీబీ ప్రత్యేకలివే..

వజ్రాలు, వజ్రాభరణాల అంతర్జాతీయ వ్యాపారానికి ఎస్‌డీబీ కేంద్రంగా నిలవనుంది. అత్యాధునిక హంగులతో తీర్చిదిద్దిన ఈ భవనాలను గుజరాత్‌లోని సూరత్ నగరానికి సమీపంలోని ఖాజోడ్ గ్రామంలో నిర్మించారు. శుద్ధి చేసిన, ముడి వజ్రాల వ్యాపారానికి ఇది అంతర్జాతీయ కేంద్రంగా మారనుంది. అలాగే ఎగుమతులు, దిగుమతులకు సంబంధించిన కస్టమ్స్ క్లియరెన్స్ హౌస్ కూడా ఇందులోనే ఉంటుంది. ఆభరణాల రిటైల్ వ్యాపారులు తమ విక్రయ కేంద్రాలు కూడా ఇక్కడ ఏర్పాటు చేసుకోవచ్చు. అంతర్జాతీయ బ్యాంకింగ్, సురక్షిత లాకర్ల సదుపాయం కూడా ఉంటుంది.

ఏకకాలంలో 4 లక్ష్యాలను ఢీ కొట్టి...

- డీఆర్‌డీవో అద్భుత విజయం

న్యూఢిల్లీ: రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) రూపొందించిన ఆకాశ్ క్షిపణి వ్యవస్థ సరికొత్త అంచనాలను అందుకుంది. ఒకే ఫైరింగ్ యూనిట్ ద్వారా ప్రయోగించిన నాలుగు క్షిపణులు 25 కిలోమీటర్ల పరిధిలో దూసుకొస్తున్న నాలుగు లక్ష్యాలను ఏకకాలంలో ఢీ కొట్టేలా అభివృద్ధి చేసిన నూతన వ్యవస్థ విజయవంతమైనట్లు ఆదివారం వెల్లడించింది. ఈ సామర్థ్యాన్ని ప్రదర్శించిన తొలి దేశంగా భారత్ అవతరించిందంటూ తన అధికారిక 'ఎక్స్' ఖాతాలో సంబంధిత ప్రజెంటేషన్ వీడియోను పోస్టు చేసింది.'సింగిల్ ఫైరింగ్ యూనిట్‌ని ఉపయోగించి కమాండ్ గైడెన్స్ ద్వారా ఏకకాలంలో 25కి.మీ పరిధిలో దూసుకొస్తున్న 4 లక్ష్యాలు ఛేదించే సామర్థ్యాన్ని ప్రదర్శించే తొలి దేశంగా భారత్ అవతరించింది. స్వదేశీయంగా రూపొందించిన 'ఆకాశ్ వెపన్ సిస్టమ్' ద్వారా ఈ ప్రయోగం చేపట్టి విజయం సాధించాం" అని డీఆర్‌డీవో పేర్కొంది. డిసెంబర్ 12న ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల జిల్లా సూర్యలంక ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌లో అస్త్రశక్తి 2023 విన్యాసాలను ఇండియన్ ఎయిర్‌ఫోర్స్ (ఐఏఎఫ్) నిర్వహించింది. ఈ సందర్భంగా నింగి నుంచి దూసుకొచ్చిన నాలుగు లక్ష్యాలను ఆకాష్ క్షిపణి వ్యవస్థ ఏకకాలంలో ధ్వంసం చేసింది. దీని కోసం ఒకే ఫైరింగ్ యూనిట్‌ను వినియోగించారు. కమాండ్ గైడెన్స్ ద్వారా సుమారు 25 కిలోమీటర్ల పరిధిలోని నాలుగు లక్ష్యాలను ఏకకాలంలో ఛేదించే సామర్థ్యాన్ని ఆకాష్ క్షిపణి వ్యవస్థ చాటింది.భూతలం నుంచి గగనతలానికి దూసుకెళ్లే ఈ క్షిపణిని షార్ట్ రేంజ్ లక్ష్యాలను ఛేదించేందుకు వాడతారు.

డీఆర్‌డీఓ పీడీపై ముఖ్యమంత్రికి ఫిర్యాదు

- ఆధారాలు ఉన్నా పట్టించుకోని అధికారులు
- ఆరోపణలపై వెంటనే విచారణ చేపట్టాలి : ఫిర్యాదులేఖలో సామాజిక కార్యకర్త
- ఆధారాలతో సహా ప్రజాదర్బార్‌లో ఫిర్యాదు అందజేత

నవతెలంగాణ-నల్గొండకలెక్టరేట్

రెండేండ్లుగా ప్రభుత్వ నిధులను పక్కదోవ పట్టిస్తూ అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్న నల్లగొండ జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి ఎం. కాళిందినిపై నల్లగొండ జిల్లా కేంద్రానికి చెందిన ఓ సామాజిక కార్యకర్త, ప్రజా దర్బార్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి శుక్రవారం ఫిర్యాదు చేశారు. కాగా ఫిర్యాదుపై త్వరలో విచారణ జరిపిస్తామని ముఖ్యమంత్రి గ్రీవెన్స్‌సెల్ నుంచి ఆదివారం సామాజిక కార్యకర్తకు రిప్లై వచ్చింది. ఈ సందర్భంగా ఆయన ఆదివారం 'నవతెలంగాణ'తో మాట్లాడుతూ.. డీఆర్‌డీఓ పీడీ కాళిందిని విధుల నిర్వహణలో అనేక అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఇప్పటికే అవినీతి ఆరోపణలకు సంబంధించిన కథనాలు వివిధ పత్రికల్లో ప్రచురితమయ్యాయని, ఆధారాలతో సహా లిఖితపూర్వకంగా పై అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదన్నారు. పీఆర్ అండ్ ఆర్డీ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్ కుమార్ సుల్తానియా, కమిషనర్, జిల్లా కలెక్టర్, ఏసీబీ, సీబీఐ, ఈడీలకు ఫిర్యాదు చేసినా చర్యలు లేవని ఆగ్రహం వ్యక్తం చేశారు. అక్రమంగా డిప్యూటేషన్ పేరుతో జిల్లాకు వచ్చిన పీడీ కాళిందిని డీఆర్‌డీఓలో తిష్ట వేసి ప్రయివేటు సంస్థలతో కుమ్మక్కై, అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ముఖ్యంగా బైరుసస్ సంస్థతో వ్యాపారాలను ఎస్‌హెచ్‌జీ,వీవో, ఎంఎస్ సభ్యులతో వ్యాపార సంస్థలను ఏర్పాటు చేస్తామని చెప్పి మహిళా సంఘాలను మోసం చేసినట్టు తెలిపారు. అంతేకాకుండా అక్రమ డిప్యూటేషన్లు, సిబ్బందిపై వేధింపులు, ధాన్యం కొనుగోళ్లలో అవినీతి తదితర అంశాలపై ఫిర్యాదు చేస్తూ గత ప్రభుత్వంలో ప్రజాప్రతినిధుల అండదండలతో ఇష్టారాజ్యంగా వ్యవహరించారన్నారు. జిల్లా మహిళా సమైక్యకు సంబంధించి రూ.14,72,576 తన సొంత ఖాతాలోకి మళ్లించారని చెప్పారు. విషయంపై సేర్ప్ డైరెక్టర్ స్థాయి అధికారి విచారణ చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా విషయంపై రాష్ట్రస్థాయి ఉన్నత అధికారిని నియమించి విచారణ చేయించాలని, తగిన ఆధారాలు ఉన్నందున వెంటనే పీడీని సస్పెండ్ చేయాలని ముఖ్యమంత్రితో పాటు జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిని ఫిర్యాదు లేఖలో కోరినట్టు తెలిపారు.

సుక్మాలో సీఆర్‌పీఎఫ్ క్యాంపుపై కాల్పులు

- సీఆర్‌పీఎఫ్ జవాన్ మృతి, మరో జవాన్‌కు తీవ్ర గాయాలు
- పలువురు మావోయిస్టులకు గాయాలు



నవతెలంగాణ-చర్ల

సరిహద్దు చత్తీస్‌గడ్‌లోని సుక్మా జిల్లా జేగురుగొండ పోలీస్ స్టేషన్ పరిధిలోని బెద్రే సీఆర్పీఎఫ్ క్యాంపుపై మావోయిస్టులు దాడి చేసి విచక్షణారహితంగా కాల్పులు జరిపినట్టు సుక్మా ఎస్పీ కిరణ్ చౌహాన్ తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం సీఆర్పీఎఫ్ జవాన్లపై మావోయిస్టులు కాల్పులు జరపడంతో జవాన్లు ఎదురు కాల్పులు జరిపే లోపే సీఆర్పీఎఫ్ 165 బెటాలియన్‌కు చెందిన సబ్ ఇన్‌స్పెక్టర్ సుధాకర్ రెడ్డి మావోయిస్టుల బులెట్‌కు మృతిచెందారు. రాము అనే మరో సీఆర్పీఎఫ్ జవాన్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గాయాల పాలైన రామును హెలికాప్టర్ ద్వారా రాయపూర్ పంపించి మెరుగైన వైద్యం అందించినట్టు పోలీసు అధికారులు తెలిపారు. ఆత్మ రక్షణ కోసం పోలీసులు జరిపిన కాల్పుల్లో కొంతమంది మావోయిస్టులు సైతం గాయపడినట్టు పోలీసులు ధృవీకరించారు. వీరమరణం పొందిన సీఆర్పీఎఫ్ జవాన్ మృతికి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నివాళులు అర్పించి తన సంతాపం తెలిపారు. ఇదిలా ఉంటే సుక్మా జిల్లా ధర్మంపేట సీఆర్పీఎఫ్ క్యాంపు సమీపంలో మందుపాతర పేల్చి హల్‌చల్ సృష్టించారు.

గురుకుల ఉపాధ్యాయుల

ఐక్య వేదిక ఏర్పాటు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్.

రాష్ట్రంలోని సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల ఉపాధ్యాయులు, అధ్యాపకులను ఒకే గొడుగు కిందికి చేర్చుతూ గురుకుల ఉపాధ్యాయుల ఐక్య వేదిక ఏర్పాటు చేశారు. ఆదివారం నారాయణ గూడలోని పీఆర్‌టీయూ భవన్‌లో జరిగిన సంయుక్త సమావేశంలో అనుబంధంగా రాష్ట్రస్థాయి కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. రాష్ట్ర అధ్యక్షులుగా. దిలీప్ కుమార్ రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ ఏ. నరేష్ కుమార్, ఉపాధ్యక్షులుగా ఎం. వేణు ప్రసాద్ లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మైనార్టీ గురుకుల కన్వీనర్‌గా పానుగంటి విజయ్‌కుమార్, కో కన్వీనర్‌గా సిహెచ్. లక్ష్మారెడ్డి, బీసీ గురుకుల కన్వీనర్‌గా బి. గట్టయ్య, కో కన్వీనర్‌గా ఆర్. రాజ్‌కుమార్, సోషల్ వెల్ఫేర్ గురుకుల కన్వీనర్‌గా ఎం. నాగేశ్వరరావు, కో కన్వీనర్‌గా ఓరుగంటి నవీన్‌లను ఎన్నుకున్నారు. ఎన్నికైన నూతన కార్యవర్గానికి రాష్ట్ర అధ్యక్షులు పింగిలి శ్రీపాల్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్ రావు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ పూల రవీందర్ తదితరులు అభినందించారు.

అందరి బాధే తన బాధ

- ఆయనో బహుముఖ ప్రజ్ఞాశాలి : ఎంఏకే దత్తు సంస్మరణ సభలో బీవీరాఘవులు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

అందరి బాధ తన బాధగా భావించి చివరికంటూ ఉపాధ్యాయ, ప్రజాతంత్ర ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించారనీ, ఆయనొక బహుముఖ ప్రజ్ఞాశాలి అని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బీవీరాఘవులు అన్నారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో టీఎస్‌యుటీఎఫ్ ఆధ్వర్యంలో ఆ సంఘం అధ్యక్షులు కె జంగయ్య అధ్యక్షతన ఎంఏకే దత్తు సంస్మరణ సభ నిర్వహించారు. సభలో రాఘవులు మాట్లాడుతూ తన బాధలను అందరికీ పంచాలనుకోలేదనీ, అందరి బాధల్లో తాను పాలుపంచుకున్నారని గుర్తు చేశారు. అదో ఉదాత్తమైన లక్షణమన్నారు. మరణం అనివార్యమైనప్పటికీ..బతికిన కాలంలో దత్తు అసమానతలు లేని సమాజం కోసం పనిచేశారని గుర్తు చేశారు. ఆయన ఆదర్శ ఉపాధ్యాయుడనీ, అంకిత భావం కలిగిన నాయకుడని కొనియాడారు. ఆయన మరణం ఉపాధ్యాయ ఉద్యమానికేగాక అభ్యుదయ, ప్రజా ఉద్యమాలకు తీరని లోటని చెప్పారు. తన దేహాన్ని వైద్య కళాశాలకు అప్పగించటం ద్వారా మరణించాక కూడా వైద్య విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్నారని తెలిపారు. ప్రొఫెసర్ కె నాగేశ్వర్ మాట్లాడుతూ అసమాన ప్రతిభాశాలి, అవిశ్రాంత ఉపాధ్యాయుడు దత్ అని కీర్తిస్తూ నివాళులర్పించారు. ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి మాట్లాడుతూ ఒక మంచి సహచరుడిని కోల్పోయామనీ, ఆయనతో మాట్లాడటమే ఒక విజ్ఞానం అని గుర్తుచేశారు. అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి వెంకట్ మాట్లాడుతూ విద్యార్థి దశనుండి నేటివరకు దత్‌తో తనకు గల అనుబంధాన్ని వివరించారు. లౌకిక, ప్రజాస్వామిక విలువలకు తుదివరకు కట్టుబడి పనిచేశారని తెలిపారు. అలాంటి వ్యక్తుల అవసరం ఇప్పుడు చాలా ఉందన్నారు. యుటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి మాట్లాడుతూ రాష్ట్ర నాయకుడి నుంచి సాధారణ కార్యకర్తల వరకు ఏ స్థాయిలో తన అవసరం ఉంటే ఆ స్థాయికి దిగి పనిచేయగలిగిన సమర్థుడు ఎంఏకె దత్ అని గుర్తు చేశారు. జీవితం చివరి శ్వాస వరకు ఉద్యమంలో మమేకమయ్యారని నివాళులర్పించారు. తొలుత దత్ చిత్రపటానికి రాఘవులు, నర్సిరెడ్డి, దత్ భార్య లలిత తదితరులు పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. వివిధ ప్రజాసంఘాల నాయకులు ఎస్ పుణ్యవతి, పాలడుగు భాస్కర్, ఎం సంయుక్త, టి జ్యోతి, పి కృష్ణమూర్తి, ఎస్ వేణుగోపాల్, వి నాగేశ్వరరావు, జి నాగేశ్వరరావు, పి మాణిక్ రెడ్డి, కె పార్థసారధి, బి రవికుమార్, స్కైలాబ్ బాబు, పద్మశ్రీ, రాధేశ్యామ్, ప్రమోద్, మస్తాన్ రావు, జి బుచ్చిరెడ్డి, సత్యానంద్, గాలయ్య, జ్ఞానమంజరి, కె రవికుమార్, సింహాచలం తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

ప్రభుత్వ ఇంటర్ విద్యారంగం అభివృద్ధికి కృషి చేయాలి

- ఎమ్మెల్సీ నర్సిరెడ్డి



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో ప్రభుత్వ ఉన్నత విద్యా రంగంలో కీలకమయిన ఇంటర్ విద్యారంగం అభివృద్ధికి అధ్యాపకులు కృషి చేయాలని ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి పిలుపునిచ్చారు. ఆదివారం హైదరాబాద్‌లోని చెన్నుపాటి భవన్‌లో తెలంగాణ గెజిటెడ్ జూనియర్ లెక్చరర్స్ అసోసియేషన్-475 రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. అధ్యాపకులు బాధ్యతగా పనిచేసి సమాజానికి ఆదర్శంగా ఉండాలని సూచించారు. క్రమబద్ధీకరణకాని కాంట్రాక్ట్ అధ్యాపకుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోతానని తెలిపారు. డాక్టర్ అందె సత్యం మాట్లాడుతూ అధ్యాపకులు సమాజానికి మోడల్‌గా ఉండాలన్నారు. సమాజంలోని సమస్యలను అధ్యయనం చేయాలని సూచించారు. సమావేశంలో టీజీజెఎల్ఏ475లోగా అవిష్కరణతోపాటు క్రమబద్ధీకరణ కాని కాంట్రాక్టు అధ్యాపకులందిరినీ రెగ్యులర్ చేయాలనీ,ప్రభుత్వ కళాశాలల్లోని విద్యార్థులకు మధ్యాహ్నభోజనం ప్రవేశపెట్టాలంటూ పలు తీర్మానాలు చేశారు.

నూతన కార్యవర్గం



నూతన కార్యవర్గం అధ్యక్షులుగా డాక్టర్ వి శ్రీనివాస్,వర్కింగ్ ప్రెసిడెంట్ జె కుమారస్వామి, పి శోభన్‌బాబు, అసోసియేట్ ప్రెసిడెంట్ ఎల్ దేవేందర్, ప్రధాన కార్యదర్శి డాక్టర్ కె సురేశ్, కోశాధికారి ఎన్ శ్రీనివాస్‌తో పాటు ఐదుగురు ఉపాధ్యక్షులు,నలుగురు కార్యదర్శులు, ఐదుగురు మహిళా కార్యదర్శులను ఎన్నుకున్నారు.



ములుగు ప్రజలకు సేవకురాలిగా ఉంటా

- ఇక్కడి నుండే పాలన కొనసాగిస్తా.
- ప్రజలకు ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేస్తాం :మంత్రి సీతక్క



నవతెలంగాణ - ములుగు

ములుగు ఆడబిడ్డగా ఆదరించి ఆశీర్వదించిన ములుగు నియోజకవర్గ ప్రజలకు సేవకురాలిగా ఉంటానని పంచాయతీ రాజ్, మహిళా శిశుసంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. ఆదివారం మంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటి సారిగా ములుగు జిల్లాకు వచ్చిన మంత్రి సీతక్కకు ములుగు ఎస్పీ గౌస్ ఆలం పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. మంత్రి సీతక్కకు గౌస్‌పల్లి, మల్లంపల్లి, భూపాల్‌నగర్, జాకారం గ్రామాల్లో మహిళలు బతుకమ్మలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం అక్కడి నుంచి గట్టమ్మ దగ్గరికి చేరుకొని తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ములుగుకు చేరుకొని చౌరస్తాలో మంత్రి సీతక్క మాట్లాడారు. అభివృద్ధి అంటే అద్దాల మేడలు రంగు, రంగుల గోడలు కాదని, ప్రతి ఒక్క పేదవారి నైతిక అభివృద్దే దేశ, రాష్ట్ర అభివృద్ధి అని నమ్మిన వ్యక్తినని తెలిపారు. ఇక ములుగు నుంచే పాలన కొనసాగిస్తానని, రాష్ట్రంలో ఉన్న గ్రామాలు అభివృద్ధి కోసమే తనకు పంచాయతీ రాజ్ శాఖ ఇచ్చారని తెలిపారు. ప్రగతి భవన్ ముందు పేదలకు అడ్డుగా ఉన్న ఇనుప కంచెలను తొలగించామని, కాంగ్రెస్ పార్టీ ప్రజలకు హామీ ఇచ్చిన 6గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. దానిలో రెండు ప్రారంభమయ్యాయని అన్నారు. రాబోయే సర్పంచ్, ఎంపీటీసీ, ఎంపీ, జెడ్పీటీసీ, సింగిల్ విండో ఎన్నికల్లో ఇదే ఉత్సాహాన్ని కొనసాగించాలని పార్టీ ప్రజా ప్రతినిధులకు హితబోధ చేశారు.

ఇందిరమ్మ రాజ్యపాలన చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ప్రజలు, అధికారులు, పత్రిక, మీడియా చేసే సూచనలను పరిగణలోకి తీసుకుంటూ వెలుగులోకి రాని వాటిని సైతం తెలుసుకొని పరిష్కరిస్తానని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు పైడాకుల అశోక్, టీపీసీసీ కార్యదర్శి కూచన రవళీరెడ్డి. కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు గొల్లపల్లి రాజేందర్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఖానోత్ రవిచందర్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షులు వంగ రవియాదవ్, అధికార ప్రతినిధి అహ్మద్ బాషా, సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి భట్టిని కలిసిన ఏపీ మంత్రి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్కను ఏపీ ఉప ముఖ్యమంత్రి నారాయణస్వామి ఆదివారం సచివాలయంలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణలో కాంగ్రెస్ సారథ్యంలో కొత్త ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఏపీకి చెందిన మంత్రి కలవడం ప్రాధాన్యతను సంతరించుకుంది.

ఇరు రాష్ట్రాల మధ్య నేలకొన్న వివాదాలు, విభజన సమస్యలు తదితర అంశాలపై ఈ సందర్భంగా చర్చించినట్టు సమాచారం.

వారం రోజుల్లో భద్రాద్రి వంతెన పనులు ప్రారంభం కావాలి

- అధికారులను ఆదేశించిన మంత్రి తుమ్మల



నవతెలంగాణ-బూర్గంపాడు

వారం రోజుల్లో భద్రాచలం వద్ద వంతెన నిర్మాణ పనులు ప్రారంభం కావాలని వ్యవసాయ, మార్కెటింగ్, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జాతీయ రహదారుల ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. వంతెన నిర్మాణ పనుల ప్రగతిపై ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బూర్గంపాడు మండలంలోని సారపాకలోని ఐటీసీ విశ్రాంతి భవనంలో జాతీయ రహదారుల అధికారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఏపీలోని ఇబ్రహీంపట్నం (విజయవాడ) నుంచి భద్రాచలం వరకు 165 కి.మీ రహదారిగా ప్రకటించినట్టు గుర్తుచేశారు. రూ.వెయ్యి కోట్లతో చేపట్టిన పనులను 2015లో నితిన్ గడ్కరీతో కలిసి తాను శంకుస్థాపన చేశానన్నారు. కానీ 2015 నుంచి 2023 వరకు వంతెన పనులు జరుగుతూనే ఉన్నాయని, రానున్న ఫిబ్రవరి మాసాంతం వరకు వంతెన పనులు ఏ మాత్రం పెండింగ్ లేకుండా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వంతెన నిర్మాణ పనులపై మంత్రి ఫోన్ ద్వారా ఈఎన్సీ గణపతి రెడ్డి, భారత ప్రభుత్వ జాతీయ రహదారుల విభాగం ప్రాంతీయ మేనేజర్ కుష్వాలతో మాట్లాడి తక్షణమే పనులు ప్రారంభించాలని ఆదేశించారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో తాను మాట్లాడుతానని, ఎట్టి పరిస్థితుల్లో ఈ వారం రోజుల్లో పనులు ప్రారంభించాలని సూచించారు. సమావేశంలో జాతీయ రహదారుల శాఖ ఈఈ యుగంధర్, డీఈ శైలజ తదితరులు పాల్గొన్నారు.

దేశంలో రాష్ట్రాన్ని ఆదర్శంగా నిలుపుతాం

- ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు



నవ తెలంగాణ - సిద్దిపేట

రాష్ట్రంలో వ్యవసాయాన్ని, ఉపాధి రంగాన్ని, పరిశ్రమలు, ఐటీని అగ్రగామిగా నిలపడానికి కార్యాచరణ రూపొందించి ముందుకెళ్తామని, దేశంలో తెలంగాణను ఆదర్శంగా నిలుపుతామని ఐటీ శాఖ మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు. ఆదివారం హైదరాబాద్ నుంచి ఆయన తన నియోజకవర్గానికి వెళ్తున్న క్రమంలో జిల్లా కేంద్రమైన సిద్దిపేటలోని రంగధాంపల్లి చౌరస్తా వద్ద కాంగ్రెస్ నాయకులు ఆయనను కలిసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రజలకు స్వేచ్ఛను కల్పించాలనేది సీఎం రేవంత్‌రెడ్డి ఆలోచన అని అన్నారు. కాంగ్రెస్ పాలనలో కక్ష సాధింపులు ఉండవని తెలిపారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలు ప్రజలకు మేలుగా ఉన్నాయనుకుంటే వాటిని కొనసాగిస్తామన్నారు. ఎన్నికల సమయంలో తాము చెప్పిన 6 గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ఆటో కార్మికులకు తమ ప్రభుత్వం సంపూర్ణంగా అండగా ఉంటుందన్నారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ఏర్పాటు చేసి.. జాబ్ క్యాలెండర్ ప్రకటించి నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారు. సిద్దిపేట, ఉమ్మడి మెదక్ జిల్లాలో మంత్రులుగా దామోదర్ రాజనర్సింహ, పొన్నం ప్రభాకర్ ఉన్నారని, వారి ఆధ్వర్యంలో సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రణాళికలు రూపొందిస్తామని తెలిపారు.

శబరిమల యాత్రలో అపశృతి

- ముగ్గురు మృతి, ఇద్దరికి తీవ్ర గాయాలు



నవతెలంగాణ-మంగపేట

శబరిమలై వెళ్లి మొక్కులు తీర్చుకుని ఇంటికి తిరుగుముఖం పట్టిన స్వాములు ప్రయాణిస్తున్న కారు రోడ్డు ప్రమాదానికి గురై ముగ్గురు మృతిచెందారు. మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ములుగు జిల్లా మంగపేట మండలంలోని కమలాపురం గ్రామానికి చెందిన ఐదుగురు స్వాములు తలారి సుబ్బయ్య నాయుడు(52), నర్ర సాంబయ్య(55) నిమ్మల వెంకట్రాజు(49), కునారపు అజయ్(24), జరుపుల రాములు(26) వారి దీక్ష సమయం ముగియడంతో మాల విరమణకు గత గురువారం కారులో శబరిమలైకు వెళ్లారు. అక్కడ మొక్కులు తీర్చుకుని మాల విరమణ చేసి అదే కారులో కమలాపురం తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో ఆదివారం తమిళనాడు వద్ద వారి కారు అదుపుతప్పి కాల్వర్టును ఢీ కొట్టింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న తలారి సుబ్బయ్య నాయుడు, నర్ర సాంబయ్య, నిమ్మల వెంకట్రాజు అక్కడికక్కడే మృతి చెందగా, కునారపు అజయ్, జరుపుల రాములుకు తీవ్ర గాయాలయ్యాయి. దాంతో వారిని చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. కాగా ఒకే గ్రామానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మరణించడంతో కమలాపురం గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. సామాజికవేత్త, హ్యూమన్ రైట్ సభ్యులు అయిన సుబ్బయ్య నాయుడు మరణం పట్ల మండలంలోని పలువురు ప్రముఖులు, రాజకీయ పార్టీల నాయకులు సంతాపం ప్రకటించారు.

సీఎంకు జోగులాంబ ఆశీర్వచనాలు

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి జోగులాంబ అమ్మవారి ఆశీర్వచనాలను అందించారు. ఆదివారం ఆలయ ప్రధాన అర్చకులు, అర్చక బందం జూబ్లీహిల్స్‌లోని నివాసంలో సీఎం కలిసి అమ్మవారి జ్ఞాపికను అందజేశారు. అనంతరం ఆలయ అభివద్ధికి చొరవ చూపాలని కోరుతూ సీఎంకు వినతిపత్రం సమర్పించారు.

వరల్డ్స్ బెస్ట్ 'ఇంద్రి'

- గ్లోబల్ బ్రాండ్‌లను షేక్ చేస్తున్న భారత విస్కీ



న్యూఢిల్లీ : భారత విస్కీ 'ఇంద్రి' ప్రపంచ బ్రాండ్‌లను షేక్ చేస్తున్నది. ఇటీవలే ప్రపంచలోని అత్యుత్తమ విస్కీగా దీనికి పేరు లభించిన విషయం విదితమే. దీంతో 'ఇంద్రి'ని సేవిస్తున్నవారి సంఖ్య కూడా క్రమంగా పెరుగుతున్నది. దీంతో ఈ భారత బ్రాండ్.. ఉత్పత్తిని పెంచటానికి అంతా సిద్ధమైంది. అంతేకాదు, స్పిరిట్ మార్కెట్‌లోనూ ఇది పెను మార్పులు తీసుకొచ్చిందని విశ్లేషకులు అంటున్నారు. ఫ్రాన్స్‌కు చెందిన పెర్నోడ్ రికార్డ్ తయారు చేసిన గ్లెన్‌లివెట్, బ్రిటన్‌కు చెందిన డియాజియోచేతాలిస్కర్ వంటి ప్రపంచబ్రాండ్‌లకు, ఇంద్రి, అమృత్ వంటి దేశీయ బ్రాండ్లకు మధ్య పోటీ నెలకొన్నదని మార్కెట్ నిపుణులు అంటున్నారు.

'నామినేటెడ్' పందేరం

నియామక పదవుల కోసం కాంగ్రెస్‌లో ఎదురుచూపులు

- సంక్రాంతి తరువాత భర్తీ చేసే చాన్స్
- సిన్సియర్ నేతలకు ప్రాధాన్యం ఇవ్వాలని విజ్ఞప్తులు
- మేయర్, డీసీసీబీ చైర్మెన్ సీట్లపైనా దృష్టి







నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

నామినేటెడ్ పదవులపై కాంగ్రెస్ నాయకులు గంపెడు ఆశలతో ఉన్నారు. ప్రజాప్రతినిధుల చేత ఎన్నికైన మేయర్, డీసీసీబీ చైర్మెన్ తదితర పోస్టుల కోసం కూడా వ్యూహాలు రచిస్తున్నారు. సంక్రాంతి తర్వాత ఈ పదవులు భర్తీ చేసే అవకాశం ఉందన్న వార్తల నేపథ్యంలో ఎమ్మెల్యే టికెట్లు ఆశించి భంగపడిన నేతల్లో ఆశలు చిగురిస్తున్నాయి. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు అనుచరులు ఎవరికి వారే నామినేటెడ్ పదవుల కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. మంత్రుల దృష్టిలో పడేందుకు హైదరాబాద్ చుట్టూ చక్కర్లు కొడుతున్నారు. అవకాశం దొరికినప్పుడల్లా మంత్రులను ప్రసన్నం చేసుకుంటున్నారు. ఎన్నికలకు ముందే హామీలు ఇచ్చిన నేతలకు మాత్రం నామినేటెడ్ పదవుల్లో ప్రాధాన్యత లభించే అవకాశం ఉన్నట్టు తెలుస్తోంది. ఎమ్మెల్యేల గెలుపు కోసం తీవ్రంగా శ్రమించిన నేతలకు సైతం నామినేటెడ్ పదవులు దక్కే అవకాశం ఉంది.

టికెట్ ఆశించి భంగపడిన నేతలకు ఎమ్మెల్సీ చాన్స్..

ఇప్పటికిప్పుడు కాకపోయినా టికెట్ ఆశించి భంగపడిన నేతలు రాయల నాగేశ్వరరావు, పోట్ల నాగేశ్వరరావు, విజయాబాయి వంటి నేతలకు ఎమ్మెల్సీ పదవులు దక్కే అవకాశం ఉందని వార్తలు వస్తున్నాయి. రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవుల్లో కీలకమైనవి కొన్ని జిల్లాకు చెందిన నేతలకు దక్కే అవకాశం ఉంది. వీరిలో సాధు రమేష్‌రెడ్డి, ఐలూరి వెంకటేశ్వరరెడ్డి, మువ్వా విజయ్‌బాబు, తుళ్లూరి బ్రహ్మయ్య, రామసహాయం నరేష్ రెడ్డి, మద్ది శ్రీనివాసరెడ్డి, చావా శివరామకృష్ణ, మద్దినేని బేబీ స్వర్ణకుమారి, కమర్తపు మురళి, మందడపు మనోహర్, ముస్తఫా, జావీద్, పువ్వాళ్ల దుర్గాప్రసాద్, దొబ్బల సౌజన్య, బొర్రా రాజశేఖర్ తదితరుల పేర్లు వినిపిస్తున్నాయి. భద్రాద్రి రామాలయ చైర్మెన్, జమలాపురం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ చైర్మెన్‌తో పాటు పాలకవర్గం ఎన్నిక కూడా ప్రాధాన్యత సంతరించుకుంది. అలాగే ఖమ్మం మార్కెట్ కమిటీ చైర్మెన్ పదవిపై కూడా పలువురి దృష్టి కేంద్రీకృతమైంది.

మేయర్ పీటం..డీసీసీబీ చైర్మెన్ గిరిపైనా దృష్టి

ఖమ్మం నగర మేయర్ పీఠంపైనా పలువురు దృష్టి సారించారు. డీసీసీబీ చైర్మెన్, మార్కెట్ కమిటీ చైర్మెన్ పదవి కోసం పలువురు పోటీ పడుతున్నారు. వాస్తవంగా ఇవి నామినేటెడ్ పోస్టులు కానప్పటికీ బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు పలువురు కాంగ్రెస్‌లో చేరేందుకు ఆసక్తి చూపుతున్న నేపథ్యంలో సంబంధిత పదవుల కోసం అవిశ్వాస తీర్మానం పెట్టేందుకు కాంగ్రెస్ సమాయత్త మవుతోంది. ఒకవేళ అవిశ్వాస తీర్మానంలో కాంగ్రెస్ పార్టీ నెగ్గితే ఖమ్మం నగర మేయర్‌గా మందడపు లక్ష్మీ మనోహర్, చావా మాధురి నారాయణ, మిక్కిలినేని మంజుల నరేందర్‌లో ఒకరికి పదవులు దక్కే అవకాశం ఉంది. సామాజిక సమీకరణాలు, పార్టీకి చేసిన సర్వీసు, ఎన్నికల సమయంలో పార్టీ గెలుపునకు దోహదపడిన అంశాలను పరిగణలోకి తీసుకొని ఈ పదవులను భర్తీ చేసే అవకాశం ఉందని తెలుస్తోంది. జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు ఈ నామినేటెడ్ పదవులను ఎలా బ్యాలెన్స్ చేస్తారనే అంశం కూడా ఇప్పుడు ఆసక్తికరంగా మారింది. సిన్సియర్ నేతలకు ప్రాధాన్యత ఇవ్వాలనే డిమాండ్ వినిపిస్తోంది.

పదవుల భర్తీకి సంక్రాంతి ముహూర్తం..

సంక్రాంతి ముహూర్తంగా నామినేటెడ్ పదవులు భర్తీ చేస్తారని ఊహాగానాలు వస్తున్నాయి. జిల్లా స్థాయిలో మార్కెట్ కమిటీలు, దేవాలయ అభివృద్ధి కమిటీలు. రెండు గ్రంథాలయ అభివృద్ధి కమిటీలతో పాటు ఖమ్మం అర్బన్ డెవలప్‌మెంట్ (సుడా) పదవులున్నాయి. వీటిని మండల స్థాయి నాయకులకు ఇచ్చే అవకాశం ఉంది. బీఆర్ఎస్ హయాంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాకు భారీ స్థాయిలో నామినేటెడ్ పదవులు దక్కాయి. జిల్లాలో కాంగ్రెస్ గణనీయమైన ఫలితాలు సాధించిన నేపథ్యంలో మంత్రి పదవులు ఎలాగైతే దక్కాయో.. నామినేటెడ్ పదవుల విషయంలోనూ ప్రాధాన్యత లభిస్తుందని భావిస్తున్నారు. పారిశ్రామిక అభివృద్ధి సంస్థ చైర్మెన్, రాష్ట్ర విత్తనాభివద్ధి సంస్థ చైర్మెన్, ఓ ఎమ్మెల్సీ, మార్కెట్ వైస్ చైర్మెన్ పదవులు జిల్లాకు దక్కాయి. మరికొన్ని పదవులు కూడా జిల్లాకు దక్కే చాన్స్ ఉందని అంటున్నారు.

నిషిద్ధ ప్రవేశం



గడ్డి తీగలన్నీ నా చుట్టూ నీలంగా
అల్లుకున్నాయి
నగర ద్వారాలు ఆక్రమించటానికి కూడా
నా చేతులూ కాళ్లలో సత్తువలేదు
భూమి కడుపు కోసి
రక్తం చేతులకు అంటించుకుని
ద్వారాలకు ఇటువైపు నాతోనున్న ఆ అనామక తల్లి
ఎందుకు అంత తీక్షణంగా నా దిక్కే చూస్తుందో
ఆమె కళ్ళ నిండా నీలి మంటలు
గుండె మీద తెగిన పాలిండ్ల నెత్తురు
ద్వారానికి అటు విందు భోజనాలు
ఇటు మట్టి చేతుల మీద తెల్లటిరక్తం పూలై పూస్తుంటే
ఆమె పాలిండ్ల రక్తం ఎర్రటి పక్షులై ఎగురుతూ వెళు
తున్నాయి
చూడండి ఆ తల్లికి ఎన్ని గజాల చీర కట్టారో
ఆమె వెనక పరుచుకున్న దారంతా ఆమె చీర అనంతంగా
కాలి అడుగుల కింద చారికల నదుల్లా
తనరక్తమే ఆ చీరని తడుపుతున్నది
ఆ చీర నిండా పురుడుపోసిన దేహ మలినాల చరిత్ర
ఆమె ఎద మీద గునపాలు దించిన ఆనవాళ్లు
ఆమె
నన్ను తన కన్నీళ్లను తుడవమంది
నేను సత్తువ లేని చేతులతో ఆమె కన్నీటిని చుంబించాను
భూమిలోకి పాతుకుపోతున్న నా పాదాల సాక్షిగా
ఆమె నన్ను అమాంతం తన రక్తసహిత చేతులతో పైకి
లేపింది
నగర ద్వారబంధాలనల్లుకున్న నీలపు గడ్డిపోచలు
నా దేహాన్ని ఆకాశానికెత్తాయి
అప్పటి వరకూ స్తంభించిన గాలి విముక్తి గీతం పాడటం
మొదలుపెట్టింది
అక్కడే పురుడు పోసుకున్న మరో బిడ్డతో ఆమె
తన ఛాతికి ఆ రక్తమాంసపు ముద్దని హత్తుకుని
ముందుకు సాగింది
నేను
నీలిఎరుపు మంటల ఉధృతితో నగరులోకి ప్రవాహంలా
దూకాను

– మెర్సీ మార్గరెట్, 9052809952

విల్సన్‌రావు కవిత్వంలో అమృతతత్త్వం


**"ఒక నిర్వేదం, నిస్తేజం ఆవరించినప్పుడు
ఆప్యాయమైన పలకరింపు కోసం
కక్కటిల్లిపోయేవాళ్ళకు
నీడనిచ్చి సేదతీర్చే
పచ్చటి వేపచెట్టులాంటివాడు
పసిబిడ్డ నవ్వులాంటివాడు"** (శాస్త, పు: 1) ఈ ఖండిక ప్రముఖకవి కొమ్మవరపు విల్సన్‌రావు 'నాగలికూడా ఆయుధమే...!' లోని తొలికవితలోని తొలిపాదాలు. దీన్ని చదవగానే నాకు ఈ కవే స్ఫురించారు. కానీ, చివరవరకు చదివిన తర్వాత ఇది కవిత్వాన్ని శ్వాసించే మహావృక్షంలాంటి కె.శివారెడ్డి గురించి అని తెలిసింది. కవితకు 'శాస్త' అని శీర్షిక పెట్టారు. దీనికి నిఘంటువులో చాలా అర్థాలున్నాయి. ఇంగ్లీషులో ఉన్న A ruler అనే అర్థం ఎంతో ఔచిత్యంగా ఉంది. విల్సన్‌రావు కూడా అమృతనంలాంటి అమృతతుల్యమైన ప్రేమ నిండిన మనిషి. ఆయన కవిత్వం కూడా తియ్యనిపదాలతో మెత్తగా గుండెలు నిండా చేరిపోయిన ఆనందం మనల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తుంది. విల్సన్‌రావు కవిత్వానికి పాఠకుణ్ణి ఒక ట్రాన్స్ లోకి తీసుకుపోయే తత్త్వం ఉంటుంది. కవితలో తాను ప్రధానంగా చెప్పాలనుకున్న అంశాన్ని పట్టుకోవాలనుకుంటూ, ఆ నిర్మాణానికి ముందు ఆశ్చర్యపోతాం. అందువల్ల కవి పంచే అనుభూతి సాంద్రతతో పాటు, ఆ నిర్మాణం, ఆ కవిత లక్ష్యార్థం పాఠకుణ్ణి పదే పదే చదివించేలా చేస్తుంది.

తెలుగు కవులకు ఒక మహావృక్షమై బుద్ధదేవునిలా తన కరుణార్ద్రహృదయంతో కవులకు నీడనిచ్చి, కవిత్వమంటే ఏమిటో చెప్పకనే చెప్పే సరసమైన సంభాషణలతో జ్ఞానమిచ్చి, భావుకత రెక్కల్నిఎగురవేయడమెలాగో నేర్పే సమకాలీన కవుల చరద్విశ్వవిద్యాలయా చార్యుడులాంటివారు శివారెడ్డి. ఆయనతో మాట్లాడినా, ఆయన కవిత్వాన్ని చదివినా ఒక సాహిత్యపు పులకరింతతో మానవత్వాన్ని అభిషేకించినట్లుంటుంది. శివారెడ్డి కవిత్వాన్ని రాసే దృశ్యాన్ని విల్సన్‌రావు ఒక భావచిత్రంలో వర్ణిస్తూ...

'మధ్యవేలు ఊతంతో/ చూపుడు వేలూ, బొటనవేలూ మధ్య/ ఇమిడిన తన కలం ప్రసరించే/ పల్లె ఒడి పద సంపద/ ఆయన జీవితమంత ధైర్యాన్నిస్తుంది" అని వ్యక్తీకరించిన అభివ్యక్తిలో ఎంతో బలమైన వస్తు, శిల్పవైవిధ్యం ఉంది. దీన్ని పైపై చూపులతో చదివితే వెంటనే అర్థంకాదు. సాధారణంగా కవులు చూపుడు వేలుని అంబేద్కరిజంలోని ఆత్మగౌరవాన్నీ, బొటనవేలుని మార్క్సిజంలోని సమైక్యపోరాటశక్తినీ చెప్పడానికి ప్రతీకాత్మకంగా వాడుకుంటారు. ఇక్కడ దీన్ని కవి ఉద్దేశించారో లేదో గానీ, ఆ రెండూ సైద్ధాంతిక బలానికి సంబంధించినవి. వస్తు నిర్దేశానికి అభివ్యక్తి చాలా ముఖ్యం. అది మధ్యవేలులాంటిదికావచ్చు. కానీ, సారంలో జీవితానికి ఒక ధైర్యాన్నివ్వాలి. అవన్నీ శివారెడ్డిలో, ఆయన కవిత్వంలో తమకు ఆదర్శంగా చేశాయనీ, అందుకే ఆయన తమకు అందరికీ ఒక ఆచార్యుడు వంటివారని తన గురుస్మరణతో ఈ కవితాసంపుటిని ప్రారంభించారు కవి. అయితే, ఇది ప్రాచీన కావ్యావతారికల్లో చేసే ప్రశంసలాంటిది కాదు.

ప్రస్తుతం వచన కవిత్వం బాగా రాస్తున్న మొదటి పదిమందిలో విల్సన్‌రావు ఒకరు. 'దేవుడు తప్పిపోయాడు' (2017) కవితా సంపుటి ఆయనకు ఎనలేని కీర్తి ప్రతిష్ఠలను తీసుకొచ్చింది.

తన కవిత్వం అంత బలంగా, బిగువుగా ఉండడానికి గల ఒక రహస్యాన్ని విల్సన్‌రావే వెల్లడించారనిపించింది. అది ఈ కవితాసంపుటిలోని ప్రతికవితలోనూ ప్రతిఫలిస్తుంది. తాను రాసిన కవితను వెంటనే పత్రికల్లోనో, సామాజిక మాధ్యమాల్లోనో చూసేసుకోవాలనే ఉబలాటం మంచిది కాదని గుర్తించాల్సిన కవులు ఎంతోమంది ఉన్నారు. తీర్చిదిద్దిన శిల్పంలాంటి కొన్ని కవితలను తన నాల్గవ కవితా సంపుటిగా ప్రచురించారు.



తెలుగులో కొంతమంది కవిత్వాన్ని చదివి దానిలో ఉన్నదాన్ని అనుభూతి చెందినంతగా, ఆ అనుభూతిని మాటల్లో చెప్పలేం. ప్రతి పదంలోనూ కవిత్వం, ప్రతి కవితలోనూ ధ్వన్యాత్మకమైన భావన. ప్రతి కవితలోనూ సామాజిక స్పృహ. విల్సన్‌రావు తన నాలుగో కవితా సంపుటికి "నాగలి కూడా ఆయుధమే..!" దీనిలో సుమారు 67 వచన కవితలు ఉన్నాయి. వీటిలో కొన్ని దీర్ఘ కవితల స్వరూప స్వభావాలను, మరికొన్ని మినీ కవితల స్వభావాన్ని కలిగి ఉన్నాయి.

"ఎంత నేరం కాకపోతే మరీనూ?/ మాట గొంతులోనే/ హత్యకు గురవుతున్నచోట/ స్వేచ్ఛకోసం అశ్రులు చాచడమా?" అనడానికి ముందు కవి ఒక ఆత్మీయుణ్ణి గురించి స్వగతంలో మనసులో అనుకోగానే తన కళ్ళముందుమెరుపులా వాలేవాడనీ, అతడు కనిపించకపోతే ఎలా ఉంటుందో మనసు పడిన సంఘర్షణ, గుండెపడిన తడబాటు, ఆలోచన చేసిన హెచ్చరికలను, సమాజానికి కావలసిన స్వేచ్ఛకోసం కొందరు చేస్తున్న త్యాగాన్నీ కీర్తిస్తాడు.'జ్ఞానవాక్యం' కవితలో కవిత్వశక్తిని అభివ్యక్తీకరించిన తీరు అద్భుతం.

'నాలో నిద్రిస్తున్న కలలను మేల్కొలిపి/ నాలో గూడు కట్టుకున్న/ సందేహాలను కూల్చేసి/ నన్నొక సజీవ జలపాతాన్ని చేసింది" దీనిలో తనని సజీవం చేసిన 'వాక్యం' ఎవరు? ఈ కవిత నవతెలంగాణ నిర్వహించిన మహాకవి దాశరథి రంగాచార్య స్మారక రచనల పోటీలో ప్రథమ బహుమతి పొందింది. 'జ్ఞానవాక్యం' ప్రతి మనిషికీ అదొక మహావాక్యమే, అది ఒక కవిత్వం కావచ్చు. అది ఒక మహాకవి మాట కావచ్చు. అది ఒక ప్రవక్త ప్రవచనం కావచ్చు. కానీ, అదంతా మళ్ళీ జీవితమై, మళ్ళీ అదంతా అనుభవమై ఎదురవుతుంది.

మక్కెన సుబ్బరామయ్య స్మారక కవితల పోటీలో బహుమతి పొందిన కవిత 'పద్యానికి పూచిన పువ్వు' ఒక చక్కని ఎలిజీ. ఏ ద్వేషం లేని మంచి మనుషులెంతోమంది ఉంటారు. మనం చూడగలగాలి. మనం చూసే చూపును బట్టి కూడా మన చుట్టూ ఉండే మంచి కనిపిస్తుంది. అందుకేనేమో మన పూర్వీకులు 'యద్భావం తద్భవతీ' అన్నారు. ప్రతి రోజూ తానెన్ని కష్టాలు పడుతున్నా, తన చుట్టూ ఉండేవాళ్ళతో సంతోషంగా గడుపుతూ, సంతోషాన్ని పంచేవాళ్ళుంటారు. కవి దీన్ని

"పొద్దు పొడుపుకు ఆత్మీయ సత్కారం చేసి/ చిన్న చిరునవ్వు మన కళ్ళలోకి ఒంపుతాడు" అని గుర్తుచేస్తాడు.

"ఒట్టిపోతున్న ప్రపంచం" కవితలో కొన్ని పాదాల్లో రెండేసి పదాలను ప్రయోగిస్తూ ఒక చరిత్రను మరొక చరిత్ర ధ్వంసం చేసి తమ చరిత్రను ప్రపంచానికి బహిర్గతం చేసే ప్రయత్నం చేసినా, రెండు చరిత్రలలోని వాస్తవాల్నీ గుర్తించే కొత్త ఉదయాలు ఉదయించకమానవు అని చెప్పడంలోనే కవి శిల్పరహస్యం దాగి ఉంది.

మనిషి అస్తిత్వానికి తాను, తన చుట్టూ ఉన్న పరిసరాలు, తన ఆలోచనలు కారణమవుతాయి. తన ఆలోచన సవ్యదృష్టిలో ఉండడం, ఉండకపోవడం అనేది తన అవగాహనను బట్టి ఉంటుంది. ఒక్కోసారి తన శత్రువు ఎవరో గుర్తించలేని యుద్ధం చేస్తుంటాడు. తనకు తానే శత్రువుగా కూడా పరిణమిస్తుంటాడు. తన శత్రువుని గుర్తించి ఆ శత్రువు లక్ష్యాన్ని గురిచూసి కొట్టగలడం ఎంతో పరిశీలన, జీవితానుభవాల వల్ల మాత్రమే అలవడతాయి. భారతదేశంలో రైతు దుస్థితికి లేదా రైతు అస్తిత్వాన్ని నిర్ణయిస్తున్నదెవరు? తానేమి చేస్తున్నాడో తెలియకుండా తాను పండించడమే పనిగా పెట్టుకుంటే సరిపోతుందా? తన పొలంలో పండే పంట ఏమి వేయాలనేది చెప్పేదెవరు? ఒక వేళ ఏవరైనా చెప్పినా తాను వింటాడా? ఒక వేళ విన్నా, ఆ లాభనష్టాలకు కారకుల్ని నిజంగా గుర్తించగలుగుతున్నాడా? ఒకవేళ తనకు అందవలసిన సహాయం, సహకారం ప్రకృతి, ప్రజలు, ప్రభుత్వం, చట్టాలు అన్నీ సక్రమంగా అందించినా తన ఆలోచనలోని 'తాను' బయటకొస్తున్నాడా? ఒకవేళ ఇప్పటివరకు చెప్పుకున్న ఈ సహాయ సహకారాలు లేకుండా తానొక్కని ఆలోచనతోనే 'తాను' నిజంగా నిలబడగలుగుతున్నాడా? ఇవన్నీ రైతులు, ప్రజలు, ప్రభుత్వం, అది చేసే ఒప్పందాలపై కూడా ఆధారపడి రైతు అస్తిత్వాన్ని నిర్ణయిస్తాయి. ఇవన్నీ ఏమి చేసినా చేయకపోయినా రైతు 'తాను' నిరంతర శ్రామికుడు. 'తాను' నిరంతం భూమిని నమ్ముకున్న విశ్వాసి. ఈ రెండు విధాల అస్తిత్వాల సంఘర్షణ 'నాగలి కూడా ఆయుధమే...! కవితలో కనిపిస్తుంది.

"భూమికీ ఒక గుండె ఉందని/ ఆ గుండెలో కొంత తడి ఉందని తెలిసాక/ దాని ఊపిరితో ఊపిరి కలిపి" అంటూ సాగే ఈ పాదాల్లో రైతు 'తాను' గా బహిర్గతమయ్యే శ్రామికుడు, 'తాను'గా నమ్మకంపై నిలబడే ఒక ఆత్మవిశ్వాసంగా జీవించే గొప్ప చైతన్యాన్ని అక్షరీకరించాడు కవి. అదే కవి అదే రైతు ఉనికిలోని మరో కోణాన్ని పట్టుకుని చూపిస్తూ...

"ఆకలి డొక్కలు నింపే/ చట్టాలు చేయాల్సిన చట్టసభల" లలో దాగిన నిర్వీర్యతను, నిస్సహాయతను, నిలువుదోపిడీని గుర్తించమంటాడు. అయినా కవి ఎగిరిపడే కెరటంలాంటివాడు. తనని తాను నమ్ముకుంటాడు. చివరిలో 'నాగలిని ఒక ఆయుధం'గా అభివర్ణించడంలో రైతుల సమైక్యశక్తిని ప్రదర్శించాల్సిన అవసరాన్నీ సూచిస్తాడు కవి. రైతు అస్తిత్వంలోని భిన్నపార్శ్వాల్నీ, భిన్న పోరాటమార్గాల్నీ, తన శత్రువుని గుర్తించడంలోని నేర్పరితనాన్నిరైతుకి చూపించడంలో కవి రైతుపక్షపాతిగా మారిపోవడమే ఈ కవిత తారాస్థాయికి చేరడం. ఈ కవితకు కొనసాగింపులాంటి కవిత 'అనివార్యం'. కానీ, రైతు జీవితాన్నీ సమన్వయించుకొనే అవకాశం ఉన్నా, మనస్తత్వ సంఘర్షణకు సంబంధించిన కవిత ఇది.

సమకాలీన సమాజాన్ని అవగాహన చేసుకోవడానికి నవల, కథ తోడ్పడితే, కవిత్వం సమకాలీన మానవీయతను ఆత్మీకరించుకోవడానికి తోడ్పడుతుంది. కరోనా తెచ్చిన మానవీయ సంబంధాల విధ్వంసం, అదే సమయంలో జీవితం పట్ల మనుషులు వ్యవహరించవలసిన తామరాకు మీద నీటి బిందువుల్లాంటి మానవజీవన గమ్యాన్నీ స్పష్టంగా చూపించింది. కళ్ళెదుటనే రక్తసంబంధీకులు కనిపిస్తున్నా ముట్టుకోనివ్వని కొంతకాలం బలవంతంగా ఉండాల్సిన క్వారంటైన పరిస్థితులు...వీటిని వర్ణిస్తూ కవి...

"భూమికీ ఒక గుండె ఉందని/ ఆ గుండెలో కొంత తడి ఉందని తెలిసాక/ దాని ఊపిరితో ఊపిరి కలిపి" అంటూ సాగే ఈ పాదాల్లో రైతు 'తాను' గా బహిర్గతమయ్యే శ్రామికుడు, 'తాను'గా నమ్మకంపై నిలబడే ఒక ఆత్మవిశ్వాసంగా జీవించే గొప్ప చైతన్యాన్ని అక్షరీకరించాడు కవి.

"చూడగానే ఎదురేగి నిన్ను హత్తుకోలేని/ అలసిన నీనుదుటిపై ముద్దెట్టుకోలేని/ కనీసం నిశ్వాసను తాకలేని అసహాయ" స్థితిని ప్రపంచవ్యాప్తంగా చూశామని ఆనాటి భయంకరమైన మానవీయ ఉద్వేగాన్ని కవిత్వీకరించారు. నవల, కథల కంటే పాత్రలు లేని, స్థల కాలాలు లేని వర్ణనలు ప్రపంచంలోని అన్ని దేశాల మానవ ఉద్వేగాల్నీ కవిత్వం అనుభూతిలోకి తీసుకొస్తుందనడానికి ఇంతకంటే నిదర్శనం అవసరం లేదేమో. ఇలాంటి వర్ణనలు ఒక భాషకు, ఒక దేశానికి మాత్రమే పరిమితమైనవి కాదు. విల్సన్‌రావు కవిత్వంలో ఇటువంటి సాధారణీకరించే అనుభూతులెన్నో ఉన్నాయి.

లోకంలో సాధారణంగా కొడుకు లేదా కూతురు తన తల్లిదండ్రులకు ఎంతో అందంగా కనిపిస్తారు. అలాగే, తన మనవలు కూడా తమ తల్లిదండ్రుల్లా అనిపిస్తూ, ఒక్కోసారి తానే ఒక ప్రతిబింబంగా అనిపిస్తూ ఆనందపారవశ్యానికి గురిచేస్తారు. అందుకనే పిల్లల్ని మన పూర్వీకులు "ఆత్మావై పుత్రనామాసి" అనీ, "అంగాదంగాత్సం భవసి"అనీ ప్రవచించారు. "హితఈజ్ మై సిన్సియర్ లవర్" కవిత చదివి చూడండి. కవిలోని ప్రేమ, కవిలోని సౌందర్యం అది ఇచ్చే ఆనందం మనకీ అనుభూతిలోకి వస్తుంది. నిజానికి ఈ కవిత ప్రతి పాదాన్నీ ఉదహరించాలనిపిస్తుంది.

"నా ఆత్మలో అతడింకిపోయాడో/ అతని ఆత్మలో నేనింకిపోయానోగానీ/ ఏదో తెలియని ఊహ ఒకటి/ నాలో ఊపిరిపోసుకొని మౌనినైనప్పుడు/ నా మౌనానికి మాటలు కూర్చే నాయకుడౌతాడు" అని వర్ణించడం ఒక వేద వాక్యాన్ని వచనంలో ప్రవచించినట్లుంది. 'గుండెలపై వెచ్చటి ముద్దివ్వ'డం, "కల్లాకపటమెరుగని కొంటెకోణంగి"గా కనిపించడం ప్రేమలోని స్వచ్ఛతను, నిష్కల్మషత్వాన్ని చెబుతున్నాయి. "నా ప్రేమమయ జీవిత పుస్తకంలో మొదటి వాక్యము చివరి వాక్యము అతడే" అంటూ బాల్యాన్నీ, యౌవనాన్నీ, వృద్ధాప్యాన్నీ, ఆ మానవ పరిణామ గతులన్నీ మనకు రుచి చూపిస్తాడు కవి. ఇలాంటి కవిత్వం రాయాలంటే గుండె నిండా ప్రేమ ఉండాలి. ఈ కవిత్వం చదువుతుంటే బైబిల్‌లోని ప్రేమగీతాన్ని చదువుతున్నట్లుంది. ప్రేమించే మనిషిని అక్షరాల్లో అభిషేకించినట్లుంది. ఒక వేదమేదో నాకు జీవితాన్ని ప్రబోధిస్తున్నట్లుంది. ఈ కవిత్వం నిండా ప్రేమ పరిమళాల్ని పంచుతున్న మానవత్వం ఉంది. ఒక కవినీ, ఒక విమర్శకుడినీ, ఒక రైతునీ, ఒక కవినీ, ఒక స్నేహితుడినీ... ఇలా మానవుడెన్ని రూపాల్లో కనిపిస్తాడో, మానవుని ప్రేమను ఎన్ని రూపాల్లో దర్శించి, స్పర్శించలగమో ఈ కవిత్వం చూపిస్తుంది.

ఈ కవితాసంపుటి నిండా కవిత్వం ఉంది. కవిత్వాన్ని చేసిన మానవీయ పరిమళం ఉంది. అమృతతుల్యమైన ప్రేమతత్వముంది. జీవన వ్యాఖ్యానం ఉంది. జీవితాన్ని జీవించడమెలాగో ఈ కవిత్వం నేర్పుతుంది. అన్ని కవితల్నీ చదివినా, వాటన్నింటినీ విశ్లేషించాలనుంది. అది మరో సందర్భంలో చేస్తాను. మళ్ళీ శివారెడ్డిపై రాసిన 'అతడూ, నేనూ– కొన్ని కవిసమయాలూ...' అనే కవితతోనే దీన్ని ముగించాలనిపిస్తుంది. కవి శివారెడ్డి ఈ కవితకు ఒక నెపం మాత్రమే. ఈ కవితలోనే 'మానవత్వం పరిమళించే ప్రేమతత్వాన్ని పంచే ప్రతి ఒక్కరినీ చూడొచ్చు. ఈ కవిని కూడా చూడొచ్చు. ఈ కవి లక్ష్యాన్ని చూడొచ్చు. ఈ కవి ఆశయాన్ని తెలుసుకోవచ్చు.

"మంచి కవిత్వం అంటే/ దానికి గుండె ఉండాలి/ ఆ గుండె కన్నీరు కార్చాలి/ ఆ కన్నీరు కాలపు బరువుల్ని మోయా"లి అనేది కవి కవిత్వతత్త్వం పట్ల వ్యక్తం చేసిన అభిప్రాయం. అంతే కాదు కవిత్వం ఎలా ఉండాలి?

"నేనున్నాననే భరోసాతో/ తొలకరి చినుకై/ జీవాక్షర"మవ్వాలి. కవిత్వం నవ్వుల పరిమళం అద్దాలి. తీపి కలలను పంచాలి. ఒక నులివెచ్చని కరస్పర్శగామారాలి. మనః పలకంపై చెరగని ముద్ర వేయాలి. ఇవన్నీ కవి విల్సన్‌రావు మహాకవి శివారెడ్డి వ్యక్తిత్వాన్ని ఆవిష్కరించే సందర్భంలో కవి పలికి కావ్యశాస్త్రవాక్యాలు. నిజంగానే ఇదంతా ఈ కవితాసంపుటిలోని కవితల్లో కనిపిస్తుంది. కవి విల్సన్‌రావుతో మాట్లాడుతుంటే ఒక పిల్లాడి స్వచ్ఛత మనలోనూ ప్రవేశిస్తుంది. ఇక ఆయన అంతరంగం చిలికి ఈ కవిత్వామృతాన్ని తాగితే నిజంగానే మనం అమరులమవుతాం.



– ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, 9182685231

సాహితీ వార్తలు

19న విల్సన్‌రావు కవితా సంపుటి ఆవిష్కరణ

ప్రముఖ కవి విల్సన్‌రావు కొమ్మవరపు కవితా సంపుటి 'నాగలి కూడా ఆయుధమే' ఆవిష్కరణ సభ ఈ నెల 19వ తేదీ సాయంత్రం 6గంటలకు రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో జరుగుతుంది. సభలో ఆచార్య దార్ల వెంకటేశ్వరరావు, ఆచార్య కొలకలూరి ఇనాక్, కె. శివారెడ్డి, కె. శ్రీనివాస్, కోయి కోటేశ్వరరావు, మామిడి హరికృష్ణ, కవి యాకూబ్, ఎం. నారాయణశర్మ, ఎం.వి.రామిరెడ్డి, జెల్ది విద్యాధర్ రావు పాల్గొంటారు.
- పాలపిట్ట బుక్స్

'దురస్తు' ఆవిష్కరణ

'దురస్తు' తెలంగాణ కథ - 2022 ఆవిష్కరణ సభ 'నల్గొండ కథా పాఠశాల' ఆధ్వర్యంలో ఈ నెల 24న నల్లగొండలోని నాగార్జున ప్రభుత్వ కళాశాల, అల్యూమిని హాల్‌లో జరుగుతుంది. సభాధ్యక్షులుగా డా॥ సంగిశెట్టి శ్రీనివాస్ వ్యవహరిస్తారు. బి. నర్సింగ రావు 'దురస్తు'ను ఆవిష్కరిస్తారు. మేరెడ్డి యాదగిరి రెడ్డి, డా॥పగడాల నాగేందర్, పెరుమాళ్ళ ఆనంద్, డా॥ఉప్పల పద్మ డా॥వెల్దండి శ్రీధర్, మోతుకూరి శ్రీనివాస్ పాల్గొంటారు.
-'సింగిడి' తెలంగాణ రచయితల సంఘం.

ప్రజావాగ్గేయకారుల పాఠం గరిమెళ్ల

"అన్యాయకాలంబు దాపురించిందిపుడు అందరం మేలుకోవాలి/ మాన్యాలు భోగాలు మనుజులందరికబ్బు మార్గాలు వెతకాలిరండి" – అంటూ అప్పటికప్పుడే ఆసువుగా పాటలు కట్టి, పాడి, ఆనాటి ప్రజల్లో నిత్యం పోరాట ధైర్య సాహసాలు నూరిపోస్తూ బ్రిటీషు పాలకుల గుండెల్లో రైళ్లు పరుగెత్తించినవాడు గరిమెళ్ల.

'ఇలాంటి పాటలను నిషేధించండి' అని బ్రిటీష్ అధికారి ఆజ్ఞాపిస్తే... 'నిషేధాలు నాకేమీ కొత్తకాదు. మీరెంత ఆపినా అన్యాయకాలం అంతం కాక తప్పదు. అసమాన రాజ్యం అంతం కాక తప్పదు' అంటూ వెన్వెంటనే గర్జిస్తాడు. **"ఏటి పొడుగునా దున్నిన ఎరువేసి నీరెట్టి నూర్చి పండించేది మనవంతా?/ గోటు చేయుచు బూతు కూతలను కూసి కూలగొట్టి కోసుకొని పోవుటింకొకరివంతా?"** అంటూ పాటగానే పాలకుల నైజాన్ని ప్రశ్నిస్తాడు. కష్టజీవుల రైతుల పక్షం వహించడమే కాదు, 'మనవంతా?' అంటూ ప్రజలతో మమేకమైపోతాడు. జట్టు కడతాడు. సామూహిక ఉద్యమశక్తిగా ముందుకు ఉరుకుతాడు.


బ్రిటీష్ పాలకులు ఆనాడు తెలుగునేలపై లెవీ ధాన్యం కట్టాలంటూ రైతుల ఇళ్లనుండి, కల్లాల నుండి దౌర్జన్యంగా పంటను లాక్కుపోయేవారు. పండించిన గింజలు దక్కక చాలామంది పస్తులతో జీవించేవారు. ఆ దురాగతాలను పాటలతో దునుమాడేవాడు గరిమెళ్ల.

తనకుతానుగా ప్రజలభాషలో పాటలు రాసుకుంటూ, పదాలు అల్లుకుంటూ బాణీలు కట్టుకున్న అన్నమయ్య, త్యాగయ్య, రామదాసు వంటి వాగ్గేయకారులు భక్తి పారవశ్యంలో మునిగితేలుతూ భక్తులను ఓలలాడించారు.

ఆధునిక కాలంలో ప్రజావాగ్గేయకారునిగా ప్రసిద్ధి పొందిన గరిమెళ్ల సత్యనారాయణ (1893–1952). శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట తాలూకా గోనెపాడు గ్రామంలోని ఓ నిరుపేద కుటుంబంలో జన్మించాడు. గరిమెళ్ల యుక్త వయసులో చదువుకుంటుండగానే గురజాడను ఆరాధించాడు. **"మూరువేషము తీసివేస్తివి/ రంగులెల్లను తుడిచిపెట్టివి/ సహజమయిన సౌందర్యముందని చాటి చెప్తివి లోకమునకు/"** అని గురజాడను కీర్తిస్తాడు.

జలియన్‌బాలా బాగ్ దురంతంలో జనరల్ డయ్యర్ కర్కశత్వానికి వందలాదిమంది బలయ్యారు. ఈ మారణకాండకు విలపిస్తూ పాడిన పాట... **"కనులనీరు కారెనుగా కరుణలేకయా/ దయ్యరు సల్పిన వధ వినినా/ చచ్చిన జనము లెక్కలేదుగా/ అబలలు బాలలెందరీల్గిరో అసలే తెలియదుగా..."** వింటూ కన్నీరు పెట్టనివారు లేరు.

గాంధీజీ పిలుపుతో చదువుమాని స్వరాజ్యసమరంలో దూకిన గరిమెళ్ల సత్యాగ్రహాలు, విదేశీ వస్త్ర బహిష్కరణోద్యమంలో ఉవ్వెత్తున పాల్గొన్నాడు. **"సీమ గుడ్డ కట్టబోకురా నా చిట్టిబిడ్డా/ రాట్నములను పొయిలోనపెట్టి రమ్యకళను మంటబెట్టి/ చేతు నిట్లుతెచ్చుకుంటిమిరా నా చిట్టిబిడ్డా"** అంటూ నిరసించాడు.



వేల్స్ యువరాజు భారత పర్యటనకు వచ్చినప్పుడు **"దండాలు దండాలోయ్ బాబు/ మేముండ లేమండోయ్ బాబు/ ఈ సైతాను ప్రభుతనింక సాగనీమండోయ్"** అంటూ జనంలో ఉత్సాహాన్ని నింపుతాడు. **"ఉప్పు పన్ను - పప్పు పన్ను - ఊరికెళితే పన్ను బాబు/ కొప్పు కాస్తా దేవునికి మొక్కుకుంటే పన్ను బాబు..."** అని వెటకరిస్తూనే **"నూలుపోగు మీద రాజ్యం ఊగుతున్నాదండీ బాబు/ సీమ నూలు తెంచితేనూ సితికి పోవునండీ బాబు"** – అలా బ్రిటీష్ పాలన ఆర్థిక రహస్యాన్ని ఎండగడతాడు.

అసలు గరిమెళ్లంటే అందరికీ గుర్తుకొచ్చేపాట **"మా కొద్దీ తెల్లదొరతనమూ దేవా/ మా ప్రాణాలపై పొంచి**

"మంటలివిగో ఆర్పరండిరా! నా చంటిబిడ్డరాలా! సకల జాతులారా! మంటలివిగో ఆర్పరండిరా!"

మానాలు హరియించే" – ఈ పల్లవికి అనుగుణంగా ఎక్కడికక్కడ లెక్కలేనన్ని చరణాలు అల్లుకుని పాడిన పాట ఇది. ప్రజలు కూడా ఈ బాణీల్లోనే తమ భావాలను, బాధలను అల్లుకుని పాడుకున్నారు. రైళ్లల్లో బిచ్చగాళ్ల సైతం పాడుకున్నట్లు ఆనాడు వార్తలొచ్చాయి. అంతటి గొప్ప ప్రజాగీతంగా అవతరించింది. వర్ధిల్లింది.

ఈ పాట విన్న గోదావరి జిల్లా కలెక్టరు బ్రేకన్ దొర "భాష తెలియని నాకే నీ పాట వింటుంటే రోమాలు నిక్కబొడుచుకున్నాయి. భాష తెలిస్తే ఇంకేమైనా వుందా?" అంటూ పాటను నిషేధించాడు.

"పసిపిల్లలను పాలు తాగనీయకుండా, ప్రజల్ని పాట పాడనీయకుండా మీరు ఆపగలరా?" అని ఎదురు ప్రశ్నిస్తాడు గరిమెళ్ల. బ్రిటీష్ కొలువులో చేరమని ఆఫర్ చేస్తే... **"దొరబూట్లు నాకుతూ, కుక్కలా బతకాలా...? బానిసత్వం కన్నా చావే మేలు"** అని తిరస్కరించాడు.

రాజ్యాధికారం నేరం కింద మద్రాసు ఎగ్మూరు కోర్టు మేజిస్ట్రేట్, గరిమెళ్ల కళ్లముందే అతను రచించిన స్వరాజ్యగీతాలు, పుస్తకాలు ఐదువేల ప్రతులను తెప్పించి తగులబెట్టాడు. "కూలి పోతుందోయ్! కూలిపోతుంది కూకటివేళ్లతో కూలిపోతుంది ఈ రాక్షస రాజ్యం" అంటూ ఆక్రోసిస్తాడు. బ్రిటీష్ రాజ్యాన్ని కూల్చాలనే కుట్రలతో అసంఖ్యాకంగా పాటలు రాశాడని గరిమెళ్లకు రెండేళ్ల కఠిన కారాగార శిక్ష విధిస్తారు. పాట వలన జైలుకెళ్లిన తొలి జాతీయకవిగా అలా చరిత్రకెక్కాడు గరిమెళ్ల.

గరిమెళ్లకు తెలుగు, ఇంగ్లీషు, హిందీ భాషలు వచ్చు. జైలులో తమిళం, కన్నడం నేర్చుకున్నాడు. జైలులో ఖైదీల హక్కుల కోసం పోరాడుతూ కూడా పాటలు కట్టాడు. ఆ సమయంలో తండ్రి మరణిస్తాడు. క్షమాపణ పత్రం రాసిస్తే విడుదల చేస్తామని జైలరు అంటే, క్షమాపణ చెప్పి నా తండ్రి అభీష్టానికి అప్రతిష్ట తేలేనని నిరసిస్తాడు. **'స్వాతంత్ర్య సమరంలో తలలు తెగినా సరే తలలు దించం'** అని నినదిస్తాడు.

గాంధీజీ కోర్కె మేరకు సబర్మతి ఆశ్రమంలో జాతీయ కవి గాయక సమ్మేళనంలో పాల్గొని అంటరానితనంపై పాటలు కడతాడు. **"అంటరానివాడని నన్నంటే ఒప్పుకోను తుంటరి, నీ కిష్టము లేకుంటే అడ్డు తొలగిపొమ్ము"** – ఇది కూడా జనమందరి పాటయిందప్పుడు.

స్వాతంత్ర్యం వచ్చినవేళ (1947 ఆగస్టు 15) దేశ విభజన అల్లర్లు మిన్నంటాయి. మత కలహాలు మంటల్లో ఎందరో బలైపోయారు. గాంధీతో పాటు గరిమెళ్ల దు:ఖసాగరంలో మునిగిపోయాడు. **"మంటలివిగో ఆర్పరండిరా! నా చంటిబిడ్డరాలా! సకల జాతులారా! మంటలివిగో ఆర్పరండిరా!"** అంటూ గుండెలవిసేలా దు:ఖించాడు.

'స్వాతంత్ర్య సమర యోధుడు, కవి, గాయకుడు గరిమెళ్ల సత్యనారాయణ ఈ రోజు నిరాధారంగా వున్నాడు. పాపం వారికి పూర్తిగా దృష్టిపోయింది. తమ్ముడు, భార్యా మరణించారు. ఇద్దరు పిల్లల్ని పోషించవలసిన బాధ్యత వీరియందుంది' అని 'పెంకిపిల్ల' మాసపత్రికలో వచ్చిన ప్రకటన గరిమెళ్ల కడపటి రోజు దయనీయ స్థితికి అద్దం పడ్తుంది.

స్వాభిమానధనుడు, బహుభాషా పండితుడు, కవిగాయకుడు, సంచార పాత్రికేయుడు అయిన గరిమెళ్ల కడకు బిక్షాటనకు కూడా వెనుకాడలేదు.

'సత్యనారాయణ గారూ! మన దేశానికి నజ్రుల్ ఇస్లాంలాగా మీరూ మన తెలుగువారికి జాతీయకవి. ప్రభుత్వం ఇచ్చిన పదెకరాలు నిరాకరించి మీరిలా అడుక్కోవడం బాగోలేదని కాంగ్రెస్ పెద్దలంటే... భ్రష్టుపట్టిన పాలకుల మోచేతి నీళ్ళ తాగి దేబిరించేకంటే, ప్రజల దగ్గర అడుక్కోవడమే నాకు గౌరవం అని ఘాటుగా సమాధానం ఇస్తాడు. 'మొండితనంతో మీరేం సాధిస్తారు?' అని ప్రశ్నిస్తే... 'కొందరు త్యాగం చేయాలి. నశించాలి. పెత్తనం చేసేవాళ్ల నాశనం కోసం కొందరు నశించాల్సిందే' అని కసిగా జవాబిస్తాడు.

'శాంతియు, క్రాంతియు, ద్రవ్యదురాశా విముక్తియు, సుజన గణ సమారాధన శక్తియు, శిల్పకళా సత్కార్య ప్రశస్తియు ఈ ఉర్వీ తలంబున విహరించువలెనని కోరుట వెర్రితనంబో... నేనొక వెర్రినగుదనే గాక ఆక్షేపించే జ్ఞానుల జ్ఞానం నాకెపుడు వద్దు' అని నిర్ద్వందంగా తన గురించి ప్రకటించుకున్నాడు.

ఆంధ్రుల ప్రత్యేక రాష్ట్రం కోసం ఉద్యమగీతాలు రచిస్తూ శిక్షణనిస్తూ 1952, డిసెంబర్ 18న మరణించాడు. గరిమెళ్ల నిలిస్తే పాట, చలిస్తే పాట. ఆ విధంగా పాటలతో కడవరకు జనాన్ని ఉద్యమశక్తిగా కదలిస్తూనే కన్ను మూశాడు.

'సత్యవాగ్గేయకారుడా/ నీ గంభీర గళోద్గీతికలు స్వాతంత్ర్య భావ వాహికలు. నీ జీవితమొక విషాదగాయం. తెలుగు జాతికది ఉషోదయగీతం' అని జనం వేనోళ్ల ప్రస్తుతించారు.


(నేడు గరిమెళ్ల వర్థంతి)



కె. శాంతారావు, 9959745723

వదిలిపెట్టండి బాబూ

ఉండలేను బందీఖానాలో వదిలిపెట్టండి బాబూ
నన్ను నేను స్కానింగ్ చేసుకోవాలి
కాలి గోర్ల నుంచి నెత్తెంటికలదాకా ప్రతిదీ
లోపమెక్కడుందో.. తాపకో రోగం బయటపడుతుంది
అదుపుతప్పిన నోరు, నెత్తికెక్కిన కళ్ళు, శ్వాసలో
బుసలు



అహం, అత్యాశ, నియంతత్వం, కోపం, మోసం
దౌర్బల్యాలు దండిగా శాసిస్తున్నాయి నన్ను
సర్కస్ బోనులో పులిలా ఆడిస్తున్నాయి
నాపై నాకు అతి నమ్మకం, అప నమ్మకం
అన్నీ నన్ను ఖైదు చేసి ఆడుకుంటున్నాయి
నన్ను త్వరగా విడిచిపెట్టండి

బాల్యంలోని మనిషి తనాన్ని మళ్లీ తెచ్చుకోవాలి
తరాల కింద ఎండిన మానవత్వం మొక్కకు తిరిగి
పాదు కట్టాలి
మమతల ఎరువు వేయాలి, స్పందన గుణం అంటు
కట్టాలి
సంకెళ్లను బద్దలు కొట్టుకొని
మొద్దును దూగోడా పట్టాలి, శిలను శిల్పంలా చెక్కాలి
దౌర్భాల్యాల జలపాతాన్ని తట్టుకునేలా
నిండు గుండెను బండరాయిలా అడ్డు నిల్వాలి
సముద్రం పాలు కాని నదిలా పొలాలకు పారాలి

నన్నొదిలిపెట్టండి బాబూ
జరగాల్సిన నష్టం ఇప్పటికే జరిగింది
అక్కరకు రాని కొవ్వు పెరిగింది
పెరిగిన కొమ్ములు కుమ్ముతున్నాయి
మదమెక్కినట్లు, ఇష్టమొచ్చినట్లు
ప్రశ్నలను కాళ్ళ కింద నలిపేసిన వెన్నో
నన్నవి కాదు నేనే వాటిని వదిలిపెట్టాలి
నన్ను నేను సొక్కం బంగారంలా చేసుకునేందుకు
కరిగించుకోవాలి, పుటంపెట్టుకోవాలి
జనానికి జాతి జెండా కావడానికి సిద్ధం చేసుకోవాలి

– కొమురవెల్లి అంజయ్య, 9848005676

హాజరుకు ఫేస్ అథంటికేషన్

- 'ఉపాధి హామీ'లో మోడీ సర్కారు యత్నాలు
- వచ్చే ఏడాది ప్రవేశపెట్టటానికి ప్లాన్
- సామాజిక కార్యకర్తలు, కార్మికుల ఆందోళన



న్యూఢిల్లీ : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ (ఎంజీఎన్ఆర్ఈజీఏ) చట్టం కింద లబ్దిదారుల హాజరును గుర్తించేందుకు కేంద్రం కొత్త ప్రణాళికతో ముందుకొస్తున్నది. ఇందుకోసం ఫేస్ అథంటికేషన్‌ను తీసుకురావాలని చూస్తున్నది. దీనిని వచ్చే ఏడాది అమలు చేయాలని చూస్తున్నది. కేంద్ర గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర పాలిత ప్రాంతాల(యూటీ)ను కొత్త ఫీచర్‌ని పరీక్షించి, దాని అమలుకు సిద్ధం చేయాలని కోరింది. నేషనల్ మొబైల్ మానిటరింగ్ సిస్టమ్ (ఎన్ఎంఎంఎస్)లో ఫేస్ అథెంటికేషన్(రికగ్నిషన్) ఫీచర్‌ను చేర్చామని మంత్రిత్వ శాఖకు చెందిన ఇద్దరు సీనియర్ అధికారులు తెలిపారు.

గత నెలలో రాష్ట్రాలు, యూటీలకు విధివిధానాలను వివరించడానికి మంత్రిత్వ శాఖ ఒక ప్రజెంటేషన్ చేసింది. "గత వారం, మేము రాష్ట్రాలు, యూటీలను ఫీచర్‌ని పరీక్షించడం ప్రారంభించాలని చెప్పాం. దీనితో అవాంతరాలను పరిష్కరించవచ్చు. రాష్ట్రాలు, యూటీల అంతటా దీని అమలుకు సిద్ధం కావాలని కూడా కోరాం. ఇది పథకం అమలులో మరింత పారదర్శకతను తెస్తుంది. నిజమైన కార్మికులు మాత్రమే వర్క్‌సైట్‌లలో ఉండేలా చూస్తుంది" అని మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారి ఒకరు వెల్లడించారు. దీనిని త్వరలోనే తీసుకురావాలన్నది తమ ప్లాన్ అని చెప్పారు. కానీ ఇది ఐచ్ఛికమనీ, హాజరు ఇప్పటికీ ఎన్ఎంఎంఎస్ యాప్‌లో మాన్యువల్‌గా గుర్తించబడుతున్నదని వివరించారు.

ప్రభుత్వం తీసుకురావాలని యోచిస్తున్న కొత్త ఫీచర్ ప్రకారం.. ప్రామాణీకరణ కోసం యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా(యూఐడీఏఐ)తో కార్మికుడి (లబ్దిదారుడు, వర్కర్) ముఖం స్కాన్ చేయబడి, అది వారి ఆధార్ డేటాతో సరిపోల్చబడుతుంది. సదరు వ్యక్తి పనికి నివేదించినప్పుడల్లా వర్కర్ ముఖం హాజరు కోసం స్కాన్ చేయబడుతుంది. యూఐడీఏఐ డేటాతో ముఖ ప్రామాణీకరణ ఒక్కసారి మాత్రమే చేయబడుతుందని ఒక అధికారి తెలిపారు. ఫేషియల్ రికగ్నిషన్ ప్రస్తుతం తెలంగాణ, కర్నాటక వంటి కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు పెన్షన్ పంపిణీకి, అధికారుల హాజరును గుర్తించడానికి, డ్రైవింగ్ లైసెన్స్ జారీ చేయడానికి ఉపయోగిస్తున్నాయి.

అయితే, కొత్త హాజరు విధానాన్ని తీసుకురావాలని ప్రయత్నిస్తున్న మోడీ సర్కారు ప్రయత్నాలు సామాజిక కార్యకర్తలు, కార్మికుల్లో ఆందోళనలు కలిగిస్తున్నాయి. డిజిటల్ అటెండెన్స్ సిస్టమ్‌లాగానే.. మారుమూల ప్రాంతాలలో ఉన్న ఉపాధి కార్మికులకు నెట్ సేవలతో ఫేషియల్ రికగ్నిషన్ తీసుకొస్తే అది సమస్యలను తీసుకొస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.

తప్పుడు హాజరును, అవినీతిని నిరోధించటం కోసం తీసుకురావాలని చూస్తున్నామని ప్రభుత్వం చెప్తున్నదనీ, అయితే గ్రామీణ ప్రాంతాల్లో ఈ ప్రయత్నం ఎంత వరకు విజయం సాధించగలదనేదే పెద్ద ప్రశ్న అని సామాజిక కార్యకర్త, మజ్దూర్ కిసాన్ శక్తి సంఘటన్ (ఎంకేఎస్ఎస్) సహ వ్యవస్థాపకుడు, ఎన్ఆర్ఈజీఏ సంఘర్ష్ మోర్చా సభ్యుడు నిఖిల్ డే అన్నారు. ఫేస్ రికగ్నిషన్ టెక్నాలజీకి అధిక నాణ్యతతో కూడిన ఇంటర్నెట్ కనెక్టివిటీ అవసరమనీ, మారుమూల గ్రామాల్లో ఇదెలా సాధ్యమని ఆయన ప్రశ్నించారు. ఈ ప్రయత్నాన్ని ప్రభుత్వం ఒక్కసారి ప్రవేశపెడితే.. కార్మికులకు ఇబ్బందులు తప్పవనీ, ఉపాధి హామీ కార్యక్రమం నీరుగారే ప్రమాదమున్నదని హెచ్చరించారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేద ప్రజలకు ఉపాధిని కల్పించే ఈ పథకం ఆ తర్వాత గాడి తప్పే ప్రమాదమున్నదని ఆందోళన వెలిబుచ్చారు. నిజమైన లబ్దిదారుల కోసమే ఇలాంటి ప్రయత్నాలు అని మోడీ సర్కారు చెప్తున్నది. 2022-23లో, 5.18 కోట్ల మంది కార్మికుల పేర్లు 'ఉపాధి హామీ' పథకం నుంచి తొలగించబడ్డాయి. ఈ విషయాన్ని సాక్షాత్తూ కేంద్రమే పార్లమెంటులో వెల్లడించటం గమనార్హం. ఫేస్ అథెంటికేషన్ టెక్నాలజీని ఉపయోగించడం వల్ల ఈ సమస్యకు తెరపడుతుందని అధికారులు అంటున్నారు.

మోడీ సర్కారుకు ఆది నుంచీ ఉపాధి హామీపై చిన్న చూపే ఉన్నదనీ, ప్రతి ఏడాది ఈ పథకానికి బడ్జెట్‌లో కోతలు విధిస్తున్నదని సామాజిక కార్యకర్తలు, కార్మికులు ఆరోపించారు. అలాగే, ఈ పథకం కింద చెల్లింపుల కోసం కానీ, హాజరు కోసం కానీ, లబ్దిదారులకు పని కల్పించే విషయంలో కానీ మోడీ సర్కారు తిరోగమన విధానాలతో ముందుకొస్తున్నదనీ, ఫేస్ అథంటికేషన్ కూడా అలాంటిదేనని వారు అంటున్నారు.

జట్టుగా పనిచేద్దాం

- సచివాలయంలో బాధ్యతలు స్వీకరించిన మంత్రి కొండా సురేఖ



నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపు కోసం ప్రజలు, అటవీశాఖ అధికారులు కలిసి జట్టుగా పనిచేయాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖల మంత్రి కొండా సురేఖ అన్నారు. ఆదివారంనాడామె సచివాలయంలోని తన ఛాంబర్‌లో మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. వన్యప్రాణుల దాడుల్లో చనిపోయిన వారి కుటుంబాలకు ఇచ్చే ఎక్స్ గ్రేషియా పెంపు ఫైల్‌పై తొలిసంతకం చేశారు. ఈ సందర్భంగా అటవీ శాఖ కార్యకలాపాలపై మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. అటవీ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన పథకాలు, పనులపై అటవీ సంరక్షణ అధికారి ఆర్.ఎం. డోబ్రియల్ పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ చేశారు. ఆయా శాఖలు ఉన్నతాధికారులు మంత్రికి అభినందనలు తెలిపారు.

గాజా ఆస్పత్రుల్లో 'రక్తపుటేరులు


- ఐరాస ఆందోళన



గాజా: హమాస్ ఉగ్రవాదుల నిర్మూలనే లక్ష్యంగా ఇజ్రాయెల్ చేస్తోన్న దాడులతో గాజా వణికిపోతోంది. ఇప్పటికే ఆ ప్రాంతంలో దాదాపు సగం భవనాలు నాశనమైనట్టు నివేదికలు చెబుతున్నాయి. ఈ క్రమంలో అక్కడున్న ప్రధాన ఆస్పత్రులు కూడా ధ్వంసం కావడం కలవరపెడుతోంది. ముఖ్యంగా గాజాలో అతిపెద్ద ఆస్పత్రి 'అల్-షిఫా'లో అత్యవసర విభాగంలో నెలకొన్న దారుణ పరిస్థితులపై ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్ఓ) తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఆ పరిస్థితిని 'రక్తపాతం'గా అభివర్ణించిన డబ్ల్యూహెచ్‌వో.. అక్కడ సాధారణ పరిస్థితులు తీసుకురావాల్సిన అవసరం ఉందని ఉద్ఘాటించింది. తీవ్ర దాడులతో ఇజ్రాయెల్ సైన్యం విరుచుకుపడుతోన్న వేళ.. వైద్య సామగ్రి అందించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ బృందం గాజాలోని పలు ఆస్పత్రులకు వెళ్లింది. ఈ సందర్భంగా అల్-షిఫా ఆస్పత్రికి వెళ్లింది. ఆ సమయంలో అక్కడి అత్యవసర విభాగంలో నెలకొన్న పరిస్థితులను చూసిన డబ్ల్యూహెచ్‌వో బృందం.. అదో 'రక్తపాతం'గా అభివర్ణించింది. యుద్ధంతోనే బందీల విడుదల సాధ్యం: నెతన్యాహు 'ఆస్పత్రి భవనం, వెలుపల వేల మంది నిరాశ్రయులు తలదాచుకుంటున్నారు. నీరు, ఆహార కొరత తీవ్రంగా ఉంది. ఇప్పటికే వందల మంది రోగులతో నిండిపోగా, ప్రతి నిమిషానికో బాధితుడు వస్తున్నాడు. తీవ్ర గాయాలతో వచ్చిన వారిని నేలపైనే ఉంచుతున్నారు. వారికి అవసరమైన నొప్పి నివారణ ఔషధాలు కూడా అందుబాటులో లేవు. ఆక్సిజన్ సరఫరా సరిగా లేకపోవడంతో ఆపరేషన్ థియేటర్లు పనిచేయడం లేదు' అని డబ్ల్యూహెచ్‌వో బృందం పేర్కొంది. గాజాలోనే అతిపెద్ద ఆస్పత్రి అయిన అల్-షిఫాలో కొద్దిమంది వైద్యులు, వాలంటీర్లు ఉన్నారని డబ్ల్యూహెచ్‌వో బృందం వెల్లడించింది. ఆస్పత్రిలో సవాళ్లతో కూడిన పరిస్థితులు నెలకొన్నాయని తెలిపింది. తక్షణమే పునరుజ్జీవనం అవసరమని అభిప్రాయపడింది. ఇంధనం, ఆక్సిజన్, ఔషధాలు, ఆహారం, నీరు క్రమంగా అందితేనే రానున్న రోజుల్లో ఇక్కడ సాధారణ పరిస్థితులు తీసుకురావచ్చని పేర్కొంది. ఇదిలాఉంటే, ఇజ్రాయెల్ చేస్తోన్న భీకర దాడులతో గాజాలో ఇప్పటివరకు 18వేల మందికి పైగా చనిపోయినట్టు అంచనా.

అఖిలపక్ష సమావేశాన్ని నిర్వహించండి

- సీఎం రేవంత్‌రెడ్డికి జూలకంటి విజ్ఞప్తి



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

ప్రజా సమస్యల పరిష్కారంలో రాజకీయ పార్టీలను భాగస్వాములను చేయాలని మాజీ ఎమ్మెల్యే, సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. అఖిలపక్ష సమావేశాన్ని ఏర్పాటు చేయాలని సూచించారు. ఆదివారం ఈమేరకు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అఖిలపక్షం నిర్వహించాలని గత ప్రభుత్వాన్ని ఎన్నిసార్లు కోరినా పట్టించుకోలేదని గుర్తు చేశారు. గత అనవాయితీని బీఆర్ఎస్ సర్కారు పెడచెవిన పెట్టిందని విమర్శించారు. విద్యుత్, పెండింగ్ ప్రాజెక్టులు, అప్పులు, నిరుద్యోగంతోపాటు కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, గత ప్రభుత్వ లోపాలు, చేసిన తప్పులు, రైతాంగం ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించాల్సి ఉన్నదని తెలిపారు. తెలంగాణ ప్రజల సమగ్రాభివృద్ధి కోసం.

ఈ ప్రభుత్వం ఏం చేయాలో, ఏం చేయకూడదో పార్టీల నుంచి సలహాలు, సూచనలు తీసుకోవాలని కోరారు. శాసనసభలో ప్రాతినిధ్యం ఉన్న వారితోపాటు ప్రాతినిధ్యం లేని పక్షాల అభిప్రాయాలను కూడా తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కేరళ రాష్ట్రంలో ఈ సంప్రదాయాన్ని పాటిస్తున్నారని గుర్తు చేశారు. మన రాష్ట్రంలో అఖిలపక్షాల సమావేశాన్ని నిర్వహించి ఆదర్శంగా నిలవాలని జూలకంటి కోరారు.

వ్యవసాయానికి ఉపాధి పనులు
ఆలోచన వెనక్కి తీసుకోవాలి

- కాంగ్రెస్ శాసనసభ్యులు టి రామ్మోహన రెడ్డి తీర్మానం అర్థరహితం : వ్యకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అర్ వెంకట్ రాములు



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

రాష్ట్రంలో వ్యవసాయ పనులకు గ్రామీణ ఉపాదిని అనుసంధానం చేస్తామంటూ కాంగ్రెస్ శాసనసభ్యులు టి రామ్మోహన రెడ్డి ప్రకటనను తక్షణమే వెనక్కి తీసుకోవాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ వెంకట్రాములు, ఉపాధ్యక్షులు బి ప్రసాద్, బొప్పిని పద్మ ఆదివారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వామపక్షాల పోరాట ఫలితంగా యూపీఏ ప్రభుత్వం వ్యవసాయ పనులు లేని సందర్భంలో వ్యవసాయ కూలీలకు పనులు కల్పించడం కోసం గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని తీసుకువచ్చారనీ, వంద రోజుల పనిని గ్యారెంటీ చేశారని తెలిపారు. ఉపాధి హామీ పనులను వ్యవసాయానికి అనుసంధానం చేయటమంటే వ్యవసాయ కూలీల కడుపు కొట్టడమేనని తెలిపారు. చట్టంలో అనేక పనులు వ్యవసాయానికి అనుబంధంగా ఉన్నాయనీ, వాటిని అమలు చేయకుండా గత పాలకులు తొక్కిపట్టారనీ, కాంగ్రెస్ ప్రభుతం అమలు చేయాలని కోరారు.

ఎస్సీ ఎస్టీల బీడు భూములు సాగులోకి తీసుకురావడం చిన్నచిన్న చెక్ డ్యాములు కాలువల నిర్మాణం చేపట్టడం వైయస్ రాజశేఖర్ రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ఇందిర జలప్రభ కింద బోర్లు వేయడం బావులు తీయడం చేశారని పేర్కొన్నారు. చౌడు భూములకు, ఒండ్రు మట్టి ఉపాధి జాబ్ కార్డు కలిగిన చిన్న సన్నకారు రైతుల భూములకు ఫ్రీగా తోలే పనిని చేపెట్టాలని డిమాండ్ చేశారు. పశువులకు పచ్చనిబైళ్లను పెంచే పనులు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

చిన్న సన్నకారు రైతులకు ఉపయోగపడే పనుల అమల కోసం చట్టంలో ఉన్న అవకాశాలను ఉపయోగించుకునే పద్ధతిలో ప్రణాళికలు రూపొందించడం కోసం వ్యవసాయ కార్మిక సంఘాలు స్వచ్ఛంద సంస్థలతో వర్క్ షాప్ నిర్వహించాలని కోరారు.

అది ఒక తిరోగమన చర్య

- భావవ్యక్తీకరణ స్వేచ్ఛకు వ్యతిరేకం : డీయూ 'సోషల్ మీడియా విధానం'పై ఉపాధ్యాయులు





న్యూఢిల్లీ : ఢిల్లీ యూనివర్సిటీ (డీయూ)లోని ఉద్యోగుల సోషల్ మీడియా వినియోగంపై సూచనలు ఇవ్వటానికి వర్సిటీ యంత్రాంగం ఏర్పాటు చేసిన ఒక కమిటీ వివాదానికి దారి తీసింది. కమిటీ ఏర్పాటుపై డీయూ ఉపాధ్యాయులు తీవ్రంగా స్పందించారు. ఇది ఒక తిరోగమన చర్యగా అభివర్ణించారు. ఇది భావవ్యక్తీకరణ స్వేచ్ఛను హరిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా 2024లో లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ, ఉపాధ్యాయులు అభిప్రాయాలను రూపొందించే వారుగా ఉండకూడదని యూనివర్సిటీ అడ్మినిస్ట్రేషన్ కోరుకుంటున్నదని ఒక టీచర్ ఆరోపించారు.

డీయూ కంప్యూటర్ సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ సంజీవ్ సింగ్ అధ్యక్షతన ఈ కమిటీ పని చేస్తుంది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, కాశ్మీర్ యూనివర్శిటీ తర్వాత సోషల్ మీడియా వినియోగం కోసం అటువంటి సంస్థను అభివృద్ధి చేసిన రెండో విశ్వవిద్యాలయంగా సెంట్రల్ యూనివర్సిటీ అవతరించింది. కాశ్మీర్ విశ్వవిద్యాలయం జారీ చేసిన మార్గదర్శకాలు రాజకీయపరమైన పోస్ట్‌లను స్పష్టంగా నిషేధించాయి.

డెమోక్రటిక్ టీచర్స్ ఫ్రంట్ మాజీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ మెంబర్, సెక్రెటరీ అభా దేవ్ హబీబ్ మాట్లాడుతూ.. ఉద్యోగుల కోసం సోషల్ మీడియా వినియోగాన్ని సూచించడానికి ఒక కమిటీని ఏర్పాటు చేయటం వ్యక్తిగత, వృత్తిపరమైన జీవితాలలో వారి ఆలోచనా, భావ ప్రకటనా స్వేచ్ఛను వినియోగించుకునే వ్యక్తులకు సంబంధించినది. "2013లో యూనివర్శిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) విశ్వవిద్యాలయాలకు ఒక నియమావళిని పంపినప్పుడు మేము ఇదే విధమైన తీరును చూశాం. క్యాంపస్‌లలో ఏదైనా అసమ్మతి, నిరసనలను తొలగించడానికి పాలనా యంత్రాంగం దానిని ఉపయోగించింది" అని అన్నారు. ముఖ్యంగా, 2024లో లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్నప్పుడు, ఉపాధ్యాయులు అభిప్రాయాలను రూపొందించే వారుగా ఉండకూడదని కూడా ఈ చర్య సూచిస్తున్నదని హబీబ్ తెలిపారు. ఉపాధ్యాయులకే స్వేచ్ఛ లేకపోతే ఇంకెవరికి ఉంటుంది? అని ప్రశ్నించారు. కామన్ టీచర్స్ ఫ్రంట్ కన్వీనర్ ఎన్. సచిన్ కూడా ఈ సమస్యపై భయాన్ని వ్యక్తం చేశారు. ఇది అణచివేత చర్యనీ, ఏ మాత్రమూ ఆమోదయోగ్యం కాదని తెలిపారు

పబ్లిక్ మోటారు వాహనాలపై
జీవితకాల పన్ను సరికాదు

- దానినిల రద్దు చేయాలి : తమిళనాడు ప్రభుత్వానికి యజమానులు, డ్రైవర్ల డిమాండ్
- సీఐటీయూతో సహా పలు కార్మిక సంఘాల మద్దతు



చెన్నై : ప్రభుత్వ మోటారు వాహనాలపై జీవిత కాలపు పన్ను విధించాలన్న తమిళనాడు ప్రభుత్వ నిర్ణయం అగ్గి రాజేసింది. ఈ పన్నును రద్దు చేయాలని యజమానులు, డ్రైవర్లు తమ డిమాండ్‌ను వినిపిస్తున్నారు. గత నెల వరకు ప్రభుత్వ మోటారు వాహనాలపై ప్రభుత్వం త్రైమాసిక పన్నులు వసూలు చేసేది. ప్రస్తుతం జీవితాంతం పన్ను చెల్లించాలని ఆదేశించింది. రాష్ట్ర ప్రభుత్వం తమిళనాడు మోటార్ వెహికల్స్ టాక్సేషన్ యాక్ట్, 1974ను ఈ ఏడాది అక్టోబర్‌లో సవరించింది. జీవితకాల పన్నులు, కొత్త మోటారు వాహనాల రిజిస్ట్రేషన్‌ను పెంచింది. నవంబరు 7న సవరణలు అమలులోకి వచ్చాయి.

అన్యాయమైన ఆన్‌లైన్ జరిమానాలు, యాప్ కంపెనీల దోపిడీ, పెరిగిన టోల్ ఛార్జీలు, అగ్రిగేటర్ నిబంధనల కారణంగా ప్రస్తుతం ఆర్థికంగా నష్టపోతున్నామని పేర్కొంటూ.. సవరణలను వాహన యజమానులు, డ్రైవర్ల సంఘాలు వ్యతిరేకించాయి.

ఈ సమయంలో తమిళనాడు ప్రభుత్వం విధించిన జీవితకాల పన్ను ఆమోదయోగ్యం కాదని వారు పేర్కొన్నారు. ఈ కొత్త లెవీని తక్షణమే విరమించుకోవాలనీ, ఇది మోటారు పరిశ్రమ, దానిపై ఆధారపడిన కార్మికులపై మరింత ప్రభావం చూపుతుందని వారు స్పష్టం చేశారు. పాత పద్ధతినే పాటించాలని మోటారు వాహనాల సంఘం తరపున డ్రైవర్లు, యజమానులు కోరుతున్నారు.

ప్రభుత్వం విధించిన 100 శాతం లైఫ్ ట్యాక్స్‌ను ఉపసంహరించుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఆల్ ఇండియా రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ నిరసన ప్రదర్శనకు దిగింది. ఆల్ ట్రేడ్ యూనియన్ జాయింట్ యాక్షన్ కమిటీ తరపున కోయంబత్తూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జరిగిన ప్రదర్శనలో పెద్ద సంఖ్యలో రోడ్డు రవాణా సంఘాలు, మోటారు వాహనాల యజమానులు, డ్రైవర్లు పాల్గొన్నారు.

కోవిడ్-19 మహమ్మారి, ద్రవ్యోల్బణం, టోల్ ఫీజు పెంపుదల, పెట్రోల్, డీజిల్ ధరల పెంపు వంటి వరుస దాడుల కారణంగా మోటారు వాహన పరిశ్రమ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నది. ఇలాంటి తరుణంలో తమిళనాడు ప్రభుత్వం అమలు చేస్తున్న జీవిత పన్నుల పెంపు పరిశ్రమకు భారీ నష్టాన్ని తీసుకొస్తుందనీ, మోటారు వాహనాల పరిశ్రమను మరింత బలహీనపరుస్తుందని నిరసనకారులు తెలిపారు.

తమ సహేతుకమైన డిమాండ్లను నెరవేర్చకుంటే రోడ్డు దిగ్బంధనం, సమ్మెతో సహా రానున్న రోజుల్లో పలు నిరసనలు చేపడతామని వారు తెలిపారు.

ఈ ప్రదర్శనలో కోయంబత్తూరు, తిరుపూర్, నీలగిరి జిల్లాల నుంచి వెయ్యి మందికి పైగా పాల్గొన్నారు. నీలగిరి జిల్లాలో 5,000కు పైగా, తిరుపూర్ జిల్లాలో 1,000కు పైగా పర్యాటక వాహనాలు నడుస్తున్నాయి. సీఐటీయూ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ యూనియన్, ఆల్ ట్రేడ్ యూనియన్ జాయింట్ యాక్షన్ కమిటీ, ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ నాయకులు ఈ నిరసనలో పాల్గొన్నారు.



వ్యాజ్యాల నుంచి ఈసీకి రక్షణ

- చట్ట సవరణ తీసుకొచ్చిన కేంద్రం

న్యూఢిల్లీ : ప్రస్తుత, గతంలో పనిచేసిన ఎన్నికల కమిషన్ సభ్యులకు వ్యాజ్యాల నుంచి రక్షణ కల్పించేందుకు కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఓ సవరణ తీసుకొచ్చింది. దానికి ముందు ప్రధాన ఎన్నికల కమిషనర్ పైనే ఇటీవల పలు ఎఫ్ఐఆర్‌లు, వ్యాజ్యాలు దాఖలు కావడంపై కేంద్ర ఎన్నికల సంఘం ఆందోళన వ్యక్తం చేసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర కమిషనర్ల ఎంపిక, సర్వీసు నిబంధనల క్రమబద్ధీకరణకు సంబంధించిన బిల్లుపై రాజ్యసభలో ఈ నెల 12న చర్చ జరిగింది. ఆ తర్వాత న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ ఓ సవరణను ప్రతిపాదించారు. అందులో సీఈసీ, ఈసీలకు రక్షణ కల్పించేందుకు ఓ క్లాజును చేర్చారు. ఇటీవల సీఈసీకి, ఈసీకి విచారణ కోర్టు నోటీసులు జారీ చేసిన నేపథ్యంలో ఈ సవరణ అవసరమైందని ఆయన తెలిపారు. ప్రధాన ఎన్నికల కమిషనర్, ఇతర ఎన్నికల కమిషనర్ల బిల్లును సవరణతో కలిపి సభ ఆమోదించింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ కానీ, ఇతర ఎన్నికల కమిషనర్లు కానీ తీసుకునే ఎలాంటి చర్య పైన అయినా న్యాయస్థానాలు సివిల్, క్రిమినల్ ప్రొసీడింగ్స్ చేపట్టకూడదని ఈ క్లాజు స్పష్టం చేస్తోంది.కేంద్రం ఈ క్లాజు తీసుకురావడానికి కారణం తెలంగాణలో జరిగిన ఓ ఉదంతమే. మహబూబ్‌నగర్‌లో దాఖలైన ఓ కేసుకు సంబంధించి ఎమ్మెల్యే ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్, ఇతర ఎన్నికల కమిషనర్లపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని విచారణ కోర్టు ఆదేశించింది. పైగా సీఈసీని, ఇతర కమిషనర్లను ఈ కేసులో సహ నిందితులుగా చేర్చింది. దీనిపై ఆగ్రహం వ్యక్తం చేసిన రాష్ట్ర హైకోర్టు ఆ ఆదేశాలు ఇచ్చిన జడ్జిని సస్పెండ్ చేసింది. గత సంవత్సరం కర్నాటకలో కూడా ఇదే తరహా ఘటన జరిగింది. 2019 బంధించి మాజీ సీఈసీ సునీల్ అరోరాకు సింగిల్ జడ్జ్ బెంచ్ సమన్లు జారీ చేసింది. అయితే ఈ సమన్లను హైకోర్టు కొట్టివేసింది. రాజ్యాంగ బద్ధమైన పదవులలో ఉన్న వారికి లేదా మాజీలకు సమన్లు జారీ చేయకూడదని స్పష్టం చేసింది. 2021లో మద్రాస్ హైకోర్టు జడ్జి ఓ తీవ్రమైన వ్యాఖ్య చేశారు. కోవిడ్ వ్యాప్తికి ఎన్నికల కమిషనే కారణమని, ఆ సమయంలో రాష్ట్రంలో ఎన్నికలు నిర్వహించిందని వ్యాఖ్యానించారు. ఎన్నికలు నిర్వహించిన అధికారులపై కేసు పెట్టాలని అన్నారు. దేశంలో 543 లోక్‌సభ, 4,123 శాసనసభ స్థానాలు ఉన్నాయి. ప్రతి స్థానంలో 10 నుండి 20 మంది పోటీ చేస్తుంటారు. కోటిన్నర మంది సిబ్బంది విధులు నిర్వర్తిస్తారు. ఎన్నికలు ముగిసిన తర్వాత దాఖలయ్యే కేసుల నుండి అధికారులకు రక్షణ కల్పిస్తూ కేంద్రం ఈ సవరణ తీసుకొచ్చింది.

తెల్ల జెండా చూపినా...


- ముగ్గురు బందీలను కాల్చి చంపేశారు
- తరువాత పొరపాటు అంటూ వివరణ
- ఇజ్రాయిల్ సైన్యం దాష్టీకంపై సర్వత్రా ఆగ్రహం



టెల్ అవీవ్/గాజా సిటీ: హమాస్ చేతిలో బందీలుగా ఉన్న ముగ్గురు ఇజ్రాయెలీయులను కాల్చి చంపడం ఇజ్రాయెల్ సైన్యానికి పెద్ద ఎదురుదెబ్బ. తెల్ల జెండా ఊపుతూ వెళ్తున్న వారిని కాల్చిచంపినట్లు ఇజ్రాయెల్ సైన్యం అంగీకరించింది. గాజా నగరంలో చొక్కా వేసుకోకుండా తెల్లజెండా పట్టుకున్న యోతమ్ హైమ్ (28), సమర్ తలాల్కా (25), అలోన్ షమిస్ (26) అనే ముగ్గురు బందీలను ఇజ్రాయిల్ సైన్యం కాల్చిపారేసింది. దీనిపై సర్వత్రా ఆగ్రహం వ్యక్తం కావడంతో సైన్యం వివరణ ఇచ్చింది. వారు దాడి చేసేందుకు వచ్చారన్న అనుమానంతోనే కాల్పులు జరిపామని, వారు బందీలు అని ఆ తరువాత తేలిందని తెలిపింది. వారు తప్పించుకున్నారా లేదా హమాస్ వదిలిపెట్టిందా అన్నది స్పష్టం కాలేదు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు దీనిపై స్పందిస్తూ ఇది "భరించలేని విషాదం" అని పేర్కొన్నారు. ఈ ఘటనపై చర్యలు తీసుకుంటామని ప్రధానమంత్రి సీనియర్ సలహాదారు మార్క్ రెగెవ్ తెలిపారు.పారిపోవడానికి ప్రయత్నించిన పౌరులను ఇజ్రాయెల్ దళాలు కాల్చిచంపినట్లు అనేక నివేదికలు తెలియజేస్తున్నాయి. బందీలను చంపిన తర్వాత ఇజ్రాయెల్‌లో తీవ్ర నిరసన వ్యక్తమైంది. బందీలను విడిపించేందుకు ఒప్పందాన్ని కోరుతూ వేలాది మంది టెల్ అవీవ్‌లో కవాతు నిర్వహించారు. దీంతో హమాస్‌తో శాంతి చర్చలకు ఇజ్రాయెల్ సిద్ధమైంది. ఖతార్ మధ్యవర్తిత్వంలో నార్వేలో చర్చలు జరుగుతున్నాయి. ప్రస్తుతం 100 మంది ఇజ్రాయిలీయులు హమాస్ చేతిలో బందీలుగా ఉన్నారు.

ఇదిలా ఉండగా గాజా సిటీలో ఇజ్రాయెల్ తన దురాక్రమణను కొనసాగిస్తూనే ఉంది. ఉత్తర గాజాలో ఇళ్లపై జరిగిన దాడిలో 14 మంది చనిపోయారు. దీంతో గాజాలో మరణించిన వారి సంఖ్య 18,787కి చేరింది. దక్షిణ గాజాలోని ఖాన్ యూనిస్‌లో జరిగిన దాడిలో అల్ జజీరా కెమెరామెన్ సమీర్ అబు దక్కా మరణించాడు. కమల్ అద్వాన్, అల్-అవుదా ఆసుపత్రుల్లో చిక్కుకున్న వారు బయటకు రాలేకపోతున్నారు. గాయపడిన వ్యక్తులతో కమల్ అద్వాన్ వెళ్తున్న అంబులెన్స్‌పై ఇజ్రాయెల్ దాడి చేసింది.

జనసేన అధినేత ఇంటికి చంద్రబాబు



హైదరాబాద్: టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ఆదివారం రాత్రి మాదాపూర్‌లోని జనసేన అధినేత పవన్ కల్యాణ్ నివాసానికి వెళ్లారు. వచ్చే ఎన్నికల్లో ఏపీలో సీట్ల సర్దుబాటు, మ్యానిఫెస్టో రూపకల్పన తదితర అంశాలపై ఇరువురు నేతలు చర్చిస్తున్నట్టు సమాచారం. తాజా రాజకీయ పరిస్థితులు, వైసీపీ విముక్త ఆంధ్రప్రదేశ్ దిశగా చర్చలు జరుగుతున్నాయని జనసేన పార్టీ ట్విటర్(ఎక్స్)లో తెలిపింది. ఏపీలో టీడీపీ, జనసేన వచ్చే ఎన్నికల్లో కలిసి పోటీ చేయాలని ఇప్పటికే నిర్ణయించిన విషయం తెలిసిందే. 2014 ఎన్నికలకు ముందు పవన్ ఇంటికి చంద్రబాబు వెళ్లారు. దాదాపు పదేండ్ల తర్వాత మరోసారి ఆయన నివాసానికి వెళ్లి భేటీ అయ్యారు.

టీడీపీ మహానాడులో సూపర్‌సిక్స్ పేరుతో ప్రకటించిన మినీ మ్యానిఫెస్టోకి జనసేన పార్టీ మరి కొన్ని అంశాలు జోడించాలని ఇప్పటికే సూచించింది. మొత్తం 10 అంశాలతో రెండు పార్టీలు ఉమ్మడి కార్యాచరణతో విస్తతంగా ప్రజల్లోకి వెళ్లనున్నాయి. యువత, మహిళలు, రైతులు, ఎస్సీ, ఎస్టీల సంక్షేమానికి సంబంధించిన అంశాల్ని జనసేన సూచించినట్టు సమాచారం. రెండు పార్టీల పొత్తు నేపథ్యంలో.. 'బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారంటీ' పేరుతో ఇప్పటికే టీడీపీ చేపట్టిన కార్యక్రమం పేరులోనూ మార్పులు చేయనున్నట్టు సమాచారం. టీడీపీ అధినేత చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్‌ల ఫొటోలు ముద్రించిన ఉమ్మడి మినీ మ్యానిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్లనున్నట్టు తెలుస్తోంది. వచ్చే ఏడాది మార్చిలో ఏపీ అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడే అవకాశం ఉండటంతో సీట్ల సర్దుబాటుపై ఓ నిర్ణయానికి వచ్చే అవకాశముందని సమాచారం.

ప్రపంచ గమనం

అమెరికాలో మరింతగా ఇండ్ల కష్టాలు

- రికార్డు స్థాయికి గృహ వసతిలేమి



అమెరికా గృహ వసతిలేమి గతంలో ఎన్నడూలేని స్థాయికి చేరిందని అమెరికన్ డిపార్ట్మెంట్ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ డెవెలప్మెంట్(హెచ్‌యూడీ) శుక్రవారంనాడు విడుదలచేసిన రిపోర్ట్ తెలుపుతోంది. ద్రవ్యోల్బణం, సరిపడినంతగా గృహ వసతి లేకపోవటం, కోవిడ్ కాలంలో ఇండ్లను ఖాళీ చేయించకుండా ఇచ్చిన రక్షణల కాలపరిమితి ముగియటం వంటి కారణాలచేత ఇటువంటి పరిస్థితి ఏర్పడిందని హె యూడీ విశ్లేషించింది. 2007లో గృహ వసతిలేని వారి సంఖ్యను లెక్కించే వ్యవస్థను ప్రవేశపెట్టిన తరువాత గృహ వసతిలేని వారి సంఖ్య 653104 కి చేరటం ఇదే తొలిసారని హెచ్ యూడీ పేర్కొంది. ఈ సంఖ్య గత సంవత్సరం సంఖ్య కంటే 12శాతం అదనంగా ఉంది. అంటే గత సంవత్సరం కంటే అదనంగా 70650 మంది గృహ వసతిలేని అమెరికన్లు అంతకు ముందటి సంఖ్యకు జత అయ్యారు. గతంలో ఎన్నడూలేనంతగా ఇండ్ల అద్దెలు పెరగటం, అద్దెకు ఉండేవాళ్ళకు అర్థంతరంగా ఖాళీ చేయించటం నుంచి రక్షణలు లేని కారణంగా గృహ వసతిలేమి 25శాతం పెరిగింది. అదే కాలంలో దాదాపు31శాతం గృహ వసతిలేని వారికి ఎటువంటి ఆచ్ఛాదనా లేకుండా పోయింది. ఈ సమస్య అన్ని వర్గాల ప్రజలలో ఉన్నప్పటికీ పిల్లలు గల కుటుంబాలు అందరికంటే ఎక్కువగా క్షోభకు గురౌతున్నాయి. గృహ వసతిలేమిని ఎదుర్కొంటున్న వారిలో ఈ కుటుంబాల సంఖ్య 15.5శాతం దాకా ఉంది. అద్దెకు ఇచ్చే ఇండ్ల సంఖ్య 2022లో అసాధారణంగా డిమాండ్ కంటే చాలా తక్కువ ఉందని హెచ్ యూడీ రిపోర్ట్ లో పేర్కొనటం జరిగింది. ప్రభుత్వం గృహ నిర్మాణ రంగాన్ని ప్రోత్సహిస్తే తప్ప సమస్య పరిష్కారం కాదని సదరు రిపోర్ట్ తెలియజేస్తోంది. అద్దెలు భరించగలిగే ఆర్థిక సామర్థ్యం లేకపోవటమనే సంక్షోభం కొనసాగుతూనే ఉంది. 2001-2022 మధ్యకాలంలో ఇండ్ల అద్దెలు 18.8శాతం పెరగగా, అదేకాలంలో ఆదాయాలు కేవలం 4.3శాతం మాత్రమే పెరిగాయి. మూడీస్ అనలిటిక్స్ ప్రకారం కుటుంబాల ఆదాయంలో దాదాపు 30శాతం ఇండ్ల అద్దెలు కట్టటానికే పోతోంది. అదే సమయంలో ఇండ్ల ధరలు కూడా పెరుగుతూ ఉన్నాయని బ్యూరో ఆఫ్ లేబర్ స్టాటిస్టిక్స్ షెల్టర్ సూచిక తెలియజేస్తోంది. గృహలేమిలో ఇటువంటి దుస్థితి 'గృహలేమి పెరుగుదలను అడ్డుకున్నాం' అని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ ప్రకటించిన తరువాత సంవత్సర కాలంలోనే ఏర్పడింది.

ఉక్రెయిన్ లో పెరిగిన నిర్బంధ సైనిక నియామకాలు - న్యూయార్క్ టైమ్స్



ఉక్రెయిన్ లో రోడ్ల మీద తిరిగే పురుషులను పట్టుకుని బలవంతంగా సైన్యంలో చేర్చి యుద్ధరంగానికి పంపటం జరుగుతుందని న్యూయార్క్ టైమ్స్ రాసింది. యుద్ధంలో సైనికుల మరణాలు విపరీతంగా పెరగటంవల్ల ఎవరిని బడితే వారిని సైన్యంలో బలవంతంగా చేర్చటం జరుగుతోంది. ఇటువంటి స్థితిలో సైన్యంలో బలవంతంగా చేరేవారి మానసిక స్థితిని కూడా పట్టించుకోవటంలేదని న్యూయార్క్ టైమ్స్ రిపోర్ట్ చేసింది. అయితే ఉక్రెయిన్ లో జరుగుతున్న యుద్ధాన్ని పశ్చిమ దేశాల మీడియా రిపోర్ట్ చేసే తీరులో వచ్చిన గణనీయమైన మార్పు తరువాతే న్యూయార్క్ టైమ్స్ ఇలా రాయటం జరిగింది. ఉక్రెయిన్ అధ్యక్షుడు వ్లాడిమీర్ జెలెన్ స్కీ రష్యాను ఓడించగలననే పగటి కలలు కంటున్నాడని, గత వేసవిలో సరియైన వ్యూహంలేకనే ఉక్రెయిన్ చేసిన ప్రతిదాడి ఘోరంగా విఫలమైనదనే ధోరణిలో పశ్చిమ దేశాల మీడియా ఉక్రెయిన్ యుద్ధంపైన రిపోర్ట్ చేస్తోంది. తమ సైన్యంలోని మరణాల సంఖ్యను ఉక్రెయిన్ పేర్కొనకపోయినప్పటికీ అమెరికా అంచనా ప్రకారం గత రెండేళ్ళలో 150, 000మంది ఉక్రెయిన్ సైనికులు యుద్ధంలో చనిపోయారు. వ్లాడిమీర్ జెలెన్ స్కీ మాజీ సలహాదారు అలెక్సీ అరెస్టోవిచ్ అంచనాలో ఈ సంఖ్య 300,000ల దాకా ఉంది. జూన్ నుంచి నవంబర్ మధ్యకాలంలోనే 125,000మంది ఉక్రెయిన్ సైనికులు చనిపోయారని రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ అంచనా వేసింది. అంతటి స్థాయిలో ఉక్రెయిన్ తన సైనికులను కోల్పోవటంవల్ల, లక్షలాది ఉక్రెయిన్ ప్రజలు దేశం విడిచి పారిపోవటంవల్ల ఉక్రెయిన్ సైన్యంలో బలవంతపు చేరికలు జరుగుతున్నాయి.

21న కలెక్టర్ల కాన్ఫరెన్స్

- ఆరు గ్యారంటీలు, ధరణి,
- రైతుబంధు, భూసమస్యలపై చర్చ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కొత్త సర్కారు ఈనెల 21న కలెక్టర్ల సమావేశం కానుంది. ఈమేరకు సన్నాహాలు చేస్తున్నది. ప్రభుత్వం ఏర్పాటయ్యాక జరుగుతున్న తొలి సమావేశం కావడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు, సీనియర్ ఐఏఎస్‌లు, ఇతరులు ఈ సమావేశానికి కానున్నారు. సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డితోపాటు, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఇతర మంత్రులతోపాటు ప్రభుత్వ ప్రధానకార్యదర్శి, డీజీపీ, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు పాల్గొననున్నారు. ఇందులో ప్రభుత్వ లక్ష్యాలు, అమలు, సర్కారీ యంత్రాంగం సహకారం తదితర అంశాలపై చర్చించనున్నారు. అలాగే ఆరు గ్యారంటీలపై కూడా చర్చ జరగనుంది. ఇప్పటికే ప్రభుత్వం ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించింది. ఆరోగ్యశ్రీ చికిత్స వ్యయం రూ. 10 లక్షలకు పెంచింది. వీటిని అధికారంలోకి వచ్చిన రెండు రోజుల్లోనే అమలుచేసినట్టుగా రేవంత్ సర్కారు ప్రకటించింది. అలాగే వందరోజుల్లో మిగతా గ్యారంటీల కూడా దృష్టి సారించాలని నిర్ణయించింది. ప్రమాణ స్వీకారం చేసిన మరుసటి రోజు నుంచే ప్రజాభవన్‌లో ప్రజావాణి కార్యక్రమాన్ని ప్రారంభించింది. దీనికి వస్తున్న ఫిర్యాదులు భారీగానే ఉంటున్నాయి. భూములు, ధరణి, పౌరసరఫరాలు, ప్రభుత్వ పథకాలకు సంబంధించిన ఫిర్యాదులు ప్రజావాణిలో అధికంగా వెల్లువెత్తున్న సంగతి తెలిసిందే. రైతు బంధు పథకాన్ని అమలుపై దిశ నిర్దేశం చేయనున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ధరణిని రద్దుచేస్తామని ప్రకటించిన రేవంత్, కలెక్టర్ల సమావేశంలో ఈ విషయాన్ని ప్రకటిస్తారా ? లేదా ఇంకొన్ని రోజులు వేచి చూస్తారా? అనేది తేలాల్సి ఉంది. తొలి అసెంబ్లీ సమావేశాల్లో అధికార, ప్రతిపక్షాలు ఢీ అంటే ఢీ అనేవిధంగా వ్యవహరించాయి. బీఆర్ఎస్ సర్కారు వైఫల్యాలపై సర్కారు రూపొందించిన గవర్నర్ ప్రసంగంపై అధికార, ప్రతిపక్షాలు వాడివేడిగా మాటల తూటాలు పేల్చుకున్నాయి. కొత్త ప్రభుత్వం వచ్చిన తొలినాళ్లల్లోనే పరిస్థితి ఇలా ఉంటే, భవిష్యత్‌లో పరిస్థితులు మరింత ఉద్రిక్తంగా ఉండొచ్చనే వ్యాఖ్యానాలు వస్తున్నాయి. ఇదిలావుండగా రైతుబంధుపై మాట్లాడే ప్రధానంగా చర్చ జరుగనున్నట్టు తెలుస్తోంది. రైతుబంధుకు నిధులు విడుదల చేయాలని రేవంత్ సర్కారు ఆదేశించినా, నిధులు లేక పూర్తిస్థాయిలో అమలుకు కొంత సమయం పట్టే అవకాశం ఉంది. అలాగే కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణ చేస్తామని ఇప్పటికే ప్రభుత్వం ప్రకటించింది. దీనిపైనా చర్చించే అవకాశం లేకపోలేదు. ఆదివారం రిజర్వ్‌బ్యాంక్ మాజీ గవర్నర్ రఘురాంరాజన్‌తో సీఎం, ఇతర మంత్రులు, సీఎస్ భేటి అయిన సంగతి తెలిసిందే. ప్రస్తుత రాష్ట్ర పరిస్థితి, మెరుగుపరచడానికి తీసుకోవాల్సిన చర్యలపై మాట్లాడిన సంగతి తెలిసిందే. ఈ అంశాలన్నీ ఈభేటిలో చర్చకు రానున్నాయి.

అదానీని తొలగించండి ధారావిని రక్షించండి



ముంబైలో ధారావి పునరాభివృద్ధి ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ చేపట్టిన కవాతులో మహారాష్ట్ర ప్రతిపక్ష నాయకులు, కార్మికులు.

ముంబయి : గౌతమ్ అదానీ పేదల ప్రయోజనాలకు వ్యతిరేకంగా రూ.23 వేల కోట్లతో చేపట్టిన దారావి పునరాభివృద్ధి ప్రాజెక్టును నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ అదానీ ముంబయి కార్యాలయాల వైపు ప్రతిపక్షాల నేతృత్వంలో వేలాదిమంది నిరసనకారులు కవాతు నిర్వహించారు. ఆసియాలోనే అతిపెద్ద స్లమ్ క్లస్టర్‌లలో ఒకటైన ధారావిలోని 590 ఎకరాల పునరాభివృద్ధి ప్రాజెక్టును గత ఏడాది నవంబర్‌లో అదానీ ప్రాపర్టీస్ దక్కించుకుంది. తమ భూములను లాక్కునేందుకు చేస్తున్న ఈ ప్రయత్నాన్ని స్థానికులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. "అదానీని తొలగించండి, ధారావిని రక్షించండి" నినాదంతో జెండాలు, బ్యానర్లను పట్టుకుని ముంబైలోని కలంగర్ నుంచి అదానీ గ్రూప్ కార్యాలయం ఉన్న బాంద్రా కుర్లా కాంప్లెక్స్ వరకు భారీ కవాతు చేశారు.

మార్చ్‌కు నాయకత్వం వహించిన శివసేన (యూబీటీ) నాయకుడు, మాజీ ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాకరే మాట్లాడుతూ తాను అభివృద్ధికి వ్యతిరేకం



కాదని చెప్పారు. తన నాయకత్వంలోని మహా వికాస్ అఘాడి ప్రభుత్వ హయాంలో బిల్డర్‌కు అనుకూలంగా నిర్ణయాలు తీసుకుంటే, తీర్మానాలు చేసుంటే ప్రజల ముందుం చాలని బీజేపీకి సవాల్ చేశారు. బిల్డర్‌కు అను కూలంగా తమ ప్రభుత్వం లేకపోవడం వల్లే తమ ప్రభుత్వం కూలిపోయిందని, అందుకు ఎవరు ఆర్థిక సహాయం చేశారో ఇప్పుడు ఎవరికైనా అర్థమవుతుందని అన్నారు. ధారావి కోవిడ్ 19పై పోరాడిందని, ఏ బిల్డర్ ముందు లొంగిపోదని తేల్చిచెప్పారు.

ఈ ప్రాజెక్టులో వంద కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి హక్కుల బదిలీ (టిడిఆర్), అక్రమాలు ఉన్నాయని విమర్శి ంచారు. ముంబై కాంగ్రెస్ చీఫ్, ధారావి ఎమ్మెల్యే వ ర్షా గైక్వాడ్ తదితరులు ఆందోళనలో పాల్గొన్నారు. పునరాభివృద్ధి సమయంలో ధారావి నివాసితులకు 500 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఇండ్లు, పోలీసు సిబ్బంది, కన్సర్వెన్సీ కార్మికులు, మిల్లు కార్మికులతో పాటు ఆ ప్రాంతంలో ఆర్థిక కేంద్రం కూడా ఏర్పాటు చేయాలని ప్రతిపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి. పునరాభివృద్ధిని ప్రభుత్వమే చేపట్టాలని కోరుతున్నారు.

పార్టీ ప్రభుత్వం మధ్య సమన్వయం

(మొదటిపేజీ తరువాయి)

ఆదిలాబాద్, నిజామాబాద్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాలకు ప్రస్తుత మంత్రివర్గంలో ప్రాతినిధ్యం లేదు. ఆయా జిల్లాల నుంచి ఎవరెవర్ని తీసుకోవాలనే అంశంపై ప్రభుత్వానికి పీఏసీ సూచనలు చేసే అవకాశం ఉన్నది. హైదరాబాద్‌లో కాంగ్రెస్ ఒక సీటు కూడా గెలువని సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రాతినిధ్యం లేని జిల్లాల్లో ఆరు మంత్రి పదవులు ఎవరికి దక్కనున్నాయనేది నేడు హాట్ టాపిక్‌గా మారింది. హైదరాబాద్ లాంటి మహానగరంలో పార్టీ అభ్యర్థులు గెలువక పోగా మంత్రిపదవి దక్కలేదు. అవకాశం కల్పిద్దామనుకున్న సీనియర్లమో ఓటమి చవిచూశారు. దీంతో ఎవరికి మంత్రిపదవి ఇవ్వాలనే దానిపై కాంగ్రెస్ పార్టీ మల్లాగుల్లాలు పడుతున్నది. ఓడిన వారిలో కాంగ్రెస్ పార్టీకి లాయల్‌గా ఉండే నేతలకు ఎమ్మెల్సీగా అవకాశం కల్పించి మంత్రి పదవి ఇచ్చే యోచనలో పార్టీ ఉన్నట్టు తెలుస్తోంది. ఎమ్మెల్సీ ఇవ్వడానికైనా, మంత్రిపదవి దక్కడానికైనా సామాజిక సమీకరణలు తప్పని సరి పాటించాలని పార్టీ వర్గాల్లో వాదనలు వినిపిస్తున్నాయి.

సామాజిక సమీకరణాలు

మైనార్టీ, ఎస్టీ, ఎస్సీ, బీసీ సామాజిక తరగతులకు ఎలా అవకాశం ఇవ్వాలనే దానిపై పార్టీలో అంతర్గత చర్చలు జరుగుతున్నాయి. మైనార్టీ కోటాలో నిజామాబాద్, నాంపల్లి స్థానాల నుంచి పోటీ చేసి ఓడిపోయిన మాజీ మంత్రి షబ్బీర్ అలీ, నాంపల్లి నుంచి పోటీ చేసి ఓటమి చవి చూసిన ఫిరోజ్‌ఖాన్‌లు పోటీ పడుతున్నారు. వీరిద్దరిలో ఒకరికి ఛాన్స్ లభించే అవకాశాలు ఉన్నాయి. పార్టీలో ఉన్న ఆదివాసీ, లంబాడ సామాజికవర్గం సీనియర్ నేతలపై పార్టీ దృష్టి పెట్టింది. ఆదివాసీల్లో కోయసామాజిక వర్గానికి చెందిన సీనియర్ నేత మాజీ, ఎమ్మెల్యే పోడెం వీరయ్య పేరు ప్రధానంగా వినిపిస్తోంది. భద్రాచలంలో ఆయన ఓడిపోయినా ఆదివాసీ ప్రజాప్రతినిధిగా గత మూడు దశాబ్దాలకు పైగా పార్టీకి సేవచేస్తూ పార్టీకి విధేయుడిగా ఉన్నందున పోడెంను పరిగణలోకి తీసుకుంటున్నట్టు తెలిసింది. ఎస్సీ సామాజిక వర్గాల్లో ఇప్పటికే ఇద్దరికి అవకాశం కల్పించినా మరో ఎస్సీకి మంత్రి వర్గంలో స్థానం దక్కే అవకాశం ఉన్నది. ఎస్సీ సామాజికవర్గంలో మంత్రి పదవి రేసులో చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి, ఆయన సోదరుడు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ పేర్లు వినిపిస్తున్నాయి. సీనియర్లయిన ఈ ఇద్దరిలో ఏ ఒక్కరికైనా మంత్రి పదవి దక్కే అవకాశం ఉందని తెలుస్తోంది. బీసీ సామాజిక వర్గాల్లో కేవలం ఒక్కరికే మంత్రి వర్గంలో స్థానం లభించింది. గౌడ సామాజిక వర్గానికి చెందిన పొన్నం ప్రభాకర్‌కు ఇప్పటికే మంత్రి పదవి దక్కగా, బీసీలకు మరో మంత్రి పదవి దక్కే అవకాశం ఉంది. ఓడిపోయిన పార్టీ సీనియర్లను సైతం పరిగణలోకి తీసుకునే అవకాశాలు ఉన్నాయి. మాజీ ఎంపీలు మధు యాష్కిగౌడ్, అంజన్‌కుమార్ యాదవ్‌లు ఈ రేసులో ఉన్నారు. ఈ ఇద్దరిలో ఒకరికి ఎమ్మెల్సీ ఇచ్చి మంత్రి పదవి ఇచ్చే అవకాశాలు ఉన్నాయనే చర్చ జరుగుతోంది. ఓసీ కోటాలో మైనంపల్లి హన్మంతరావు, అదేవిధంగా మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్‌సాగర్‌రావు, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి, ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిల పేర్లు పరిశీలనలో ఉన్నట్టు తెలిసింది.

మంత్రివర్గంలో ఖాళీలు అందుకేనా?

64 మంది ఎమ్మెల్యేల్లో 12 మంది పోను 42 మంది ఎమ్మెల్యేల్లో ఆరుగురిని ఎంపిక చేయాల్సి ఉన్నది. అందులో సీనియర్లు కూడా చాలా మంది ఉన్నారు. కానీ, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరితే వారికి మంత్రి పదవులు ఇవ్వాల్సి వస్తుందనీ, అందుకే మంత్రివర్గంలో ఖాళీలు పెట్టినట్టు కూడా పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతున్నది. హైదరాబాద్ నగరానికి చెందిన సీనియర్ మాజీ మంత్రి కూడా సీఎం రేవంత్‌రెడ్డిని కలిసినట్టు పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

తనకు మంత్రి పదవి ఇస్తే కాంగ్రెస్‌లో చేరుతానని షరతు పెట్టినట్టు తెలుస్తోంది. ఒకవేళ ఆయన చేరితే మరికొంత మంది కాంగ్రెస్‌లో చేరే అవకాశం ఉన్నదని పార్టీ వర్గాలు అంటున్నాయి. ఇతర పార్టీలకు చెందిన వారిని బీఆర్ఎస్‌లో చేర్చుకుని ప్రతిపక్షాలను బలహీన పరిచిందన్న విమర్శలున్నాయి. అదే తప్పు కాంగ్రెస్ పార్టీ చేయొద్దంటూ పార్టీ శ్రేణుల్లో ఆందోళన వ్యక్తమవుతున్నది.

సర్కారు దూకుడు

(మొదటిపేజీ తరువాయి)

స్వయంగా ఆ సమావేశాలకు హాజరవుతున్నారు. ఆదివారం రిజర్వుబ్యాంకు గవర్నర్ రఘురామ రాజన్‌తో భేటీ కూడా అందులో భాగమే. త్వరలోనే మరికొన్ని రంగాలకు చెందిన నిష్ణాతులతో భేటీ కానున్నారు. కొత్త సర్కారు తొలి శాసనసభా సమావేశాలు కూడా దూకుడుగానే ప్రారంభమయ్యాయి. శనివారం ప్రతిపక్షం, అధికారపక్షం మధ్య తీవ్రస్థాయిలో మాటల యుద్ధం జరిగింది. తిరిగి ఈనెల 20 నుంచి మళ్లీ ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల్లో ఇదే దూకుడు కొనసాగించాలని సీఎం రేవంత్‌రెడ్డి భావిస్తున్నారు. దానికోసం విషయ పరిజ్ఞానం ఉండి, మెరుగ్గా, దూకుడుగా, ప్రతిపక్షాన్ని ఇరుకున పెట్టి మాట్లాడగలిగిన ఎమ్మెల్యేలకు ప్రత్యేక క్లాసులు చెప్పించి, మెరుగులు దిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అసెంబ్లీలో ముఖ్యమంత్రిగా తాను తక్కువ మాట్లాడుతూ, మంత్రులు, ఎమ్మెల్యేలతోనే ప్రతిపక్షంపై ఎదురుదాడి చేయించాలనేది రాజకీయ వ్యూహంగా ఉంది. పరిపాలనను వేగవంతం చేయడం కోసం ఇప్పటికే సొంత టీంను ఏర్పాటు చేసుకొనే పనిలో సీఎం రేవంత్‌రెడ్డి బిజీగా ఉన్నారు. దానిలో భాగంగానే భారీగా ఐఏఎస్, ఐపీఎస్‌ల బదిలీలు జరుగుతున్నాయి. కేంద్ర ఎన్నికల సంఘం ఎన్నికల సమయంలో జరిపిన బదిలీలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. సదరు అధికారులు నిష్పక్షపాతంగా ఉండటం వల్లే కేంద్ర ఎన్నికల సంఘం వారిని కీలక పోస్టుల్లో నియమించిందని భావిస్తున్న రేవంత్‌రెడ్డి, తన టీంలో వారికి తొలి ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇప్పటి వరకు నాన్ ఫోకల్ కేడర్‌లో ఉన్న ఐఏఎస్, ఐపీఎస్‌లకు అవకాశాలు కల్పించాలని భావిస్తున్నారు.


దానిలో భాగంగానే విద్యుత్ సంస్థలకు ఐఏఎస్‌లను సీఎమ్‌డీలుగా నియమిస్తున్నారు. ఇప్పటి వరకు ఈ పోస్టుల్లో రిటైర్డ్ ఉద్యోగులతోనే బీఆర్ఎస్ ప్రభుత్వం నడిపించిన విషయం తెలిసిందే. అలాగే ఇతర శాఖల్లో విభాగాధికారులుగా ఐఏఎస్‌లకు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించారు. రైతుబంధుపై సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈ స్కీంలో వందల ఎకరాలు ఉన్న పెద్ద రైతులకూ అప్పనంగా సర్కారు ఖజానా నుంచి రైతు బంధు పేరుతో డబ్బు చెల్లించడాన్ని ఆయన వ్యతిరేకిస్తున్నట్టు సమాచారం. త్వరలో ఈ స్కీంలో భారీ మార్పులు జరుగుతాయని ప్రచారం జరుగుతున్నది. ఐదు లేదా పది ఎకరాల వరకు సీలింగ్ పెట్టి, ఆ రైతులకే రైతుబంధు అందించాలని యోచిస్తున్నట్టు తెలిసింది. రైతుబంధు పేరుతో దాదాపు రూ.9వేల కోట్లకు పైగా ప్రజాధనాన్ని వెచ్చిస్తున్నారు.

దీన్ని బ్రేకప్ చేసి అదే సొమ్మును రైతు కూలీలు, కౌలు రైతులకు వర్తింపచేస్తే ఎలా ఉంటుందని చర్చలు జరుపుతున్నారు. ఉమ్మడి రాష్ట్రంలో వైఎస్ రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధరలు పెంచినప్పుడు రాష్ట్ర ప్రభుత్వం తరఫున సబ్సిడీ ప్రకటించి, ఆ భారం ప్రజలపై పడకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. ఇప్పుడు కూడా కేంద్రప్రభుత్వ గ్యాస్ సిలిండర్ ధర రూ.1200కు పెరిగిన విషయం తెలిసిందే. దాన్ని రూ.500కే ఇస్తామని ఆరు గ్యారెంటీల్లో భాగంగా ప్రకటించారు. దానితో పాటు ఇతర గ్యారెంటీల అమలుకు నిధుల కేటాయింపు ఏ విధంగా చేయాలనేదానిపైనే ఆదివారం ఆర్బీఐ మాజీ గవర్నర్‌తో జరిగిన చర్చల్లో ప్రధానంగా ప్రస్తావన చేసినట్టు తెలిసింది.

వందరోజుల పాలనపై తన ముద్ర ప్రత్యేకంగా ఉండాలని సీఎం రేవంత్‌రెడ్డి ధృఢంగా భావిస్తున్నారు. దానికోసం పాలనా కసరత్తును ముమ్మరం చేశారు.

అచ్ఛే దిన్ అంటే ఇదేనా..!

- నిత్యావసర ధరల్ని అదుపుచేయరేం.. : మోడీ సర్కారుపై మల్లికార్జున్ ఖర్గే ఆగ్రహం



న్యూఢిల్లీ : మోడీ ప్రభుత్వ హయాంలో నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలపై కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే కేంద్రంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది ఏ రకమైన "అభివద్ధి చెందిన భారతదేశం" అని ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో ఒక పోస్ట్ చేశారు.ద్రవ్యోల్బణాన్ని హైలైట్ చేస్తూ.. పాలు, ఉల్లిగడ్డలు, టమాటా, చక్కెర వంటి నిత్యావసర వస్తువుల ధరలతో.. 2014 నాటి ధరలను పోల్చే ఒక వీడియోను ఆయన పంచుకున్నారు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తున్న వేళ కేంద్రంలోని బీజేపీ సర్కారుపై కాంగ్రెస్ ఆరోపణల దాడిని తీవ్రతరం చేసింది. ముఖ్యంగా, దేశ ఆర్థిక వ్యవస్థ, పెరుగుతున్న నిరుద్యోగం, ధరల పెరుగుదలపై ప్రభుత్వాన్ని అనేక సందర్భాల్లో నిలదీస్తూ వస్తున్నది.

నటుడు ప్రకాశ్‌రాజ్‌కు క్లీన్‌చిట్

- పొంజి స్కామ్‌తో ఆయనకు సంబంధం లేదన్న ఈడీ



న్యూఢిల్లీ : తమిళనాడులోని ప్రణవి జ్యువెల్లర్స్‌కు సంబంధమున్న రూ.100 కోట్ల విలువైన పొంజి స్కామ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొన్న ప్రముఖ నటుడు ప్రకాశ్‌రాజ్‌కు ఊరట లభించింది. కేంద్ర దర్యాప్తు సంస్థ ఈడీ ఆయనకు క్లీన్‌చిట్ ఇచ్చింది. ఈ కేసుతో ఆయనకు సంబంధం లేదని వెల్లడించింది. ప్రణవ్ జ్యువెల్లర్స్‌కు ప్రకాశ్‌రాజ్ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరించారు.

కాగా, ఈడీ క్లీన్‌చిట్ అనంతరం నటుడు ప్రకాశ్‌రాజ్ 'ఎక్స్' వేదికగా స్పందించారు. "తమిళం అర్థం కానివారి కోసం బ్రేకింగ్ న్యూస్. దర్యాప్తు బృందం అధికారిక ప్రకటన. తమిళనాడు ప్రణవ్ జ్యువెల్లర్స్‌కు చెందిన పొంజి స్కామ్‌లో ఆయనకు సంబంధం లేదు. నన్ను నమ్మి, నా వెంట నిలబడ్డ ప్రతి ఒక్కరికి నా ధన్యవాదాలు" అంటూ సత్యమేవజయతే, జస్ట్ ఆస్కింగ్ అనే హ్యాష్‌ట్యాగ్‌లతో ఆయన తన పోస్టును ముగించారు. ఈ మేరకు తన ఎక్స్ పోస్ట్‌కు తమిళ వార్త ఛానెల్‌కు చెందిన ఒక క్లిప్‌ను ఆయన జోడించారు.

పకడ్బందీ వ్యూహంతో డ్రగ్స్‌పై ఉక్కుపాదం

- రాష్ట్రంలో క్లబ్బులు, పబ్బులు, రిసార్ట్‌లు, సినీపరిశ్రమ పైనా 24 గంటలు నిఘా
- స్కూళ్లు, కాలేజీల పైనా నార్కొటిక్ బ్యూరో దేగకన్ను
- కార్యాచరణను ప్రకటించిన నార్కొటిక్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి : రాష్ట్రంలో మాదక పదార్థాల అక్రమ రవాణా, వినియోగంపై ఉక్కుపాదం మోపుతున్నట్టు రాష్ట్ర నార్కొటిక్ బ్యూరో డైరెక్టర్ సందీప్ శాండిల్య స్పష్టం చేశారు. డ్రగ్స్‌ను కఠినంగా అణచివేయటానికి పకడ్బందీ వ్యూహంతో కార్యాచరణను రూపొందించి అమలు చేస్తున్నామని ఆయన తెలిపారు. ముఖ్యంగా, డ్రగ్స్‌కు ఆలవాలంగా మారిన క్లబ్బులు, పబ్బులు, రిసార్ట్‌లు, రేవ్‌పార్టీలపై 24 గంటల పాటు నిఘా వేసి ఉంచుతామని ఆయన చెప్పారు. అలాగే, సినీ పరిశ్రమలో సైతం ఈ డ్రగ్స్ మహమ్మారి ప్రవేశించటం ఆందోళనకర పరిణామమనీ, ఈ పరిశ్రమ పైన కూడా తాము నిశితంగా దృష్టిని సారించామని ఆయన స్పష్టం చేశారు. ప్రధానంగా కొన్ని పాఠశాలలు, కాలేజీలలో డ్రగ్స్ వినియోగం సాగుతున్నట్టు గతంలో అనేకసార్లు వెలుగులోకి వచ్చిందనీ, దీంతో వీటి పైనా తమ అధికారులు డేగ కన్ను వేసి ఉంచుతారని ఆయన తెలిపారు. అయితే, తామేగాక కాలేజీలు, స్కూళ్లలో ఆయా విద్యాసంస్థల టీచర్లు, మేనేజ్‌మెంట్లు, విద్యార్థుల తల్లిదండ్రులతో యాంటీ డ్రగ్ కమిటీలను కూడా వేసి పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తామని చెప్పారు. అదే సమయంలో తమ విభాగానికి అవసరమైన నిధులు, సిబ్బంది అధికారుల కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేశామనీ, అందుకు పూర్తి సహకారాన్ని అందిస్తామని ఆయన హామీ ఇచ్చారని సందీప్ శాండిల్య వివరించారు. ఇందుకోసం కార్యాచరణను రూపొందించి ప్రభుత్వానికి సమర్పిస్తామని ఆయన తెలిపారు.గత ప్రభుత్వం డ్రగ్స్‌ను నియంత్రించటానికి నార్కొటిక్ బ్యూరోను తూతూ మంత్రంగా ఏర్పాటు చేసి, దానికి తగిన నిధులు, సిబ్బందిని కేటాయించలేదని శనివారం శాసనసభలో ముఖ్యమంత్రి ఆరోపించిన విషయం విదితమే. అదే సమయంలో, ఈ విభాగానికి అవసరమైన 302 మంది అధికారులు, సిబ్బందితో పాటు రూ.50 కోట్ల వరకు నిధులను కేటాయించి రాష్ట్రంలో విద్యార్థులు, యువత భవిష్యత్తుతో ఆడుకుంటున్న డ్రగ్ మహమ్మారిని కూకటివేళ్లతో పెకిలించి వేస్తామని సీఎం ప్రకటించారు.

ఉపగ్రహాలతో ఎన్నో ఉపయోగాలు

- చంద్రయాన్ విజయంలో శాస్త్రవేత్తల కృషి గొప్పది
- ప్రభుత్వం మరిన్ని నిధులివ్వాలి
- అంతరిక్ష జ్ఞానంపై విద్యార్థులను తల్లిదండ్రులు ప్రోత్సహించాలి : ఎస్వీకే వెబినార్‌లో రఘునందన్ కుమార్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

అంతరిక్షంలో ప్రయోగిస్తున్న ఉపగ్రహాలతో ఎన్నో ఉపయోగాలున్నాయని ప్లానిటరీ సొసైటీ ఆఫ్ ఇండియా డైరెక్టర్ ఎన్.రఘునందన్ కుమార్ తెలిపారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రం మేనేజింగ్ కమిటీ కార్యదర్శి ఎస్.వినయకుమార్ సమన్వయంతో చంద్రయాన్ విజయం-శాస్త్రవేత్తల కృషి అనే అంశంపై నిర్వహించిన ఫేస్ బుక్ వెబినార్‌లో ఆయన మాట్లాడారు. తుఫాన్ తదితర ప్రకృతి వైపరీత్యాల రాకను ముందే పసిగట్టి ప్రాణ నష్టాన్ని నివారించడంతో పాటు కమ్యూనికేషన్, వైద్యం, దేశ భద్రత తదితర వాటికి ఆ సాంకేతిక విరివిగా వినియోగిస్తున్నారని తెలిపారు. ఉదాహరణకు 1999లో వచ్చిన తుఫాన్‌లో 10 వేల మంది చనిపోతే, ఇటీవల అలాంటి తుఫాన్ వస్తే ముందే హెచ్చరికలతో ప్రాణ నష్టం జరగకుండా నివారించగలిగారన్నారు. కారడవుల నుంచి కూడా ప్రత్యక్ష ప్రసారం ఇవ్వగలిగిన స్థితికి చేరుకున్నామన్నారు. దీనికంతటికీ శాస్త్రవేత్తలు చేసిన కృషి గొప్పదనీ, ప్రభుత్వాలు మరిన్ని నిధులను ఇచ్చి వారిని ప్రోత్సహించాలని కోరారు. విద్యార్థులు అంతరిక్ష జ్ఞానం పొందేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని సూచించారు.

రష్యా, అమెరికా పోటాపోటీగా అంతిరక్ష ప్రయోగాలు చేయడం, ఒక దశలో అంతరిక్షాన్ని సైనికీకరణ చేయాలని చేసిన ప్రయత్నాలను ఐక్యరాజ్య సమితి అడ్డుకుందని గుర్తుచేశారు. ఖగోళ వస్తువులను అందరి సొత్తుగా ప్రకటించిందని చెప్పారు భూమి చుట్టు బాహ్య వలయంలో, అంతరిక్షంలో చేసే ప్రతి ప్రయోగం శాంతిపూర్వక కార్యక్రమంగా ఉండాలని నిర్దేశించిందని తెలిపారు. ప్రపంచం 1957 నుంచి స్పేస్ యుగంగా భావిస్తుండగా, అదే సమయంలో కొంత మంది శాస్త్రవేత్తలు మన దేశాభివృద్ధికి ఖగోళ ప్రయోగాలు అవసరమని గుర్తించారని తెలిపారు. చంద్రయాన్ 1, చంద్రయాన్ 2ల నేపథ్యం, అనుభవాలను వివరిస్తూ చంద్రయాన్ 3 విజయవంతానికి వాటిని శాస్త్రవేత్తలు ఉపయోగించుకున్నారని తెలిపారు. చంద్రయాన్ 2 పూర్తిగా వైఫల్యం చెందిందని చెప్పలేమన్నారు. అది పంపించిన డాటా విశ్లేషణకు ఏండ్ల తరబడి సమయం పడుతుందన్నారు. చంద్రయాన్ 3 విషయంలో సాఫ్ట్ ల్యాండింగ్‌తో పాటు భారత శాస్త్రవేత్తలు మరో ప్రయోగాన్ని చేశారనీ, దానితో చంద్రమండలంపైకి వ్యోమగామిని పంపించేందుకు అవకాశాలపై ఆశలు చిగురించాయని తెలిపారు.





భవిష్యత్ సైంటిస్టులకు ప్రోత్సాహం

భవిష్యత్ సైంటిస్టులను ప్రోత్సహించేందుకు ఇస్రో ఎనిమిది, తొమ్మిదో తరగతి చదివే విద్యార్థులను ప్రోత్సహిస్తున్నదని రఘునందన్ తెలిపారు. ప్రతి ఏడాది మార్చిలో నోటిఫికేషన్ ఇచ్చి 330 మంది విద్యార్థులను క్విజ్ ద్వారా ఎంపిక చేస్తుందన్నారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు విద్యార్థులను ప్రోత్సహించాలని ఆయన సూచించారు. అంతిరక్ష జ్ఞానంపై అవగాహన కల్పించే కృషిని ప్లానిటరీ సొసైటీ ఆఫ్ ఇండియా గత 20 ఏండ్లుగా కొనసాగిస్తున్నదనీ, రాబోయే కాలంలోనూ ఇదే విధంగా కృషి చేస్తామని తెలిపారు. 2040 కల్లా వ్యోమగామిని చంద్రునిపైకి పంపించాలని ప్రధానమంత్రి కార్యాలయం ప్రకటించిన నేపథ్యంలో మరో 17 ఏండ్లపాటు తమ ముందు మరింత బాధ్యత మిగిలి ఉందని తెలిపారు.

జ్యోతిష్యుల వక్రభాష్యాలు

నిర్దిష్ట కాలవ్యవధిలో భూమికి, ఇతర గ్రహాలు దగ్గరగా వస్తుంటాయనీ, అలాంటి సందర్భాలను ఉపయోగించుకుని కొంత మంది జ్యోతిష్యులు వక్రభాష్యాలు చెబుతుంటారని ఖండించారు. ఇలాంటి వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. ఇది సహజమైందని తెలిపారు.

అయ్యప్ప పూజలో మేయర్ పారిజాత



నవతెలంగాణ-బడంగ్ పేట్

మహేశ్వరం నియోజకవర్గం బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఉన్న బాలాపూర్ గ్రామంలో ఆది వారం అయ్యప్ప స్వామి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, మేయర్ పారిజాత నర్సింహారెడ్డి, గురుస్వామి, ఫ్లోర్ లీడర్ వంగేటి ప్రభాకర్ రెడ్డి హాజరై పూజలు చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రతి ఒక్కరూ భక్తి భావం కల్గి ఉన్నపుడే మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో శశిధర్ రెడ్డి స్వామి, స్థానిక నాయకులు సంజీవ గౌడ్, కార్యకర్తలు, అయ్యప్ప స్వామి భక్తులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సబితమ్మకు కార్పొరేటర్ శుభాకాంక్షలు



నవతెలంగాణ - చైతన్యపురి

మహేశ్వరం నియోజకవర్గం ఎమ్మెల్యే పటోళ్ల సబితా ఇంద్రారెడ్డిని ఆదివారం శ్రీనగర్ కాలనీలోని ఆమె నివాసంలో ఆర్కేపురం డివిజన్ బీజేపీ కార్పొరేటర్ రాధా ధీరజ్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సబితా ఇంద్రారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం రాధా ధీరజ్ రెడ్డి మాట్లాడుతూ శాసనసభ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిచిన శుభ సందర్భంగా ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలియజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు సుదర్శన్, రమేష్ గౌడ్, శ్రీశైలం యాదవ్, వెంకటేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతా



- ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి

నవతెలంగాణ - సంతోష్‌నగర్

ఎల్బీనగర్ నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే దేవి రెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. చంపాపేట డివిజన్ పరిధిలోని మెగా ఫంక్షన్ హాల్ పక్కన చేపట్టిన బాక్స్ డ్రైన్స్ పనులను ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ ఎన్నికల నేపథ్యంలో అధికారులు ఎన్నికల విధుల్లో ఉండడంతో పనులు కొంతమేర నెమ్మదిగా సాగాయన్నారు. వెంటనే చీఫ్ ఇంజనీర్‌తో మాట్లాడి, పనుల్లో వేగం పెంచి, త్వరగా పూర్తిచేయాలని కోరారు. అలాగే బాక్స్ డ్రైన్స్ నిర్మాణం కోసం ఎక్కడెక్కడ తవ్వారో అక్కడ పూడ్చాలని సూచించారు. ప్రస్తుతం ఇక్కడ జరుగుతున్న ప్రదేశం నందు స్లాబ్ వేసి కాలనీవాసులకు ఉపశమనం కల్పించాలని సూచించారు. ఎల్బీనగర్ నియోజకవర్గ అభివృద్ధే తన లక్ష్యం అని అన్నారు. నియోజకవర్గంలో మిగిలిపోయిన సమస్యలను ప్రణాళికబద్ధంగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.ఈ పరిశీలనలో కర్మన్ ఘాట్ హనుమాన్ దేవాలయం చైర్మన్ నల్ల రఘుమారెడ్డి, సుంకోజు కృష్ణమాచారి, ఎల్బీనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ యువజన అధ్యక్షులు రవి ముదిరాజ్, ధర్మకర్త చీర తిరుమల, యాదిరెడ్డి, నిష్కాంత్ రెడ్డి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

ఈ ఏడాది ఎక్సైజ్ శాఖకు రూ.41కోట్లు



- గత ఏడాది కంటే ఈ ఏడాది పెరిగిన ఆదాయం
- జిల్లా వ్యాప్తంగా గంజాయిపై 30టీమ్‌లు నిఘా...

నవతెలంగాణ - హయత్ నగర్

తెలంగాణ ప్రభుత్వానికి ఆదాయ వనరులు కలిగిన శాఖలో ఎక్సైజ్ శాఖ ఒకటని చెప్పవచ్చు. ప్రధానంగా ఆబ్కారి శాఖ పోలీసులు నిరంతరం మద్యం అమ్మకాలు ఎక్కువగా జరిగేలా చర్యలు తీసుకోవాలి. అదేవిధంగా మత్తు పదార్థాలపై నిఘా ఏర్పాటు చేసి, వాటిని పూర్తిగా నియంత్రణ కోసం కృషి చేసే విధంగా చొరవ చూపాలని ప్రభుత్వం ముఖ్య ఉద్దేశ్యం. దీని కోసం కింది స్థాయి అధికారులు, సిబ్బంది పనిచేయాలి. దానికి అనుగుణంగానే హయత్ నగర్ ఎక్సైజ్ శాఖ పరిధిలో మొత్తం 28 మద్యం దుకాణాలు, 31 బార్లు ఉన్నాయి.

వాటి నుండి గత ఏడాది 604కోట్ల రూపాయలు ఆదాయం రాగా.. ఈ ఏడాది అసెంబ్లీ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో అట్టి ఆదాయం 649.44కోట్ల రూపాయలు దాటింది. ఇక గంజాయి(మత్తు పదార్థాలు) విషయంలో ఈ ఏడాది 15 కేసులు నమోదు కాగా..120 కేజీలు పట్టుబడగా 19మంది జైల్‌కు వెళ్లారు. గత ఏడాది కేవలం 57 కేజీలు పట్టుబడింది. లిక్కర్ కేసులు గత ఏడాది 11, ఈ ఏడాది 51 కేసులు నమోదయ్యాయి. ఎక్కడైనా నూతనంగా ఏర్పాటు చేసిన వెంచర్‌లలో తాటి, ఈత చెట్లు నరికిన వారిపై కేవలం ఒక్క కేస్ మాత్రమే నమోదైంది. గత ఏడాది ఎక్సైజ్ శాఖ హయత్ నగర్‌లో 97కేసులు, ఈ ఏడాది 268 కేసులు నమోదయ్యాయి. రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా మొత్తం 30టీమ్‌లు నిరంతరం పర్యవేక్షణ చేసి, గంజాయి లేకుండా చేయడం, నకిలీ మద్యం లేకుండా చూస్తారు. ఏడాది ఏడాదికి ఆదాయం పెరగాలి కానీ లెక్క తగ్గకుండా చూడాల్సిన భాధ్యత ఎక్సైజ్ శాఖ అధికారులదని తెలుస్తోంది.







మత్తు పదార్థాల నివారణకు జిల్లా వ్యాప్తంగా 30టీమ్‌లు

ప్రభుత్వం, ఎక్సైజ్ శాఖ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నిరంతరం మత్తు పదార్థాల నివారణకు రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా మొత్తం 30టీమ్ లు 24 గంటలూ పని చేస్తున్నాయి. ఆదాయ వనరులు సమకూర్చడంలో కూడా ముందు వరసలో ఉన్నాం. ఇన్ని సంవత్సరాలు హయత్ నగర్‌లో ఎక్సైజ్ శాఖ సొంత భవనం లేక చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాం. ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న నూతన భవనం 2024 మార్చి నాటికి పూర్తి అవుతుంది.

- హయత్‌నగర్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణ్ గౌడ్

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



- సొంత ఖర్చుతో బోరు మోటర్, కులాయి ఏర్పాటు చేసిన చిలుక ఉపేందర్ రెడ్డి

నవతెలంగాణ - చైతన్యపురి

మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ కాంటెస్టెంట్ అభ్యర్థి కిచ్చెన్నగారి లక్ష్మారెడ్డి, టీపీసీసీ ప్రతినిధి దేప భాస్కర్ రెడ్డి సహకారంతో పలు సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్ళి పరిష్కరించేందుకు కృషి చేస్తానని రాష్ట్ర యువజన కాంగ్రెస్ పార్టీ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి అన్నారు. ఆర్కేపురం డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ ఫిఫ్టీ(50) యాడ్స్‌లో మూడు సంవత్సరాలుగా నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్‌కు చిలుక ఉపేందర్ రెడ్డి తన సొంత నిధులతో కొత్త త్రీ ఫేజ్ బోరు మోటార్, వైరింగ్, కుళాయిలను ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ నిరుపయోగంగా ఉన్న వాటర్ ట్యాంక్ సమస్యను స్థానిక ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకున్న పాపాన పోలేదని ఆరోపించారు. ఈ ఎన్నికల ప్రచారంలో భాగంగా బస్తీ పర్యటనకు వచ్చినప్పుడు కాలనీవాసులు ఈ సమస్యను తన దృష్టికి తీసుకొచ్చారని గుర్తుచేశారు. అందుకే వాటర్ ట్యాంక్ సమస్యను పరిష్కరించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రేణుక, మమత, సంతోష, జయశ్రీ, రమాదేవి, లక్ష్మి, లావణ్య, కవిత, మాధవి, స్వరూప, రాజు, విజయ్, భాస్కర్, శ్రావణ్, హరి, ప్రేమ్, అనిల్, కుమార్, రాజు, స్వామి, శ్రీకాంత్ రెడ్డి, జహంగీర్, నగేష్, భార్గవ్, బస్తీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు పాత్రల ఎగ్జిబిషన్

నవతెలంగాణ - ధూల్‌పేట్

సాలార్ జంగ్ అనే నవాబు వాడిన ఉక్కు పాత్రలను సేకరించిన మినిస్ట్రీ ఆఫ్ కల్చరల్, సాలార్జంగ్ మ్యూజియం సంయుక్తంగా ఎగ్జిబిషన్ ను ఏర్పాటు చేశారు. మ్యూజియం డైరెక్టర్ ఆశిష్ గోయల్ ఈ ఎగ్జిబిషన్‌ను ఆదివారం జ్యోతి



ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాలార్జంగ్ మ్యూజియం ఎన్నో కళాఖండాలను సేకరించిందని గుర్తుచేశారు. అందులో ఈ ఉక్కు పాత్రలను కూడా సేకరించిందన్నారు. ఈ ప్రత్యేక ఎగ్జిబిషన్ ఈ నెల చివరి వరకు కొనసాగుతుందని మ్యూజియం క్యూరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సాలార్జంగ్ మ్యూజియం బోర్డు సభ్యుడు నవాబ్ ఎతరం అలీ ఖాన్, డాక్టర్ కుస్సుం, బిఆర్ నాయక్, వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

23న 'సింగరేణి' సంఘం రాష్ట్ర సదస్సు



నవతెలంగాణ -నాగోల్

ఈ నెల 23న సింగరేణి దినోత్సవాన్ని పురస్కరించుకొని సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర సదస్సును నాగోలులో నిర్వహిస్తున్నట్లు సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఆలవంధార్ వేణుమాధవ్ సంయుక్త కార్యదర్శి ఎస్ నరసింహారావు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఆయన మాట్లాడుతూ నాగోలు డివిజన్లోని లలిత నగర్ రోడ్డు నెంబర్ నాలుగులోని కమ్యూనిటీ భవనంలో ఈ సదస్సును నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సింగరేణి సంస్థ ఆవిర్భవించి 134 సంవత్సరాలు గడించి లక్షలాది మందికి ఉపాధి కల్పించిందని, దాదాపు 30,40 సంవత్సరాలు కష్టపడి సంస్థ అభివృద్ధికి పాటుపడి పదవి విరమణ పొందిన తర్వాత విశ్రాంత ఉద్యోగుల పట్ల యాజమాన్యం నిర్లక్ష్యం వహిస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. కోల్ మైన్స్ పెన్షన్ స్కీం-1998 ప్రకారం ప్రతి మూడు సంవత్సరాలకు ఒకసారి సమీక్ష జరిపి సవరించాలని నిబంధన అమలు చేయడం లేదని, కనీస పెన్షన్ 15,000 రూపాయలు ఇవ్వాలని, అన్ని రకాల వైద్య సేవలు ఉచితంగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సింగరేణి విశ్రాంత ఉద్యోగులకు తెల్ల రేషన్ కార్డులు ఇవ్వాలని కోరారు. తదితర డిమాండ్స్ పరిష్కారం కోసం ఈ నెల 23న అసోసియేషన్ సర్వ సభ్య సమావేశం దృష్టికి తెస్తూ..సింగరేణి డే వేడుకలు, సీనియర్ సిటిజన్లకు 'భీష్మ' అవార్డుతో సత్కారం, నూతన కమిటీ ఎన్నిక, నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరణ తదితర అంశాలపై రాష్ట్ర సదస్సులో చర్చించనున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర సదస్సుకు సింగరేణి విశ్రాంత ఉద్యోగులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్, కార్యవర్గ సభ్యులు గీస కనకయ్య టి.నర్సింహ రావు పాల్గొన్నారు.

'సృజనాత్మకతను వెలికి తీసేందుకే ఫుడ్ ఫెస్టివల్స్'



నవతెలంగాణ - ధూల్ పేట్

విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఫుడ్ ఫెస్టివల్స్ ఎంతగానో దోహద పడతాయని కార్పొరేటర్ ఖాదర్ హుస్సేనీ పాషా అన్నారు. కాలపత్థర్‌ల్లోని గోల్డెన్ జూబ్లీ హైస్కూల్లో ఆదివారం నిర్వహించిన ఫుడ్ ఫెస్టివల్‌లో విద్యార్థులు డ్రై ఫ్రూట్స్ వివిధ వంటకాలను ఎంతో చక్కగా చేసి చూపించారు. ఈ సందర్భంగా విద్యార్థులు కనబరిచిన ప్రతిభనుద్దేశించి ఆయన మాట్లాడారు. విద్యార్థులలో విద్య తోపాటు వారిలో ఉన్న సృజనాత్మకతను బయటికి తీసి ప్రోత్సహిస్తే..ఉన్నత శిఖరాలను అధిరోహిస్తారని అన్నారు. విద్యార్థులు అన్ని రంగాల్లోనూ రాణించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ హైదర్ రజా, ప్రిన్సిపాల్ అబ్బాస్ రజా, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

గణిత శాస్త్ర మహనీయుడు రామానుజన్

ఆల్ఫోర్స్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ నరేందర్ రెడ్డి

నవతెలంగాణ - చైతన్యపురి

గణిత శాస్త్రానికి నూతన అధ్యాయాన్ని కనుగొన్న మహనీయుడు శ్రీనివాస రామానుజన్ అని ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి నరేందర్ రెడ్డి అన్నారు. ఘటకేసర్, కర్మన్ ఘాట్, నల్లకుంట, గుర్రంగూడ , సుచిత్ర, అల్వాల్‌లో వేడుకగా నిర్వహింపబడిన ఆల్ఫోర్స్ మ్యాథ్స్ ఒలంపియాడ్ టెస్ట్ (అమాట్) నిర్వహణకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ రామానుజన్ చిన్నతనం నాటినుండే గణిత శాస్త్రం పట్ల చాలా దృష్టి వహించేవారని గుర్తుచేశారు. అదే ఆసక్తిని క్రమక్రమేనా పెంపొందించుకొని పలు శాస్త్రవేత్తలు చేపట్టినటువంటి పరిశోధనలకు ఆకర్షితులై, ప్రత్యేకంగా రామానుజన్ గణిత శాస్త్రంలో వివిధ నూతన విషయాలకు బీజం వేశారని కొనియాడారు. తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి ఆల్ఫోర్స్ విద్యాసంస్థల్లో 6 నుండి 10వ తరగతి విద్యార్థులకు రాష్ట్రస్థాయిలో పరీక్షను గంట పాటు నిర్వహించడం జరిగిందన్నారు. సుమారు



12,600 మంది విద్యార్థులు పాల్గొన్నట్లు తెలిపారు. అత్యుత్తమ ప్రదర్శన కనబర్చినటువంటి విద్యార్థులకు ఈ నెల 22న కొత్తపల్లిలోని ఆల్ఫోర్స్ ఇ-టెక్నో పాఠశాలలో నిర్వహించనున్న జాతీయ గణిత దినోత్సవ వేడుకలలో అతిథుల చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్య క్రమంలో వివిధ పాఠశాలల ప్రిన్సిపాల్స్, టీచర్స్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'పండితుల పోస్టులను పండితులకే ఇవ్వాలి'



నవతెలంగాణ - ధూల్ పేట్

తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో ఉన్నత పాఠశాలలలో బోధిస్తున్న భాషా (తెలుగు, హిందీ, ఉర్దూ) పండితుల పోస్టులను పండితులకే ఇవ్వాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ (ఆర్.యు. పి. పి) తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్. ఎస్. విజయ భాస్కర్ అన్నారు. పండిత ఉపాధ్యాయులతో కలిసి ఆదివారం శాసన సభ సభ్యులు కసిరెడ్డి నారాయణ రెడ్డిని ఆయన క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విజయ భాస్కర్ మాట్లాడుతూ పండిత్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు.

గత మూడు దశాబ్దాలుగా భాషోపాధ్యాయులకు పదోన్నతులు లేక ఉన్నత పాఠశాలలో బోధిస్తూ..ప్రాథమిక పాఠశాల వేతనాలు తీసుకుంటూ శ్రమదోపిడికి, వెట్టిచాకిరికి గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 317 జీవో ద్వారా స్థానికులు, స్థానికేతరులుగా మారాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యారంగ సమస్యలను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు కె.గోపాల్ జీ, కన్నయ్య, యాదిలాల్, వివిధ జిల్లాల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధితో యువత రాణించాలి

- మాజీ కార్పొరేటర్ రమణ రెడ్డి



నవతెలంగాణ - సంతోష్ నగర్

స్వయం ఉపాధి రంగాలను ఎంచుకొని యువత రాణించాలని మాజీ కార్పొరేటర్ రమణ రెడ్డి అన్నారు. ఎల్బీనగర్ నియోజకవర్గం చంపాపేట్ డివిజన్ కర్మన్ ఘాట్ పరిధిలోని ప్రధాన రహదారిపై నూతనంగా ఏర్పాటు చేసిన అద్వయ కిచెన్ మల్టీ కుసిన్ రెస్టారెంట్‌ను ఆదివారం నిర్వాహకులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రమణ రెడ్డి మాట్లాడుతూ మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన వెరైటీలను అందించి.. ప్రజల మన్ననలు పొందాలని నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సోమనాథ్ రెడ్డి, రామకృష్ణ, జహన్ని, రాజేష్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



ఓల్డ్ పెన్షన్ ప్రభుత్వ అమలుపై హర్షం



నవతెలంగాణ - ధూల్ పేట్

రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలులోకి తెస్తామని ఎమ్మెల్యే రాంమ్మోహన్ రెడ్డి అసెంబ్లీలో ప్రకటించిన నేపథ్యంలో ఓల్డ్ పెన్షన్ సాధన సమితి హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు ఆదివారం రాష్ట్ర కన్వీనర్ బియ్యం సంతోష్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతానికి ఎటువంటి ఆర్థికపరమైన అంశంతో ముడిపడి లేనందున వీలైనంత త్వరగా ప్రకటించి సీపీఎస్ ఉద్యోగుల ఆకాంక్షను నెరవేర్చాలన్నారు. ఈ సందర్భంగా విడుదల చేసిన ప్రకటనలో కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో పేర్కొన్న అంశాల అమలు దిశగా ముందుకు రావడం గొప్ప విషయమన్నారు. ఈ కార్యక్రమంలో కో-కన్వీనర్లు రంజిత్ కుమార్, బి.అరవింద్, ఎస్.నర్సింహా చారి, మహిళా కో-కన్వీనర్లు మంద రజిత, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు.

మినీ క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఉప్పల్ ఎమ్మెల్యే బండారి



నవతెలంగాణ-కాప్రా

క్రిస్మస్ వేడుకల్లో భాగంగా ఆదివారం మల్లాపూర్ డివిజన్ పరిధిలోని కేఎల్ రెడ్డి నగర్ కాలనీలోని బేతేస్థ హౌస్ ఆఫ్ ప్రేయర్ చర్చి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినీ క్రిస్మస్ వేడుకకు ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డిలు హాజరై ప్రత్యేక ప్రార్థనలను చేశారు. ఈ సందర్భంగా వారు క్రిస్టియన్లకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్లు ఏబినేజర్, దేవదాస్, జాకబ్, స్థానిక కాలనీ వాసులు, నాయకులు పాల్గొన్నారు.



ఉప్పల్ నియోజకవర్గ పరిధిలో ఆదివారం జరిగిన పలు వివాహాలకు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన ఉప్పల్ శాసన సభ్యుడు బండారి లక్ష్మారెడ్డి. -నవతెలంగాణ, కాప్రా

ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి శుభాకాంక్షల వెల్లువ



నవతెలంగాణ-కాప్రా

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డికి నియోజకవర్గంలోని పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం సైనిక్‌పూరిలోని ఎమ్మెల్యే కార్యాలయంలో కలిశారు. ఈ సందర్భంగా పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలిపి సన్మానించారు. అనంతరం బండారి మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేసే నాయకుడికి ప్రజలు ఎప్పుడూ మద్దతుగా ఉంటారని తన గెలుపుతో మరోమారు నిరూపితమైందన్నారు. తనపై ప్రజల ప్రేమ, అభిమానం ఎప్పుడూ ఎలాగే ఉండాలని కోరారు.

సీఐటీయూ రాష్ట్ర కార్యాలయ నిర్మాణానికి

రూ.47,150 చెక్కు అందజేత



నవతెలంగాణ-కాప్రా

సీఐటీయూ రాష్ట్ర కార్యాలయ నిర్మాణానికి రూ.47,150లు నిధి చెక్కును మెడిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ సీఐటీయూ అనుబంధ సంఘాల నాయకులు ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా కమలానగర్ సీఐటీయూ ఆఫీసులో సీఐటీయూ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు డీజీ.నరసింహారావు రాష్ట్ర కార్యదర్శి జే. చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షులు మెడిసిటీ యూనియన్ అధ్యక్షులు ఎర్ర. అశోక్ మాట్లాడుతూ.. నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తోందన్నారు. కొత్త చట్టాలు చేయకపోగా ఉన్న కార్మిక చట్టాలనే రద్దుచేసి కొత్తగా 4 కోడ్‌లు తెచ్చి పెట్టుబడిదారులకు, యజమానులకు తొత్తుగా వ్యవహరిస్తున్నదని చెప్పారు. కులం పేరుతో, మతం పేరుతో, ప్రాంతం పేరుతో కార్మిక వర్గాన్ని విభజించి పాలిస్తున్నదని తెలిపారు. సెంటిమెంట్‌ను రెచ్చగొట్టి పబ్బం గడుపుకొని పరిపాలనను కొనసాగిస్తోందని మండిపడ్డారు. వీటిని నమ్మకుండా అనునిత్యం కార్మిక వర్గాన్ని చైతన్యం చేస్తూ ప్రజా పోరాటాల్లో అగ్ర భాగాన నిలిచే సీఐటీయూ కార్యాలయానికి సహకరించడం మంచి పరిణామం అని పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉన్న ఉద్యోగ, కార్మికుల సహాయ సహకారాలతో 2024 ఏడాదిలో సీఐటీయూ రాష్ట్ర కార్యాలయ నిర్మాణం పూర్తి చేస్తామని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. హైదరాబాద్ రిసాల గడ్డలో నిర్మించబోయే సీఐటీయూ రాష్ట్ర కార్యాలయం కార్మిక, ఉద్యోగ ప్రజా పోరాటాలకు కేంద్రంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మెడిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎన్. దేవేందర్, ఉపాధ్యక్షులు జీ.సుధాకర్ రావు, బీ.నర్సింగ్‌రావు. కోశాధికారి ఏ. సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వైఎస్ షర్మిల జన్మదిన వేడుకలు



నవతెలంగాణ-కాప్రా

వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల పుట్టినరోజు వేడుకలను కాప్రా సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఆదివారం ఘనంగా నిర్వహించారు. కాప్రాలో వైఎస్ఆర్టీపీ నాయకులు సర్వేపల్లి రవికుమార్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రంలో రాజన్న రాజ్యం తీసుకువచ్చేందుకు పార్టీని ఏర్పాటు చేసి ప్రజల పక్షాన పోరాడుతున్న ఘనత షర్మిలకు దక్కుతుందన్నారు. ప్రజల కష్టాలు తెలుసుకు నేందుకునేందుకు పాదయాత్ర చేసిన అనుభవం ఆమెకు ఉందన్నారు. ఇలాంటి పుట్టిన రోజులు మరిన్నో జరుపుకోవాలని ఆశాభావం వ్యక్తం చేశారు.కార్యక్రమంలో వైసీపీ నాయకులు అయ ప్ప, కిష్టమూర్తి, వెంకటేష్, శ్రీకాంక్, ప్రవీణ్‌కుమార్, నాగమణి, శేషారత్నం, సింధూ, పవన్ పాల్గొన్నారు.

మహిళలు స్వయం ఉపాధిలో రాణించాలి



● నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి

నవతెలంగాణ-కీసర

మహిళలు స్వయం ఉపాధి రంగాల్లో రాణించాలని నాగారం మున్సిపల్ చైర్మెన్ కౌకుంట్ల చంద్రారెడ్డి అన్నారు. ఆదివారం నాగారం మున్సిపా లిటీలో ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత కుట్టు శిక్షణా శిబిరాన్ని చైర్మెన్ ప్రారంభిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా రాణించాలంటే ఇలాంటి శిక్షణ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మెన్ బి.మల్లేష్ యాదవ్, ఎన్జీవో అధికారి సూచిత్ర, కౌన్సిలం శ్రీనివాస్‌గౌడ్, బీఆర్ఎస్ నాయకులు లింగం, సాయినాథ్‌గౌడ్, పాల్గొన్నారు.

ప్రేరణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-కాప్రా

ప్రేరణ ఫౌండేషన్ అధ్వర్యంలో బీఎన్.రెడ్డి నగర్‌లోని స్మార్ట్ కిడ్స్ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. సీఎస్ఆర్ హెల్త్‌కేర్ వారి సహకారంతో నిర్వహించిన ఈ వైద్య శిబిరంలో రోగులకు 17 రకాల పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ప్రేరణ ఫౌండేషన్ చైర్మెన్ శరత్ సుదర్శి మాట్లాడుతూ.. సామాన్య ప్రజలు ఆర్థిక పరిస్థితులతో ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని పేర్కొన్నారు. చివరకు అనారోగ్యం వచ్చిన తర్వాత ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నారని పేర్కొన్నారు. అలా కాకుండా ముందే ఎప్పటికప్పుడు పరీక్షలు చేయించుకుంటే రాబోయే సమస్యలను ముందుగానే తెలుసుకోవచ్చని తెలిపారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ప్రేరణ ఫౌండేషన్ హెల్త్ క్యాంప్‌లు నిర్వహిస్తుందన్నారు. ప్రజలందరూ ఈ క్యాంపులను ఉపయోగించుకోవాలని కోరారు. ఈ ఉచిత వైద్య శిబిరంలో విద్యార్థుల తల్లిదండ్రులు, చుట్టుపక్కల ప్రజలు వైద్య పరీక్షలు చేయించుకున్నారు. భవిష్యత్‌లో రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇటువంటి వైద్య శిబిరాలు మరెన్నో పెట్టబోతున్నామని చెప్పారు. వైద్య పరీక్షలు చేసిన సీఎస్ఆర్ హెల్త్ కేర్ సభ్యులు లలిత, శ్రీకాంత్, హుస్సేన్, శరత్‌లకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు టాన్యా, రెహమత్ సుల్తాన, మాధవి, మౌనిక, లక్ష్మీ ఫాతిమా పాల్గొన్నారు.

మల్లాపూర్‌లో మెగా ఉచిత వైద్య శిబిరం



నవతెలంగాణ-కాప్రా

మల్లాపూర్ డివిజన్ పరిధిలోని మల్లాపూర్ మున్సిపల్ గ్రౌండ్‌లో XENIA ఆస్పత్రి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరాన్ని కార్పొరేటర్ పన్నాల దేవేందర్ రెడ్డి ప్రారంభించారు. ఈ వైద్య శిబిరాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ సూచించారు. ఈ కార్యక్రమంలో XENIA ఆస్పత్రి నిర్వాహకులు డా సురేష్, డాక్టర్ పూర్ణచంద్రారెడ్డి, నాగసాయి లక్ష్మీ, స్థానిక నాయకులు తండా వాసుగౌడ్, పైళ్ల ప్రవీణ్, సీతాల వీరస్వామి, దయాకర్‌రెడ్డి, రఘు, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం.. ప్రాణదానంతో సమానం



నవతెలంగాణ-జవహర్‌నగర్

యువత రక్తదానంలో ముందుండాలనీ, రక్తదానం మరొకరి జీవితంలో ప్రాణదానంతో సమానమని జవహర్‌నగర్ భజరంగ్ దళ్ ఇన్‌చార్జి కార్తీక్, శ్రీకాంత్‌లు అన్నారు. ఆదివారం జవహర్ నగర్ కార్పొరేషన్‌లో శౌర్యదివాసు పురస్కరించుకొని బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ప్రముఖ్ కుమారస్వామి హాజరై ప్రారంభించి మాట్లాడుతూ.. ఆపద సమయంలో రక్తదానం ఎంతో అవసరమని, ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని కోరారు. సుమారు 80 మంది యువకులు రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సునీతా, బజరంగ్ దళ్ నాయకులు మహంకాళి విభాగ్ ఇన్‌చార్జి శ్రీకాంత్, కార్కీ, నవీన్, చరణ్, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నీరజ్ ఇంటర్నేషనల్ స్కూల్ వార్షికోత్సవం



నవతెలంగాణ-మేడ్చల్

నీరజ్ ఇంటర్నేషనల్ స్కూల్, నీరజ్ కిండర్ గార్డెన్ ప్రైమరీ స్కూల్ విద్యాసంస్థల వార్షికోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అద్భుతమైన సాంస్కృతిక ప్రదర్శనలను నిర్వహించారు. ఇందులో భాగంగా తెనాలి రామకృష్ణుడి నాటికను ప్రదర్శించారు. తెనాలి రామకృష్ణుడి తెలివి తేటలు, వికటత్వం ఆనాటి విజయనగర సామ్రాజ్య మహారాజు శ్రీకృష్ణ దేవరాయల అద్భుతమైన ప్రజాపాలన, తెనాలి రామకృష్ణుడికి అరబ్ సామ్రాజ్య చక్రవర్తి అక్బర్ నుంచి వచ్చిన ప్రత్యేక ఆహ్వానం, అక్బర్‌ను తెనాలి మెప్పించిన విధానం విద్యార్థులు నృత్య ప్రదర్శనలతో, నాటిక ప్రదర్శనతో ప్రదర్శించారు. అంతకుముందు కార్యక్రమం గణేషుడి నృత్య ప్రదర్శన, విష్ణుమూర్తి దశవతారం నృత్య ప్రదర్శనలతో ప్రారంభం అయ్యింది. దశవతారం ప్రదర్శన అహుతులను విశేషంగా ఆకట్టుకుంది. విద్యార్థులు వివిధ రకాలైన భాషా, సంస్కృతులను తెలియజేసే మరాఠీ, ఫార్మర్, యూపీ, పంజాబీ, మలహారి, శుభదిన్, హెూలీ, అరబిక్ నృత్య ప్రదర్శనలు, నాటకాలతో ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో నీరజ్ విద్యాసంస్థల చైర్మెన్ డా.బి. జ్యోతిరెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ బి.గవిష్ రెడ్డి, ప్రిన్సిపాల్ బి.రాక్షారెడ్డి, సన్ ఫ్లవర్ వేదిక్ స్కూల్ ప్రిన్సిపాల్ సరితా కుమార్, సంగీతా రఘురామ్, నీరజ్ ఎడ్యుకేషనల్ సొసైటీ సభ్యురాలు ప్రియా రెడ్డి, నీరజ్ కిండర్ గార్డెన్ ప్రైమరీ స్కూల్ సెంటర్ హెడ్ టి. సౌజన్య తదితరులు పాల్గొన్నారు.



81వ వారం అంబేద్కర్ జ్ఞానమాల కార్యక్రమం



నవతెలంగాణ-కాప్రా

మహాత్మా జ్యోతిరావుపూలే, డాక్టర్ బీ.ఆర్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ విగ్రహాలకు 81వ వారం జ్ఞాన మాల టీం సభ్యులు ఆదివారం పూలమాలతో జ్ఞానమాల సమర్పించారు. ఈ కార్యక్రమంలో జ్ఞానమాల జమ్మిగడ్డ టీం ఆర్గనైజర్ తాడూరి గగన్ కుమార్, బీజేఆర్ కాలనీ అధ్యక్షులు రహీం, జ్ఞానమాల టీం సభ్యులు నరసింహ చారి, నరేందర్ రావు, రవినాయక్, నాగేష్, జాషువా రాములు, ప్రభు, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యకు మారు పేరు సత్యసాయి విద్యా సంస్థలు



● విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి ● ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-ఉప్పల్

క్రమశిక్షణ, నాణ్యమైన విద్యకు మారు పేరు సత్యసాయి విద్యాసంస్థలు అని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం రాత్రి హబ్సిగూడ డివిజన్ వెంకట్ రెడ్డి నగర్‌లో జరిగిన సత్యసాయి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ అవార్డ్స్ వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బండారి మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని సూచించారు. విద్యార్థులు అన్ని రంగాల్లో రానించాలన్నారు. ఈ కార్యక్రమంలో సత్య సాయి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ యాజమాన్యం గడ్డం సాయి కిరణ్, కార్పొరేటర్లు చేతన హరీష్, బండారి శ్రీవాణి వెంకట్‌రావు, బీఆర్ఎస్ పార్టీ డివిజన్ ప్రెసిడెంట్ బీవీ.చారి, ఉప్పల్ సీఐ శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరాలతో

పేదలకు మెరుగైన వైద్యం అందుతోంది



● కౌన్సిలర్ కోడిమేల ఉమా ఆంజనేయులు

నవతెలంగాణ-శామీర్‌పేట

ఉచిత వైద్య శిబిరాలతో పేదలకు మెరుగైన వైద్యం అందుతోందని స్థానిక కౌన్సిలర్ కోడిమేల ఉమా ఆంజనేయులు అన్నారు. తూంకుంట మున్సిపల్ పరిధిలోని 14 వ వార్డు మందాయిపల్లి అనుబంధ గ్రామం ఎలిగలగూడలో ఆదివారం మోర లక్ష్మీనరసింహ జ్ఞాపకార్థం వారి కుమారుడు మోర దీపక్ మేడ్చల్ ఉషోదయ లేసర్ కంటి హాస్పిటల్ వారి సహకారంతో ఉచితంగా కంటి శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో సుమారు 150 మందికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కంటి అద్దాలు అవసరం ఉన్న వారికి త్వరలోనే ఉచితంగా అద్దాలు పంపిణీ చేస్తామని హాస్పిటల్ వారు తెలిపారు.

ఈ కార్యక్రమంలో తూంకుంట మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు భీమిడి జైపాల్ రెడ్డి, మున్సిపల్ 14 వ వార్డు కౌన్సిలర్ కోడిమెల ఉమా ఆంజనేయులు, వైద్యులు డాక్టర్ సుమన్, సిబ్బంది పరుశురామ్, విజయ్, పూజశ్రీ, స్థానికులు మోర సత్యనారాయణ, మహేష్, బాలకృష్ణ, భాను, మల్లేష్, దశరథ్, నర్సింహ, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ నగర్‌లో పర్యటించిన కార్పొరేటర్



నవతెలంగాణ-కాప్రా

మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్ నగర్ కాలనీలో డ్రయినేజీ, మంచినీటి సరఫరా, ఇతర సమస్యలపై కార్పొరేటర్ జెర్రిపోతుల ప్రభుదాస్ ఆదివారం కాలనీలో పర్యటించారు. అనంతరం ప్రభుదాస్ మాట్లాడుతూ డివిజన్ అభివృద్ధిలో భాగంగా సీసీ రోడ్లు, డ్రయినేజీ వ్యవస్థ, మంచినీటి పైప్‌లైన్ల ఏర్పాటు, ఇలా ఎన్నో అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. డివిజన్ పరిధిలోని ప్రతి కాలనీకి అవసరమైన అభివృద్ధి పనులు చేస్తున్నామన్నారు. కాలనీవాసులు సమస్యలేమైనా ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. కాలనీవాసులు సీసీ రోడ్డు నిర్మించాలని తన దృష్టికి తీసుకొచ్చారని, త్వరలో పనులు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ సెక్రటరీ మధు ముదిరాజ్, కాలనీ అధ్యకులు వాసుచారి, భీష్మాచారి, ఎర్ర అంజి, నాగరాజు గౌడ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత



నవతెలంగాణ-శామీర్‌పేట

మూడు చింతలపల్లి మండలంలోని ఉద్దెమర్రి జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో 1997-98 విద్యా సంవత్సరం పదో తరగతి చదివిన ఆద్రాస్ పల్లి రాజు ఇటీవల మృతి చెందారు. రాజు మృతి చెందాని విషయం తెలుసుకున్న నాటి మిత్రులు మృతుడి కుటుంబ సభ్యులకు రూ.57,500 ఆర్థిక సహాయం అందజేసి అండగా నిలిచారు.

నవతెలంగాణ
కూకట్‌పల్లి - కుత్బుల్లాపూర్ - మల్కాజిగిరి
సోమవారం | డిసెంబర్ 18, 2023 | www.navatelangana.com

ఉచిత మెగా వైద్య శిబిరం



నవతెలంగాణ-మల్కాజిగిరి

మల్కాజిగిరి డివిజన్‌లోని ఎల్ కె హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం గాంధీ పార్కులో డాక్టర్ మహేశ్ ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెరుగైన సమాజం కోసం ఆరోగ్యవంతమైన జీవనం గడపాలని, అందుకు మెరుగైన ఆహారం తీసుకోవాలని అన్నారు. ఈ శిబిరంలో 121 మంది రోగులు పాల్గొన్నారు. వీరికి బి.పి, మధుమేహం (షుగర్) పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందచేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ మేనేజర్ ఎం. శివరాజ్, కో ఆర్డినేటర్ వినోద్ యాదవ్, ఎంఓడి మనిమాల, నలుగురు నర్సులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వరద, ముంపు ప్రాంతాల్లో పర్యటించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-మల్కాజిగిరి

ఈస్ట్ ఆనంద్ బాగ్ డివిజన్‌లోని వరద, ముంపు ప్రాంతాల్లో ఆదివారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి పర్యటించారు. సతిరెడ్డి కాలనీ, సత్య రాఘవేంద్ర కాలనీ, బీజేఆర్ నగర్ కాలనీలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు కృషి చేస్తానని చెప్పారు. ప్రజలు తమ సమస్యలను, ఇబ్బందులను నేరుగా వచ్చి తెలియజేస్తే వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ ఏ.కె మురుగేష్, కేబుల్ రమేష్, నవీన్ యాదవ్, నర్సింగ్, భగవత్ రెడ్డి, తిరుపతి రెడ్డి, జంగరాజు, శ్రీధర్ మేరు తదితరులు పాల్గొన్నారు.

మతసామరస్యాలకు ప్రతీక గ్యార్వి ఉత్సవాలు



- యూత్ నాయకులు కొలుకుల జైహింద్

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

మతసామరస్యాలకు ప్రతీక గ్యార్వి ఉత్సవాలు నిలుస్తాయని బీఆర్ఎస్ యూత్ నాయకులు కొలుకుల జైహింద్ అన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని మగ్దుం నగర్‌లో గల దర్గా వద్ద ఆదివారం సాయంత్రం జరిగిన గార్వి వేడుకల కు హాజరై ముస్లిం సోదరులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హిందూ ముస్లింలు సోదర భావంతో మెలగాలని సూచించారు. మైనార్టీల సంక్షేమం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ మైనారిటీ సెల్ అధ్యక్షులు మొహమ్మద్ ఆజం, మాజీ వార్డు సభ్యులు మహమూద్, దర్గా కమిటీ నాయకులు అమీద్, సాదిక్ అలీ, సులేమాన్, ఖయ్యూం, ముస్లిం పెద్దలు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

జగద్గిరిగుట్ట: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సర్వమతాల ప్రతిబింబమని స్థానిక ఎమ్మెల్యే కె.పి.వివేకానంద్ అన్నారు. ఆదివారం చింతల్ డివిజన్ వివేకానంద నగర్ షాబుద్దీన్ బస్తీలోని మహబూబ్-సుభానీ-చిల్లా దర్గా వద్ద నిర్వహించిన గ్యార్వి ఉత్సవాల కు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ముస్లిం సోదరులు, దర్గా కమిటీ సభ్యులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేసి చాదర్ సమర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ హైదరాబాద్ నగరం గంగా, జమునా తహజీబ్ అని ఇక్కడ ప్రజలంతా కులమతాలకతీతంగా ఒకటిగా జీవిస్తూ మతసామరస్యాన్ని చాటుతున్నారన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సర్వమతాల ప్రతిబింబమ ని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మైనారిటీ నాయకులు, దర్గా కమిటీ సభ్యులు ఎండి. చాంద్ పాషా, ఎండి.అలీ, ఎండి.మస్తాన్ సాబ్, ఎండి.ఆసిఫ్, ఎండి.మహబూబ్ తదితరులు పాల్గొన్నారు.



సీఐటీయూ రాష్ట్ర కార్యాలయ నిర్మాణానికి నిధి అందజేత



నవతెలంగాణ-సిటీబ్యూరో

సీఐటీయూ రాష్ట్ర కార్యాలయ నిర్మాణానికి రూ.47,150 నిధిని (చెక్కు) మెడిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) నాయకులు కమలానగర్‌లోని సీఐటీయూ ఆఫీసులో సీఐటీయూ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు డీజీ నరసింహారావుకు యూనియన్ మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కార్యదర్శి జె.చంద్రశేఖర్, జిల్లా అధ్యక్షులు, మెడిసిటీ యూనియన్ అధ్యక్షులు ఎర్ర అశోక్ అందజేశారు. ఈ సందర్భంగా అశోక్ మాట్లాడుతూ నేడు అధికారంలో ఉన్న కేంద్ర బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తుందన్నారు. కొత్త చట్టాలు చేయకపోగా ఉన్న కార్మిక చట్టాలనే రద్దుచేసి కొత్తగా నాలుగు కోడ్‌లను తీసుకొచ్చి పెట్టుబడిదారులకు యజమానులకు తొత్తుగా వ్యవహరిస్తుందన్నారు. కులం, మతం, ప్రాంతం పేరుతో కార్మిక వర్గాన్ని విభజించి పాలిస్తుందన్నారు. సెంటిమెంటును రెచ్చగొట్టి పబ్బం గడుపుకుని పరిపాలనను కొనసాగిస్తుందన్నారు. వీటిని నమ్మకుండా అనునిత్యం కార్మిక వర్గాన్ని చైతన్యం చేస్తూ ప్రజా పోరాటాల్లో అగ్ర భాగాన నిలిచే సీఐటీయూ కార్యాలయానికి సహకరించడం మంచి పరిణామం అన్నారు. రాష్ట్రంలో ఉన్న ఉద్యోగ, కార్మికుల సహాయ సహకారాలతో 2024లో సీఐటీయూ రాష్ట్ర కార్యాలయ నిర్మాణం పూర్తి చేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్‌లోని రిసాల గడ్డలో నిర్మించ బోయే సీఐటీయూ ఆఫీస్ కార్మిక, ఉద్యోగ ప్రజా పోరాటాలకు కేంద్రంగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మెడిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్.దేవేందర్, ఉపాధ్యక్షులు జి.సుధాకర్ రావు, బి.నర్సింగ్ రావు, కోశాధికారి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్ఎంసీ మేయర్‌కు కార్పొరేటర్ వినతి

- పత్యేక హౌస్ కమిటీ ఏర్పాటు చేసి, అవకతవకలను సరి చేయాలి
- కార్పొరేటర్ శ్రావణ్



నవతెలంగాణ-మల్కాజిగిరి/నేరేడ్ మెట్

జీహెచ్ఎంసీ పరిధిలో పలు డిపార్ట్‌మెంట్లలో ఉన్నటువంటి లాంగ్ స్టాండింగ్ స్టాఫ్, డిప్యూటేషన్ పైన ఉన్నటువంటి అధికారులు, కాంట్రాక్ట్ స్టాఫ్ పైన ప్రత్యేక హౌస్ కమిటీ ఏర్పాటు చేసి వాటిలో ఉన్నటువంటి అవకతవకలను సరిచేయాలని మల్కాజిగిరి కార్పొరేటర్ ఊరవెల్లి శ్రావణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అవసరం ఉన్నచోట అదనపు సిబ్బందిని పెట్టాలని మేయర్ గద్వాల్ విజయలక్ష్మిని కలిసి వివిధ డిమాండ్లతో కూడిన వినతిపత్రం సమర్పించడం అందించారు. అదేవిధంగా జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రోస్ అందుబాటులో లేకపోవడంతో వారి కార్యాలయంలో కూడా విజ్ఞాపన పత్రాన్ని అందించడం జరిగిందన్నారు. అదేవిధంగా జీహెచ్ఎంసీ పాలకమండలి సమావేశాన్ని కూడా ఎలక్షన్ కోడ్ రాకముందే నిర్వహించాలని కోరడం జరిగిందని తెలిపారు.

వ్యాసభట్టు రమదేవి సేవలు మరువలేనివి



- సీపీఐ రాష్ట్ర నాయకులు కే. ఏసురత్నం

నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

సీపీఐ మహిళా నాయకురాలు స్వర్గీయ వ్యాసబట్టు రమాదేవి సేవలు మరువలేనివని సీపీఐ రాష్ట్ర నాయకులు కే.ఏసురత్నం విచారం వ్యక్తం చేశారు. గత పది రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందిన రమాదేవి" సంతాప సభ" ఆదివారం నగరంలోని బోడుప్పల్ నిర్వహించారు. ఈ సభకు ఆయనతోపాటు భట్రాజు సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు దేవరాజు విష్ణువర్ధన్ రాజు, ప్రతికంఠం పూర్ణచందర్ రాజు, మేడ్చల్ జిల్లా అధ్యక్షులు కూరపాటి కరుణాకర్ రాజు, కుత్బుల్లాపూర్ సీపీఐ మండల కార్యదర్శి ఈ. ఉమమహేష్, కుల బంధువులు హాజరై ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీపీఐ పార్టీకి, భట్రాజు సంఘానికి చేసిన సేవలు గుర్తు చేసుకున్నారు. ఆమె మరణం తీరనిలోటన్నారు. ఈ కార్యక్రమంలో భట్రాజు సంఘం రాష్ట్ర ప్రతినిధులు బాపిరాజు అంబటి, రాధకిషన్ రాజు, నర్సింహారాజు అదురీ, హేమలత, మూర్తి రాజు, రమాదేవి భర్త వ్యాసభట్టు బాలరాజు, కుమారుడు వ్యాసభట్టు శ్రీధర్ కులబంధువులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి



- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి

నవతెలంగాణ-నేరేడ్‌మెట్

ప్రభుత్వం పేదల సంక్షేమం కోసం అమలు చేసే పథకాలను పేదలు సద్వినియోగం చేసుకోవాలని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన, 134, 135 డివిజన్‌లకు మంజూరైన కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్ రెడ్డితో కలిసి లబ్ధిదారుల ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలు పేదలకు ఓ వరమన్నారు. వీటిని నిరుపేదలు వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు నేమూరి శ్రీధర్ గౌడ్, వి.ఎన్. రాజు, ఢిల్లీపరమేష్, ప్రేమ్ కుమార్, కన్నా గౌడ్, సురేష్, లోకేష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

గ్లోరీ టూ జీసస్ మినిస్ట్రీస్‌ను సందర్శించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

132 - జీడిమెట్ల డివిజన్‌లో ఆదివారం వివేకానంద నగర్‌లో గల గ్లోరీ టు జీసస్ మినిస్ట్రీస్ చర్చిను ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ సందర్శించి, సెమీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కులమతాలకు అతీతంగా అన్ని వర్గాల ప్రజలు సంపూర్ణంగా మద్దతు తెలుపుతూ నిమ్న మనసుతో ఆశీర్వదించి బంపర్ మెజారిటీని అందించారన్నారు. కుత్బుల్లాపూర్ నియోజక వర్గ ప్రజల సహాయ సహకారాలు ఎప్పుడూ ఇలాగే ఉండాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్లోరీ టూ జీసస్ మినిస్ట్రీస్ చర్చి పాస్టర్ పసల అంటోనీ, సంఘ పెద్దలు మడుపు శ్యాంసుందర్, మడుపు ప్రశాంతి, పసల జోసెఫ్, డేవిడ్, యోనా, కుమార్, జోసెఫ్ తదితరులు పాల్గొన్నారు.

పదవీ విరమణ తరువాతే అసలు జీవితం మొదలవుతుంది



- 'జాతీయ ఫించనుదారుల దినోత్సవం' సందర్భంగా వక్తలు

నవతెలంగాణ-మల్కాజిగిరి

తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ (టాప్రా), మల్కాజిగిరి ఏరియా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం 'జాతీయ ఫించనుదారుల దినోత్సవం' ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ప్రత్యేక అతిథిగా విచ్చేసిన సుబర్బన్ రైల్ ప్రయాణీకుల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నూర్ మహమ్మద్ ఆలీ మాట్లాడుతూ.. తాను రైల్వేలో పదవీ విరమణ చేసిన తరువాత మల్కాజిగిరి ప్రాంత రైల్ ప్రయాణీకుల సమస్యలపై పూర్తిగా దృష్టి సారించి వారికి మరిన్ని సౌకర్యాలు కలుగజేసేందుకు కృషి చేస్తున్నానని ఇది చాలా సంతృప్తిని ఇస్తోందని, తన అసలు జీవితగమ్యం పదవీ విరమణ తరువాతే ప్రారంభమైనట్లు భావిస్తాననీ అన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన 'టాప్రా' రాష్ట్ర అధ్యక్షుడు పి. నారాయణరెడ్డి మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఫించనుదారుల సమస్యలను కావాలనే విస్మరిస్తున్నాయని, ముఖ్యంగా దేశవ్యాప్తంగా అనేక కష్టాలు పడుతున్న 75 లక్షల మంది ఈ.పీ.ఎస్. 95 పెన్షనర్లను కేంద్రప్రభుత్వం, ఈ. పీ.ఎఫ్.ఓ సంస్థలు కలసి మోసం చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. 'టాప్రా' మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి టి.బాలగంగాధరరావు సమావేశానికి అధ్యక్షత వహించి, మాట్లాడుతూ, ఉద్యోగాలనుంచి రిటైర్డ్ అయిన వారు తమ జీవితం ముగిసిందని భావించరాదని, అప్పటి నుంచే కొత్త జీవితం ప్రారంభించాలని, పదవీ విరమణ అనంతరం సామాజిక సేవలు అందిస్తున్న వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా వివిధ రంగాలలో ఉద్యోగాలు చేసి పదవీ విరమణ చేసిన, 75 సంవత్సరాల వయసు నిండిన వారిని శాలువలతో సత్కరించి జాతీయ సంపద వృద్ధిలో వారు చేసిన కృషికి నిర్వాహకులు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమానికి ఆర్మీ, బ్యాంకింగ్, కేంద్ర, రాష్ట్ర, పబ్లిక్ సెక్టార్ రంగాలలో పదవీ విరమణ చేసిన మాజీ ఉద్యోగులు అనేకులు హాజరయ్యారు. తొలుత సమావేశానికి టాప్రా మల్కాజిగిరి ఏరియా కమిటీ అధ్యక్షుడు ఆర్.అశోక్ స్వాగతం పలుకుతూ, అతిథులను, సన్మానితులను వేదికపైకి ఆహ్వానించారు. సమావేశం అనంతరం కోశాధికారి నరసింగరావు వందనసమర్పణ చేశారు.

యాదిరెడ్డి మృతి మిత్రమండలికి తీరనిలోటు



- కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి

నవతెలంగాణ-బాలానగర్

సోమనామూర్తి యాదిరెడ్డి ఓ మంచి నిష్ణాతుడు, క్రమశిక్షణ ప్రేరణ కలిగిన వ్యక్తిగా రోజు ఎంత అద్భుతంగా, స్ఫూర్తిదాయకంగా ఉండేవాడు. చాలా చిన్న వయస్సులోనే మరణించడం, ఆయన మరణ వార్త ఏంతో కాల్చివేసిందని బాలానగర్ కార్పొరేటర్ ఆవుల రవీందర్ రెడ్డి ఆదివారం తెలంగాణ గార్డెన్స్‌లో జరిగిన సంతాప సభలో ఆయన లేని లోటును పేర్కొన్నారు. ఈ సందర్భంగా స్థానిక స్నేహమిత్ర మిత్రమండాలి సంతాప సభ కార్పొరేటర్ అధ్యక్షతనలో జరిగింది. ముందుగా యాదిరెడ్డి చిత్రపటానికి స్నేహమిత్ర మిత్రమండాలి సభ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కార్పొరేటర్ మాట్లాడుతూ అందరి శ్రేయస్సు కొరకు పని చేసిన మనిషిగా యాదిరెడ్డి జీవితం సాగిందన్నారు. ఆయన మరణంతో స్నేహమిత్ర మిత్రమండలి పెద్దదిక్కుని కోల్పోయామని ఆవేదన వ్యక్తంచేశారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే ఆయనకు మనమిచ్చే నివాళులని తెలిపారు.

హ్యాట్రిక్ లీడర్ ఎమ్మెల్యేకు అభినందనల వెల్లువ..



నవతెలంగాణ-కుత్బుల్లాపూర్

కుత్బుల్లాపూర్‌లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద ముచ్చటగా మూడవసారి రాజకీయాల్లో చారిత్రాత్మకంగా భారీ మెజార్టీతో హ్యాట్రిక్ విజయం సాధించిన ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్‌కి ఆదివారం కుత్బుల్లాపూర్ నియోజక వర్గానికి చెందిన పలు కాలనీలా సంక్షేమ సంఘం నాయకులు, అభిమానులు, శ్రేయోభిలాషులు, నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం పనిచేసే నాయకుడికి ప్రజలు ఎప్పుడూ పట్టం కడతారని మరో మారు నిరూపించారన్నారు. మీరు అందించిన ఇంతటి మెజార్టీతో నూతన ఉత్తేజంతో నియోజకవర్గాన్ని మరింత వేగవంతంగా అభివృద్ధి చేస్తానన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం



నవతెలంగాణ-శామీర్‌పేట

గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం శామీర్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని అలియబాద్ చౌరస్తా కమాన్ వద్ద ఆదివారం లభ్యమైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఈ నెల 16న ఉదయం 7 గంటల ప్రాంతంలో అలియాబాద్ చౌరస్తా కమాన్ దగ్గర ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతి చెంది విగత జీవిగా పడి ఉన్నాడు. మృతదేహం గురుంచి ఎటువంటి ఆధారాలు లేవు. మృతుడు అలియాబాద్ గ్రామం చుట్టూ పక్కల ప్రాంతాలలో భిక్షాటన చేస్తుండేవాడని తెలిసింది. మృతిచెందిన వ్యక్తి వయస్సు 45 నుంచి 50 సం॥ లు ఉండవచ్చు. అతని ఎత్తు: 6 అడుగులు, బట్టలు: మాచిపోయి ఉన్నాయి. జుట్టు పిచ్చి పిచ్చిగా ఉండి, చామంచాయ రంగులో ఉన్నాడు. మృతదేహం పై ఎలాంటి గాయాలు లేవని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ హాస్పిటల్‌కి తరలించామని ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కాక్లియర్ ఇంప్లాంటేషన్ సర్జరీ ద్వారా వినికిడిని పునర్ ప్రసాదించవచ్చు...



- డాక్టర్ రావూస్ ఇఎన్టీ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీ రావు

నవతెలంగాణ-కేపీహెచ్‌బీ

ఫ్రీ ఫౌండ్ హియరింగ్ లాస్ సమస్యతో భాధపడుతున్న కాక్లియర్ ఇంప్లాంటేషన్ సర్జరీ ద్వారా వినికిడిని పునర్ ప్రసాదించవచ్చని డాక్టర్ రావూస్ ఇఎన్టీ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీ రావు అన్నారు. లోతైన వినికిడి లోపాల్ని రూపుమాపే కాక్లియర్ ఇంప్లాంటేషన్ అనే ఆధునిక శస్త్ర చికిత్స ప్రక్రియ పై ఆదివారం కేపీహెచ్‌బీలో జరిగిన అవగాహన సదస్సులో దేశ వ్యాప్తంగా ఇఎన్టీ వైద్య రంగానికి చెందిన వంద మంది ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇఎన్టీ ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ శ్రీ రావు మాట్లాడుతూ ప్రతి తల్లి తన పిల్లలు అమ్మ అని పిలిచే మొదటి మాట కోసం ఎదురు చూస్తుందని, ప్రతి తండ్రి తాను చెప్పే మాటలు పిల్లలు వినాలని కోరుకుంటారన్నారు. డాక్టర్ రావూస్ ఇఎన్టీ ఆసుపత్రిలో కొన్ని ప్రత్యేకమైన పథకాల ద్వారా ఉచిత కాక్లియర్ ఇంప్లాంటేషన్ సర్జరీస్‌ని చేయనున్నట్లు తెలిపారు.

అయ్యప్ప మహా పడిపూజ



నవతెలంగాణ-జగద్గిరిగుట్ట

గాజులరామారం డివిజన్ రావి నారాయణరెడ్డి నగర్ ఈస్ట్‌లోగల శ్రావణ్ గురు స్వామి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అయ్యప్ప మహా పడిపూజ కార్యక్రమానికి ఎమ్మెల్యే కేపీ.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శరణన్న వారిని అనునిత్యం కాపాడే దైవం ఆహరిహర సుతుడు అయ్యప్ప స్వామియేనన్నారు. ఈ కార్యక్రమంలో సోమేష్ గురుస్వామి, మురళీకృష్ణ, నారాయణ, కోటి, సూర్య, లోకేష్, తిరుపతి, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య శాఖ మంత్రిని కలిసిన కాకమాను శశిశ్రీ



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ మెడికల్ రిక్రూట్మెంట్ బోర్డ్ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శశి శ్రీ ఆదివారం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహను కలిసి పూల బొకే అందించి శుభాకాంక్షలు తెలిపారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి

నవతెలంగాణ-ఓయూ

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం రాత్రి హబ్సిగూడ డివిజన్ వెంకట్ రెడ్డి నగర్‌లో జరిగిన సత్య సాయి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ అవార్డ్స్ వార్షికోత్సవంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులకు మంచి పేరు తేవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సత్య సాయి గ్రూప్ ఆఫ్ స్కూల్స్ యాజమాన్యం గడ్డం సాయి కిరణ్, కార్పొరేటర్లు




చేతన హరీష్, బండారు శ్రీవాణి వెంకట్ రావు,బి ఆర్ ఎస్ పార్టీ డివిజన్ ప్రెసిడెంట్ డా.బివి. చారి, ఉప్పల్ ఇ న్స్పెక్టర్ శ్రవణ్ పాల్గొన్నారు.

అయ్యప్ప పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే తలసాని

నవతెలంగాణ-బేగంపేట్

అయ్యప్ప స్వామి మాలధారణ ఎంతో పవిత్రమైందని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శనివారం రాత్రి రెజిమెం టల్ బజార్‌లోని కీస్ హై స్కూల్‌లో శ్రీ ధర్మశాస్త్ర భక్తబృందం ఆధ్వర్యంలో నిర్వహించిన అయ్యప్ప స్వామి మహా పడిపూజలో ఆయన పాల్గొన్నారు. స్వామి వారికి పూజలు నిర్వహించిన అనంతరం నిర్వహకులు తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. పూజలలో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ



నియోజకవర్గ ఇంచార్జి తలసాని సాయి కిరణ్ యాదవ్, మాజీ కార్పొరేటర్ అత్తిలి అరుణ శ్రీనివాస్ గౌడ్, వెంకటనారాయణ, రాజు, చంద్ర శ్రీను, ఎర్రం శ్రీను, ప్రఫుల్, శివ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛందంగా సేవలందించడమే మా లక్ష్యం

ఫ్రెండ్స్ ఆఫ్ మాక్స్, మాక్స్ ఫౌండేషన్..

నవ తెలంగాణ-బంజారా హిల్స్

బసవతారకం ఇండో అమెరికా క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చి ఇన్స్టిట్యూట్‌లో ఫ్రెండ్స్ ఆఫ్ మాక్స్, మాక్స్ ఫౌండేషన్ వారి క్యాన్సర్ సపోర్టు గ్రూపు సమావేశాన్ని ఆదివారం బంజరాహిల్స్ లోని ఆసుపత్రి ఆడిటోరియంలో ఏర్పాటుచేసిన సమావేశానికి ఫౌండేషన్ తరపున ప్రోగ్రాం ఆఫీసర్, ఫ్రెండ్స్ ఆఫ్ మాక్స్ ఫౌండేషన్ బీనా నారాయణన్, ఎఫ్ఓఎం ట్రస్టీ, ఫ్రెండ్స్ ఆఫ్ మాక్స్ ఫౌండేషన్, హైదరాబాదు ప్రమోద్ అగర్వాల్‌లు ఆస్పత్రి తరపునుండి మెడికల్ ఆంకాలజీ విభాగపు అధిపతి డా.సెంథిల్ రాజప్పతో పాటూ వైద్యులు డా.కృష్ణ మోహన్లు పాల్గొని సీఎంఎల్ (సీఎంఎల్ క్రానిక్ మెయేలాగేనౌఎస్ లెయూకేమియా) అనే ఒకరకమైన బ్లడ్ క్యాన్సర్, గిస్ట్ (జీఐఎస్టీ గస్ట్రోఇంటెస్టినాల్ స్ట్రోమాల్ ట్యూమర్) అని పిలువబడే కడుపులోని జీర్ణ వ్యవస్థలో ఏర్పడే క్యాన్సర్ వ్యాధి గ్రస్థులైన వారితో ప్రత్యేక సమావేశంలో వారి సలహాలు సూచనలను రోగులకు తెలియజేస్తూ వారితో పాటు వారి కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యక్ష సమావేశాన్ని నిర్వహించారు. రెండు దశాబ్దాల క్రితం సీఎంఎల్, జీఐఎస్టీ క్యాన్సర్ వచ్చిన వారికి భారత దేశంలో ఎటువంటి చికిత్స లేని పరిస్థితులలో వారికి మనోధైర్యం చెప్పి అవసరమైన మందులతో స్వాంతన చేకూర్చుడానికి ఫ్రెండ్స్ ఆఫ్ మాక్స్ సంస్థ ఏర్పడింది. నాటి నుండి నేటి వరకూ సంస్థ ఎందరో రోగులకు స్వాంతన చేకూర్చడమే కాకుండా వారికవసరమైన చికిత్స అందించడంలో ఎంత గానో తోడ్పాటు అందించింది. అటు పిమ్మట ఆధునిక సాంకేతికత ద్వారా అందుబాటులోనికి వచ్చిన ఎక్కువ ధరతో కూడిన మందులను అందించడం కూడా చేస్తోంది. ఫ్రెండ్స్ ఆఫ్ మాక్స్ వారు చేస్తున్న ఈ కార్యక్రమంలో బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్ రీసెర్చి ఇన్స్టిట్యూట్ కూడా ఒక భాగస్వామిగా వ్యవహరిస్తూ రోగులకు సహాయం అందించడంలో తోడ్పాటు అందిస్తోంది. ముందుగా మెడికల్ ఆంకాలజీ విభాగపు అధిపతి డా.సెంథిల్ రాజప్ప మాట్లాడుతూ ఒకప్పుడు క్యాన్సర్ వచ్చిందంటే జీవితం ముగిసిందనే భావించే వారమని వైద్యులుగా ఉపసమనం ఎలా కలిగించాలనే ఆలోచనతో చికిత్స అందించే వారమన్నారు. అలాంటి పరిస్థితి నుండి



నేడు అందుబాటులోనికి వచ్చిన ఆధునిక వైద్య విధానాల కారణంగా పరిస్థితులలో మార్పు వచ్చిందని క్యాన్సర్ వచ్చిందంటే మరణం తథ్యమనే భావనను వదలి పెట్టి తిరిగి సాధారణ జీవనాన్ని సాగించవచ్చనే రీతిలో సాగడం సంతోషకరమైన అంశమన్నారు. అయినప్పటికీ చికిత్సను అందరికీ అందుబాటులో తీసుకొనిరావడం కొంత కష్టమైనప్పటికీ ఫ్రెండ్స్ ఆఫ్ మాక్స్ ఫౌండేషన్ లాంటి సంస్థల కారణంగా కొంత మేర అవసరమైన సహాయం అందుతోందని అభినందించారు. అనంతరం డా. కృష్ణ మోహన్, మెడికల్ ఆంకాలజిస్టు, బీఐఏసీహెచ్ ఆర్ఐ వారు మాట్లాడుతూ తమను రోగులు ఎన్ని రోజులు బ్రతుకుతామనే ప్రశ్న ఎక్కువగా వేస్తుంటారన్నారు. అయితే ఇది శాస్త్రీయ బద్ధంగా సమాధానం చెప్పలేని అంశమని అయితే పెరుగుతున్న వైద్య విజ్ఞానం లో ఎక్కువ శాతం మంది మరణాల బారిన పడకుండా కాపాడగలుగుతున్నామనే నిజాన్ని అందరూ గుర్తించాలన్నారు. అయితే అది ఖచ్చితమా అంటే అందుకు శాస్త్రీయ బద్ధంగా సమాధానమివ్వలేమని తెలిపారు. ఈ కార్యక్రమాలలో బీనా నారాయణన్, ప్రోగ్రాం ఆఫీసర్, ఫ్రెండ్స్ ఆఫ్ మాక్స్ ఫౌండేషన్ ప్రమోద్ అగర్వాల్, ఎఫ్ఓఎం ట్రస్టీ, ఫ్రెండ్స్ ఆఫ్ మాక్స్ ఫౌండేషన్, హైదరాబాదు సుధా సామినేని, ప్రోగ్రాం ఆఫీసర్, ఫ్రెండ్స్ ఆఫ్ మాక్స ఫౌండేషన్లతో పాటు మెడికల్ ఆంకాలజీ విభాగపు అధిపతి డా.సెంథిల్ రాజప్ప తో పాటూ వైద్యులు డా. కృష్ణ మోహన్, మెడికల్ ఆంకాలజిస్టులతో పాటూ మెడికల్ ఆంకాలజీ విభాగపు వైద్యులు, సిబ్బంది, రోగులు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

చేనేత అమ్మ చల్లని ఒడిలాంటిది

డాక్టర్ గూడపాటి విజయలక్ష్మి..

నవతెలంగాణ-బంజారా హిల్స్

శ్రీనగర్ కాలనీలోని శ్రీ సత్య సాయి నిగమాగమంలో ఏర్పాటైన కృతి వీవ్స్ అండ్ క్రాఫ్ట్స్ హ్యాండ్ లూమ్ వస్త్ర ప్రదర్శననూ ఆదివారం నగర సోషలైట్ డాక్టర్ గూడపాటి విజయలక్ష్మి కొలువుదీరిన చేనేత కారులు వస్త్రోత్పత్తులు తిలకిస్తూ, చేనేత కారులతో వాటి తయారీ విధానం, ప్రత్యేకత తెలుసుకుంటూ కలవడిగా తిరిగి సాంప్రదాయ ప్రకారం జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ భారతీయ సంస్కృతిలో సిల్క్, హ్యాండ్ లూమ్ వస్త్రో ఉత్పత్తులకు ఎంతో ప్రత్యేకత ఉందన్నారు. ఈ ఉత్పత్తులకు నేటికి వన్నె ఏమాత్రం తగ్గలేదని నేటి తరం యువతలో కూడా హ్యాండ్ లూమ్ ఉత్పత్తులను ఎంతో ఆదరిస్తున్నారన్నారు. చేనేత అమ్మ చల్లని ఒడిలాంటిదని హ్యాండ్ లుమ్ ఉత్పత్తుల తయారీకి చేనేత కారులు శ్రమ వెల కట్టలేనిదన్నారు. ప్రతి ఒక్కరూ చేనేతను ఆదరించాలని, అప్పుడే



చేనేత కారుల కష్టానికి తగ్గా ఫలితం పరోక్షంగా ఇవ్వగలమన్నారు. నిర్వాహకులు యలమంచిలి శ్రీలత మాట్లాడుతూ ఈ నెల 25 వరకు కొనసాగుతున్న ప్రదర్శనలో దేశం లోని 14 రాష్ట్రాల నుండి చేనేత కారులు, చేతి పని బృందాలు తమ సిల్క్ హ్యాండ్ లూమ్ చీరలు, డ్రెస్ మెటిరియల్ వంటి 75 వేల రకాల వస్త్రో ఉత్పత్తులను అందుబాటులో ఉంచారని వివరించారు. ఈ నెల 27 నుండి నిజాంపేటలో కూడా ప్రదర్శన నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ-బేగంపేట్

అభివృద్ధి పనులు అన్నింటినీ త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని మాజీమంత్రి, ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ చెప్పారు. సనత్ నగర్ నుండి మూడవ సారి భారీ మెజార్టీతో గెలుపొందిన సందర్భంగా ఆదివారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన నివాసంలో పలువురు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. గొర్రెలు, మేకల అభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ దూదిమెట్ల బాలరాజ్ యాదవ్ దంపతులు, కంటోన్మెంట్ బోర్డ్ మాజీ ఉపాధ్యక్షుడు మహేశ్వర్ రెడ్డి, లోకనాథం, అమీర్ పేట మాజీ కార్పొరేటర్ నామన శేషుకుమారి ఆధ్వర్యంలో బుద్దా నగర్‌కు చెందిన నవ్య భవాని, గిరి ప్రసాద్, సంపత్, బల్కంపేటకు చెందిన రాజు ముదిరాజ్, గురుమూర్తి నగర్ కు చెందిన శివ, వనం శ్రీను, గాయత్రి నగర్‌కు చెందిన వినోద్ తదితరులు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను శాలువాలు, పూల మాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా సీనియర్ సిటీజన్స్ పార్థసారథి, కృష్టారెడ్డి, విఠల్ రెడ్డి,



వీరారెడ్డి, అరవింద్, మోడల్ కాలనీ సీనియర్ సిటీజన్స్ జేఏసీ సాయి, వెంకటేశ్వర శర్మ, నాగమణి, సుబ్బారెడ్డి, బన్సీలాల్ పేట డివిజన్ జయప్రకాష్ నగర్, గొల్ల కొమరయ్య కాలనీలకు చెందిన కేఎం కృష్ణ ఆధ్వర్యంలో పలువురు మహిళలు తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిసి శుభాభినందనలు తెలిపారు. ఎన్నికల కోడ్ కారణంగా రోడ్లు, వాటర్ లైన్, డ్రైనేజీ లైన్ తదితర అభివృద్ధి పనులు నిలిపివేశారని, త్వరలోనే వాటిని తిరిగి చేపడతామని తెలిపారు.

హ్యాట్రిక్ సాధించిన ఎమ్మెల్యే మాగంటికి శుభాకాంక్షలు



నవతెలంగాణ-జూబ్లీహిల్స్

జూబ్లీహిల్స్ నియోజకవర్గ శాసన సభ్యులు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు మాగంటి గోపీనాథ్ ఆఫీస్‌లో రహమత్ నగర్ డివిజన్ ఇంద్ర నగర్ ఫేజ్ 2లో కాలనీ సభ్యులు ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిసి హ్యాట్రిక్ విజయం సాధించిన సందర్భంగా శుభాకాంక్షలు తెలిపారు. గత తొమ్మిది సంవత్సరాలలో ఎమ్మెల్యేగా అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేశారని, ఇంకా మిగిలి ఉన్న కొన్ని సమస్యలను కాలనీ వాసులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. ఇంద్ర నగర్ ఫేజ్ 2 లో కమిటీ హాల్, సీసీ రోడ్లు, డ్రైనేజీ పైప్ లైన్, సమస్యలు పూర్తి చేయాలని ఎమ్మెల్యేను కోరడం జరిగింది. ఈ సమస్యలు అన్ని త్వరలో పూర్తి చేస్తానని ఎమ్మెల్యే కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే కాలనీ సభ్యులకు జనవరి మొదటి వారంలో కాలనీ ఎన్నికలకు పిలుపునిచ్చారు. పోచమ్మ దేవాలయం, సాయిబాబా దేవాలయాలను, ఎండోమెంట్‌కు హ్యాండ్ ఓవర్ చేస్తానని కాలనీ సభ్యులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇంద్ర నగర్ ఫేజ్ 2 కాలనీ మాజీ అధ్యక్షుడు, టీసీ సెల్ అధ్యక్షుడు రమేష్ ముదిరాజ్, కె వెంకన్న, కె.శ్రీనివాస్, అంజయ్య, జి.నాగరాజు, రామకృష్ణ పంతులు, ఇ రాజు, యేసు రత్నం, శ్రీనివాస్ రెడ్డి, నగేష్ , జగ్గారావు, మోహన్ దాస్, రామారావు తదితరులున్నారు.

పదోన్నతుల కోసం పాకులాట

- ఒకరు హుందాతనం విస్మరించి వ్యక్తిగతంగా తీసుకున్నారు
- ఓయూ పరువు గాలికి
- ఓయూలో సీనియర్ ప్రొఫెసర్స్ పదోన్నతుల రచ్చ

నవతెలంగాణ- ఓయూ

ఓయూలో ఒక ప్రధాన అధికారి కక్షసాధింపు వైఖరితో తన వ్యక్తిగత పగను వ్యవస్థపై రుద్దటం సహచర, ఇతరుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకపోవడంతో ఓయూలో గతంలో ఎన్నడూ లేని ఒక విచిత్రమైన వాతావరణం నెలకొంది. తొలి నాళ్లలో పదవుల పంపకానికే పరిమితమైన పక్షపాత ధోరణితో తదనంతరం న్యాయంగా రావాల్సిన విద్యా విషయక పదవులు పలువురు సీనియర్ ప్రొఫెసర్స్‌కు దూరమై తాను అనుకున్న వారు జూనియర్స్ అయినా పదవులు ఇవ్వడం, వారిలో కొందరు నికచ్చేగా వ్యహరించి శత్రువుగా మారారు. తన మాట వినని, తన విధానాలపై భిన్నభిప్రాయలను వ్యక్తం చేసిన వారిని సమయం చూసి లేదా కల్పించుకొని మరీ కక్షసాధింపు చర్యలకు పాల్పడ్డారు. మరి కొంతమందిని వివిధ సందర్భాల్లో అవమానించారు. యూనివర్సిటీలో చట్టాలని నిబంధనలు తుంగలో తొక్కి తన వ్యక్తి ఇమేజ్ భవిష్యత్తు ను దృష్టిలో ప్రభుత్వం పాలకుల మెప్పుకోసం వర్సిటీ స్వయం ప్రతిపత్తిని నీరుగార్చారు.

వ్యక్తిగత కక్షసాధింపులతో దెబ్బతిన్న పరువు..

తన వ్యక్తిగత కక్షసాధింపు చర్యల్లో భాగంగానే కొంతమంది సీనియర్ ప్రొఫెసర్స్ పదోన్నతుల వేళ వివిధ రకాల సాకులతో తనకు గిట్టని వారిని గతంలో ఉన్న మనస్పర్ధలను మనస్సులో పెట్టుకొని వారికి దక్కాల్సిన పదోన్నతులకు దూరం చేసిన ఫలితమే నేడు ఓయూకు శాపంగా మారింది. సీనియర్ ప్రొఫెసర్స్ పదోన్నతుల్లో నిర్వహించాల్సింది కేవలం ఇంటరాక్షన్ మాత్రమే కానీ ఇంటర్వ్యూ కాదని, అన్ని తానై తాను అనుకున్న వారికి ఇంటరాక్షన్, గిట్టని వారికి ఇంటర్వ్యూల పేరుతో నిపుణులు ఎంపిక చేయలేదని సాకుతో పదోన్నతి కి దూరం చేస్తే, ఇంకొకరి పరిశోధన పత్రాలలో గుణాత్మకత లేదని సాకుతో అసలు ఇంటరాక్షన్‌కే పిలువకుండా చెక్ పెట్టారు. ఇంకొక ప్రొఫెసర్ విషయంలో రిపోర్టు సానుకూలంగా వచ్చినప్పటికీ దానిని పరిగణనలోకి తీసుకోకుండా మరి కొంత మంది సబ్జెక్ట్ నిపుణులకు పంపించి సదరు ప్రొఫెసర్‌ను ఎంపిక కాకుండా తన చాణక్య రాజనీతిజ్ఞతను ప్రదర్శించారని ఓయూలో బాధితుల అభిప్రాయాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రామాణిక పరిశోధన పత్రాలు కలిగి ఉన్న షెడ్యూల్ కలిగి ఉన్న షెడ్యూల్ తెగ ప్రొఫెసర్ కూడా తాను చెప్పిన మాటవినలేదని ఇంటరాక్షన్‌కే పిలవలేదని తెలిసింది. పై అంశాలు అన్ని ఒక వ్యక్తి రివెంజ్

పదోన్నతులు దక్కక పోవడంతో అసలు విషయం బయటకు

తమకు జరిగిన అన్యాయం గురించి వివిధ కారణాలతో పదోన్నతులకు దూరమైన సదరు ప్రొఫెసర్స్ కొందరు ఆర్టీఐ ద్వారా ఇంకొందరు ఆశ్రయించారు. తమకు జరిగిన అన్యాయాన్ని, పదోన్నతుల్లో జరిగిన అవకతవకలను, లభించిన ఆధారాలను నాటి ప్రభుత్వ విద్యాశాఖ మంత్రి, విద్యా శాఖ సెక్రెటరీల దృష్టికి తీసుకు వెళ్లి సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. దానికి స్పందించి విచారణ కమిటీ వేయడంతో అనర్హుల అక్రమాల డొంక కలిదింది. వాస్తవానికి వీరికి కూడా పదోన్నతులు వచ్చి ఉంటే అనర్హులు అక్రమ మార్గాన పదోన్నతి పొంది సంవత్సరాల పొడవున వీరు ఖజానాకు భారంగా మారేవారు. పగ ప్రతీకారంతో పదోన్నతులకు దూరం చేసిన సందర్భాలు లేవు. గతంలో అధికారుల మాదిరిగా సానుకూల నిర్ణయాలు తీసుకుని ఉంటే కమిటీ విచారణ వరకు వచ్చేదా ?



అంటూ కొందరు ఇంకొందరు మాత్రం విద్యార్థులు, అధ్యాపకులు, ఉద్యోగులతో నిత్యం సంఘర్షణాత్మక వైఖరియే ప్రస్తుతం ఈ పరిస్థితికి కారణం అంటున్నారు.

వ్యక్తుల ప్రయోజనం కోసం వెంపర్లు..

తమకు అన్యాయం జరిగిందని వ్యక్తిగత పదోన్నతుల కోసం వెంపర్లులాడుతున్న వీరు గతంలో ఇలాంటి సంఘటనలు జరిగినప్పుడు నిబంధనలకు విరుద్ధంగా ప్రొఫెసర్స్‌కు లబ్ది చేకూరిన వేళా కానీ జాతీయ స్థాయి పరిశోధన సంస్థల నుండి ఒకరి పరిశోధన పత్రలపై గ్రంథ చౌర్యం (ప్లాగారిజం), ఆధారాలతో నిరూపించిన నాడు ఏ ఉపాధ్యాయ సంఘం కానీ, ఉపాధ్యాయులు కానీ, నాడు స్పందించిన దాఖాలాలు లేవు. వీరికి వ్యక్తిగత ప్రయోజనాలు, ప్రమోషన్స్ పదవుల పట్ల వ్యామోహం తప్ప వర్సిటీ పరువు ప్రతిష్టాత్మక ప్రమాణాలపై ఎలాంటి చిత్తశుద్ధి లేదని నేడు ఓయూలో జరుగుతున్న ఈ సంఘటన నిరూపిస్తోంది. ఇది యూనివర్సిటీ చరిత్రలోనే ఒక మాయని మచ్చగా నిలిచిపోతుంది. ఉన్నత స్థాయిలో ఉన్న ఒకరి వ్యక్తిగత పగ ప్రతీకారంతో ఒకరు ఇంకొందరు పదోన్నతులు వెరసి ఓయూ ప్రతిష్టాత్మక గాలికి వదిలేసిన దుస్థితి. వాస్తవానికి గతంలో ఎన్నడు లేని విధంగా పలుమార్లు సీఏఎస్ ఇంటర్వ్యూలు నిర్వహించి పదోన్నతులు ఇచ్చిన ఇటీవలే నిర్వహించిన సీనియర్ ప్రొపెసర్స్ పదోన్నతుల్లో వ్యక్తిగత దూషణలు, కక్షపూరిత వ్యవహారాలు నేడు విచారణ కమిటీ వరకు వచ్చిందని అధ్యాపకులు వాపోతున్నారు. ముందుముందు కమిటీ ఏ రిపోర్టు ఇస్తోందో ఎంతమంది చర్యలు తీసుకుంటారో ఇది వర్సిటీ ప్రతిష్టాత్మకను ఎంత వరకు దిగజారుస్తుందో వేచి చూడాల్సిందే.

వైన్, పర్మిట్ షాపు తరలించాలని ధర్నా..



నవతెలంగాణ-కంటోన్మెంట్

తిరుమలగిరి ఫుట్‌బాల్ గ్రౌండ్ ఎదురుగా అంబికా వైన్స్ తొలగించాలని ఆదివారం స్థానిక పద్మనాభ, సూర్య ఏవెన్యూ, ఇండియన్ ఎయిర్లైన్స్, మలాని కాలనీ ప్రజలు అపార్టుమెంట్ వాసులు వైన్ షాప్ ముందు ధర్నా నిర్వహించారు. అంబికా వైన్స్ కొత్తగా ఏర్పాటు చేయడం వల్ల కాలనీ ప్రజలు చాలా ఇబ్బందులకు గురి అవుతు న్నారని రాత్రి 7:00 దాటిన తర్వాత కాలనీకి వెళ్లాలంటే భయ భ్రాంతులకు గురి అవుతున్నారని మహిళలు ఆవేదన చేశారు. వైన్ షాప్ నిర్వాహకులు షాప్ రోడ్డుపైన పర్మిట్ రూమ్ పక్కనే ఉన్న రెసిడెన్షియల్ కాంప్లెక్స్ సెల్లార్‌లో పెట్టారని దీనితో కాంప్లెక్స్‌లో స్థానికులు కూడా అనేక ఇబ్బందులకు గురివుతున్నారని పేర్కొన్నారు. వైన్ షాపు ను పర్మిట్ షాపును తొలగించాలని కంటోన్మెంట్ బోర్డ్ అధికారులకు ఎక్సైజ్ అధికారులకు కూడా వినతి పత్రాలు ఇచ్చిన ఫలితం కనిపించడం లేదని ధర్నా దిగాల్సి వచ్చిందని కాలనీ వాసులు మహిళలు తెలిపారు. స్థానికులు వైన్ షాప్ ఎదుట స్థానికులు ధర్నా నిర్వహిస్తుండగా తిరుమలగిరి పోలీసులు సంఘటన స్థలానికి వచ్చి ఎలాంటి సంఘటనలు జరగకుండా చూశారు. పర్మిట్ రూమ్‌కు తాళాన్ని వేయించేశారు. స్థానికులు వైన్ షాప్‌ను తొలగించాలని డిమాండ్ చేస్తూ ధర్నా నిర్వహించారు. పోలీసులు వారిని అదుపు చేశారు.

డ్రైవర్స్‌కు ఐడీ కార్డ్సు పంపిణీ

నవ తెలంగాణ-ఓయూ

హబ్సిగూడలో తెలంగాణ కారు డ్రైవర్ సంఘం హబ్సిగూడ వారి ఆధ్వర్యంలో 100 మంది డ్రైవర్ సభ్యులకు, డ్రైవర్ గుర్తింపు కార్డు టీసీడీసీ వారి అధ్యక్షులు రాములు, ఉపాధ్యక్షులు ధర్మేందర్ నాయక్(ధర్మా) చేతుల మీద కార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీసీడీసీ సభ్యులు చంద్రం, పరుశురాములు, శేఖర్, రాజు, సాంబ, పాల్గొన్నారు.



విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపేందుకు ఈ ఫేట్ - నాదిర్ చినాయ్..



నవతెలంగాణ బేగంపేట్

విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపేందుకు గాను ఈ ఫేట్ ను నిర్వహిస్తున్నట్లు సీనియర్ ట్రస్టీ నాదిర్ చినాయ్ అన్నారు. సికింద్రబాద్ పార్క్ లేన్ లో గల బాయ్ రతన్ బాయ్ జహంగీర్ జీ చినాయ్ (బీఆర్ జే సీ) పార్శీ హై స్కూల్ లో ఆదివారం విద్యార్థులు, పాఠశాల సిబ్బందిలో ఉత్సాహాన్ని, ఆటవిడుపును నింపేందుకు పార్శీ హై స్కూల్ ఆధ్వర్యంలో ప్రతి నాలుగు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే ఫేట్ ను సీనియర్ ట్రస్టీ నాదిర్ చినాయ్ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్శీ ట్రస్ట్ ఆధ్వర్యంలో నడిచే ఈ పాఠశాలలో పేదల విద్యకు ట్రస్టఎంతో ప్రాధాన్యం ఇస్తుందనీ, అలాగే విద్యార్థులను, ఉపాధ్యాయులను, సిబ్బందినీ దృష్టిలో ఉంచుకొని పాఠశాల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ విష్ణు వర్ధనాచారీ మాట్లాడుతూ పాఠశాలలో దాదాపు 1000 మంది విద్యార్థులు ఉన్నారని, ఇందులో ఎంతో మంది పేద విద్యార్థులు ఉన్నారని అలాంటి వారికి స్కాలర్షిప్ ల ద్వారా ఆర్థిక చేయూతను ఇలాంటి ఫేట్ ల ద్వారా వచ్చే ఆదాయం తోనే కాక ట్రస్ట్ నిధుల నుంచి గత విద్యా సంవత్సరానికి గాను దాదాపు పదిహేను లక్షల రూపాయలను స్కాలర్ షిప్ ల ద్వారా అందించామన్నారు. అలాగే ప్రభుత్వ సహకారం లేకుండా మేనేజ్ మెంట్ విద్యార్థులకు ఉపకార వేతనం అందించేటటువంటి ఏకైక ప్రైవేటు విద్యాసంస్థ అని తల్లిదండ్రులు కొనియాడుతున్నారన్నారు. ఫేట్ లో హూప్ల, టెయిల్ ది డాంకీ, స్కేరీ హౌజ్ లో తో పాటు ఫూడ స్టాళ్లు ఏర్పాటు చేయడం జరిగిందనీ, ఇందులో హూప్ల, స్కేరీ హౌజ్ లు ఆహుతులను విశేషంగా ఆకర్షిస్తోందన్నారు. ఫేట్ విజయవంతం కావడానికి ఎంతో కృషి చేసిన పిఆర్ఓ ఎంవివి సత్యనారాయణ, రత్నాకర్, అనహిత, ఇతర టీచర్లు, సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు.

ఇసాక హైదరాబాద్ అధ్యక్షులుగా జీసీఎస్ శర్మ

నవతెలంగాణ-బంజారా హిల్స్

ప్రతిష్టాత్మకంగా ఆదివారం హయా త్ ప్లేస్ బంజారా హిల్స్ లో జరిగిన ఇసాక హైదరాబాద్ ఎన్నికల్లో కంట్రోల్ ఎస్ డేటా సెంటర్, ప్రొక్యూర్మెంట్ డైరెక్టర్ జీసీఎస్ శర్మ ఎన్నికయ్యారు. ఇందులో ఆడిటర్లు, సైబర్‌సెక్యూరిటీ, సాఫ్ట్‌వేర్ నిపుణులతో కూడిన 1100 కంటే ఎక్కువ మంది సభ్యులతో కూడిన వీరంతా ఆయనను ఎన్నుకున్నారు. (ఐఎస్ఏసీఏ) అనేది ఒక ప్రొఫెషనల్ అసోసియేషన్, ఇది ఐటీ, గవర్నెన్స్, రిస్క్ మేనేజ్‌మెంట్, సైబర్ సెక్యూరిటీ, ఆడిట్‌పై దృష్టి కేంద్రీకరిస్తుంది. ఇసాక ప్రభుత్వ, ప్రైవేట్ రంగాలలో సమాచార సాంకేతికత, పాలన, రిస్క్ మేనేజ్‌మెంట్, సంబంధిత రంగాలలో పాల్గొన్న నిపుణుల కోసం మార్గ దర్శకత్వం, వనరులను కూడా అందిస్తుంది. ఇసక (ఇసకా) ప్రపంచవ్యాప్తంగా కాన్ఫరెన్స్‌లు, సెమినార్‌లు, ఈవెంట్‌లను నిర్వహిస్తు సమాచార వ్యవస్థలు, సైబర్‌సెక్యూరిటీ రంగాలలో ఆలోచనలు, అనుభవాలను మార్పిడి చేసుకోవ డానికి నిపుణులకు వేదికను అందిస్తుందనీ తెలిపారు.





వెస్ట్ జోన్ డీసీపీగా గత మూడు సంవత్సరాల నుండి విధులు నిర్వహిస్తున్న జోయల్ డెవిస్ ఐపీఎస్ బదిలీతో నూతనంగా విజయ్ కుమార్ ఐపీఎస్ వెస్ట్ జోన్ డీసీపీగా నియమితులైనట్లు ప్రభుత్వం నుండి ఉత్తర్వులు జారీ చేశారు.

నవతెలంగాణ-బంజారా హిల్స్

అందుకే యువతి ఫొటోలు తీసి భయపెట్టా..

నవతెలంగాణ-బంజారా హిల్స్

పుష్ప ఫేం మచ్చ అంటే స్నేహం అది చేయాలేదనీ మచ్చ అలియాస్ జగదీష్ ఓ యువతి ఆత్మహత్యకు కారణమై విషయం తెలిసిందే.. పంజాగుట్ట పోలీసులు అరెస్టు చేశారు. అతనిని రెండు రోజుల కస్టడీలోకే తీసుకొని విచారించగా గతంలో తనతో సన్నిహితంగా ఉన్న యువతి మరొకరికి దగ్గరవడం భరించలేకయదేమో కానీ ఎలాగైనా సరే మళ్లీ దారిలోకి తెచ్చుకునేందుకు ఆమె ఫొటోలు తీసి భయపెట్టానని జగదీశ్ పోలీసుల విచారణలో వెల్లడించినట్లు తెలిసింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సినిమా అవకాశాల కోసం హైదరాబాద్ కు వచ్చిన జగదీశ్‌కు అయిదేళ్ల క్రితం ఒక యువతితో పరిచయమైందనీ కొంతకాలానికి అది ప్రేమగా మారి శారీరకంగానూ మానసికంగానూ దగ్గరయ్యారు. ఈ క్రమంలో పుష్ప సినిమాతో ఒక్కసారిగా గుర్తింపు రావటంతో సినిమా అవకాశాలు పెరిగి అతని ప్రవర్తనలో మార్పుతో పాటు ఆ యువతిని కలవడానికి గానీ మాట్లాడడానికి గాని ఇష్టపడకపోవడంతో అది నచ్చని యువతి మరో యువకుడికి దగ్గరవ్వడంతో ఏదో విధంగా ఆమెను మళ్లీ దారిలోకి తెచ్చుకోవాలనుకున్న జగదీష్ దురబుద్ధి అతన్ని నేరస్తుడిగా నిలబెట్టింది. గత నెల 27న పంజాగుట్ట ఠాణా పరిధిలో నివాసం ఉంటున్న యువతి ఇంటికి వెళ్లి ఆ సమయంలో సదరు యువకుడితో ఆమె సన్నిహితంగా ఉండటం చూసి



ఫొటోలు తీశాడు.వాటిని ఆమెకు పంపి తన మాట వినకుంటే సోషల్ మీడియాలో పోస్టు చేస్తానంటూ బెదిరించాడమే కాక నేను చెప్పినట్టు వినకుంటే కథ వేరేలాగా ఉంటుందని చెప్పడంతో సదరు యువతీ భయపడి గత నెల 29న ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది.ఆమె తండ్రి ఫిర్యాదుతో దర్యాప్తు చేపట్టిన పోలీసులకు జగదీష్ నేరస్తులని తేలడం అతని అదుపులోకి తీసుకొని విచారణ చేపట్టగా నేరం చేసినట్లు అంగీకరించడంతో ఈనెల 6న అరెస్టు చేసి రిమాండ్ కు తరలించి అనంతరం కస్టడీలోకి తీసుకొని విచారించగాపై విషయాలను వెల్లడించినట్లు తెలుస్తోంది.

వ్యాయామశాలకు బండ చంద్రారెడ్డి చేయూత

నవతెలంగాణ-ఓయూ

సీతాఫల్‌మండి డివిజన్ మైలార్‌గడ్డలోని పురాతన మారుతి వ్యాయామశాలకు జిమ్ మల్టీస్టేషన్ ఎక్విప్‌మెంట్ పరికరాలను ఆదివారం బీజేపీ సీనియర్ నాయకుడు బండ చంద్రారెడ్డి వితరణగా అందజేశారు. వ్యాయామశాలలో జరిగిన కార్యక్రమంలో మల్టీస్టేషన్ ఎక్విప్‌మెంట్‌ను బండ చంద్రారెడ్డి ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతు ఎనిమిది దశాబ్దాల క్రితం ఏర్పాటైన మారుతి వ్యాయామశాల జాతీయ, రాష్ట్ర స్థాయిలో ఎంతోమంది క్రీడాకారులను



అందించిందని, వ్యాయామశాలను అన్నివిధాల అభివృద్ధి చేసేందుకు తన వంతు సాయంగా మల్టీ స్టేషన్ ఎక్విప్‌మెంట్ పరికరాన్ని వితరణగా అందించానన్నారు. మల్టీస్టేషన్ ఎక్విప్‌మెంట్‌ను అందించిన బండ చంద్రారెడ్డిని మారుతి వ్యాయామశాల నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వ్యాయామశాల డెవలప్‌మెంట్ కమిటీ ప్రతినిధులు నిర్మల్ కుమార్‌గౌడ్, జలంధర్‌రెడ్డి, శ్రీనివాస గౌడ్, టీవీ శ్రీను, లంబుకుమార్, జాషు మోజెస్, శంకరరెడ్డి, బ్యాంకు రమేష్, జ్ఞానేశ్వర్ పాల్గొన్నారు.

పేకాట అడుతున్న ఐదుగురు వ్యక్తుల అరెస్టు

నగదు స్వాధీనం



నవతెలంగాణ-బోడుప్పల్

గుట్టు చప్పుడు కాకుండా ఓ ఇంట్లో పేకాట ఆడుతుండగా స్పెషల్ ఆపరేషన్ టీం పేకాట ఆడుతున్న స్థలంపై దాడి చేసి ఐదు గురు వ్యక్తులను పట్టుకున్న సంఘటన మేడిపల్లి పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని చెంగిచెర్ల సాయిబాబా కాలనీలోని ఒక ఇంట్లో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేశారు. ఈ దాడిలో బాస్కారాల సంపత్, గుంటుకా రమేష్, చిట్టవెణి శ్రీనివాస్, గోగుల మధు, పేరిక మహేందర్ అనే ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి నుండి రూ.37 వేల నగదు, ఐదు సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం.

పల్లె పోరు జరిగేనా..?

- మంచుకొస్తున్న గడువు
- ఎన్నికల నిర్వహణపై సందిగ్ధత
- పార్లమెంట్ ఎన్నికల ముందు లేదా తరువాత అనేది తేలని వైనం



నవతెలంగాణ-వికారాబాద్ ప్రతినిధి

గ్రామ పంచాయతీ ఎన్నికలను ఇప్పట్లో నిర్వహించే పరిస్థితి కనిపించడం లేదు. ఇటీవలే కొత్త ప్రభుత్వం ఏర్పడడం, కాంగ్రెస్ ఎన్నికల్లో హామీ ఇచ్చిన ఆరు గ్యారంటీలను వంద రోజుల్లో అమలు చేస్తాననం వాటిలో రెండు పథకాలే ప్రస్తుతం ప్రారంభమయ్యాయి. మిగిలిన గ్యారంటీలను కూడా అమలు చేయాల్సి ఉంది. అవన్నీ పూర్తి చేశాక గ్రామ పంచాయతీ ఎన్నికలకు వెళ్తే కాంగ్రెస్ అభ్యర్థులకు మేలు చేకూరుతుందనే ఆలోచనల్లో ప్రభుత్వం ఉంది. మరోవైపు పార్లమెంట్ ఎన్నికలు పూర్తయ్యాక నిర్వహిస్తే బాగుంటుందని అంచనా వేస్తున్నట్టు తెలుస్తోంది. అధికారులు మాత్రం ఎన్నికలకు సంబంధించిన ఏర్పాట్లను కొనసాగిస్తున్నా ప్రభుత్వం మాత్రం అందుకు సిద్ధంగా లేనట్లుగా తెలుస్తోంది. కానీ పంచాయతీరాజ్ అధికారులు ఇప్పటికే ఎన్నికల కసరత్తు ప్రారంభించారు.

ఫిబ్రవరి 1తో కాలపరిమితి పూర్తి..

వికారాబాద్ జిల్లాలో మొత్తం 566 గ్రామపంచాయతీ ఉండగా 565 గ్రామ పంచాయతీలకు 4858 వార్డు మెంబర్లకు గ్రామ పంచాయతీ ఎన్నికలు జరిగాయి. వికారాబాద్‌లోని నారాయణపూర్ గ్రామ పంచాయతీ ఒక్కదానికే ఎన్నికలు జరగలేవు. ఇతర జిల్లాల నుంచి మరికొన్ని గ్రామపంచాయతీలో వికారాబాద్ జిల్లాలోకి రానున్నాయి. అలాగే కొత్త గ్రామ పంచాయతీల కోసం 19 గ్రామ పంచాయతీలను ప్రతిపాదనలో గత ప్రభుత్వంలో అధికారులు పంపించారు. 2024 ఫిబ్రవరి ఒకటో తేదీతో పంచాయతీ పాలకవర్గాల కాల పరిమితి పూర్తవుతుంది. నిబంధనల ప్రకారం కనీసం 15 రోజుల ముందుగానే ఎన్నికల తతంగం అంతా పూర్తి కావాలి. అంటే జనవరిలో ఈ ప్రక్రియ పూర్తి చేయాల్సి ఉంది. పైగా మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించాల్సి ఉంటుంది. ఈ లెక్కన ఇప్పటినుంచే ఆ ప్రక్రియను ప్రారంభిస్తే తప్ప జనవరి 15వ తేదీ నాటికి ఎన్నికలను పూర్తి చేసే పరిస్థితి ఉండదు. అయితే ప్రభుత్వం ఇంత వేగిరంగా గ్రామ పంచాయతీ ఎన్నికలకు వెళ్లే ఆలోచనల్లో లేనట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో పదేండ్లుగా కాంగ్రెస్ అధికారానికి దూరంగా ఉంది. గ్రామాల్లో పార్టీ శ్రేణులు చెల్లాచెదురయ్యాయి. ఈ పరిస్థితుల్లో పథకాల అమలు, పార్లమెంటు ఎన్నికలు పూర్తి చేసుకోవడం ద్వారా గ్రామాల్లోనూ పార్టీ శ్రేణులకు బలం చేకూర్చవచ్చనే ఆలోచనల్లో ఉన్నట్టు సమాచారం.

స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల పెంపు..

స్థానిక సంస్థల్లో బీసీ, ఎస్టీ రిజర్వేషన్లు పెంచాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ఉంది. 6 శాతం నుంచి 10 శాతానికి ఎస్టీ రిజర్వేషన్లను పెంచడంతో పాటు బీసీలకు కూడా స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు పెంచాలని యోచిస్తుంది..

సన్నద్ధమవుతున్న అధికారులు

ఎన్నికల సంఘం ఆదేశాలతో అధికారులు మాత్రం గ్రామ పంచాయతీల ఎన్నికల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై దృష్టి సారించారు. ప్రభుత్వం ఒకవేళ ముందుగానే ఎన్నికలు నిర్వహించాలంటే అప్పటికప్పుడు అంటే ఇబ్బందులు ఎదురవుతాయనే ఉద్దేశంతో అధికారులు ముందస్తుగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికల నిర్వహణకు ఎంత మంది సిబ్బంది అవసరం తదితర వివరాలు అన్నింటిని సిద్ధం చేస్తున్నారు.

పార్లమెంట్ ఎన్నికల తర్వాతే..!

లోక్‌సభ ఎంపీల పదవీ కాలం 2024 మేతో పూర్తి కానుంది. వాటికి సంబంధించి ఓటరు నమోదు వంటి ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమైంది. పార్లమెంట్ ఎన్నికల నాటికి ఆరు గ్యారంటీలను పూర్తి స్థాయిలో అమలు చేసే ఆలోచనల్లో రాష్ట్ర ప్రభుత్వం ఉంది. పార్లమెంట్ ఎన్నికలతరువాత పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తే విజయావకాశాలు కూడా కాంగ్రెస్‌కు ఎక్కువగా ఉండే అవకాశం ఉంటుందని ఆ పార్టీ భావిస్తున్నట్టు సమాచారం.

శంషాబాద్‌లో దారి దోపిడీ



- లారీని అడ్డగించి రూ 1,35 లక్షలతో పరారైన దుండగులు
- నిందితుల కోసం పోలీసుల గాలింపు
- కేసు నమోదు దర్యాప్తు ముమ్మరం

నవతెలంగాణ-శంషాబాద్

వాహనాన్ని అడ్డగించి బెదిరించి డబ్బులు లాక్ వెళ్ళిన ఘటన లాక్కెళ్ళిన ఘటన శంషాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం జరిగింది స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఏ.శ్రీధర్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం వనపర్తి జిల్లా క్రిష్ణగిరి గ్రామం నుంచి జె రమేష్ (35), రాములు అనే ఇద్దరు వ్యక్తులు టీఎస్ 32 టి 5986 లీల్యాండ్ వాహనంలో శంషాబాద్ వైపు వస్తున్నారు.అర్ధరాత్రి02.20గంటల సమయంలో శంషాబాద్ మండల పరిధిలోని గొల్లూరు వద్దకు చౌరస్తా వద్దకు రాగానే ముగ్గురు గుర్తు తెలియని వ్యక్తులు ఒక స్కూటీని లారీకి అడ్డం పెట్టి కత్తులతో బెదిరించి వారి వద్ద ఉన్న రూ.1.35లక్షలు బలవంతంగా తీసుకొని పరారయ్యారు. దుండగులు ముగ్గురు హిందీలో మాట్లాడుతూ ఇద్దరిని బెదిరించారు. దీంతో బాధితులు ఇద్దరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. నిందితులు పెద్ద గోల్కొండ టోల్ గేట్ వైపు వెళ్లినట్టు తెలిసింది. వెంటనే కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఘటన స్థలాన్ని ఆర్‌జీఐఏ పోలీస్ స్టేషన్ ఏసీపీ రామ్‌చందర్‌రావు, సీఐ శ్రీధర్‌కుమార్, డీఐ రాజు, ఎస్ఓటీ, సీసీఎస్ బృందాలు ఘటన స్థలాన్ని సందర్శించి దోపిడి తీరును పరిశీలించారు.

చేవెళ్ల బీజేపీ ఎంపీ సీటు

భాస్కర యోగికేనా..?

- పుష్కలంగా అధిష్టానం పెద్దల ఆశీస్సులు
- కలిసిరానున్న ఆర్ఎస్ఎస్ బ్యాక్‌గ్రౌండ్
- చేవెళ్లపై మొదటి నుంచి ప్రత్యేక దృష్టి సారిస్తున్న బీజేపీ




నవతెలంగాణ-పరిగి

పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో చేవెళ్ల పార్లమెంట్ అభ్యర్థిగా అందరికీ సుపరిచితుడు, రచయిత, వక్త, రాజకీయ విశ్లేషకులు డాక్టర్ పి. భాస్కరయోగి పేరు ప్రము ఖంగా వినిపిస్తుంది. దానికి అనుగుణంగానే చేవెళ్ల పార్లమెంట్ ఎంపీ అభ్యర్థిగా బరిలో ఉంటున్నారనే ప్రచారం జిల్లాలో విస్తృతంగా జరుగుతోంది. ఈ సందర్భంగా ఇప్పటికే పలువురు పార్టీ నాయకులు, అభిమానులు ఆయనతో చర్చిస్తున్నట్టు తెలుస్తుంది. చిన్నప్పటి నుంచి భాస్కర్ యోగి ఆర్ఎస్ఎస్ సంస్థలో ప్రముఖ పాత్రను పోషించారు. ప్రస్తుతం జాతీయ సాహిత్య పరిషత్ సంఘటన కార్యదర్శిగా వ్యవహరిస్తున్నారు. రెండు దశాబ్దాలుగా ఈ ప్రాంతం నుంచి ఆధ్యాత్మిక, సాహిత్య, సామాజిక రంగాల్లో విశేషమైన సేవలను అందిస్తూ ప్రజలకు సుపరిచితులయ్యారు. కరీంనగర్ ఎంపీ, బీజేపీ మాజీ అధ్యక్షుడు బండి సంజయ్, ఎంపీ, ఓబీసీ మోర్చా అధ్యక్షుడు డాక్టర్ కే.లక్ష్మణ్‌తో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. పరిగికి ఎప్పుడు వచ్చినా భాస్కరయోగి ఇంటికి వెళ్లడం తప్పనిసరి. దీనితో ప్రస్తుత ఎన్నికల్లో భాస్కర్ యోగి పేరు వినిపిస్తుంది.

చేవెళ్ల పార్లమెంటు పరిధిలో పరిగి, తాండూర్, వికారాబాద్, చేవెళ్ల, మహేశ్వరం, శేర్లింగంపల్లి, రాజేంద్రనగర్ నియోజకవర్గం ఉన్నాయి. ఇప్పటివరకు ఉన్నవారు ఈ ప్రాంత అభివృద్ధిపై శ్రద్ధ వహించకపోవడంతో అధిష్టానం సైతం ఈ ఎన్నికల్లో ప్రత్యేక దృష్టిని పెట్టినట్టు తెలుస్తోంది. ఆర్ఎస్ఎస్ సంఘ్ ఆశీస్సులు కూడా పుష్కలంగా లభిస్తున్నాయని బలం గా వినిపిస్తున్నాయి. దీనికి తో డు బీజేపీ అభిమానులు, కొన్ని స్వచ్ఛంద సంస్థలు, స్థానిక నా యకులు ఆయన అభ్యర్థిత్వాన్ని కోరుతున్నట్టు సమాచారం.

స్థానికతకే ప్రాధాన్యం...?

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు చెందిన బీజేపీ పార్టీ అభ్యర్థులు ఓటమి చెందారు. పార్లమెంట్ ఎన్నికల్లో స్థానికులు నిలబడితే నియోజకవర్గాల గొంతునీ బలంగా వినిపించే నాయకత్వం అవసరమన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది. దీనితో భాస్కర యోగి పేరును పరిశీలనకు తీసుకుంటున్నట్టు తెలుస్తుంది. గతంలో కాంగ్రెస్ నుంచి ప్రాతినిధ్యం వహించిన కొండ విశ్వేశ్వర్‌రెడ్డి 2019 పార్లమెంట్ ఎన్నికల్లో ఓడిపోయారు. అనంతరం కొండా విశ్వేశ్వర్‌రెడ్డి బీజేపీలో చేరారు. కానీ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో పెద్దగా ప్రచారం చేయలేదు. బీజేపీ అభ్యర్థులు ఘోర పరాజయం పాలవడంతో పార్టీలో అంతర్మధనం ప్రారంభమైంది. ఈ సారి ఎలాగైనా చేవెళ్ల పార్లమెంట్‌లో పాగా వేయాలని బీజేపీ అధినాయకత్వం ముమ్మర కసరత్తు చేస్తుంది. అందులో భాగంగానే వికారాబాద్ జిల్లా పరిగి ప్రాంతానికి చెందిన భాస్కరయోగి పేరు చర్చిస్తున్నట్టు సమాచారం. దీనితో కొందరు స్థానిక నాయకులు ఈసారి ఎంపీ టికెట్ భాస్కర్‌యోగికి వస్తుందని సోషల్ మీడియాలో బహిరంగంగానే పోస్టులు పెడుతూ ప్రచారం చేస్తున్నారు.



వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- వాహనాల వేగం తగ్గించేందుకు స్టాపర్ల ఏర్పాటు
- తాండూరు పట్టణ సీఐ రాజేందర్‌రెడ్డి



నవతెలంగాణ-తాండూరు

వాహనాదారులందరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని తాండూరు పట్టణ సీఐ రాజేందర్‌రెడ్డి సూచించారు. ఆదివారం తాండూర్ పట్టణ కేంద్రంలోని వివిధ రూట్లల్లో వాహనాల వేగాలను తగ్గిం చేందుకు స్టాపర్లను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాండూర్ పట్టణంలోకి వచ్చేటటువంటి భారీ వాహనాలు అతివేగంగా రాకుండా ఉండేం దుకు బస్టాండ్ వద్ద, మల్లప్ప జంక్షన్ వద్ద, రాయల్ కంట వద్ద జిగ్ జాగ్ పద్ధతిలో స్టాపర్లను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. వాటి వలన పట్టణంలోకి వచ్చే భారీ వాహనాలు వాటి వేగాన్ని నియంత్రించి ప్రమాదాలు జరగకుండా చూసేందుకు ఏర్పాటు చేశామ న్నారు. వాహనదారులు రాంగ్ రూట్‌లో పోకుండా ట్రాఫిక్ నియమాలు పాటించాలన్నారు. తాండూరు పట్టణ ఎస్ఐ అబ్దుల్ రావుఫ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి కొండ సురేఖను కలిసిన అర్చక ఉద్యోగులు



నవతెలంగాణ-సుల్తాన్‌బజార్

దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను దేవాదాయశాఖ అర్చక, ఉద్యోగుల సంఘం జేఏసీ చైర్మెన్ గంగు ఉపేంద్ర శర్మ అధ్యక్షులు చింతపట్ల బద్రీనాథ్‌చార్యులు, సిహెచ్ రంగా చార్యులు, కన్వీనర్ రవీంద్ర ఆచార్యులు, వర్కింగ్ ప్రెసిడెంట్ అగ్నిహోత్ర చంద్రశేఖరశర్మ రత్నాకర్‌రావు, కాండూరి కృష్ణమాచారి, గ్రేటర్ అధ్యక్షులు బండారి జగపతి, మహేష్‌శర్మ జి. శ్రీనివాసచార్యులు ఆమె నివాసంలో కలిసి శుభాకాంక్షలు తెలిపి, శుభాభినందనలు తెలియజేస్తూ వేద ఆశీర్వచనము తెలిపారు.

యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలి

కీసర ఎస్ఐ రాజశేఖర్



నవతెలంగాణ-కీసర

యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని కీసర ఎస్ఐ రాజశేఖర్ అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని రాంపల్లిలో ఎస్ఐ రాజశేఖర్, వెంకటేష్‌లు యువతను ఉద్దేశించి మాట్లాడుతూయువత డ్రగ్స్, గంజాయికి, అలవాటు పడుద్దని వారి జీవితాలు నాశనం చేసుకోవద్దన్నారు. అనంతరం వాటి పైన యువతకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో బందెలా పరమేష్, మీసాల సురేష్, మీసాలఅనిల్ తదితరులు పాల్గొన్నారు.

రామ్‌కోఠి త్యాగరాజ ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో

కథక్ నృత్య విద్యార్థులకు ఇబ్బందులు

- కథక్ నృత్య గురువు 3 నెలలుగా గైర్హాజరు
- అయినా జీతం కోసం పైరవీలు?



నవతెలంగాణ-సుల్తాన్ బజార్

రామ్‌కోఠి త్యాగరాజ ప్రభుత్వ సంగీత నృత్య కళాశాలలో కథక్ నృత్య గురువు సక్రమంగా విధులకు రాకుండా, విద్యార్థుల బోధనసుగాలి కొదిలి జీతం కోసం పైరవీకి తెర లేపినట్లు పలువురు విద్యార్థులు తెలిపినట్లు శ్వసనీయ సమాచారం. విధులకు గైర్హాజర్ అయినప్పటికీ తనకు జీతం చెల్లించాల్సిందేనని కథక్ గురువు రాఘవరాజ్ భట్ అధికారులపై ఒత్తిడి తెస్తు న్నట్లు, ఇందుకు గాను సదరు గురువు మంత్రుల పేషీ నుండి అధికారులకు ఫోన్ చేయించి, జీతం చెల్లించాలని హుకుం జారీ చేస్తున్నట్లు సమాచారం. అయితే విధులకు హాజరు కాకుండా జీతాల చెల్లింపు నిబంధనలకు విరుద్ధం కావడంతో ఉన్నతాధికారులు సైతం తమ చేతిలో ఏమీ లేదని చెప్పి చేతులె త్తేసినట్లు పలువురు తెలిపినట్లు తెలిసింది. మంత్రుల పీఏలతో ఉన్నతా ధికారులకు ఫోన్ చేయించి ఒత్తిడి తేవడంతో పాటు సంగీత కళాశాల సిబ్బందికి ఫోన్ చేసి తనకు జీతం చెల్లించేలా చూడాలని, లేని పక్షంలో మీసంగతి చూస్తానంటూ బెదిరింపులకు పాల్పడినట్లు విశ్వసనీయంగా సమాచారం అందించినట్లు తెలిపారు. గతంలో విధులకు హాజరు కాకున్నా తనకు తానే సర్టిఫికెట్ ఇచ్చుకొని మూడున్నర లక్షలు తన ఖాతాలో వేసుకున్నట్లు ఈ విషయం బయటకు వచ్చినట్లు సమాచారం. ఈ విషయాలన్నిటిపై సంగీత, నృత్య కళాశాల ప్రిన్సిపల్ పాండురంగ ముతాలిక్ వివరణ అడిగేందుకు ఫోన్ సంప్రదించగా ఆయన అందుబాటులోకి రాలేదని తెలిపారు.

ప్రజలు, పేషెంట్లకు నాణ్యమైన మందులు అందేలా చూడాలి

- తెలంగాణ ఫార్మా సొసైటీ అధ్యక్షులు ఆకుల సంజయ్‌రెడ్డి



నవతెలంగాణ-సిటీబ్యూరో

రాష్ట్రంలోని ప్రజలు, పేషెంట్లకు నాణ్యమైన మందులు అందేలా చూడాలని తెలంగాణ ఫార్మా సొసైటీ అధ్యక్షులు ఆకుల సంజయ్‌రెడ్డి కోరారు. మెడికల్ షాపుల్లో జరుగుతున్న అవకతవకలపై ఆయన రాష్ట్ర డ్రగ్స్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్ కమలాసన్‌రెడ్డికి ఆయన పేషీలో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా సంజయ్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజారోగ్య సంక్షేమ శంఖారావం పూరిస్తున్నట్టు తెలిపారు. ఆరోగ్య తెలంగాణే లక్ష్యంగా రాష్ట్రంలోని ప్రజలు, పేషెంట్లకు నాణ్యమైన మందులను మెడికల్ షాపుల్లో ఉన్న క్వాలిఫైడ్ రిజిస్టర్ ఫార్మాసిస్టుల ద్వారానే అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యమానికి పూనుకున్నట్టు తెలిపారు. మందుల ద్వారా ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ రావొద్దనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. రాష్ట్ర ప్రజలకు, ఫార్మసీలను నడుపుతున్న ట్రేడర్స్‌కు అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. కొన్ని మెడికల్ షాపుల్లో ఫార్మసిస్టులు లేకటెన్త్, ఇంటర్ చదివిన వారిలో మందులు విక్రయింపజేస్తున్నారని తెలిపారు. ఇలాంటి విషయాలపై డీజీ కమలాసన్‌రెడ్డికి ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. హైదరాబాద్‌లో ఉన్న కొన్ని ఫార్మసీలు డ్రగ్స్ అండ్ కాస్మోటిక్ యాక్ట్ 1940, రూల్స్ 1945, సెక్షన్ 65 (టు), ఫార్మసీ యాక్ట్ 1948 సెక్షన్ 42 ప్రకారం ప్రజలకు ఫార్మసిస్టుల ద్వారానే నాణ్యమైన మందులు అమ్మేలా చూడాలని కోరారు. టెన్త్, ఇంటర్ చదివిన వారు మెడికల్ షాపుల్లో మందులు ఇస్తే అది చట్ట రీత్యా నేరం అని, దీనికి రూ.2 నుంచి 5 లక్షల వరకు జరిమానా ఉంటుదని, ఆ తర్వాత 6 నెలల జైలు శిక్ష ఉంటుందని తెలిపారు. తెలియక ఒక మెడిసిన్ కాకుండా మరో మెడిసిన్ ఇవ్వడం ద్వారా కిడ్నీ, లివర్ డ్యామేజ్ అయ్యే అవకాశం ఉందని, కొన్ని సందర్భాల్లో చనిపోయే అవకాశం కూడా ఉంటుందని పేర్కొన్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రజలకు నాణ్యమైన మందులు అందించాలని ఉద్దేశంతో తెలంగాణ ఫార్మా సొసైటీ ప్రజలు, మెడికల్ షాపుల వారికి అవగాహన ఏర్పరుస్తున్నట్టు తెలిపారు. కొందరు చనిపోయిన ఫార్మసిస్టుల పేరు మీద కూడా మెడికల్ షాపులను రన్ చేస్తున్నారని, అలాంటి వారిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు.

'2వ సయ్యద్ యూసుఫ్ ఆలీ రెజ్లింగ్ ఛాంపియన్ షిప్ ప్రారంభం



నవతెలంగాణ-హిమాయత్ నగర్

సయ్యద్‌యూసుఫ్ ఆలీ పహిల్వాన్ జ్ఞాపకార్థంగా 22, 23, 24వ తేదీలలో ఉద యం 10 గంటల నుంచి 2 గంటల వరకు 2వ సయ్యద్ యూసుఫ్ ఆలీ రెజ్లింగ్ ఛాంపియన్ షిప్-2023 పోటీలను హైదరాబాద్, మల్లేపల్లిలోని ఫణిగ్రౌండ్‌లో నిర్వహించనున్నట్లు ఛాం పియన్ షిప్ నిర్వాకులు, సయ్యద్ ఆజామ్ పహిల్వాన్, హై దరాబాద్ అమేచ్యూర్ రెజ్లింగ్ అసో సియేషన్ ప్రతినిధులు శైలేందర్ సింగ్, కిరణ్‌యాదవ్, నాజర్ కోలాకి, మహ మ్మద్ అస్లామ్ తెలి పారు. ఆదివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్‌కు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ 2వ రెజ్లింగ్ ఛాంపియన్ షిప్ పోటీల్లో జూనియర్ విభాగంలో 35 కేజీల నుంచి 46 కేజీల బరువు, సీనియర్ విభాగంలో 50 కేజీల నుంచి 96 ప్లస్ సూపర్ హెవీటైటిల్ వెయిట్ గల పోటీలు కొనసాగుతాయన్నారు. ఈ రెజ్లింగ్ పోటీల్లో గెలు పొందిన పహిల్వాన్లకు యూసుఫ్ ఆలీకేసరి టైటిల్ 75 నుంచి 100 కేజీల విభాగంలో మొదటి బహుమతి, బాల్ జూనియర్ కేసరి 55 నుంచి 60 కేజీల విభాగంలో రెండ వ, మూడవ బహుమతులుగా ట్రాక్ సూట్, మెడల్, సర్టిఫి కెట్, ట్రోఫీ, కిట్ బ్యాగ్, కాస్ట్యూమ్స్‌లను అందజేయనున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్యే ముఠా గోపాల్‌కు సన్మానం



నవతెలంగాణ-ముషీరాబాద్

ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ముషీరాబాద్ నియోజకవర్గం నుంచి బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా భారీ మెజారిటీతో విజయం సాధించిన ఎమ్మెల్యే ముఠా గోపాల్, సరోజ దంపతులనును బీసీ సంక్షేమ సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షులు మాదేశి రాజేందర్, కళావతి, ముషీరాబాద్ నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు మమతా నరేందర్‌లు ఎమ్మెల్యేను తన నివాసంలో కలిసి ఘనంగా సన్మానించారు. బీసీలఓట్లతోనే భారీ మెజారిటీతో విజయం సాధించామని తెలిపారు.

సైన్స్‌పై జరుగుతున్న దాడికి వ్యతిరేకంగా

రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమించాలి





- జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోయ వెంకటేశ్వరరావు

నవతెలంగాణ-ముషీరాబాద్

సైన్స్ పై జరుగుతున్న దాడికి వ్యతిరేకంగా రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమించాలి అని జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు ప్రొఫెసర్ కోయ వెంకటేశ్వరరావు అన్నారు. జన విజ్ఞానవేదిక రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రెండు రోజులపాటు జరిగిన జాతీయ శాస్త్రీయ ప్రచార ఉద్యమం వర్క్ షాప్ విజయవంతంగా ముగిసింది. ఈ వర్క్‌షాప్‌లో చివరి రోజు మిరాకిల్ ఎక్స్ క్లోజర్, సోషల్ మీడియాలో శాస్త్రప్రచారం, సైన్స్ కార్నివాల్, సైన్స్ - సాహిత్యం అంశాలపై వర్క్ షాప్‌లో సమగ్రమైన ప్రణాళిక ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా జన విజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షుడు కోయ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ. రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాలలోసైన్స్ అవేర్నెస్ కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. మారుతున్న సమాజంలో విద్యార్థులకు ప్రజలకు సైన్స్ పట్ల ప్రత్యేక అవగాహన కల్పించాలన్నారు. శాస్త్రీయ దృక్పథంతో ఏదైనా సాధించవచ్చు అని తెలిపారు. ప్రస్తుత సమాజంలో సైన్స్ పట్ల దాడులు జరుగుతున్నాయని అన్నారు. సైన్స్‌పై జరుగుతున్న దాడికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమి ంచాలని పిలుపునిచ్చారు. ప్రజల్లో మూఢనమ్మకాలను రూపుమాపాలన్నారు. ఈ కార్యక్రమంలో జనవిజ్ఞావేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనాథ్, కార్యదర్శిరాజా, ట్రెజరర్‌రావుల వరప్రసాద్, నాయకులు చెలిమెల రాజేశ్వరరావు, లింగస్వామి ఆల్తాఫ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులందరికి ఉచిత బస్‌పాస్ ఇవ్వాలి



- ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) డిమాండ్
- ఆర్టీసీ యమ్ డి.సజ్జనార్‌కు వినతిపత్రం

నవతెలంగాణ-ముషీరాబాద్

విద్యార్థులందరికి ఉచిత బస్‌పాస్ ఇవ్వాలని ప్రగతి శీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షులు పి.మహేష్ డిమాండ్ చేశారు. గ్రేటర్ హైదరాబాద్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఆర్టీసీ యమ్‌డి. సజ్జనార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూరాష్ట్ర అధ్యక్షులు పి.మహేష్, గ్రేటర్ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు గడ్డం శ్యామ్, కంచనపల్లి శ్రీను మాట్లాడుతూ. వందల మంది విద్యార్థుల ఆత్మ బలిదానాల మీద ఏర్పడిన గత ప్రభుత్వం నిరుద్యోగులకు, విద్యార్థులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోగా, విద్యార్థుల బస్ పాసుల రుసుమును అమాంతం పెంచడం వలన విద్యార్థుల నెలసరి వ్యయం పెరిగిందన్నారు. దీనివలన విద్యార్థులు పార్ట్ టైమ్ ఉద్యోగులుగా మారుతున్నారు. బస్ పాస్ గ్రామీణ, మధ్యతరగతి విద్యార్థులకి దీర్ఘకాలిక సమస్య గా మారింది అని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులు విద్యకు దూరం అవుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం విద్యార్థులకు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమై తన పతనానికి తానే కారణమైంది. కొత్తగా ఏర్పటైనా ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మహిళలకు ఉచిత ప్రయాణం ఇవ్వడం మంచి పరిణామమే. దీనితో పాటు విద్యార్థులందరికి ఎలాంటి లింగబేధం లేకుండా ఉచిత బస్ పాసులు ఇవ్వాలని, అలాగే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో విద్యార్థులకి, నిరుద్యోగులకి ఇచ్చిన హామీలన్నీ హమలు పర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శి గౌతమ్, నాయకులు ఆసిఫ్, గణేష్, జీవన్ తదితరులు పాల్గొన్నారు.

'నారానాగేశ్వర్ రావుకు డాక్టరేట్'

నవతెలంగాణ-హిమాయత్ నగర్



తెలంగాణ రాష్ట్ర వికలాంగుల సలహా మండలి సభ్యులైన నారానాగేశ్వర్‌రావు గతంలో దివ్యాంగులు, బాలలకు, యువజనులకు సామాజిక సేవలందించినందుకు నాలుగు జాతీయ స్థాయిలో అవార్డులను అందుకున్నారు. నారానాగేశ్వర్ రావు గతంలో వికలాంగుల హక్కుల చట్టం-2016, రాష్ట్ర స్థాయి నియమావళి రూపకల్పన సభ్యులుగా, వివిధ శాఖలలో 4 శాతం రిజర్వ్ చేయబడిన వికలాంగులు సులువుగా చేయగలిగే ఉద్యోగాల గుర్తింపు సభ్యుడిగా, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా బాలల పరిరక్షణ సభ్యుడిగా పని చేశారు. నాగేశ్వర్‌రావు ఉస్మానియా విశ్వ విద్యాలయం నుండి మేనేజ్ మెంట్ విభా గంలో డాక్టరేట్ అందుకున్నారు. మేనేజ్ మెంట్ విభా గంలో సహ ఆచార్యులైన డాక్టర్ జి.విద్యాసాగర్ రావు పర్యవేక్షణలో "దివ్యాంగుల సాధికారత-కార్పోరేట్ సామాజిక బాధ్యత ఎంచుకున్న కొన్ని కంపెనీలపై పరిశోధన" అనే అంశంపై పరి శోధన పూర్తి చేశారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి డాక్టర్ డి.అన సూయ సీతక్క, ప్రొఫెసర్ డి.రవీందర్, వెను కబడిన తరగతుల ప్రిన్సిపాల్ సెక్రటరీ బుర్ర వెంకటేశం (ఐఏఎస్), రాష్ట్ర వికలాంగుల కమి షనర్ శైలజ, కర్ణాటక రాష్ట్ర ఆదాయపు పన్ను శాఖ కమిషనర్ ఎం.సతీష్ తదితర ప్రముఖుల చేతుల మీదుగా అవార్డులను అందుకున్నట్లు నాగేశ్వర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు.

మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాలి



- కాసుల వినోద్

నవతెలంగాణ-అంబర్‌పేట

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను, భారతీయ వారసత్వ సంపదను భావితరాలకు అందించాల్సిన అవసరం మనందరిపై ఉందని శ్రీవీరభద్ర స్వామి సేవా సమితి ప్రధానకార్యదర్శి కాసులవినోద్ అన్నారు. ఆదివారం నింబోలి అడ్డలో జరిగిన కార్యక్రమంలో శ్రీ వీరభద్రస్వామి సేవా సమితి ఆధ్వర్యంలో ఈ నెల 18న సోమవారం ఉదయం 9 గంటలకు కర్మన్‌ఘాట్ ఏపీఆర్ గార్డెన్స్‌లో జరగనున్న భద్రకాళి సమేత వీరభద్రస్వామి కల్యాణ మహో త్సవ వేడుకల ఆహ్వాన పత్రికలను భక్తులకు అం దజేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మహబూబ్నగర్ జిల్లా కురవికి వెళ్లి వీరభద్రస్వామి కల్యా ణాన్ని చూడలేక పోయిన భక్తులు ఈ కల్యాణ వేడుకల్లో పాల్గొనడానికి మంచి అవకాశం అని అన్నారు. కార్యక్రమంలో అద్దోజు చక్రపాణి, ఆర్థోజు ప్రకాష్, మధుసూదన్‌చారి,మాధవ్‌చారి, టి.భాస్కర్‌రాజ్ గౌడ్, రాజేష్‌కుమార్,బి.ఉపేందర్, టి.శ్రీనివాస్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి ఎన్‌సీఏ కృషి



నవతెలంగాణ-అంబర్‌పేట

సమస్యల పరిష్కారానికి ఐక్యంగా అందరు ముందుకు రావాలని రిటైర్డ్ ఎలక్షన్ కమిషన్ ఆఫీసర్, ఎన్‌సీఏ ఆదివారం క్షత్రియ టవర్స్‌లో భవానీ రామశంకర్ అధ్యక్షతన నల్లకుంట సిటిజన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ నాయుడు మాట్లాడుతూ నల్లకుంటలో స్థానిక సమస్యల పరిష్కారం కోసం స్థానికులందరూ కలిసి రావాలని, దాంతో సమస్యలు పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తుందని తెలిపారు. ఎన్‌సీఏ అధ్యక్షులు మోహన్‌రావు మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి మంచి కృషి చేస్తున్నారని, మరింత కృషి చేయాలని అన్నారు. ఎన్సీఏ ఉపాధ్యక్షులు రాజీవ్ మాట్లాడుతూ అసోసి యేషన్ పని వివరిస్తూ, సూచనలు చేశారు. రిటైర్డ్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్, వాకర్స్ క్లబ్ ఇంటర్నేషనల్ డిస్టిక్ గవర్నర్ వి.మోహన్ రావు అధ్యక్షులుగా, ప్రధాన కార్యదర్శిగా మోహన్ నాయుడు, కోశాధికారిగా శ్రీనివాసరావు, నిర్వహణ కార్యదర్శిగా వీరయ్య మరోసారి నూతన కమిటీని ఎన్నుకున్నారు. సలహాదారులుగా రామకృష్ణారావు సీతః రిటైర్డ్, రమేష్ నాయుడు రిటైర్డ్ ఎలక్షన్ కమిషన్ ఆఫీసర్, డాక్టర్ జయసూర్య పర్యావరణవేత్త, కొండారెడ్డి బార్ కౌన్సిల్ సభ్యులు ఎన్నికయ్యారు. వినోద్ నాయుడు, కృష్ణ బాబు, సువాస్, నందకుమార్, కిషన్‌రావు, సాంబయ్య లతో పాటు 9 మంది ఉపాధ్యక్షులుగా, 6 మంది సహాయ కార్యదర్శులుగా, 12 మంది కమిటీ సభ్యులను ఎన్నికయ్యారు.

పర్యావరణ భావజాలం అందరిలో పెరగాలి



కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి

నవతెలంగాణ-అంబర్‌పేట

మానవ తప్పిదాలతో సమాజం ప్రమాదంలో పడే పరిస్థితి వచ్చిందని, భావితరాల మను గడకోసం ప్రతి ఒక్కరూ విధిగా పర్యావరణ భావజాలాన్ని అలవర్చుకోవాలని కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. ఆదివారం బర్కత్ పురాలోని తన నివాసంలో ప్రముఖ పర్యావరణ పరి రక్షణ ఉద్యమ సంస్థ "ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్ " ఆధ్వర్యంలో రూపుదాల్చిన 'ఎన్విరాన్మెంట్ యాక్టివిస్ట్'అనే మాసపత్రికను కిషన్‌రెడ్డి ఆవిష్కరించారు. పర్యావరణ భావ జాలంతో ఒక ప్రత్యేక మాసపత్రికను తీసుకురావడం అభినందనీయమని ఈ సందర్భంగా పత్రి క సంపాదకులు, ఎన్విరాన్మెంట్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షులు రంగయ్యను కేంద్ర మంత్రి అభి నందించారు. పర్యావరణాన్ని ఇబ్బందులకు గురి చేసే ప్రతి అంశం మీద తమ సంస్థ పోరాట పంథాలో ముందుకు సాగుతోందని, దాంతోపాటు పర్యావరణ స్పృహ జనంలో మరింత తీసుకు వచ్చేందుకు కృషి చేస్తున్నట్లు ఈ సందర్భంగా రంగయ్య మంత్రికి వివరించారు. ఈ కార్యక్ర మంలో నాయకులు తిరుపతి గుప్తా, వెంకటేశ్ సీనియర్ పాత్రికేయులు సతీష్, రవి పాల్గొన్నారు.

బొడ్డు వెంకటేశ్వరరావు జన్మదిన వేడుకలు





- ముఖ్యఅతిథి ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

నవతెలంగాణ-దుండిగల్

కుత్బుల్లాపూర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ బొడ్డు వెంకటేశ్వరరావు 71 వ జన్మదిన వేడుకలు ఆదివారం దుండిగల్‌లో నూతనంగా నిర్మిస్తున్న గ్రీన్ మెట్రో సైట్‌లో కుటుంబ సభ్యుల, బంధువుల, స్నేహితుల మధ్య కోలాహలంగా ఘనంగా నిర్వహించారు. ఈ జన్మదిన వేడుకలకు కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ గౌడ్ హాజరై పుష్పగుచ్ఛం అందించి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వారితో అనుబంధం గత 20 సంవత్సరా లుగా కొనసాగుతుందని, తమ తండ్రితో బొడ్డు వెంకటేశ్వరరావు అనుబంధం ఎనలేనిదని గుర్తు చేశారు. ఈ వయసులో కూడా ఆరోగ్యంగా ఉంటూ అందరికి ఆదర్శంగా నిలుస్తున్నారన్నరు, ప్రతిక్షణం కష్టపడే తత్వాన్ని అలవర్చుకున్న వ్యక్తి అని పేర్కొన్నారు. ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకోవాలని కోరారు. గత ఎన్నికల్లో తమకు తోడుగా ఉండి భారీ విజయాన్ని సాధించడానికి వారి కృషి ఎంతో ఉందని తెలిపారు.

ఎమ్మెల్యేను సన్మానించిన బొడ్డు

శాసనసభ ఎన్నికల్లో రాష్ట్రంలోనె అత్యధికంగా 85 వేలకు పైగా మెజార్టీతో మూడోసారి హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గెలుపొందిన వివేకానంద్‌ను బొడ్డు వెంకటేశ్వరరావు పుష్పగుచ్ఛం అందించి గజ పూలమాలతో సత్కరించా రు. ఈ కార్యక్రమంలో నిజాంపేట్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు కొలను గోపాల్ రెడ్డి, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేటర్ ఆగం రాజు ముదిరాజ్, దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్, శంభీపూర్ కృష్ణ, బండారి మహేందర్ యాదవ్, దుండిగల్ మున్సిపల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సంజీవరెడ్డి, మేకల వెంకటేష్, బొడ్డు అశోక్, బొడ్డు రవి, బొడ్డు సురేష్ చంద్ర, గణేష్ నగర్ కాలనీ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అమ్మలకు అమ్మలా ...



అమ్మ
అంటే మన దృష్టిలో సూపర్ హీరో! ఇంట్లో అందరూ అన్నిటికీ అమ్మ మీద ఆధార పడుతూ ఉంటాం. మన అవసరాలు చెప్పాల్సిన పని లేదు. తనకు బాధ్యత గుర్తుచేసే అవకాశం మనకు రాదు. అమ్మకు అన్నీ తెలిసే ఉండాలి. అమ్మ తప్పు చేయదు. చేసే అవకాశం కూడా ఇవ్వస్త్ర. ఒకవేళ మనం తప్పు చేసినా అమ్మ చెయ్యకూడదు. అమ్మకు అలసట ఉండకూడదు. అనారోగ్యం ఉండకూడదు. అసహనం ఉండకూడదు. బాధలు కూడా ఏమీ పెద్దగా ఉండవు. ఎందుకంటే ఇంటిని చూసుకోవడం తప్ప ఇంకేం పని ఉందని తనకు? ఉద్యోగం తనకు తానుగా ఎంచుకున్నది. అందులో సాధకబాధకాలు కూడా తనే పడాలి. ఇల్లు కాకుండా అసలు అమ్మకంటూ వేరే ప్రపంచం ఎందుకు? ఇదీ మన సమాజం తీరు!


అమ్మ అంటే పరిపూర్ణత్వం అనే అపోహలో ఆమెపై ఈ సమాజం ఎంత ఒత్తిడి తీసుకొస్తోందో కేవలం ఆమెకే ఎరుక. ప్రేమను పరిపూర్ణంగా ఇవ్వగలదు గానీ కుటుంబమంతా తన పనిలో ఆశిస్తున్న పరిపూర్ణతను ఎలా సాధించాలో ఇంకా తెలియట్లేదు. అందుకే అందరితో మాట పడుతూ, మౌనం వహిస్తూ, కుంగుబాటుతో తన అస్థిత్వాన్ని ఎప్పుడో మరిచిపోయింది. మర బొమ్మలా మన అవసరాలు తీరుస్తోంది. కానీ అమ్మకూ మనసుంటుంది కదా! ఆ మనసుకు ఇలాంటి జీవితం నచ్చక కుంగిపోతోంది. ఫలితంగా అమ్మను అనేక శారీరిక, మానసిక రోగాలకు గురిచేస్తోంది. కుటుంబ వ్యవస్థలో పునాదులు కదిలిపోతే అంతస్తులు నేలకొరగడం ఎంత సేపు? ప్రస్తుతం మన కుటుంబ వ్యవస్థ ఇలాగే ఉంది.

అమ్మ ఎవరికి చెప్పుకోవాలి

మనిషి సంఘ జీవి. పోటీ ప్రపంచంలో ఎంత పరుగు పెడుతున్నా, కష్టం వచ్చేసరికి మన కండ్లు సాటి మనిషినే వెతుకుతాయి. వాళ్ళ ఓదార్పు మనకు ఆ సమయంలో ఎంతో గొప్పగా అనిపిస్తుంది. మరి అమ్మ కూడా మనిషే కదా? ఆమె తన కష్టాలను, బాధలను, సందేహాలను, సవాళ్ళను ఎవరితో పంచుకుంటుంది? ఇంట్లో చెబితే ఇదీ ఒక కష్టమేనా అంటారేమో అని భయం. పక్కింటి వాళ్లకు చెబితే ఊరంతా పాకుతుందని అనుమానం. అమ్మానాన్నలకు చెప్పి బాధ పెట్టడం ఎందుకులే అనే ఆలోచన. మరెక్కడ చెప్పుకోవాలి? అమ్మ గురించి ఇదంతా ఎవరు ఆలోచించగలరు? మరో అమ్మ మనసు మాత్రమే దీన్ని ఆలోచించింది. ఆ అమ్మే 'ప్రదీప్తి విస్సంశెట్టి'. ఆలోచన రావటం కన్నా ఆచరణ చాలా కష్టం. మీకేం సమస్యలున్నాయని ఎదుటివారిని అడగటం సంస్కారం కాదని ఆమెకు తెలుసు. అందుకే నెట్టింట్లో నేటి సమస్యలకు పరిష్కారం చూపాలనుకుంది. అమ్మలకు అండగా తన వంతుగా ఫేస్బుక్లో 'తెలుగు మామ్స్ నెట్వర్క్' అనే గ్రూపును సెప్టెంబర్ 4, 2019లో ప్రారంభించింది. మొదట్లో వందల్లో ఉన్న గ్రూపు సభ్యుల సంఖ్య నేడు ముప్పయి వేల పై చిలుకుకు చేరింది. అంటే ఎంత మంది అమ్మలకు సలహాలు, సహాయాలు అవసరమవుతున్నాయో మనకు అర్థమవుతోంది.

మంచి అవగాహనతో..

ఒక గ్రూపులో సభ్యులు పెరుగుతున్నారంటే ఆ గ్రూపును ఎంతో సమర్థవంతంగా నిర్వహిస్తున్నారనే కదా! ఆ బాధ్యతను నిర్వహిస్తున్న గ్రూపు అడ్మిన్‌గా ప్రదీప్తి గురించి మనం కచ్చితంగా కొంత చెప్పుకోవాల్సిందే. కుటుంబంలో రెండో కూతురిగా, గారాల పట్టిగా పెరిగిన ప్రదీప్తి తల్లితండ్రులు శైలజ,శ్యామసుందర్. సమాజాన్ని సునిశితంగా పరిశీలించడం, సమాజం పట్ల బాధ్యతగా ఉండడం నేర్చుకున్నారు. అంతేకాక తల్లి శైలజ నడిపే ఎన్జీఓ 'సహజ ఫౌండేషన్'కు ఈమె సహ వ్యవస్థాపకురాలిగా ఉండటంతో సామజిక అవసరాలేంటో, అసహాయులెవరో, ఎలా సహాయపడాలో మంచి అవగాహన వచ్చింది. కంప్యూటర్స్‌లో మాస్టర్స్ చేసిన ఆమెకు ఆధునిక సాంకేతికతపై పట్టు ఉంది. ప్రముఖ హోటల్లో ఈవెంట్ మేనేజర్‌గా ఉద్యోగం చేయడంతో నాయకత్వ లక్షణాలు అలవడ్డాయి. అలాగే కంటెంట్ రైటర్‌గా, ఎడిటర్‌గా, మంచి చదువరిగా తనకున్న అనుభవంతో తెలుగు మామ్స్ నెట్వర్క్ లోని యాభయి మంది అమ్మలతో కలిసి 'అమ్మంటే' అనే కథా సంకలనం 2021లో మాతృదినోత్సవ సందర్భంగా ప్రచురించారు.



అనామిక పోస్ట్...

ఈ గ్రూపులో ప్రత్యేకంగా చెప్పుకోవలిసినది అనామిక పోస్ట్. ఎదుటివారికి మన భయం, బాధ చెప్పుకుంటే లోకువవయిపోతామేమో అనే భయం అందరికీ సహజం. కానీ అనామికగా మన కష్టం చెప్పుకోవచ్చు. ధైర్యం పొందవచ్చు. నిరాశ నుండి బయటపడే దారి తెలుసుకోవచ్చు. ఎవరో, ఏంటో తెలియకపోయినా గ్రూపులో ప్రతీ అమ్మ మేమున్నామంటూ అభయాన్నిస్తారు. ఇంకొక ముఖ్యమైన సంగతి. ఇందులో ఉండే ఎంతో మంది వైద్యులు తమ విద్యను, విజ్ఞానాన్ని సామజిక వికాసానికి ఉపయోగిస్తూ అమ్మలకు అండగా ఉంటున్నారు. వారి సేవ వెలకట్టలేనిది.



పారిశ్రామిక వేత్తలుగా అమ్మలు

ఉద్యోగాలు చేయడానికి ఇంట్లో పరిస్థితులు అనుకూలించక, చదువుకుని నిరుపయోగం అయిందని బాధపడే అమ్మలకు తెలుగు మామ్స్ నెట్వర్క్ వ్యాపారవేత్తలుగా ఎదగడానికి చక్కని అవకాశాలు కల్పిస్తుంది. ఎంతో మంది మామ్ ఎంట్రప్రెన్యూర్స్‌ను తయారు చేసిన ఘనత ఈ ఫేస్బుక్ గ్రూపుది. ఇందుకోసం ప్రదీప్తి ప్రత్యేకంగా నిర్వహించే 'ప్రోస్పెర్ విత్ ప్రదీప్తి', 'టి ఎం ఎస్ టాక్స్' అమ్మలకు ఎంతో ఉపయుక్తంగా ఉంటాయి. ఎంతో మంది నిపుణులు తమ సలహాలను, సూచనలను అందిస్తారు. ప్రదీప్తి దీనికి సంబంధించిన వీడియోలు 300 లకు పైగా చేశారు . ఫేస్బుక్ గ్లోబల్ కమ్యూనిటీ యాక్సిలరేటర్ ప్రొగ్రాము 2022 లో 'మెటా' ప్రపంచవ్యాప్తంగా 140 కమ్యూనిటీలలో ఒకటిగా గుర్తించింది.భారత దేశం నుండి ఎంపికైన 15 కమ్యూనిటీలలో ఒకటి.దక్షిణ భారత దేశం నుండి మన తెలుగు మామ్స్ నెట్వర్క్ ఒక్కటే! ఇంతేకాక తానా, ఏపిఎస్ఆర్టిఎస్ తో కలిసి నిర్వహించిన 'అమ్మా నీకు వందనం' అనే కార్యక్రమంలో 1800 మంది అమ్మలతో ఆన్‌లైన్‌లో పాల్గొని తెలుగు బుక్ అఫ్ రికార్డ్స్‌లోనూ, ఇండియా బుక్ అఫ్ రికార్డ్స్‌లోను స్థానం సంపాదించుకుంది ఈ నెట్వర్క్.

పాత సామెతను మార్చేసింది

మానవ సంబంధాలు మరుగున పడి మాట సాయం కూడా కరువుతున్న ఈ రోజుల్లో అమ్మలకు అమ్మగా ఎన్నో కొత్త బంధాలను కలుపుతూ, ప్రేమలను పంచుతున్న తెలుగు మామ్స్ నెట్వర్క్ 'ఆడానికి ఆడదే శత్రువు' అనే పాత సామెతను 'ఆడదానికి ఆడదే అండ' అని మార్చిందని ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఇందుకోసం ప్రదీప్తి తరుచుగా లైవ్‌లో స్పూర్తివంతమైన విషయాలను పంచుకుంటూ అందరినీ పలకరిస్తుంటారు. ఈ ఆన్‌లైన్ అమ్మల సంఘం ఇంకా ఎంతో మందిని కలుపుకుంటూ మరింత ముందుకు వెళ్లాలని ఆశిద్దాం.

- డా॥ హారిక చెరుకుపల్లి, 9000559913

అమ్మల పుట్టిల్లు

ఇప్పుడు ఈ 'తెలుగు మామ్స్ నెట్వర్క్' ముప్పయి వేల అమ్మల పుట్టిల్లు. ఇందులో ఎనభయేండ్ల అమ్మమ్మ నుండి ఇరవైఐదేండ్ల అమ్మల వరకు అన్ని వయసుల వారు ఉన్నారు. వీరంతా తమ సుఖదుఃఖాలను, సంతోషాలను, సందేహాలను, విజయాలను, విశేషాలను, విజ్ఞానాన్ని, కళలను, ఇష్టాఇష్టాలను, అభిరుచులను, ఆసక్తులను అందరితో పంచుకుంటారు. కానీ ఇవన్నీ ఒక పద్ధతిలోనే ఉంటాయి. ప్రదీప్తి, స్వప్న అడ్మిన్స్‌గా ముప్పయివేల అమ్మలను ఒక తాటిపై నడిపించే బాధ్యతను ఎలా నిర్వర్తిస్తున్నారో చూడండి.

రోజు వారి ప్లానింగ్

సోమవారం - శారీరిక/ మానసిక ఆరోగ్యం, ఇంటి అలంకరణ చిట్కాలు, విషయాలు, సలహాలు.

మంగళవారం - మంచి అలవాట్లు, పుస్తక పరిచయాలు, పుస్తక విశ్లేషణలు, హాబీలు, ఆర్ట్ అండ్ క్రాఫ్ట్.

బుధవారం - బిజినెస్ ప్రకటనలు, ఉద్యోగ అవకాశాల ప్రకటనలు, యుట్యూబ్ చానల్స్.

గురువారం - తెలుగు సాహిత్య చర్చలు, సాహిత్య పోటీలు.

శుక్రవారం - తెలుగు ఆచారాలు, పండగలు, మన గ్రూప్ మహాలక్ష్మి.

శనివారం - వంటలు/వంటింటి చిట్కాలు/ రెసిపీలు, సౌందర్య చిట్కాలు, పిల్లల చదువులు సలహాలు/చిట్కాలు.

ఆదివారం - సినిమా కబుర్లు, విశ్లేషణలు, సరదా ఆటలు, మీ గురించి మీరు, లేదా మన గ్రూప్‌లో ఇతరుల గురించి మంచి చెప్పాలి అంటే ఇవాళ చెప్పేయండి. విశేషమేంటంటే ఇందులో ప్రతీ ఒక్కరు ఈ పట్టికను అనుసరించి అంతే క్రమశిక్షణగా నడుచుకునేలా చేస్తారు.



రెచ్చగొడుతున్నారు

తిరువనంతపురం : ప్రతి విషయంలోనూ రాష్ట్ర గవర్నర్ ఖాన్ రెచ్చగొట్టేందుకు ప్రయత్నిస్తున్నారని కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్ మండిపడ్డారు. ప్రొటోకాల్‌ను గవర్నర్ తరచూ ఉల్లంఘించడంలో ఔచిత్యాన్ని కేంద్ర ప్రభుత్వం పరిశీలించాలని కోరారు. రాష్ట్రంలోని ప్రజలకు చేరువయ్యేందుకు వామపక్ష సంఘటన ప్రభుత్వం ప్రారంభించిన నవ కేరళ సదస్ కార్యక్రమం సందర్భంగా పతనంతిట్టలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ 'కేరళలో నెలకొన్న శాంతియుత వాతావరణాన్ని నాశనం చేసేందుకు గవర్నర్ ఉద్దేశపూర్వకంగా ప్రయత్నిస్తున్నారని నేను గతంలోనే చెప్పాను. ఆ తర్వాత ఆయన చేసిన ప్రతి పని నేను చెప్పింది నిజమేనని నిరూపించింది. తాను నిర్వహిస్తున్న పదవిని గవర్నర్ తరచూ మరిచిపోతున్నారు. ఆ పదవికి అప్రదిష్ట తెచ్చేలా వ్యాఖ్యలు చేస్తున్నారు' అని విమర్శించారు.

ఛాన్సలర్‌గా గవర్నర్ తీసుకున్న చర్యలు సహజంగానే నిరసనలకు అవకాశం ఇచ్చాయని విజయన్ చెప్పారు. విశ్వవిద్యాలయం ఎంపిక చేసిన ప్యానల్ నుండి ఆయన సెనెట్‌ను నియమించాల్సి ఉందని, అయితే ఆయన ఆర్ఎస్ఎస్ అందజేసిన జాబితా నుండి సభ్యులను ఎంపిక చేస్తున్నారని తెలిపారు. 'తన విచక్షణాధికారాలు ఉపయోగించి సెనెట్‌కు సభ్యులను నామినేట్ చేశానని గవర్నర్ చెబుతున్నారు. ఆయన తనంతట తాను సభ్యులను గుర్తించి నామినేట్ చేయగలరా? యూనివర్సిటీ ఇచ్చిన జాబితాలోని సభ్యులకు అవసరమైన అన్ని అర్హతలు ఉన్నప్పటికీ గవర్నర్ మాత్రం ఒకే ఒక అర్హతను గుర్తిస్తున్నారు. అది వారు ఆర్ఎస్ఎస్‌కు సంబంధించిన వారు కావడమే. ఈ చర్యల కారణంగానే ఆయన విద్యార్థుల నుండి నిరసన ఎదుర్కొంటున్నారు' అని వివరించారు.

నిరసనకారులపై గవర్నర్ కఠిన పదజాలం ఉపయోగించారని, వారిపై నేరస్తులు, గూండాలు అని ముద్ర వేశారని విజయన్ ఆరోపించారు. వివిధ హోదాలలో అనేక సంవత్సరాల పాటు పనిచేసిన వ్యక్తికి ఇది తగని పని అని అన్నారు. 'అలాంటి పదవిలో ఉన్న వ్యక్తి నిరసనకారులతో ఘర్షణకు దిగి వారికి నల్ల జెండాలు చూపుతారని ఎవరైనా ఆశిస్తారా? ప్రజాస్వామ్య వ్యవస్థలో నిరసన తెలపడం అనేది ప్రాథమిక హక్కు అని ఆయన మరచిపోతున్నారు.

రెండు రోజుల క్రితం గవర్నర్ ఖాన్‌పై సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి రోహింటన్ నారిమన్ చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ ఇప్పుడు దేశమంతా గవర్నర్ చర్యలను గమనిస్తోందని విజయన్ అన్నారు.

పార్లమెంట్ పొగబాంబు లింకులు..?

(మొదటిపేజీ తరువాయి)

నాశనం చేసేందుకే ఉద్దేశపూర్వకంగానే ఫోన్లను పగులగొట్టడం, దగ్ధం చేయడం చేశారని పేర్కొంటూ ఎఫ్ఐఆర్‌లో ఐపీసీ సెక్షన్ 201ను జత చేశారు. పార్లమెంట్ భద్రతా వైఫల్యం కేసులో ఇప్పటికే సాగర్ శర్మ, మనోరంజన్, అమోల్ షిండే, నీలం దేవి, లలిత్ ఝూ, మహేష్ కుమావత్‌లను అరెస్టు చేశారు. ఈ నెల 13న ఇప్పటికే వీరిపై ఉపా చట్టం కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు.

బీజేపీ ఎంపీ పాత్రపై ప్రశ్నలు వస్తాయనే చర్చకు దూరంగా మోడీ.. : కాంగ్రెస్

మైసూర్ బీజేపీ ఎంపీ పాత్రపై ప్రశ్నలు వస్తాయనే పార్లమెంట్‌లో భద్రతా వైఫల్యంపై చర్చ నుంచి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ దూరంగా పారిపోతున్నారని కాంగ్రెస్ పార్టీ విమర్శించింది. 'డిసెంబరు 13న జరిగిన అసాధారణ ఘటనలపై ప్రధాని మోడీ ఎట్టకేలకు మౌనం వీడారు. అయితే విచారణ అవసరమని, చర్చ కాదని ప్రధాని తెలిపారు' అని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ సోషల్ మీడియాలో పోస్టు చేశారు. 'ఇండియా ఫోరంలోని అన్ని పార్టీలు డిమాండ్ చేస్తున్నదీ, ఒత్తిడి కొనసాగిస్తున్నది డిసెంబరు 13న ఏం జరిగింది? ఎలా జరిగింది? అనేదానిపై హోం మంత్రి ప్రకటన కోసమే' అనే పోస్టు చేశారు. ప్రధాన మంత్రి చాలా చిన్న కారణంతోనే ఈ విషయంపై చర్చకు దూరంగా ఉంటున్నారని పేర్కొన్నారు. నిందితులు సులభంగా లోక్‌సభలో ప్రవేశించడంలో బీజేపీ ఎంపీ ప్రతాప్ సింహా పాత్రపై ప్రశ్నలు వస్తాయనే మోడీ చర్చ నుంచి పారిపోతున్నారని పేర్కొన్నారు.

నాగ్‌పూర్ ఫ్యాక్టరీలో భారీ పేలుడు

(మొదటిపేజీ తరువాయి)

సంఘటన జరిగిందని, తొమ్మిది మంది అక్కడికక్కడే మరణించారని పేర్కొన్నారు. గాయపడిన కార్మికులను ఆస్పత్రికి తరలించినట్టు తెలిపారు. యువరాజ్ చారోడ్, ఒమేశ్వర్ మచ్చిర్కే, మితా ఉయికే, ఆర్తి సహారే, శ్వేతాలి మార్వాటే, పుష్పా మనాపురే, భాగ్యశ్రీ లోనారే, రుమితా ఉయికే, మౌసం పాట్లేగా మరణించినట్టు అధికారులు ప్రకటించారు. ప్రమాద సమయంలో మొత్తం 12 మంది కార్మికులు ఉన్నట్టు పోలీసులు చెబుతున్నారు. గాయపడిన మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉన్నట్టు సమాచారం. ఈ కంపెనీలో సాయుధ బలగాల కోసం డ్రోన్లు, పేలుడు పదార్థాలను తయారు చేస్తారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే నిర్ణయించినట్టు ఉపముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. నష్టాన్ని అంచనా వేస్తున్నామని, పేలుడుకు గల కారణాలపై దర్యాప్తు జరుపుతున్నామని జిల్లా పోలీసు సూపరింటెండెంట్ హర్ష్ పొద్దార్ తెలిపారు.

లోపలికి వెళ్లనివ్వరు.. మా వాళ్లను చూడనివ్వరు...
మృతుల కుటుంబ సభ్యుల ఆందోళన

ఫ్యాక్టరీలోకి అనుమతించడం లేదని, ప్రాణాలు కోల్పోయిన తమ వారి సమాచారం కూడా ఇవ్వడం లేదంటూ మృతుల కుటుంబ సభ్యులు సంస్థ ఆవరణలో ఆదివారం ఆందోళన చేశారు. సోలార్ ఇండస్ట్రీస్ ఇండియా లిమిటెడ్‌లో జరిగిన పేలుడులో సజీవ దహనమైన వారి మృతదేహాలను ఫ్యాక్టరీ ఆవరణలో ఉంచడంపై బంధువులు, స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఫ్యాక్టరీ ఆవరణలోకి అనుమతించాలని డిమాండ్ చేస్తూ బాధితుల కుటుంబ సభ్యులు, స్థానికులు యూనిట్ ప్రవేశ ద్వారం వద్ద బైటాయించారు. ప్రమాద వార్త తెలిసినవెంటనే ఫ్యాక్టరీ వద్దకు చేరుకున్నా.. తమను లోపలకు అనుమతించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 'నాకు ఏమీ వద్దు.. నా కుమార్తె మృతదేహాన్ని అప్పగించండి' అని మృతుల్లో ఒకరైన 22 ఏండ్ల ఆర్తి తండ్రి నీలకంఠరావు సహారే దీనంగా వేడుకోవడం అందర్నీ కలిచి వేసింది. గతంలో పక్షవాతానికి గురికావడంతో సహారే కాళ్లు చచ్చుబడిపోయాయి. ప్రమాద వార్త తెలిసిన వెంటనే సంఘటనా స్థలికి సహారే చేరుకున్నారు. ఆర్తి సంపాదనతోనే తమ కుటుంబం గడుస్తుందని, మాటలు రాని తల్లికి, చెల్లికి ఆర్తి అండగా ఉండేదని గుర్తు చేసుకుంటూ సహారే కన్నీరు పెట్టడం చూపరులను కంటతడిపెట్టించింది.

ఇద్దరు పిల్లల తల్లి అయిన 32 ఏండ్ల రుమితా ఉయికి ఆదివారం ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయారు. ఆమె తండ్రి దేవిదాస్ ఇరపాటి ఫ్యాక్టరీ వద్ద ఆందోళనలో ఉన్నారు. ప్రమాదం గురించి ఫ్యాక్టరీ నుంచి ఎలాంటి సమాచారం లేదని, ఇతరుల ద్వారా ప్రమాదం గురించి తెలుసుకుని ఇక్కడకు వచ్చినట్టు తెలిపారు. రుమితకు ఇద్దరు కుమారు ఉన్నారని, భర్త వ్యవసాయ కార్మికుడని చెప్పారు. ఆదివారం తమ ఇంటికి రావాల్సి ఉందని, అంతలోనే ప్రమాదంలో మరణించిందని గద్గద స్వరంతో చెప్పారు. 'రుమిత మృతదేహాన్ని మాకు ఎప్పుడు అప్పగిస్తారో తెలియదు' అని ఆవేదన వ్యక్తం చేశారు. మిగిలిన వారి కుటుంబ సభ్యులు, బంధువులు కూడా ఇదేవిధమైన ఆందోళన వ్యక్తం చేశారు.

రాష్ట్రంలో 9 మంది ఐపీఎస్‌ల బదిలీలు

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి :

రాష్ట్రంలో ఐపీఎస్‌ల బదిలీల ప్రక్రియను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కొనసాగిస్తున్నారు. ఇందులో భాగంగా ఆదివారం 14 మంది పోలీసు ఉన్నతాధికారులను బదిలీ చేశారు. ఇందులో కొందరు నాన్‌కేడర్ ఎస్పీలు కూడా ఉన్నారు. కాగా, మరికొందరు అధికారులను బదిలీ చేసి వారిని డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు.

బదిలీల వివరాలు ఈ విధంగా ఉన్నాయి. నగర ఎస్బీ అదనపు కమిషనర్ పి.విశ్వప్రసాద్‌ను నగర ట్రాఫిక్ అదనపు కమిషనర్‌గా, పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న డీఐజీ ఎ.వి రంగనాథ్‌ను నగర జాయింట్ పోలీస్ కమిషనర్ (క్రైమ్స్ అండ్ సిట్)గా నియమించి.. ఈ స్థానంలో ఉన్న డాక్టర్. గజరావ్ భూపాల్‌ను డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. ఇంటెలిజెన్స్ ఎస్పీ ఎస్.ఎం. విజయ్ కుమార్‌ను నగర పశ్చిమ మండలం డీసీపీగా బదిలీ చేసి.. ఆ స్థానంలో ఉన్న డీసీపీ జోయెల్ డేవిస్‌ను నగర స్పెషల్ బ్రాంచ్ డీసీపీగా మార్చారు. మెదక్ ఎస్పీ రోహిణి ప్రియదర్శినిని నగర ఉత్తర మండలం డీసీపీగా నియమించి.. ఈ స్థానంలో ఉన్న డీసీపీ జి.చందన దీప్తిని డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలన్నారు. సిద్దిపేట్ కమిషనర్ ఎస్.శ్వేతను నగర డి.డి డీసీపీగా, పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న మరో ఎస్పీ ఎల్.సుబ్బారాయుడును నగర ట్రాఫిక్ డీసీపీ-1గా నియమించారు. నగర టాస్క్‌ఫోర్స్ డీసీపీ నితికా పంత్‌ను బదిలీ చేసి డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలన్నారు.

ఇక నాన్‌కేడర్ ఎస్పీలలో పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్న ఎస్.వెంకటేశ్వర్లును నగర ట్రాఫిక్ డీసీపీ-3గా నియమించి, ఇక్కడున్న డీసీపీ డి.శ్రీనివాస్‌ను డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు. రాచకొండ కమిషనరేట్‌లో రోడ్ సేఫ్టీ డీసీపీగా ఉన్న శ్రీ బాలా దేవిని నగర టాస్క్‌ఫోర్స్ డీసీపీగా, మాదాపూర్ డీసీపీ జి.సందీప్‌ను సికింద్రాబాద్ రైల్వేస్ (అడ్మిన్) ఎస్పీగా నియమించి.. ఇక్కడున్న జె.రాఘవేందర్‌ను డీజీపీ కార్యాలయంలో రిపోర్ట్ చేయాలని ఆదేశించారు.

ఆర్థికాన్ని గాడిలో ఎలా పెట్టాలి?

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

అప్పుల కుప్పగా మారిన తెలంగాణ రాష్ట్ర ఆర్థిక రంగాన్ని ఎలా గట్టెక్కించాలో చెప్పండంటూ ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి రిజర్వుబ్యాంక్ (ఆర్బీఐ) మాజీ గవర్నర్ రఘురామరాజన్‌ను కోరారు. ఆర్థిక క్రమశిక్షణ, నూతన సంస్కరణల అమలు, ఆర్థికాభివృద్ధికి దోహదం చేసే అంశాలను వివరించాలనీ అడిగారు. ఆదివారం జూబ్లీహిల్స్‌లోని సీఎం రేవంత్‌రెడ్డి నివాసంలో ఆయనతో పాటు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, శాసనసభా వ్యవహారాలు, ఐటీ శాఖల మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి, ఆర్థిక శాఖ ప్రత్యేక కార్యదర్శి కే రామకృష్ణారావు, ముఖ్యమంత్రి ముఖ్య కార్యదర్శి శేషాద్రి తదితరులు రఘురామరాజన్‌తో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఆర్థికరంగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, కేంద్ర ప్రభుత్వం నుంచి ఏఏ పథకాల కింద ఎలాంటి నిధులు వస్తాయి...వాటి వినియోగం...ఆడిట్ వంటి కీలకమైన విషయాలను,,ఈ సందర్భంగా ఆయన తన అనుభవాలను వారితో పంచుకున్నారు. పన్నుల సరళీకరణ, స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వంటి పలు అంశాలను ఆయన వారికి వివరించినట్టు సమాచారం. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీల



అమలుకు అయ్యే ఖర్చు, వాటికి కేంద్రం నుంచి ఏవైనా మ్యాచింగ్ గ్రాంట్స్ వంటివి వస్తాయా... లేదా... వస్తే వాటిని ఎలా వినియోగించాలి వంటి పలు అంశాలను ఈ సందర్భంగా మంత్రులు రఘురామరాజన్‌ను అడిగి తెలుసుకున్నారు.

ఉద్యోగాలు ఉత్తమాటలే.!

(మొదటిపేజీ తరువాయి)

ఎన్ఎస్ఎస్ఓ జులై 2022-జూన్ 2023 మధ్య కాలంలో నిర్వహించిన పీరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే ఆధారంగా ఆరో వార్షిక నివేదికను విడుదల చేసింది. నమూనాలకు సంబంధించి సమాచార సేకరణ కోసం ఫీల్డ్ వర్క్ జులై 2022-జూన్ 2023 కాలానికి సంబందించినది. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామంటూ మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి..తొమ్మిదేండ్లు పూర్తయినా..కేంద్రశాఖల్లో ఉన్న ఖాళీలను భర్తీ చేయటంలేదని నిరుద్యోగ సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి.

ఆగని బాల్య వివాహాలు

(మొదటిపేజీ తరువాయి)

వివాహ వయసును పురుషులతో సమానంగా 21 సంవత్సరాలకు పెంచేందుకు ఉద్దేశించిన బిల్లును పార్లమెంటరీ కమిటీ పరిశీలిస్తున్న సమయంలో ఈ అధ్యయన వివరాలు బయటకు రావడం గమనార్హం. 'బాలికల చట్టబద్ధమైన వివాహ వయసును పెంచడం సమర్థనీయమే. అయితే వివాహ వయసును 21 సంవత్సరాలకు పెంచాలని ప్రతిపాదించారు. ప్రస్తుతం అమలులో ఉన్న కనీస వివాహ వయసు 18 సంవత్సరాలను కూడా ఎవరూ పట్టించుకోవడం లేదు. కాబట్టి ఈ వయసును 21 సంవత్సరాలకు పెంచాలన్న ప్రతిపాదనను క్షుణ్ణంగా పరిశీలించాల్సిన అవసరం ఉంది' అని అధ్యయనానికి నేతృత్వం వహించిన హార్వర్డ్ యూనివర్సిటీ ప్రొఫెసర్ ఎస్‌వీ సుబ్రమణ్యం చెప్పారు. బాల్య వివాహాలను ఎలా అడ్డుకోవాలన్న విషయంపై మరింత దృష్టి సారించాల్సి ఉందని, ఇందుకోసం అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆయన సూచించారు. బాలికల కనీస వివాహ వయసును 21 సంవత్సరాలకు పెంచితే ఇప్పటికే అమలులో ఉన్న 18 సంవత్సరాల నిబంధనకు కట్టుబడి ఉన్న కుటుంబాలు ఇకపై తమ కుమార్తెలకు త్వరగా వివాహం చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభిస్తారని, మరిన్ని సంవత్సరాలు ఎదురు చూడడానికి వారు ఇష్టపడకపోవచ్చునని కొందరు అభిప్రాయపడుతున్నారు.

లిబియాలో జలసమాధి

(మొదటిపేజీ తరువాయి)

లాభాల కోసం లిబియా అధ్యక్షుడు గడాఫీతో యుద్ధం చేసి, హత్య చేసిన తరువాత ఆ దేశం పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. మానవ అక్రమ రవాణాదారులకు కూడా లిబియాలోని కల్లోల పరిస్థితులు అనుకూలంగా మారాయి. ఆరు దేశాలతో సరిహద్దులు పంచుకుంటున్న లిబియాలోకి ఆఫ్రికా దేశాల నుంచి వలసదారులు పోటెత్తుతున్నారు. వీరందరినీ ప్రమాదకరమైన పడవల్లో కుక్కి తీరం దాటిస్తుంటారు. ఎవరైనా పట్టుబడి తిరిగి లిబియాకు వస్తే ప్రభుత్వ నిరాశ్రయ కేంద్రాల్లో ఉంచుతున్నారు. వారిని నిర్బంధ శ్రామికులుగా మారుస్తున్నారు. వారిపై అత్యాచారాలకు పాల్పడుతున్నారు. వారి నుంచి డబ్బును లాక్కుంటున్నారు.

మరోసారి ఐఏఎస్‌ల బదిలీలు

(మొదటిపేజీ తరువాయి)

కార్యదర్శిగా ఉన్న వాణి ప్రసాద్‌ను అటవీ, పర్యావరణశాఖ ముఖ్య కార్యదర్శిగా నియమించి, ఈపీటీఆర్ఐ డైరెక్టర్ జనరల్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. మహిళా శిశుసంక్షేమ శాఖ కార్యదర్శిగా వాకాటి కరుణ, వాణిజ్య పన్నులశాఖ కమిషనర్‌గా టీకే.శ్రీదేవిని నియమించారు. నల్గొండ కలెక్టర్‌గా ఉన్న ఆర్వీ కర్ణన్‌ను వైద్య, ఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ డైరెక్టర్‌గా నియమించారు.

సజ్జన్ జిందాల్‌పై లైంగికదాడి కేసు

(మొదటిపేజీ తరువాయి)

అఘాయిత్యం జరిగినట్టు తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరిలో పోలీసులకు ఫిర్యాదు చేశానని, వారు నిర్లక్ష్యం వహించడంతో హైకోర్టును ఆశ్రయించానని ఆమె పేర్కొన్నారు. హైకోర్టు ఆదేశాలతో జిందాల్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. 64 ఏండ్ల జిందాల్ జెఎస్‌డబ్ల్యూ గ్రూప్‌నకు నేతృత్వం వహించడంతోపాటు ఉక్కు, విద్యుత్, మౌలిక వసతులు, సిమెంట్, పెయింట్స్, ఈ-కామర్స్, స్పోర్ట్స్ వంటి విభిన్న రంగాల వ్యాపారాల్లో ఉన్నారు.



కోట్ల వర్షం కురిసేనా?

• మంగళవారం ఐపీఎల్ ఆటగాళ్ల వేలం • వర్ధమాన క్రికెటర్లపైనే ఫోకస్

ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) సందడి షురూ కానుంది. డిసెంబర్ 19న దుబాయ్ వేదికగా ఐపీఎల్ 16 ఆటగాళ్ల మినీ వేలానికి రంగం సిద్ధమైంది. పది ఫ్రాంచైజీలు 77 మంది క్రికెటర్లను (30 మంది విదేశీ క్రికెటర్లు) కొనుగోలు చేసేందుకు రూ.262.92 కోట్ల డబ్బుతో ప్రణాళికలు రూపొందించాయి. తొలిసారి ఐపీఎల్ ఆటగాళ్ల వేలం విదేశీ గడ్డపై జరుగుతుండగా.. ఓ మినీ వేలంలో ఫ్రాంచైజీలు 31.58 మిలియన్ అమెరికన్ డాలర్లు ఖర్చు చేయనుండటం సైతం ఇదే ప్రథమం కానుంది.

ఐపీఎల్ వేలం అనగానే సహజంగానే ప్రపంచ శ్రేణి అత్యుత్తమ క్రికెటర్లపైనే ఫోకస్ ఉంటుంది. మ్యాచ్ ఫలితాన్ని ఒంటిచేత్తో శాసించగల ఆటగాళ్ల కోసం ఫ్రాంచైజీలు ఎంత వరకైనా వెళ్లేందుకు వెనుకాడవు. ఈసారి మినీ వేలంలో సంప్రదాయానికి కాస్త భిన్నంగా.. దేశవాళీ వర్ధమాన క్రికెటర్లపై ఫోకస్ కనిపించనుంది. పలు ఫ్రాంచైజీలు యువ క్రికెటర్ల కోసం కోట్లు కుమ్మరించేందుకు సిద్ధపడనున్నాయి. అటువంటి సత్తా ఉన్న దేశవాళీ అన్‌క్యాప్‌డ్ కుర్ర క్రికెటర్లు ఎవరో చూద్దాం.

నవతెలంగాణ క్రీడావిభాగం



అర్షిన్ కులకర్ణి : పేస్ ఆల్‌రౌండర్

దేశవాళీ సర్క్యూట్‌లో నాణ్యమైన పేస్ బౌలింగ్‌తో పాటు ధనాధన్ హిట్టింగ్ సామర్థ్యం కలిగిన ఆల్‌రౌండర్లు అరుదు. అటువంటి ఆటగాళ్లు అందుబాటులో ఉంటే ఫ్రాంచైజీలు ఊరుకుంటాయా?!. ఈ కోవలోకి వచ్చే ఆటగాడు అర్షిన్ కులకర్ణి. వచ్చే ఏడాది ఆరంభంలో ఐసీసీ అండర్-19 ప్రపంచకప్‌లో భారత్‌కు ప్రాతినిథ్యం వహించబోతున్న అర్షిన్.. ఈ ఏడాది మహారాష్ట్ర ప్రీమియర్ లీగ్‌లో ఈగల్ నాసిక్ టైటాన్స్ తరఫున ఆకట్టుకున్నాడు. మహారాష్ట్ర తరఫున సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీలో అరంగ్రేటం చేసిన అర్షిన్ అక్కడా రాణించాడు. రుతురాజ్ గైక్వాడ్ సిఫారసుతో చెన్నై సూపర్‌కింగ్స్ ట్రయల్స్‌కు హాజరు కావాల్సింది. కానీ ఆ సమయంలో అండర్-19 శిక్షణ శిబిరం ఉండటంతో వీలు పడలేదు. చెన్నై సూపర్‌కింగ్స్‌తో పాటు పంజాబ్ కింగ్స్ అర్షిన్ కోసం వేలంలో పోటీపడే అవకాశం ఉంది.

శుభమ్ దూబే : యువ ఫినిషర్



అన్‌క్యాప్‌డ్ ఫినిషర్ సైతం దేశవాళీ క్రికెట్‌లో ఓ పట్టాన కనిపించరు. ఇక్కడే విదర్భకు చెందిన శుభమ్ దూబే ప్రతిభాన్వేషకుల దృష్టిలో పడ్డాడు. సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీలో శుభమ్ దూబే మంచి ప్రదర్శన చేశాడు. లోయర్ మిడిల్ ఆర్డర్‌లో బ్యాటింగ్ చేసే శుభమ్.. 187.28 స్ట్రయిక్‌రేట్‌తో 221 పరుగులు చేశాడు. ముస్తాక్ అలీ టోర్నీలో బెంగాల్‌తో మ్యాచ్‌లో 213 పరుగుల ఛేదన శుభమ్ ప్రత్యేకతను చాటింది. భారీ లక్ష్యాన్ని మరో 13 బంతులు మిగిలి ఉండగానే ముగించేశాడు శుభమ్. 20 బంతుల్లో అజేయంగా 58 పరుగులు చేశాడు. దూబే ఇన్నింగ్స్‌లో మూడు ఫోర్లు, ఆరు సిక్సర్లు ఉన్నాయి. దేశవాళీ హిట్టర్, ఫినిషర్ కోసం అన్వేషిస్తున్న ఫ్రాంచైజీలు శుభమ్ దూబే కోసం వేలంలో పోటీపడనున్నాయి.

ముషీర్ ఖాన్ : స్పిన్ ఆల్‌రౌండర్



చాలా ఏండ్ల క్రితం.. ఓ ఎనిమిదేండ్ల బుడతడు భారత క్రికెట్ దిగ్గజం యువరాజ్ సింగ్‌ను క్లీన్‌బౌల్డ్ చేసిన వీడియో ఇంటర్‌నెట్‌లో వైరల్ అయ్యింది. బుడతడి ఆనందం కోసం యువీ వికెట్లను అప్పగించే అవకాశం లేకపోలేదు, అది వేరే సంగతి. కానీ బుడ్డోడు ఆ స్ఫూర్తి మరింత ముందుకు తీసుకెళ్లాడు. భారత క్రికెట్‌లో తనకంటూ ఓ స్థానం ఉండాలంటూ దూసుకొస్తున్నాడు. అతడే ముషీర్ ఖాన్. లెఫ్ట్ ఆర్మ్ స్పిన్ బౌలింగ్, మిడిల్ ఆర్డర్ బ్యాటర్‌గా ముషీర్ సత్తా చాటాడు. భారత అండర్-19 ప్రపంచకప్ జట్టులో ఫస్ట్ క్లాస్ క్రికెట్ అనుభవం కలిగిన ఇద్దరు క్రికెటర్లలో ముషీర్ ఖాన్ ఒకడు. నిరుడు, కూచ్ బెహర్ ట్రోఫీలో ముంబయిని ఫైనల్‌కు నడిపించిన ముషీర్.. 632 పరుగులు, 32 వికెట్లతో ప్లేయర్ ఆఫ్ ది టోర్నమెంట్ అవార్డు అందుకున్నాడు. ఈ ప్రదర్శన ముషీర్‌కు రంజీ జట్టులో చోటు దక్కేలా చేసింది. ముషీర్ ఖాన్ ఇప్పటివరకు మూడు ఫస్ట్ క్లాస్ మ్యాచులు ఆడాడు. ఇంపాక్ట్ ప్లేయర్ నిబంధనతో ఐపీఎల్‌లో ఆల్‌రౌండర్ల ప్రాధాన్యతను తగ్గించినా.. ముషీర్ ఖాన్ బ్యాట్‌తో, బంతితో సమానంగా ప్రభావం చూపించగలడు. మంగళవారం వేలంలో ఈ లక్షణమే అతడిని ప్రత్యేకంగా నిలబెట్టనుంది.

సమీర్ రిజ్వి : బిగ్ హిట్టర్



20 ఏండ్ల సమీర్ రిజ్వి.. యూపీ టీ20 లీగ్‌లో అత్యధిక సిక్సర్లు కొట్టిన బ్యాటర్‌గా నిలిచాడు. రెండు మెరుపు సెంచరీలు నమోదు చేసిన రిజ్వి.. టోర్నీలో 455 పరుగులు పిండుకున్నాడు. మినీ వేలానికి ముందు సమీర్ రిజ్వి మూడు ఫ్రాంచైజీలకు ట్రయల్స్ ఇచ్చాడు. పంజాబ్ కింగ్స్ అందులో ఒకటి. యూపీ అండర్-23 జట్టు షెడ్యూల్‌తో కొన్ని ట్రయల్స్‌కు రిజ్వి దూరమయ్యాడు. కానీ.. అండర్-23 జట్టు తరఫున తన ఎంతటి ప్రమాదకర హిట్టరో ఓ టీజర్ వదిలాడు. రాజస్థాన్‌తో మ్యాచ్‌లో 65 బంతుల్లోనే 91 పరుగుల ఇన్నింగ్స్‌తో చెలరేగాడు. ఫైనల్లో 50 బంతుల్లో 80 పరుగులు చేసిన రిజ్వి యూపీ విజేతగా నిలువటంలో ముఖ్య భూమిక పోషించాడు. సమీర్ రిజ్వి టోర్నీలో అత్యధిక పరుగుల చేసిన బ్యాటర్‌గా నిలిచాడు. సమీర్ కోసం సైతం వేలంలో ఫ్రాంచైజీలు ఆసక్తి చూపనున్నాయి.

కుమార్ కుశాగ్ర : వికెట్ కీపర్ బ్యాటర్

ఏ ఆటగాడి కెరీర్‌నైనా మలుపుతిప్పేందుకు ఒక గేమ్ చాలు. ఎంతో మంది స్టార్ క్రికెటర్ల విషయంలోనూ ఇది చూశాం. జార్ఖండ్‌కు చెందిన యువ వికెట్ కీపర్ బ్యాటర్ కుమార్ కుశాగ్ర ఆ కోవలోకే వస్తాడు. కోచ్‌లు, కెప్టెన్లను ఆకట్టుకునే రీతిలో గణాంకాలు, నిలకడ కుమార్‌లో లేవు. కానీ అవకాశం ఇచ్చి.. మద్దతు ఇస్తే అద్భుతాలు చేయగల సత్తా అతడి సొంతం. అటువంటి ఇన్నింగ్స్ ఒకటి విజయ్ హజారే టోర్నీలో ఆడాడు. మహారాష్ట్రపై 355 పరుగుల ఛేదనలో కుశాగ్ర ఆరో స్థానంలో బ్యాటింగ్‌కు వచ్చాడు. 37 బంతుల్లో అజేయంగా 67 పరుగులు చేశాడు. అందులో నాలుగు ఫోర్లు, ఐదు సిక్సర్లు ఉన్నాయి. అసాధ్యం అనుకున్న టార్గెట్‌ను కుశాగ్ర మెరుపు బ్యాటింగ్‌తో సాధ్యం చేశాడు. జార్ఖండ్‌కు విజయాన్ని అందించాడు. ఆ మ్యాచ్‌కు ఐపీఎల్ ఫ్రాంచైజీల ప్రతిభాన్వేషకులు సైతం హాజరు కావటం కుశాగ్రకు ప్లస్ పాయింట్. ఇషాన్ కిషన్ జాతీయ జట్టు తరఫున ఆడుతుండటంతో.. జార్ఖండ్‌కు కుశాగ్ర ఫస్ట్ చాయిస్ వికెట్ కీపర్‌గా మారాడు. కుమార్ నిలకడ సాధించాల్సి ఉంది.. అయినా అతడిలో విలువైన ప్రతిభ దాగి ఉంది. నాణ్యమైన వికెట్ కీపర్ వేటలో ఉన్న ఢిల్లీ క్యాపిటల్స్, కోల్‌కత నైట్‌రైడర్స్‌లు కుశాగ్ర కోసం వేలంలో ఓ లుక్కేయవచ్చు!.



సింగ్ ఈజ్ కింగ్

అర్షదీప్ దెబ్బకు సఫారీ విలవిల తొలి వన్డేలో భారత్ ఏకపక్ష విజయం



జొహానెస్‌బర్గ్ : వాండరర్స్‌లో భారత పేసర్లు అర్షదీప్ సింగ్ (5/37), అవేశ్ ఖాన్ (4/27) నిప్పులు చెరిగారు. అర్షదీప్ సింగ్ స్వింగ్ బంతులతో, అవేశ్ ఖాన్ పేస్‌తో చెలరేగటంతో ఆతిథ్య దక్షిణాఫ్రికా 116 పరుగులకే కుప్పకూలింది. 27.3 ఓవర్లలోనే దక్షిణాఫ్రికా కథ ముగిసింది. టెయిలెండర్ అండిల్ ఫెలుక్‌వయో (33 49 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), టోనీ డీ జార్జీ (28, 22 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లు) సఫారీలకు గౌరవప్రద స్కోరు అందించారు. స్వల్ప లక్ష్యాన్ని టీమ్ ఇండియా అలవోకగా ఛేదించింది. సాయి సుదర్శన్ (55 నాటౌట్, 43 బంతుల్లో 9 ఫోర్లు), శ్రేయస్ అయ్యర్ (52, 45 బంతుల్లో 6 ఫోర్లు, 1 సిక్స్) అర్థ సెంచరీలతో 16.4 ఓవర్లలోనే భారత్ ఛేదించింది. మరో 200 బంతులు మిగిలి ఉండగానే 8 వికెట్ల తేడాతో ఏకపక్ష విజయం నమోదు చేసింది. ఐదు వికెట్ల వీరుడు అర్షదీప్ సింగ్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. మూడు మ్యాచుల వన్డే సిరీస్‌లో భారత్ 1-0 ఆధిక్యం సాధించింది. భారత్, దక్షిణాఫ్రికా రెండో వన్డే మంగళవారం పోర్ట్ ఎలిజబెత్‌లో జరుగనుంది.

అర్షదీప్ అదుర్స్ : టాస్ నెగ్గి బ్యాటింగ్ ఎంచుకున్న సఫారీకి అర్షదీప్, అవేశ్ చుక్కలు చూపించారు. తొలి స్పెల్‌లో పరిస్థితులకు అలవాటు పడేందుకు ఇబ్బంది పడిన అర్షదీప్.. రెండో స్పెల్‌లో వికెట్ల జాతర సాగించాడు. హెండ్రిక్స్ (0), వాన్‌డర్ డసెన్ (0), క్లాసెన్ (6), టోనీ (28), ఫెలుక్‌వయో (33) అర్షదీప్ దెబ్బకు పెవిలియన్ బాట పట్టారు. 52 పరుగులకే 5 వికెట్లు కోల్పోయిన దక్షిణాఫ్రికా.. 116 పరుగులకే కుప్పకూలింది. సొంతగడ్డపై సఫారీలకు ఇదే అత్యల్ప స్కోరు కావటం విశేషం. దక్షిణాఫ్రికాలో ఆ జట్టుపై ఐదు వికెట్లు కూల్చిన తొలి పేసర్‌గా అర్షదీప్ నిలిచాడు. అవేశ్ ఖాన్ సైతం నాలుగు వికెట్లతో చెలరేగాడు. పదో వికెట్‌ను కుల్దీప్ యాదవ్ తన ఖాతాలో వేసుకున్నాడు. ఇక ఛేదనలో ఓపెనర్ రుతురాజ్ (5) విఫలమైనా.. శ్రేయస్ (52), అరంగ్రేట సాయి సుదర్శన్ (55) అర్థ సెంచరీలతో మెరిశారు.

పెర్త్‌లో పాకిస్థాన్ చిత్తు

• 360 పరుగుల తేడాతో ఆసీస్ గెలుపు

పెర్త్ (ఆస్ట్రేలియా) : స్వదేశీ సమ్మర్ సీజన్‌ను ఆస్ట్రేలియా ఘనంగా ఆరంభించింది. పెర్త్ టెస్టులో పాకిస్థాన్‌ను చిత్తు చేసిన కంగారూలు 360 పరుగుల తేడాతో ఘన విజయం సాధించారు. 450 పరుగుల ఛేదనలో రెండో ఇన్నింగ్స్‌లో బ్యాట్ పట్టిన పాకిస్థాన్..30.2 ఓవర్లలో 89 పరుగులకే కుప్పకూలింది. ఆసీస్ పేసర్లు మిచెల్ స్టార్క్ (3/31), జోశ్ హేజిల్‌వుడ్ (3/13) నిప్పులు చెరుగగా.. స్పిన్నర్ నాథన్ లయాన్ (2/18) మాయ చేశాడు. ఇమామ్ (10), బాబర్ (14), షకీల్ (24) మాత్రమే రెండెంకల స్కోరు సాధించారు. తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ 487 పరుగుల భారీ స్కోరు చేయగా.. రెండో ఇన్నింగ్స్‌ను 233/5 వద్ద డిక్లరేషన్ ఇచ్చింది. పాకిస్థాన్ తొలి ఇన్నింగ్స్‌లో 271 పరుగులే చేసింది. మూడు మ్యాచుల టెస్టు సిరీస్‌లో ఆస్ట్రేలియా 1-0 ఆధిక్యం సాధించింది. శతక హీరో డెవిడ్ వార్నర్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.



రాజ్ తరుణ్, నాగార్జున, అల్లరినరేష్

నవచిత్రం

సంక్రాంతికి సరైన సినిమా

నాగార్జున అక్కినేని నటిస్తున్న తాజా చిత్రం 'నా సామిరంగ'. విజయ్ బిన్నీ దర్శకుడిగా పరిచయం అవుతున్న ఈ చిత్రాన్ని శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్ పై నిర్మాత శ్రీనివాస చిట్టూరి భారీ స్థాయిలో నిర్మిస్తున్నారు. పవన్ కుమార్ సమర్పిస్తున్నారు.


తాజాగా మేకర్స్ టీజర్‌ను విడుదల చేశారు. 'ఇటీవల విడుదలైన గ్లింప్స్ నాగార్జున, అల్లరి నరేష్‌ల స్నేహాన్ని ఎలివేట్ చేయగా, సినిమాలోని అన్ని ఇతర లేయర్స్‌ని టీజర్ పరిచయం చేసింది. నాగార్జున గురించి ఆషికా రంగనాథ్, అల్లరి నరేష్ మధ్య జరిగిన ఆసక్తికరమైన సంభాషణతో టీజర్ ప్రారంభమవుతుంది. నాగ్, ఆషికా యంగ్ ఏజ్‌లో వీరిద్దరి ప్రేమ, నాగ్ తన స్నేహితులైన అల్లరి నరేష్, రాజ్ తరుణ్‌లతో స్నేహం చాలా అద్భుతంగా టీజర్‌లో ప్రజెంట్ చేశారు. ముఖ్యంగా టీజర్ చివరి సగం మాస్ స్టఫ్, యాక్షన్స్ సీక్వెన్స్ గూస్ బంప్స్ తెచ్చింది. అన్ని కోణాలను అద్భుతంగా ప్రజెంట్ చేసిన టీజర్.. ఇది పర్ఫెక్ట్ సంక్రాంతి ట్రీట్‌ని ప్రామిస్ చేస్తోంది. ప్రతి సీక్వెన్స్‌ని విజయ్ బిన్నీ ఎక్స్‌ట్రార్డినరీగా తీర్చిదిద్దారు. ఈ సినిమా సంక్రాంతికి థియేట్రికల్ రిలీజ్ అవుతుంది' అని చిత్ర యూనిట్ తెలిపింది.

మిస్టర్ బచ్చన్‌గా రవితేజ

రవితేజ, డైరెక్టర్ హరీష్ శంకర్ కాంబోలో చేస్తున్న ప్రాజెక్ట్‌కు 'మిస్టర్ బచ్చన్' అనే పవర్ టైటిల్‌ని ఖరారు చేశారు. టైటిల్ పోస్టర్ రవితేజ అమితాబ్ బచ్చన్ ఐకానిక్ పోజ్‌ను అనుకరిస్తున్నట్లు అద్భుతంగా ప్రజెంట్ చేస్తోంది. ఈ సినిమాలో రవితేజ సరసన భాగ్యశ్రీ బోర్సే కథానాయికగా నటిస్తోంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి వివేక్ కూచిభొట్ల సహ నిర్మాత. పనోరమా స్టూడియోస్, టి-సిరీస్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని సమర్పిస్తున్నాయి.

ఆదివారం చిత్రబృందం, అతిథుల సమక్షంలో ఈ సినిమా గ్రాండ్‌గా లాంచ్ అయింది. హీరో రవితేజ, నిర్మాత టీజీ విశ్వ ప్రసాద్, వివేక్ కూచిభొట్ల, రఘు రామకృష్ణ స్క్రిప్ట్‌ను దర్శకుడు హరీష్ శంకర్‌కి అందజేశారు. రవితేజపై చిత్రీకరించిన ముహూర్తపు షాట్‌కు కుమార్ మంగత్ పాఠక్ క్లాప్ కొట్టగా, కె రఘు రామకృష్ణ, టిజి భరత్ కలిసి కెమెరా స్విచాన్ చేసారు. ముహూర్తం షాట్‌కు వివి వినాయక్ గౌరవ దర్శకత్వం వహించారు. ముహూర్తం షాట్ కోసం "మిస్టర్ బచ్చన్... నామ్ తో సునా హెూగా!" డైలాగ్‌ని చెప్పారు రవితేజ.

ఈ చిత్రానికి మిక్కీ జె మేయర్ సంగీతం సమకూరుస్తుండగా, అయనంక బోస్ సినిమాటోగ్రఫీని అందిస్తున్నారు. అవినాష్ కొల్లా ప్రొడక్షన్ డిజైనర్‌గా, ఎడిటర్‌గా ఉజ్వల్ కులకర్ణి బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు.



రవితేజ

నన్ను చూసినావే పిల్ల..

సంపూర్ణేష్ బాబు, సంజోష్, ప్రాచీ బంసాల్, ఆరతి గుప్తా హీరో, హీరోయిన్లుగా మన్ మోహన్ మేనంపల్లి దర్శకత్వంలో వస్తున్న సినిమా 'సోదరా'.

క్యాన్స్ ఎంటర్టైన్మెంట్స్, మాంక్ ఫిలిమ్స్ పై నిర్మాత చంద్ర చగంలా నిర్మిస్తున్నారు. ఇప్పటికే సినిమా నుంచి విడుదలైన ఫస్ట్ లుక్, ఫస్ట్ సాంగ్ 'అన్నంటే దోస్తే సోదరా' మంచి సక్సెస్ అందుకోగా, ఇప్పుడు ఈ సినిమాకి సంబంధించిన సెకండ్ సింగిల్ 'పిల్లా పిల్లా..' సాంగ్ విడుదలైంది.

'అన్నంటే దోస్తే సోదరా..' సాంగ్ అన్నదమ్ముల మధ్య ఉండే అనుబంధాన్ని తెలిపితే, తాజాగా రిలీజ్ అయిన 'పిల్ల పిల్ల' సాంగ్ ఒక ఫ్రెష్ ఫీల్‌తో మంచి రొమాంటిక్ లవ్ సాంగ్‌గా ఉంది.



సంపూర్ణేష్ బాబు, ప్రాచీ బంసాల్

ఈ సాంగ్ లో సంపూర్ణేష్ బాబు లుక్స్ చాలా కొత్తగా ఉన్నాయి. 'నన్ను చూసి నావే పిల్ల నా కలలే నిజమయ్యేలా..' అంటూ సాగే ఈ సెకండ్ సింగిల్ అందర్నీ విశేషంగా అలరిస్తోంది. అన్నదమ్ముల అనుబంధానికి అద్దం పట్టే ఈ సినిమా అన్ని వర్గాల ప్రేక్షకుల్ని మెప్పిస్తుందనే దీమాతో మేకర్స్ ఉన్నారు అని చిత్ర యూనిట్ తెలిపింది.

సంపూర్ణేష్ బాబు, సంజోష్, ప్రాచీబంసాల్, ఆరతి గుప్తా, బాబా భాస్కర్, బాబు మోహన్, గెటప్ శీను తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి కథ- దర్శకత్వం: మన్ మోహన్ మేనంపల్లి, సంగీతం: సునీల్ కశ్యప్, డిఓపి: జాన్, ఎడిటర్: శివశర్వాణి, లిరిక్స్: సుద్దాల అశోక్ తేజ, పూర్ణ చారి, ప్రొడ్యూసర్: చంద్ర చంగలా.

ఇది చట్ట విరుద్ధం


1968 ఒప్పందాన్ని కూడా ఉలంఘిస్తోంది

అలహాబాద్ హైకోర్టు తీర్పుపై ముస్లిం పర్సనల్‌లా బోర్డ్



లక్నో : మధురలోని షాహీ ఈద్గా మసీదులో సర్వే చేపట్టాలని అలహాబాద్ హైకోర్టు ఇచ్చిన తీర్పు 1968లో హిందూ ముస్లింలు కుదుర్చుకున్న ఒప్పందానికి, 1991లో అప్పటి కేంద్ర ప్రభుత్వం చేసిన చట్టానికి విరుద్ధంగా ఉన్నదని ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డ్ (ఏఐఎంపీఎల్‌బీ) అభిప్రాయపడింది. సర్వే చేపట్టడం వల్ల చారిత్రక మసీదు సమస్యకు పరిష్కారం లభించవచ్చునని ఆశాభావం వ్యక్తం చేస్తూనే అలా జరగని పక్షంలో సుప్రీంకోర్టును ఆశ్రయిస్తామని స్పష్టం చేసింది.

సర్వేతో ఈ సమస్యకు న్యాయ సమ్మతమైన పరిష్కారం లభిస్తుందని ఏఐఎంపీఎల్‌బీ ప్రతినిధి ఖాసిం రసూల్ ఆశాభావం వ్యక్తం చేశారు. సర్వేకు తమ లీగల్ కమిటీ సహకరిస్తుందని చెప్పారు. బాబ్రీ మసీదు వివాదం సందర్భంగా కేంద్ర ప్రభుత్వం 1991లో ప్రార్థనా మందిరాలకు సంబంధించి ఓ చట్టాన్ని తీసుకొచ్చిందని గుర్తు చేశారు. దాని ప్రకారం దేశం స్వాతంత్ర్యం సాధించే నాటికి ప్రార్థనా మందిరాలు ఎలా ఉన్నాయో వాటిని అలాగే కొనసాగించాల్సి ఉంటుంది. అంటే యథాతథ స్థితిని కొనసాగించాలి. 'ఈ చట్టం కారణంగా కొత్త వివాదాలు తలెత్తబోవని అందరూ ఆశించారు. అయితే దేశంలో శాంతిని, సామరస్యాన్ని ఇష్టపడని శక్తులకు, హిందూ ముస్లింల మధ్య ద్వేషాన్ని సృష్టించి తద్వారా రాజకీయ ప్రయోజనాన్ని సాధించాలని కోరుకునే వారికి అలా జరగడం ఇష్టం లేదు' అని రసూల్ అన్నారు. స్థానిక హిందూ ముస్లింలు ఒప్పందం కుదుర్చుకొని చట్టానికి అనుగుణంగా 13.37 ఎకరాల భూమిని మసీదు, దేవాలయం మధ్య విభజించారని రసూల్ వివరించారు. అయితే ఈ ఒప్పందానికి అలహాబాద్ హైకోర్టు తీర్పు విరుద్ధంగా ఉన్నదని చెప్పారు. షాహీ ఈద్గా మసీదు ట్రస్ట్, శ్రీకృష్ణ జన్మస్థాన్ సేవా సంస్థాన్ మధ్య 1968లో ఒప్పందం కుదిరిందని, దీని ప్రకారం 10.9 ఎకరాలు కృష్ణ జన్మభూమికి, 2.5 ఎకరాలు మసీదుకు వచ్చాయని తెలిపారు. అది ముస్లింల ప్రార్థనా స్థలమని 17వ శతాబ్దపు చరిత్ర చెబుతోందని అన్నారు. సర్వే చేసే స్థలంలో తవ్వకాలు చేపట్టరాదని కోర్టు స్పష్టం చేసిందని, దీనిపై మరింత ఊరట పొందేందుకు సుప్రీంకోర్టును ఆశ్రయించే అవకాశం ఉన్నదని చెప్పారు.




వివాదం ఏమిటి?

మొత్తం 13.37 ఎకరాల భూమికి సంబంధించిన యాజమాన్య హక్కులపై వివాదం నడుస్తోంది. 11 ఎకరాలలో మసీదు, మిగిలిన 2.37 ఎకరాలలో మసీదు నిర్మించారు. అయితే మసీదు నిర్మించిన స్థలాన్ని కూడా తమకే అప్పగించాలని హిందూ సంస్థలు డిమాండ్ చేస్తున్నాయి. అదంతా శ్రీకృష్ణ జన్మభూమి దేవాలయం స్థలమేనని వాదిస్తున్నాయి. ఈ వాదనతో ముస్లిం సంస్థలు విభేదిస్తున్నాయి. ఈ వివాదం ఈనాటికి కాదని, 350 సంవత్సరాల నుండి కొనసాగుతోందని చరిత్రకారులు చెబుతున్నారు. 1670లో మొఘల్ పాలకుడు ఔరంగజేబు ఢిల్లీని పరిపాలించేటప్పుడు ఠాకూర్ కేశవ్‌దేవ్ ఆలయాన్ని కూల్చి, అక్కడ మసీదు నిర్మించారు. దేవాలయ శిథిలాలను మసీదు నిర్మాణంలో వాడారు. ఈ కారణంతోనే మసీదును సనాతన ధర్మానికి చిహ్నంగా చెబుతారు. హైకోర్టులో విచారణ సందర్భంగా షాహీ ఈద్గా మసీదు కమిటీ, యూపీ సున్నీ సెంట్రల్ వక్ఫ్ బోర్డు తరఫున న్యాయవాదులు వాదనలు వినిపిస్తూ అసలు మసీదు 13.37 ఎకరాలలోనిది కాదని తెలిపారు. కృష్ణుడి జన్మస్థలంలో మసీదు నిర్మించలేదని చెప్పారు.కాగా మసీదు ప్రదేశంలో సర్వేను పర్యవేక్షించేందుకు అడ్వకేట్ కమిషనర్‌ను నియమించడానికి అలహాబాద్ హైకోర్ట్ అంగీకరించింది. ఈ నెల 18న జరిగే తదుపరి విచారణలో సర్వేకు సంబంధించిన మార్గదర్శకాలు ప్రకటిస్తామని హైకోర్ట్ న్యాయమూర్తి మయాంక్ కుమార్ తెలిపారు. వారణాసిలోని జ్ఞానవాపి దేవాలయంలో చేపట్టిన విధంగానే మథుర మసీదులో కూడా సర్వే జరుపుతారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State, Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.

భారతదేశంలో విపత్తు నిర్వహణకు ఏ మంత్రిత్వ శాఖ బాధ్యత వహిస్తుంది?



భారతదేశ విపత్తు నిర్వహణ వ్యూహం ఉపశమనం, సంసిద్ధత, ప్రతిస్పందన, పునరుద్ధరణ దశలను కలిగి ఉంటుంది. భారతదేశంలో విపత్తు నిర్వహణ అనేది దేశం పాలనా అంశాలలో అత్యంత కీలకమైనది. 2005లో అమలులోకి వచ్చిన విపత్తు నిర్వహణ చట్టం విపత్తు ప్రతిస్పందనకు చట్టపరమైన పునాది వేసింది. అంతేకాదు, రాష్ట్రంలో రాష్ట్ర విపత్తు నిర్వహణ అధికారులు (SDMAలు), జిల్లా విపత్తు నిర్వహణ అధికారులు (DDMAs)తో పాటు జాతీయ స్థాయిలో జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ (NDMA)ని ఏర్పాటు చేసింది. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ (NIDM) వంటి సంస్థలు ప్రభుత్వ అధికారులు, మొదటి ప్రతిస్పందనదారులు, సంఘాలకు అవగాహన కల్పించేందుకు సామర్థ్య నిర్మాణం, శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తాయి. విపత్తు ప్రమాదాలు, ప్రతిస్పందన విధానాలపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రజా అవగాహన ప్రచారాలు, కసరత్తులు క్రమం తప్పకుండా నిర్వహించబడతాయి. జాతీయ విపత్తు నిర్వహణ ప్రణాళిక (NDMP) వివిధ వాటాదారుల పాత్రలు, బాధ్యతలను వివరిస్తూ మార్గదర్శకంగా పనిచేస్తుంది. నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (NDRF) ప్రత్యేక ప్రతిస్పందన, రెస్క్యూ ఆపరేషన్లలో కీలక పాత్ర పోషిస్తుంది, భారత వాతావరణ శాఖ (IMD) సకాలంలో, ఖచ్చితమైన అంచనాలను అందించడంలో కీలక పాత్ర పోషిస్తుంది. అయినప్పటికీ ప్రకృతి విపత్తుల వల్ల ఏటా పెద్దఎత్తున ప్రాణ నష్టంతో పాటు, ఆస్తి నష్టం కూడా సంభవిస్తుంది.

1. భారత జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికర సంస్థకి ఎవరు సారధ్యం వహిస్తారు ?
ఎ) రాష్ట్రపతి బి) కేంద్ర అటవీ శాఖా మంత్రి
సి) ప్రధాన మంత్రి డి) కేంద్ర రక్షణ శాఖా మంత్రి

2. భారతదేశంలో విపత్తు నిర్వహణకు బాధ్యత వహించే ప్రాథమిక ప్రభుత్వ సంస్థ ఏది?
ఎ) ఆరోగ్య మంత్రిత్వ శాఖ
బి) నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (NDRF)
సి) భారత వాతావరణ శాఖ (IMD)
డి) రక్షణ మంత్రిత్వ శాఖ

3. భారత జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికర సంస్థ కార్యాలయం పేరు ఏమిటి ?
ఎ) విజయ్ భవన్ బి) నిర్మాన్ భవన్
సి) అశోక్ భవన్ డి) సర్కారీ భవన్

4. భారతదేశంలో విపత్తు నిర్వహణకు ఏ మంత్రిత్వ శాఖ బాధ్యత వహిస్తుంది?
ఎ) హోంం వ్యవహారాల మంత్రిత్వ శాఖ
బి) విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ
సి) ఆర్థిక మంత్రిత్వ శాఖ
డి) రక్షణ మంత్రిత్వ శాఖ

5. జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ (NDMA) ఏ సంవత్సరంలో స్థాపించబడింది?
ఎ) 1998 బి) 2000 సి) 2005 డి) 2010

6. నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (NDRF) ప్రయోజనం ఏమిటి?
ఎ) విపత్తులపై పరిశోధన నిర్వహించడం
బి) విపత్తులకు తక్షణ ప్రతిస్పందన అందించడం
సి) ప్రచారాల ద్వారా అవగాహన కల్పించడం
డి) సహాయ నిధుల పంపిణీ

7. రిక్టర్ స్కేల్ సాధారణంగా ఏ ప్రకృతి విపత్తు తీవ్రతను కొలవడానికి ఉపయోగిస్తారు?
ఎ) వరదలు బి) తుపాన్లు
సి) భూకంపాలు డి) సునామీ

8. విపత్తు నిర్వహణలో 'షెల్టర్ కిట్' ప్రయోజనం ఏమిటి?
ఎ) తాత్కాలిక గృహాలను అందించడం
బి) అత్యవసర వైద్య సంరక్షణ
సి) స్వచ్ఛమైన నీటి సరఫరా
డి) కమ్యూనికేషన్ పరికరాలు

9. భారతదేశంలో విపత్తుల కోసం ముందస్తు హెచ్చరిక వ్యవస్థలలో ఏ సంస్థ కీలక పాత్ర పోషిస్తుంది?
ఎ) ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ
బి) నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (NDMA)
సి) భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)
డి) పర్యావరణ మంత్రిత్వ శాఖ

10. విపత్తు నిర్వహణలో మాక్ డ్రిల్స్ నిర్వహించడం యొక్క ముఖ్య ఉద్దేశ్యం ఏమిటి?
ఎ) విపత్తు తర్వాత నష్టాన్ని అంచనా వేయడం
బి) వ్యక్తులకు శిక్షణ ఇవ్వడం మరియు ప్రతిస్పందన విధానాలను పరీక్షించడం
సి) రిలీఫ్ మెటీరియల్స్ పంపిణీ
డి) పరిశోధన కోసం డేటాను సేకరించడం

11. స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (SDRF) ప్రాథమిక పాత్ర ఏమిటి?
ఎ) అంతర్జాతీయ సహాయాన్ని అందించడం
బి) శోధన మరియు రెస్క్యూ కార్యకలాపాలు
సి) విపత్తులపై పరిశోధన నిర్వహించడం
డి) విధాన రూపకల్పన

12. జాతీయ స్థాయిలో విపత్తు సమయంలో సహాయక చర్యలను సమన్వయం చేయడానికి ఏ ఏజెన్సీ బాధ్యత వహిస్తుంది?
ఎ) భారత సైన్యం
బి) నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (NDRF)
సి) జిల్లా కలెక్టర్
డి) నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ (NDMA)

13. విపత్తు సంసిద్ధతలో '72-గంటల కిట్' ప్రయోజనం ఏమిటి?
ఎ) ఒక వారం ఆహారాన్ని అందించడం
బి) విపత్తుల సమయంలో కమ్యూనికేషన్‌ను నిర్ధారించడం
సి) మొదటి 72 గంటల తక్షణ అవసరాలను తీర్చడం
డి) ముఖ్యమైన పత్రాలను నిల్వ చేయడం

14. భారత వాతావరణ శాఖ (IMD) కింది వాటిలో ఏ విపత్తుల గురించి హెచ్చరికలు జారీ చేస్తుంది?
ఎ) భూకంపం బి) తుఫాను
సి) అటవీ అగ్ని డి) పారిశ్రామిక ప్రమాదాలు

15. భారతదేశంలో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ (NIDM) పాత్ర ఏమిటి?
ఎ) విపత్తుల సమయంలో వైద్య సహాయం అందించడం
బి) వాతావరణ మార్పులపై పరిశోధన నిర్వహించడం
సి) విపత్తు నిర్వహణలో శిక్షణ మరియు సామర్థ్యాన్ని పెంపొందించడం
డి) విపత్తు ఆశ్రయాలను నిర్మించడం



డాక్టర్ కె. శశిధర్
పర్యావరణ నిపుణులు
94919 91918

16. భారతదేశంలో విపత్తు నిర్వహణ చట్టం ఏ సంవత్సరంలో రూపొందించబడింది?
ఎ) 2000 బి) 2005
సి) 2010 డి) 2015

17. విపత్తు నిర్వహణలో సెంట్రల్ వాటర్ కమిషన్ (CWC) ప్రాథమిక విధి ఏమిటి?
ఎ) సహాయ నిధులు అందించడం
బి) విపత్తుల సమయంలో నీటి సరఫరాను నిర్ధారించడం
సి) వరదలను పర్యవేక్షించడం, అంచనా వేయడం
డి) శోధన, రెస్క్యూ కార్యకలాపాలను నిర్వహించడం

18. 'సునామీ' అనే పదం ఏ భాష నుండి వచ్చింది?
ఎ) జపనీస్ బి) హిందీ
సి) గ్రీకు డి) సంస్కృతం

19. భారతదేశంలో తుఫానులకు ఎక్కువగా గురయ్యే రాష్ట్రం ఏది?
ఎ) రాజస్థాన్ బి) కేరళ
సి) ఒడిశా డి) హిమాచల్ ప్రదేశ్

20. విపత్తుల సన్నద్ధతలో 'గో బ్యాగ్' ఉద్దేశ్యం ఏమిటి?
ఎ) అత్యవసర తరలింపు
బి) ఆహార సరఫరాలను నిల్వ చేయడం
సి) ఆశ్రయాలను నిర్మించడం
డి) వైద్య సహాయం అందించడం

21. 'సెండాయ్ ఫ్రేమ్‌వర్క్ ఫర్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్' ఏ సంవత్సరంలో ఆమోదించబడింది?
ఎ) 2005 బి) 2010 సి) 2015 డి) 2020

22. విపత్తు నిర్వహణలో 'కమ్యూనిటీ ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్' (CERT) ప్రయోజనం ఏమిటి?
ఎ) మారుమూల ప్రాంతాల్లో వైద్య సంరక్షణ అందించడం
బి) విపత్తులపై పరిశోధన నిర్వహించడం
సి) ప్రతిస్పందన మరియు పునరుద్ధరణ కోసం స్థానిక వనరులను సమీకరించడం
డి) అంతర్జాతీయ సహాయాన్ని సమన్వయం చేయడం

23. భారతదేశంలో జాతీయ విపత్తు నిర్వహణ ప్రణాళిక (NDMP) పాత్ర ఏమిటి?
ఎ) సహాయ నిధులు కేటాయించడం
బి) రాష్ట్ర స్థాయి విపత్తు ప్రణాళికలను రూపొందించడం
సి) అంతర్జాతీయ సహాయాన్ని అందించడం
డి) జాతీయ స్థాయిలో విపత్తు నిర్వహణ కార్యకలాపాలకు మార్గదర్శకత్వం వహించటం

24. నేషనల్ డిజాస్టర్ మిటిగేషన్ ఫండ్ (NDMF) పాథమిక విధి ఏమిటి?
ఎ) విపత్తు బాధితులకు సహాయాన్ని అందించడం
బి) విపత్తులపై పరిశోధనలకు నిధులు సమకూర్చడం
సి) ఉపశమన ప్రాజెక్టులకు ఫైనాన్సింగ్
డి) అంతర్జాతీయ సహాయ చర్యలకు మద్దతు ఇవ్వడం

25. 'హ్యోగో ఫ్రేమ్‌వర్క్ ఫర్ యాక్షన్' విపత్తు నిర్వహణలో ఏ అంశంతో ముడిపడి ఉంది?
ఎ) విపత్తు ప్రతిస్పందన బి) విపత్తు ప్రమాద తగ్గింపు
సి) విపత్తు రికవరీ డి) విపత్తు తగ్గించడం

26. విపత్తు నిర్వహణలో 'సేఫ్ స్కూల్ ప్రోగ్రామ్' ఉద్దేశం ఏమిటి?
ఎ) మనుగడ నైపుణ్యాలను బోధించడం
బి) పాఠశాలలకు ఆర్థిక సహాయం అందించడం
సి) భూకంపాలను తట్టుకునే విధంగా పాఠశాల భవనాలను నిర్మించడం
డి) పాఠశాల భద్రతపై పరిశోధన నిర్వహించడం

27. భారీ విపత్తుల సమయంలో అంతర్జాతీయ సహాయాన్ని సమన్వయం చేయడానికి ఏ సంస్థ బాధ్యత వహిస్తుంది?
ఎ) విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ
బి) యునైటెడ్ నేషన్స్ ఆఫీస్ ఫర్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ (UNDRR)
సి) అంతర్జాతీయ రెడ్ క్రాస్, రెడ్ క్రెసెంట్ ఉద్యమం
డి) నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ (NDRF)

28. భారతదేశంలో భూకంపాలు ఎక్కువగా సంభవించే రాష్ట్రం ఏది?
ఎ) కేరళ బి) గుజరాత్
సి) పశ్చిమ బెంగాల్ డి) హిమాచల్ ప్రదేశ్

29. ఆసియన్ డిజాస్టర్ రిడక్షన్ సెంటర్ ఏ దేశంలో ఉంది ?
ఎ) ఇండియా బి) అమెరికా
సి) జపాన్ డి) స్విట్జర్లాండ్

30. ఈ కింది వాటిలో ఏది విపత్తు నిర్వహణకి సంబంధించింది ?
ఎ) రియో డిక్లరేషన్ బి) యోకోహామా డిక్లరేషన్
సి) క్యోటో ప్రోటోకాల్ డి) మొంటిరియల్ ప్రోటోకాల్

సమాధానాలు

1.సి	2.బి	3.ఎ	4.ఎ	5.సి
6.బి	7.సి	8.ఎ	9.సి	10.బి
11.బి	12.డి	13.సి	14.బి	15.సి
16.బి	17.సి	18.ఎ	19.సి	20.ఎ
21.సి	22.సి	23.డి	24.బి	25.బి
26.సి	27.ఎ	28.బి	29.సి	30.బి

కరెంట్ అఫైర్స్



- కె. నాగార్జున
కరెంట్ ఎఫైర్స్ సీనియర్ ఫ్యాకల్టీ
9490352545

ప్రపంచంలో అతి పెద్ద సోలార్ పవర్ ప్రాజెక్టును ప్రారంభించిన దుబాయ్

దుబాయ్ పాలకుడు మహ్మద్ బిన్ రషీద్ అల్ మక్తూమ్ ప్రపంచంలోనే అతిపెద్ద సాంద్రీకృత సౌర విద్యుత్ ప్రాజెక్ట్ మహ్మద్ బిన్ రషీద్ అల్ ముక్తూమ్ సోలార్ పార్క్ నాల్గవ దశను ప్రారంభించారు. ఈ ప్రాజెక్టు 44 చదరపు కిలోమీటర్ల మేర విస్తరించి సూర్యుని కదలికను ట్రాక్ చేసే 70,000 హిలియో స్టాట్‌లను కలిగి వుంది. దీని ద్వారా దాదాపు 3,20,000 నివాసాలకు విద్యుత్ సరఫరా చేస్తూ ఏటా 1.6 మిలియన్ కార్బన్ ఉద్గారాలను తగ్గించవచ్చు.



భారత నౌకాదళం లోనికి అతి పెద్ద సర్వే నౌక ఐఎన్‌ఎస్ సంధాయక్



దేశంలో రూపొందించిన అతి పెద్ద సర్వే నౌక ఐఎన్‌ఎస్ సంధాయక్ 2023 డిసెంబర్ 4న భారత నౌకాదళంలో చేరింది. కోల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్ బిల్డర్స్ అండ్ ఇంజనీర్స్ సంస్థ దీన్ని నిర్మించింది. ఈ శ్రేణిలోని 4 సర్వే నౌకల్లో ఇది మొదటిది. దీని పొడవు 110 మీటర్లు, డిసెంబర్ 4న నౌకాదళ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నౌకను లాంచనంగా నేవికి అప్పగించారు. ఇది సాగరంలో హైడ్రోగ్రాఫిక్ సర్వేలను నిర్వహిస్తుంది.

గ్లోబల్ రెస్పాన్సిబల్ టూరిజం అవార్డుని పొందిన కేరళ

టూరిజం మిషన్ ఆధ్వర్యంలో 2023 సంవత్సరానికి కేరళ ప్రతిష్టాత్మకమైన "గ్లోబల్‌రెస్పాన్సిబుల్ టూరిజం అవార్డు" ని కైవసం చేసుకుంది. కేరళలో అంట రానితనం దురాచారం ఎక్కువగా వున్న రోజుల్లో నారాయణగురు అనే ఆధ్యాత్మిక వేత్త స్థానికంగా ఎన్నో సంఘసంస్కరణల్ని తీసుకొచ్చాడు. విద్యా సంస్థలు నెలకొల్పాడు. అలా కేరళ రాజకీయంగానూ, ఇటు సాంస్కృతికంగానూ అభివృద్ధి చెందింది. ప్రస్తుతం గెలుపొందిన గ్లోబల్ రెస్పాన్సిబుల్ టూరిజం అవార్డును రెస్పాన్సిబుల్ టూరిజం పార్టనర్ షిప్, ఇంటర్నేషనల్ సెంటర్ ఫర్ రెస్పాన్సిబుల్ టూరిజం, బెస్ట్ ఫర్ లోకల్ సోర్సింగ్, ఫుడ్ అండ్ క్రాఫ్ట్ విభాగం సంయుక్తంగా ఏర్పాటు చేశారు.




మార్స్ రోవర్‌ను నడిపిన మొదటి భారతీయురాలు అక్షతా కృష్ణమూర్తి



అంతరిక్ష పరిశోధనలో డాక్టర్ అక్షతా కృష్ణమూర్తి అపూరూపమైన విజయాన్ని సాధించారు. ఎంఐటీ (మసాచుసెట్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ) నుంచి ప్రత్యేక డిగ్రీని పొందిన ఆమె ప్రయాణం మీ కలలను వదులుకోకూడదనడానికి ఒక గొప్ప ఉదాహరణ నాసాలో ఆమె చేసిన పని రోవర్ మిషన్ కోసం డాక్టర్ అక్షతా కృష్ణమూర్తి చేసిన కృషి చాలా ముఖ్యమైనది. ఆమె మార్స్‌పై రోవర్‌ను నడిపిన మొదటి భారతీయురాలిగా చరిత్ర కెక్కారు.

ప్రజలే చరిత్ర నిర్మాతలు..!

తెలంగాణ రాష్ట్రంలో ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో ప్రజా తీర్పు పాలక బీఆర్ఎస్‌ను ప్రతిపక్షానికే పరిమితం చేసింది. అధికార పీఠాన్ని కాంగ్రెస్ పార్టీకి కట్టబెట్టడం జరిగింది. ఈ ప్రజా తీర్పు పరిణామాలను చూస్తే రాష్ట్ర ఆవిర్భావంలో కీలక భూమిక పోషించి రాష్ట్రాన్ని తెచ్చిన పార్టీగా టీఆర్ఎస్ కు రెండు పర్యాయాలు తెలంగాణ ప్రజలు అధికారం కట్టబెట్టారు. అలా ఆ పార్టీ రాష్ట్ర అభివద్ధి, సంక్షేమంలో దేశంలో ముందుంచినప్పటికీ, ప్రజల తీర్పు కాంగ్రెస్‌ను వరించడంతో బీఆర్ఎస్ అంతర్మథనంలో పడింది. తెలంగాణ రాష్ట్ర సమితి పేరుతో ఉద్యమ పార్టీగా ఆవిర్భవించి రాష్ట్ర సాధనలో ప్రముఖ పాత్ర పోషించింది. ఆ తర్వాత ఉద్యమ పార్టీని, రాజకీయ పార్టీగా మార్చడం జరిగింది. పాలన చేపట్టిన తొలినాళ్లలోనే ప్రభుత్వ యంత్రాంగాన్ని రాష్ట్ర స్థాయిలో పురమాయించి ఒకేరోజు సమగ్ర కుటుంబ సర్వే చేపట్టింది. ఆ సర్వేలో తెలంగాణలోని వివిధ సామాజిక వర్గాల వారీగా జనాభా వారీగా ఆర్థిక, సామాజిక స్థితిగతులు తదితర వివరాలను సేకరించింది. ఆ తర్వాత అనేక రకాల సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి అభివద్ధి, సంక్షేమం సమంగా కొనసాగిస్తూ ముందుకు సాగింది. ఆ తర్వాత వివిధ రాజకీయ పార్టీల నాయకులను అభివద్ధి పేరుతో తమ పార్టీలోకి చేర్చుకోవడం జరిగింది. అలా ప్రధాన పార్టీ నాయకులను చేర్చుకొని రాజకీయ శూన్య తకు, ప్రత్యర్థి పార్టీలను బలహీనపరచడానికి పూనుకున్నాడు. రాష్ట్రంలోని అన్ని పార్టీలు అనైతిక విధానాలకు బలైనవే!. ఆ తర్వాత అక్కడక్కడ అప్రజాస్వామిక చర్యలను విభేదించే, ప్రశ్నించే పత్రికలకు, ప్రజా సంఘాలకు నిర్బంధం విధించి ప్రశ్నించే స్వేచ్ఛకు విఘాతం కలిగించారు. పాలకవర్గం చర్యలను భరించలేని నాయకులు, కళాలు, గళాలు ఒక్కొక్కరుగా వెనక్కి తగ్గడం జరిగింది. రాష్ట్రంలో ధర్నాలు, నిరసనలు కనిపించకుండా, వినిపించరాదనే భావనతో ఇందిరాపార్క్ వద్ద ధర్నాచౌక్‌ను ఎత్తివేశారు. అలా కార్పొరేట్ ఎలక్ట్రానిక్ అండ్ ప్రింట్ మీడియాను నియంత్రిస్తూ అధికార దర్పంతో ప్రభుత్వ వ్యతిరేకత ఎక్కడికి అక్కడ కానరాకుండా నయానో, భయానో కనపడకుండా చేసే ప్రయత్నం జరిగింది.



రాష్ట్ర సాధనలో ఉద్యమానికి పురికొల్పిన అంశాల్లో ప్రధానంగా నీరు, నిధులు, నియామకాలు. ఈ మూడింటిలో తాగునీరు, సాగునీరు విషయంలో పురోగతి సాధించినప్పటికీ, ఎక్కువ నిధులు కాళేశ్వరం ప్రాజెక్టుకు ఖర్చు చేశారు. తీరా ఎన్నికల ముందు ఈ ప్రాజెక్టు కుంగిపోవడంతో, ప్రతిపక్షాల విమర్శలతో ప్రజల్లో ఇంతకు ముందున్న భావనకు బలం చేకూరినట్లు అయింది. ఇలా సాగునీరు, తాగునీరు పేరుతో కాళేశ్వరం ప్రాజెక్టు నుండి నిధులు అన్యాక్రాంతమైనట్లు ప్రజలు భావిస్తుండంతోనే ఈ వ్యతిరేకతకు దారితీసినట్లు విశ్లేషకుల అభిప్రాయం. నిధులు అనేక సంక్షేమ పథకాల పేరుతో ఓటు బ్యాంకుగా మార్చుకున్నారనే అపవాదు నేడు నిజమని ప్రజలు భావించడం కనిపిస్తుంది. రైతుబంధు, బీసీ బంధు, దళితబంధు, పెన్షన్లు, డబుల్ బెడ్ రూములు, మన ఊరు మన బడి ఇలా అనేక పథకాలు ఆరంభించి నిధుల కొరతతో కొద్దిమందికి అందివ్వడం అది కూడా వారి పార్టీ క్యాడర్‌కు ఇవ్వడంతో ప్రజల్లో వ్యతిరేకత పైకి కనిపించకుండా ఒక్కసారిగా ఓటు ద్వారా వ్యక్తమైంది. నాయకులు నియోజకవర్గంలో భూదందా చేయడం ధరణితో రైతుబంధు పొందుటకు ఒకరి భూమిని ఇంకొకరికి మార్చడం వల్ల లబ్ధిని పొందడం జరిగింది. రైతు బంధుకు నిర్దిష్టత లేకపోవడంతో ఈ పథకం ద్వారా పేదలకన్న ధనవంతులే ఎక్కువ లబ్ధి జరగడం లాంటి వాస్తవాలను ప్రజలు ఆలస్యంగా గుర్తించారు. దీంతో ప్రభుత్వ వ్యతిరేకత ప్రజల్లో పెరిగిపోయింది. మద్య విధానం మీద ఉన్న శ్రద్ధ.. విద్య, వైద్యం, వ్యవసాయం, నిరుద్యోగం, తదితర రంగాలపై లేకపోవడం గ్రహించారు. పరిశ్రమల పేరుతో ఎన్నో ప్రభుత్వ భూములను ఉచితంగా ఇవ్వడం, ఆర్థిక లోటును పూడ్చుకోవడానికి ప్రభుత్వ భూములు అమ్మడం లాంటి చర్యలు ప్రజలను పునరాలోచించేలా చేశాయి. ప్రచారానికి అక్కడికక్కడ కొన్ని వైద్య, విద్యా కళాశాలలను చూపి ప్రచారం పొందినప్పటికీ, రాష్ట్రంలో చాలా చోట్ల విద్యా, వైద్యం మౌలిక వసతులు లేక సిబ్బంది కొరతతో కనీసం పారిశుద్ధ్య కార్మికులు లేక దుర్భర స్థితిలో కొనసాగుతుందని తన మనుమడే స్పందించిన తీరుతో అర్థమవుతుంది.



- మేకిరి దామోదర్
9573666650

తెలంగాణ రాష్ట్రం ఏర్పడితే లక్షలాది ఉద్యోగాలు మన నిరుద్యో గులకు దక్కుతాయనే ఆశలు కల్పించడంతో ఉద్యమ కాలంలో నిరుద్యోగ యువత ఆకర్షితులై కాలేజీలను, యూనివర్సిటీలను వదిలి తెలంగాణ ఉద్యమంలో ప్రాణాన్ని పణంగా పెట్టి పాల్గొని ఉద్యమానికి స్ఫూర్తిని నింపారు. అలా శ్రీకాంతాచారి లాంటి ఎంతో మంది ఉద్యమ కారులు అమరులైనారు. ఆ క్రమంలో ఎన్నికల్లో ఉద్యమ పార్టీ అయిన టిఆర్ఎస్ పార్టీకి వెన్నుదన్నుగా నిలిచి చదువులు మానేసి పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం యువకులు, విద్యార్థులు మేధావులు ప్రచారం చేసి ప్రజల్లోకి తీసుకెళ్లారు. కానీ తీరా పదేళ్ల ఆత్మగౌరవ పాలనలో నియమకాలు జరగక పోవడం, ఎన్నికల్లో ఇచ్చిన నిరుద్యోగ భతి హామీని అమలు చేయక పోవడం చూసిన నిరుద్యోగుల్లో వ్యతిరేకత రోజురోజుకు పెరిగిపోయింది. ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ రాక పోవడం, వచ్చినవి.. పరీక్షలు వాయిదా వేయడం లేదా రద్దు చేయడం జరిగింది. ఇలా నిరుద్యోగ యువత విలువైన జీవితాలతో చెలగాటమాడడం ఆత్మగౌరవపాలనలో జరిగింది. టీఎస్పీఎస్సీ పరీక్షలలో అవకత వకలు జరగడం చూసిన నిరుద్యోగుల్లో ప్రభుత్వ వ్యతిరేకత ఆకాశాన్నంటింది. తెలంగాణ రాష్ట్రం వస్తే మన నిధులు మనకే, మన నియమకాలు మనవే అన్న ఆశలు ఆవిరై పోవడంతో అమరుల త్యాగాలు రాజకీయ నాయకుల లబ్ధి కోసమో, ముఖ్యమంత్రి పదవుల కోసమో! మంత్రి పదవుల కోసమేనా..అని ఆలో చనలో పడ్డారు యువత. రాజకీయ ఖాళీలను భర్తీ చేసినంత టైం బాండ్‌తో నిరుద్యోగుల నియామకాలు చేయక పోవడం చూసినారు. నిరుద్యోగుల ఆత్మహత్యలతో కూడా ఆత్మగౌరవ పాలకుల్లో కదలిక లేకపోవడంతో వ్యతిరేకత అంతకంతకు పెరిగిపోయింది.

ప్రభుత్వ ఉద్యోగుల పరిస్థితి చూస్తే ఉద్యోగులు ఉద్యమ కాలంలో ఉద్యమ పార్టీ బలపడడానికి చేతనైన సహాయం చేశారు. సహాయ నిరాకరణ, సకలజనుల సమ్మె లాంటి అనేక ఉద్యమాలకు ఊపిరి పోశారు. మా ప్రభుత్వం వస్తే ఫ్రెండ్లీ గవర్నమెంట్ అని పలికి దేశంలోనే ఎక్కువగా వేతనాలు పెంచుతామని నమ్మబలికినారు. అధికారంలోకి రాగానే ప్రభుత్వ ఉద్యోగులను ప్రజల నుండి వేరు చేసి దేశంలోనే ఎక్కువ జీతాలు ఇస్తున్నామనే ప్రచారానికి తెరలేపారు, వాస్తవంగా పెంచడం కాదుకదా.. గతంలోని ఉద్యోగుల హక్కులను హరిస్తూ క్రమేపి వారి సమస్యలు గుట్టలుగా పెరిగినయి తప్ప ఏ ఒక్కటి ఈ ప్రభుత్వం పరిష్కరించిన పాపాన పోలేదు. పైగా ఫ్రెండ్లీ గవర్నమెంట్ పేరుతో కొద్దిమంది సంఘ నాయకులను చేరదీసుకొని వారికి పదవుల ఆశలు కల్పించి ఉద్యోగులను మోసం చేశారు. కనీసం కరువు భత్యం కూడా ఇవ్వలేని స్థితి. అధికార వికేంద్రీకరణ పేరుతో జిల్లాలు, మండలాలు పెంచి నియామకాలు లేకపోవడంతో ఒత్తిడిలో ఉద్యోగులు విధులు నిర్వహించాల్సి వస్తుంది వాస్తవం కాదా!. అంతేకాకుండా గత ప్రభుత్వాల కాలంలో మొదటి తారీఖున వేతనాలు, ప్రతి ఆరు నెలలకోసారి డీఏ, ఐదేళ్లకోసారి పిఆర్సీ ఇచ్చే సంస్కతికి విఘాతం కలిగించారు. ఆర్థికంగా ఉద్యోగులను నష్టపరచడం జరిగింది. ఒకటో తారీకు కాదు కదా.. 15వ తారీకు కూడా వేతనాలు పడని దుర్భర స్థితికి నెట్టి వేయబడ్డది మన ఆర్థిక వ్యవస్థ. ప్రభుత్వ ఉద్యోగులు బ్యాంకు రుణాలు కట్టలేక వారి పరపతి దెబ్బతిని కుటుంబంలో సమాజంలో కక్కలేక మింగలేక జీవితాలను గడుపుతున్నారు. అలా వారి బాధను చెప్పడానికి ప్రగతి భవన్ లో అవకాశం కల్పించకుండా తను ఏకాస్వామ్య పద్ధతిలో ప్రజా సమస్యలను కూడా పరిష్కరించకపోవడంతో ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ద్వారా వారి వ్యతిరేకతను చాటినారు. అంతేకాదు! టీఎస్ ఆర్టీసీ కార్మికులు పోరాటం చేసినప్పుడు వారి న్యాయమైన సమస్యలు పరిష్కరించకుండా ప్రయాణికులను,కార్మికులను ఎన్నో అవస్తల పాలు చేశారు. సమస్యలు పరిష్కరించకుండా ఎగతాళి చేశారు. వారి అవసరం కోసం ప్రభుత్వంలో కలిపారు. అందులో కూడా వాటి ఆస్తులపై కన్ను పడిందని ప్రతిపక్షాల వాదన కూడా చేశారు.

తెలంగాణ రాష్ట్రాన్ని పాలిస్తూనే ఉద్యమ పార్టీ టిఆర్ఎస్‌ను ఆ తర్వాత జాతీయ స్థాయిలో బీఆర్ఎస్‌గా మార్చడం, జాతీయ రాజకీయాలంటూ రాష్ట్ర పాలన గాలికి వదిలేసి దేశం చుట్టి రావడం చూశాం. గతంలో కొండగట్టు ప్రమాదంలో మరణించిన వారిని కనీసం మానవీయ కోణంలో అయినా పరామర్శించక పోవడం, రాష్ట్ర ప్రజలను కలవకపోవడం, రైతు రుణమాఫీ చేయకపోవడంతో రైతు ఆత్మహత్యలు జరిగినా చలించలేదు. మిగులు రాష్ట్రాన్ని అప్పుల రాష్ట్రంగా మార్చడం టీఆర్ఎస్ పార్టీ విస్తరణకు ప్రభుత్వ నిధులను ఖర్చు చేయడం.. ఇదంతా ప్రజలు గమనించడం జరిగింది. ప్రధాని అధికారిక పర్యటనకు రాష్ట్రానికి వచ్చినప్పుడు ప్రోటోకాల్ మేరకు వారికి స్వాగతం పలకకపోవడం, దళిత ముఖ్యమంత్రిని చేస్తానన్న ఉద్యమకాలం నాటిమాట నిలుపుకోకపోవడం, లిక్కర్‌స్కామ్ లో కవితను అరెస్టు చేస్తారనే రాజకీయ పరిణామాలకు తలొగ్గి మళ్లీ ప్రధానిని ప్రాధేయ పడడం, ఇలా ఒక్క మాట మీద నిలబడకుండా ద్వంద్వ విధానాలు పాటించడాన్ని ప్రజలు ఆలస్యంగా గుర్తించారు. ఉద్యమ పార్టీలో కుటుంబ పాత్ర పెరిగిపోయింది. వ్యక్తి ఆరాధన పెరిగిపోయింది. ఎంతటి వ్యక్తినైనా విమర్శించడం.. అవసరం కోసం ఆ వెంటనే ప్రాధేయపడడం గమనార్హం.

ప్రధానంగా ఉద్యమకాలంలో పనిచేసిన నాయకులకు పొగబెట్టి బయటికి వెళ్లగొట్టడం, ఉద్యమాన్ని అణచివేసిన నాయకులను మంత్రులుగా చేయడం.. ఇలా అనేక తప్పుల మీద తప్పులు చేస్తూ అధికారం ఎల్లకాలం ఉండదనే వాస్తవాన్ని విస్మరించి వారి ఒక్కరి సొంతం అన్నట్లుగా వ్యవరించారు. వారి చుట్టూ ఒక భజన సంఘం (కోటరి)ఆహా.. ఓహో అంటూ వ్యతిరేకతను కనిపించకుండా చేశారు. ప్రజలు అన్ని పార్టీల సభలకు అధిక సంఖ్యలో హాజరైనట్టే.. రాష్ట్రాన్ని తెచ్చిన మన్న పార్టీకి ఓటుతో పదేళ్ల అధికారం ఇచ్చాం. ఇక చాలు..!? మీ వ్యవహారం బాగాలేదిదు. మార్పు కోసం.. ఇచ్చామంటున్న పార్టీ నాయకులకు ఒక్క అవకాశం ఇవ్వండని అభ్యర్థించినా కాంగ్రెస్‌కు మరో అవకాశం ఇచ్చారని విశ్లేషకులు ప్రజా తీర్పును విశ్లేషిస్తున్నారు. ప్రజల విజ్ఞత, చైతన్యం గమనించి అధికార దర్పం ప్రదర్శించకుండా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తూ రాజ్యాంగబద్ధమైన ప్రజాస్వామ్య పాలన అందించి ప్రజల హక్కులను, స్వేచ్ఛను పరిరక్షిస్తూ పాలన సాగించాలి. లేదంటే అధికారాన్ని ఇచ్చేదీ.. అహంకారం తలకెక్కితే అధ:పాతాళానికి తొక్కేది ప్రజలే. చరిత్ర నిర్మాతలు ముమ్మాటికీ ప్రజలే అని గమనించాలి.

వేదిక

కాంగ్రెస్ వైఫల్యాలు... కమల వికాసం!





- పతకమూరు దామోదర్‌ప్రసాద్
9440990381

ఇటీవల తెలంగాణ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, ఈశాన్య రాష్ట్రం మిజోరం శాసనసభలకు జరిగిన ఎన్నికలలో బీజేపీ మూడు రాష్ట్రాల్లో విజయం సాధించగా, కాంగ్రెస్ పార్టీ గెలుస్తామని ఆశలు పెట్టుకున్న మధ్యప్రదేశ్ కూడా వారిని వరించలేదు. అంతేగాక ఇప్పటివరకు కాంగ్రెస్ ఏలుబడిలో ఉన్న రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలలో కూడా కాషాయం పార్టీ విజయకేతనం ఎగురవేసింది. తెలంగాణలో రేవంత్‌రెడ్డి నాయకత్వాన బొటాబొటి మెజారిటీతో అధికారంలోకి రావడం కాంగ్రెస్‌కు కొంత ఊరట. 40 అసెంబ్లీ స్థానాలు గల ఈశాన్య రాష్ట్రం మిజోరంలో లాల్ దుహెూమా నేతత్వంలోని జోరాంగ్ పీపుల్స్ మూవ్మెంట్ అధికార మిజో నేషనల్‌ఫ్రంట్‌ను ఓడించి కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసింది. జోరం పీపుల్స్ మూవ్మెంట్ పార్టీ 27 స్థానాలు గెలవగా ఎంఎన్‌ఎఫ్‌కు 10స్థానాలు, బీజేపీకి కేవలం రెండు సీట్లు మాత్రమే వచ్చాయి. తెలంగాణ శాసనసభ 119 స్థానాలకు గాను కాంగ్రెస్ 64 స్థానాలు మిత్రపక్షం సీపీఐ ఒక్క స్థానం గెలిచాయి. కొత్త రాష్ట్రంగా ఏర్పడ్డాక గత పదేళ్లుగా తిరుగులేని అధికారం చెలాయించిన కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ అవినీతి, అక్రమాలు, ప్రజా స్వామ్య వ్యతిరేక ఏకవ్యక్తి నియంతత్వ అహంకారపూరిత కుటుంబ పాలనను ముఖ్యంగా కాళేశ్వరం నీటిపారుదల ప్రాజెక్టు నిర్మాణంలో జరిగిన వేలకోట్ల అవినీతిని, విద్యుత్ కొనుగోళ్లలో వేల కోట్ల రూపాయల ధన దుర్వినియోగాన్ని సమర్థవంతంగా ఎండ గట్టి రేవంత్‌రెడ్డి సీఎంగా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ఆ వెంటనే హస్తం పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీలలో ఆర్టీసి బస్సులలో మహిళలకు ఉచిత ప్రయాణం,రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం కింద వైద్య సౌకర్యం పరిమితిని రూ.10 లక్షలకు పెంచి ప్రజల మన్ననలను అందుకుంది. ఇక పెద్ద హిందీ రాష్ట్రాలు రాజస్తాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గడ్‌లలో విజయ సాధనకు కమలనాథులు పకడ్బందీ ముందస్తు వ్యూహంతో కొన్ని నెలల ముందు నుండే బూత్ స్థాయి మొదలు రాష్ట్ర స్థాయి కమలం శ్రేణులను, నేతలను ఎప్పటికప్పుడు అప్రమత్తంచేస్తూ చెమటోడ్చారు. ఆదివాసీనేత బిర్సముండా జయంతి రోజున ఆదివాసీలలో బాగా వెనుకబడిన వర్గాల బతుకులను మెరుగుపరచడానికి నవంబర్ 5న రూ.24,104 కోట్లు ఖర్చయ్యే " ప్రధానమంత్రి జన జాతి ఆదివాసీ న్యాయ అభియాన్" అనే పథకాన్ని ప్రకటించడం ఎన్నికలు జరిగిన రాష్ట్రాలలో ఆదివాసీలు కమలం పార్టీ వైపు మొగ్గేలా చేసింది ప్రధాన్ మంత్రి గరీబ్ కళ్యాణ్ యోజన కింద 80కోట్ల మందికి ఉచితంగా ఇస్తున్న రేషన్ పథకాన్ని మరో ఐదేండ్లు పొడిగించడం వల్ల కూడా పేదలు "పువ్వు" పార్టీ వైపు మొగ్గు చూపినట్లు తెలిసింది. రాజస్తాన్, మధ్య ప్రదేశ్, ఛత్తీస్ గఢ్ లలో కాంగ్రెస్, బీజేపీలు హోరాహోరీగా తలపడినా గెలుపు కమలం పార్టీనే వరించింది. మధ్యప్రదేశ్‌లో బీజేపీకి 48.55శాతం ఓట్లు రాగా, ఛత్తీస్‌గఢ్‌లో 46.27 శాతం, రాజస్థాన్‌లో 41.7 శాతం ఓట్లు లభించాయి. కాంగ్రెస్ పార్టీకి మధ్యప్రదేశ్‌లో 2018 ఎన్నికలలో 40.89 శాతం ఓట్లు రాగా ఈసారి స్వల్పంగా తగ్గి 40.40శాతం ఓట్లు వచ్చాయి. ఛత్తీస్‌గఢ్‌లో 2018లో 43.04 శాతం ఓట్లు రాగా ఈసారి 42.23 శాతానికి తగ్గాయి. రాజస్తాన్‌లో 2018లో కాంగ్రెస్ పార్టీకి 39.3 శాతం ఓట్లు రాగా ఈసారి అవి39.5 శాతానికి పెరిగాయి. కాంగ్రెస్ ఆరోగ్య బీమాను రూ.50 లక్షలకు పెంచినా, ఎన్నో జన సంక్షేమ పథకాలు అమలు చేసినా ఐదేళ్ల కోసారి కొత్త ప్రభుత్వాన్ని ఎన్నుకునే సంప్రదాయాన్ని ప్రజలు పాటించారు.

మూడు హిందీ రాష్ట్రాలు రాజస్తాన్, మధ్యప్రదేశ్ ఛత్తీస్ గడ్‌లలో కమలం పార్టీకి ఏడెనిమిది నెలల క్రితం వరకు ఏమంత అనుకూల పరిస్థితులు లేవు. కర్నాటకలో పరాజయం తర్వాత యూపీ, బీహార్ తర్వాత పెద్ద హిందీ రాష్ట్రం మధ్యప్రదేశ్‌లో ప్రతికూలత ఉన్నట్లు సంకేతాలు రావడంతో కమలనాథులు ఏడెనిమిది నెలల ముందే జాగ్రత్త పడుతూ వచ్చారు.బూత్ స్థాయి నుండిపై స్థాయి వరకు బాధ్యులను నియమించి, పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించి దిద్దుబాటుకు యత్నించారు.ప్రధాన హిందీ రాష్ట్రాలలో ఓడితే వచ్చే మేలో జరిగే లోక్‌సభ ఎన్నికలలో నెగ్గుకు రావడం కష్టమని కమలనాథులకు అవగతమైంది. అందుకే ప్రధానిమోడీ అన్నీ తానై,అంతటా తానై ప్రచార యుద్ధం సాగించారు. 2018లో ఆయా రాష్ట్రాల నేతలకు ఎన్నికల బాధ్యతలు అప్పగించి పరాజయం పాలైన సంగతి గుర్తించి ఈసారి అభ్యర్థుల ఎంపిక సహా అన్ని విషయాలలో జాగ్రత్తలు తీసుకున్నారు. తాము అధికారంలోకి వస్తే "కులగణన" చేస్తామని రాహుల్ గాంధీ ప్రకటించడంతో మోడీ అప్రమత్తమయ్యారు. బీజేపీ తన మాతృసంస్థ ఆరెస్సెస్ నుండి సైద్ధాంతిక దన్ను, ఆదివాసీలలో స్వచ్ఛంద సంస్థల ద్వారా చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు ఓట్ల శాతాన్ని మెరుగు పరచుకోవడానికి తోడ్పడ్డాయి. సాంప్రదాయంగా కాంగ్రెస్‌కు ఓటేసే దళితులు,ఆదివాసీల ఓట్ల కోసం కమలనాథులు గట్టి ప్రయత్నాలే చేస్తున్నారు. కాంగ్రెస్, కమ్యూనిస్టులు, ఇతర లౌకిక పార్టీలు సంస్థాగతంగా బలపడి చేరువ కాకపోతే బీజేపీ క్రమక్రమంగా వారికి దగ్గరయ్యే అవకాశాలే ఎక్కువ. ఈ వైఫల్యాలను పార్లమెంట్ ఎన్నికల్లోపు కాంగ్రెస్ అధిగమించాలి. 'ఇండియా' కూటమి ద్వారా ప్రజలకు చేరువయ్యే మార్గాలను అన్వేషించాలి. లేదంటే భారతదేశ చిత్ర పటం కాషాయపు రంగులోకి మారే ప్రమాదం పొంచివుందన్న సంగతి మరువరాదు.